మనవిమాటలు

దశాబ్దం క్రిందట రాజకీయేతర రంగాలలో ప్రముఖులైనవారి సేవను పాఠకులకు పరిచయం చేయాలని ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక సంకల్పించినప్పుడు, నేనూ, నా సహ పత్రికా రచయిత శ్రీ నీలంరాజు మురళీధరూ ఆ యా ప్రాంతాలకు వెళ్ళి ప్రముఖులను కలుసుకొని, సేకరించిన విషయాలతో, శ్రీ మురళీధర్ తీసిన ఛాయాచిత్రాలతో పాటు 'మరపురాని మనీషి' శీర్షిక క్రింద ధారావాహికంగా ప్రచురించిన లేఖినీచిత్రాలలో కొన్ని ఇవి.

ఆ యాత్రలో నేను కలుసుకొన్నవారి జీవితచరిత్రలు చిత్రించదగినంత విషయ భండారం సేకరించినాను. వారితో అరమరికలు లేక చర్చలు జరిపినాను. చిన్ననాటి సంగతులు తెలుపుతున్నప్పుడు వారికి కలిగిన భావావేశాలు, స్పర్థలు, ఎదుర్కొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు మొదలైనవి కుప్పలు తెప్పలుగా దొర్లిన ఆ చర్చలు కొందరి కొందరి సహజ సరళ ప్రకృతిని, ముందుతరాలవారికి ఏమీ ఇవ్వలేకపోయామే ననే ఆవేదనాక్రోశాలను కుమ్మరించి, వారి పెద్దతనాన్ని పిరమిడ్లుగా పేర్చగా, నా చిన్నతనం నాకు అనుపదం కనిపిస్తూ, అలాటి వారిముందు నా స్థాన మేమిటో హెచ్చరించి చెప్పినట్టు అనిపించేది. ఆ విషయభండారం నుంచి నాకు కావలసినవి, నేను చెప్పగలిగినవి మాత్రమే గ్రహించి, వారి సేవాస్వరూపం చిత్రించినాను. ఈ చిత్రాలు పఠితలకు దిక్సూచకాలు మాత్రమే; ఈ దారిని వెళ్ళితే పఠితలు ఎన్నో సంగతులు తెలుసుకోవచ్చు నని నా నమ్మకం.

నేను వ్రాయవలసిన లేఖినీ చిత్రాలు కొన్ని కారణాలవల్ల అప్పుడు ఆగిపోయాయి. వాటితో మూడింటిని-శ్రీయుతులు నార్ల వెంకటేశ్వరరావు, నిడదవోలు వెంకట రావు, మోటూరి సత్యనారాయణ గార్లను- దీనిలో చేర్చినాను.

నేను కలుసుకొన్నవారిలో పలువురు గత దశాబ్దంలో ఎన్నో అభ్యుదయాలు పొందినారు; కొత్తరచనలూ చేసినారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణ జ్ఞానపీఠ బహుమతి పొందినారు. శ్రీ జాషువా 'పద్మభూషణ' బిరుదు పొందినారు. కొందరు కీర్తిశేషులయినారు. ఆ సంగతులు గుదిగుచ్చడం అందదుకులుగా కనిపిస్తుందని మానుకొన్నాను వాటిని తెలుసుకోవలసిన బాధ్యతను పఠితలకు అప్పగించినందుకు క్షంతవ్యుణ్ణి.

నా కోసం తమ అమూల్య కాలాన్ని వినియోగించి, నా పిచ్చిప్రశ్నలకు ఓపికతో సమాధానం చెబుతూ, తమ జీవితాన్ని ఆవిష్కరించిన ఆ మనీషుల కందరికీ కృతజ్ఞుణ్ణి.

దశాబ్దం తర్వాత ఇవి పుస్తకరూపంలో ఆంధ్రావళికి అందడం- పుస్తకముద్రణ ప్రచురణలు ప్రళయతాండవమైన ఈ సమయంలో అందడం- నాకు ఆశ్చర్యానందాలు కలిగిస్తున్నది. యువభారతి నిర్వాహకులు మిత్రులు శ్రీయుతులు వంగపల్లి విశ్వనాథం, ఇరివెంటి కృష్ణమూర్తి, డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం మొదలైనవారు పూనుకొనక పోయివుంటే, ఇవి ఇంత సుందరరూపంలో వచ్చేవి కావు. వారికి నా ధన్యవాదాలు.

అప్పటి ఛాయాచిత్రాలతోపాటు ప్రచురించాలని నా మనస్సులో ఉండేది. కాని రేఖాచిత్రాలు సరికొత్త అందాన్ని తెస్తాయనిపించింది. వకాలత్‌ను వదలి వర్ణప్రపంచంలో దూకిన మిత్రులు శ్రీ బి. వి. సత్యమూర్తి ఎంత చక్కగానో రేఖాచిత్రాలు గీచి, పుస్తకసౌందర్యాన్ని పెంచడం మాత్రమే కాక, తమ రేఖా రామణీయక సౌష్ఠవాలతో మనీషులను నిజంగా మరపురాకుండా చేసినారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఈ లేఖినీ చిత్రాలను పుస్తకరూపంలో ప్రచురించడానికి సహృదయతతో అనుమతించిన ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక యజమానులు శ్రీ భగవాన్‌దాస్‌జీ గోయంకాకు, అప్పటి సంపాదకులు, మిత్రులు శ్రీ బి.సి. కామరాజుకు నేనెంతో ఋణపడివున్నాను.

ఈ 'మరపురాని మనీషి'ని నా బాల్యమిత్రుడు, సతీర్థ్యుడు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రికి అంకిత మిస్తుద్నందుకు చాల ఆనందిస్తున్నాను. ఇతడుకూడ మరపురాని మనీషి. దీనిని స్వీకరిస్తున్న నా మిత్రునికి చాల కృతజ్ఞుణ్ణి.

ఆనంద సంక్రాంతి
14-1-1975
69, ఆదర్శనగర్, హైదరాబాద్.

భాషా సేవకుడు
తిరుమల రామచంద్ర

అంకితం

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రికి

మిత్రుడా : నీ వొక సాహిత్య రత్నాకరం. నీ సంభాషణ చాతుర్యం సుభాషిత రత్నభాండాగారం. నీ భాషణ పాటవం సప్తగోదావరం; ఆంధ్రీ గైర్వాణీ కర్నాటీ ద్రావిడీ మహారాష్ట్రీ హిందీ ఉరుదూలలో నీ వక్తృత్వం హరిద్వార గంగవలె, గద్గద నదద్గోదావరి వలె, సముత్తుంగ వీచిఘటా గంభీర తుంగభద్రవలె సాగిపోతుంది. నీ ధారణ గొప్పది; గురుసన్నిధిలో నేర్చినది, మనన నిధిధ్యాసనాలతో సంపాదించినది ప్రతి అక్షరం నీకు వాచోవిధేయం. నీ కవిత ఆంధ్ర సంస్కృతోభయ కూలంకషయై ప్రవహించే బ్రహ్మపుత్ర. కనుకనే నీవు బ్రాహ్మీభూషణ, ఆంధ్రబిల్హణ, సుధీంద్రమౌళి బిరుదభాసురుడవైన సాహిత్య శిరోమణివి.

నెచ్చెలీ : నీవు పండ్లతో వంగిన గున్నమామిడివి; అందుకోని వానిదే లోపం ఆర్తులపాలిటి తంగేటి జున్నువి; జుర్రుకోని వానిదే జాగు. 'ఈ పని నీవల్లనే సాధ్యం, అని ఎవరు కోరినా నెత్తినపెట్టుకొని సాధించి సంతృప్తిపడడం నీకు చిన్ననాటినుంచి వచ్చిన బుద్ధి; ఇది జీవితానువర్తిని.

ఇన్ని మించుతనాలు, మంచితనాలు ఉన్న నీవూ ఒక మరపురాని మనీషివి. చంద్రుని కొక నూలుపోగని సామెత. కాని, నేను మిత్రుని కొక నూలుపోగుగా ఈ చిన్న కృతిని 'మరపురాని మనీషి'ని నీకు మన చెలిమికి గుర్తుగా అర్పిస్తున్నాను; స్వీకరించు

నీ వాడు

తిరుమల రామచంద్ర

అనుక్రమణిక

మరపురాని మనీషులు

1.	శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి	...	9
2.	శ్రీ ఆదిరాజు వీరభద్రరావు	...	14
3.	శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి	...	19
4.	శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ	...	23
5.	శ్రీ కాశీ కృష్ణాచార్యులు	...	28
6.	శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు	...	33
7.	శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం	...	38
8.	శ్రీ గన్నవరపు సుబ్బరామయ్య	...	43
9.	శ్రీ గిడుగు సీతాపతి	...	47
10.	శ్రీ గుండేరావు హర్కారే	...	53
11.	శ్రీ గుఱ్ఱం జాషువా	...	58
12.	శ్రీ ఘులాం జిలానీ	...	63
13.	శ్రీ తల్లావజ్ఝల శివశంకరశాస్త్రి	...	67
14.	శ్రీ తాపీ ధర్మారావు	...	72
15.	శ్రీ తుమ్మల సీతారామమూర్తి	...	77
16.	శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి	...	82
17.	శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి	...	87
18.	శ్రీ దేవులపల్లి రామానుజరావు	...	94
19.	శ్రీ నాయని సుబ్బారావు	...	99
20.	శ్రీ నార్ల వెంకటేశ్వరరావు	...	104
21.	శ్రీ నిడదవోలు వేంకటరావు	...	111
22.	శ్రీ నేలటూరి వేంకటరమణయ్య	...	117
23.	శ్రీ పులిపాటి వేంకటేశ్వర్లు	...	123
24.	శ్రీ బండా కనకలింగేశ్వరరావు	...	127
25.	శ్రీ మాడపాటి హనుమంతరావు	...	131
26.	శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్య	...	137
27.	శ్రీ ముదిగొండ జ్వాలాపతిలింగశాస్త్రి	...	149
28.	శ్రీ మోటూరి సత్యనారాయణ	...	146
29.	శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ	...	151
30.	శ్రీ విశ్వనాథ సత్యనారాయణ	...	156
31.	శ్రీ సమ్మెట అంబాప్రసాద్	...	162
32.	శ్రీ స్థానం నరసింహారావు	...	167

894.8274
RAM
AOUA102B134

ప్రస్తావన

కథ చెప్పటం ఎంతకళో కథానాయకుణ్ణి చిత్రించటం అంతకళ. చరిత్రనే కథగా చెప్పాలంటే కత్తిమీద సాముచేసే ప్రజ్ఞ కావాలి. ఆ చరిత్రరంగంలో నాయకత్వం నిర్వహించే మనీషిని మనోజ్ఞంగా చిత్రించాలంటే వాఙ్మయమైన చిత్రకళ కావాలి. వాస్తవాన్ని కళారేఖలతో వస్తుతత్వాన్ని తెల్పే వంపులతో గీసి జీవచైతన్యాన్ని వ్యంజింపచేసే భంగిమతో రూపొందించే విశిష్టప్రక్రియ ఈ కళ. ఇది ఉత్త పరిచయం కాదు; గట్టి పరిశోధనం కాదు. పరిచయం చెప్పే వివరాలూ, పరిశోధన చేసే విశ్లేషణాలూ కావు ఇందులో ప్రధానం. ఫొటోగ్రఫీలాగా ఛాయనుమాత్రం చూపించటం కాదు; ఎక్స్‌రే లాగా అస్థిపంజరాన్ని ఆలోకింపచేయటం కాదు. చేవగల జీవచైతన్యం జీవితక్షేత్రంలో సాగించిన కృషినీ, సాధించిన ఫలసాయాన్నీ సమాజసముత్తేజానికి సమర్పణం చేసిన సౌజన్య శీలాన్ని చిత్రించే విచిత్ర ప్రక్రియ ఇది.

మనీషుల మహనీయ సిద్ధులే మానవజాతి మహాప్రస్థానంలో మైలురాళ్లు. మనీషికి మొదటి లక్షణం మానవత్వం. అది ఆయన మానసకాసారంలో వికసించే మనోజ్ఞ కమలం. ఆయనకు రెండవ లక్షణం మేధావిత్వం. అది ఆయన బుద్ధిక్షేత్రంలో సిద్ధించే జ్ఞానఫలం. మనోబుద్ధుల అనురూప సమావేశమే మనీషుల అమరత్వం. మనిషిగా బ్రతికే మనీషినే మానవత పూజిస్తుంది; కలకాలం స్మరిస్తుంది. మనీషుల చిత్రణంలో వారి మహిమ కెంత ప్రాధాన్య ముంటుందో వారి మనసుకు అంత ప్రాముఖ్య ముంటుంది. ఒకటి పైవెలుగు- మరొకటి లోవెలుగు.

మనీషుల వ్యక్తిత్వాలను చిత్రించే సారస్వత ప్రక్రియ ప్రతి సభ్యభాషలోనూ ఉంటుంది. అది వీరారాధనంలో ఒక భాగంగా, సంస్కృతి కొక చిహ్నంగా భావిస్తారు చరిత్రకారులు. వీరులు కదనరంగంలోనే కాదు, కళారంగంలోనూ, సమాజ సేవా రంగాల్లోనూ ఉంటారు కదనరంగంలో కనపడే కండబలిమికంటే దాని వెనుక ఉన్న త్యాగవీరానికి గౌరవం ఎక్కువ. కళారంగంలో ప్రక్రియా సాధనం కంటె ప్రయోజనానికి ప్రతిపత్తి ఎక్కువ. సమాజ సేవారంగంలో స్వార్థంకంటె పరార్థానికి పరిగణనం ఎక్కువ. వీరి కీర్తనం ఛాందసమైన సంప్రదాయం కాదు; అభ్యుదయాని కబ్బే అభినవ తేజం!

వీర కీర్తనం, మనీషి ప్రభావం కవితలో వెలిస్తే కావ్యమౌతుంది; కథగా వెలిస్తే గాథగా, జీవిత చరిత్రగా రూపొందుతుంది. కానీ, ఈ రెండూ విస్తృత ప్రక్రియలు. ఆధునిక యుగంలో మహాకావ్యాలకంటె ఖండకావ్యాలకూ, భావగీతికలకూ ప్రచారం ఎక్కువగా ఉంది. వేగవంతమైన ఆధునిక జీవితంలో అల్పాక్షరాలలో అనల్పప్రభావం వేసే సంగ్రహ రచనలు కావాలి. స్కెచ్, ప్రొఫైల్ లాంటి ప్రక్రియలు మనీషుల చిత్రణానికి అనువైనవిగా ఆధునికులు గుర్తించారు. ఈ రెండు ప్రక్రియలూ ప్రధానంగా

చిత్రకళకు సంబంధించినవి. తరువాత రచనాప్రక్రియలకు అన్వయింపబడినవి. స్కెచ్ అనే పదానికి Unfinished drawing or painting అనీ, general account of some thing అనీ, a fragment of narrative or discription అనీ అర్థాలు నిఘంటువులు చెపుతున్నాయి. దీన్నే రేఖాచిత్ర మంటాం తెలుగులో. వెలుగు నీడల వివరాలతో వర్ణరంజితమైన నిలువుపాటి చిత్రం కాదది. శక్తిమంతమైన కొన్ని రేఖలతో వ్యక్తి వైఖరి గోచరించేటట్లు గీచిన భావచిత్రం. వ్యక్తియొక్క జీవచైతన్యం రేఖలమధ్య తొంగిచూస్తుండటం దీని ప్రత్యేకత. వ్యంగ్యచిత్రంకంటె భావచిత్రం వేరైంది. వ్యంగ్యచిత్రంలో హావంతోపాటు హాస్యం మేళవింపబడుతుంది. భావచిత్రంలో హావంలో భావం నిండిఉంటుంది. దానిలో ప్రతీకాత్మకమైన కల్పన ఉండవచ్చు; దీనిలో ప్రతిబింబాత్మకమైన భావవ్యక్తి ఉంటుంది. ఈ లక్షణాలనే సారస్వతంలో రేఖాచిత్రాలకు అన్వయించాలి. కథనంలో, వర్ణనంలో, చిత్రణంలో మనిషియొక్క రూపురేఖలతోపాటు, భావవ్యక్తి రూపుకట్టటం రేఖాచిత్రానికి ప్రధానలక్షణం.

స్కెచ్‌కీ ప్రొఫైల్‌కీ కొంత తేడా ఉంది. ప్రొఫైల్ పదానికి- Outline of the face as seen from the side అనీ, any edge outlined against the sky or other background అనీ నిఘంటువులు అర్థం చెపుతున్నాయి. దీన్ని సారస్వత ప్రక్రియకు అన్వయించుకోవాలి. ఒక దృక్కోణంతో ఒక వ్యక్తి ప్రధాన వ్యక్తిత్వాన్ని సమకాలీన వాతావరణానికి అన్వయించి సమీక్షించటం ప్రొఫైల్‌కు ప్రధానలక్షణ మౌతుంది. చిత్రంలో ముఖాన్ని ఒక కోణం నుంచి దర్శించిన విధంగా రూపొందించటమంటే అర్థ మిదే. ముఖం వ్యక్తియొక్క వ్యక్తిత్వానికి ప్రతీక. దాన్ని రేఖామధురంగా ఆవిష్కరించటం కళాధర్మం. ఆ రేఖామాధుర్యంలో జీవచైతన్యం తొణికిసలాడాలి; ఒక విశిష్ట దర్శనం రూపుకట్టాలి. చిత్రకళలో రేఖలు చేసేపని ఈ ప్రక్రియలో కథన-లేక-వర్ణన శిల్పం చేస్తుంది. ఈ ప్రొఫైల్‌ను పదచిత్ర మని కొందరన్నారు. లేఖినిచిత్ర మని తిరుమల రామచంద్ర గారన్నారు. భావచిత్ర రచయిత వ్యక్తియొక్క స్వరూప స్వభావ వర్ణనాన్ని రేఖామాత్రంగా భావసుందరంగా ఆవిష్కరించటానికి ప్రయత్నిస్తాడు. పదచిత్ర రచయిత సమకాలీన పరిస్థితులమధ్య ఒక వ్యక్తి ఎలా తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నాడో తన దృక్కోణంతో సమీక్షించి సమన్యాయంతో చిత్రిస్తాడు. స్కెచ్‌లో రచయిత నిర్లిప్తుడై వ్యక్తియొక్క నిజరూపాన్ని నిరూపించటానికి ప్రయత్నిస్తాడు; ప్రొఫైల్‌లో తాను చూసిన వ్యక్తిత్వాన్ని ప్రదర్శించటానికి ప్రయత్నిస్తాడు.

'స్కెచ్'కంటె 'ప్రొఫైల్' చిత్రణం కత్తిమీద సాములంటిది. రచయిత చిత్రించే మనీషి వ్యక్తిత్వం సర్వజనాంగీకారమైన సమన్వయ మార్గంలో సాగాలి. సాగాలని నియమం లేదంటారు కొందరు. అదీ కొంతవరకు నిజమే. అయితే 'ప్రొఫైల్' చిత్రణంలో రచయిత రాగద్వేషాలు ప్రధానంగా ప్రతిబింబిస్తే దానికి విశ్వజనీనత కొరవడుతుంది. విభిన్న దృక్కోణాలతో వ్యక్తిత్వాన్ని సమన్వయించటమే ఈ ప్రక్రియలో

ప్రధాన లక్షణమైతే విశ్వజనీనత కొరవడితే దోషం కాదంటారు కొందరు. కాని, రచయిత దర్శనం, సమన్వయం సహేతుకంగా, సహృదయ భావబంధురంగా ఉన్నప్పుడు పఠితను ఆ రచయిత ఒక్కొక్కసారి తన దృక్పథంతో ప్రభావితం చేయవచ్చు. అయినా, ఇందులో గమనింపదగిన అంశం ఒక్కటే. రచయిత మనిషిమీద మహాభిమానం ప్రకటించినా, తీవ్రద్వేషాన్ని వెళ్లగక్కినా పఠితల సానుభూతిని కోల్పోతాడు ఒకని ముఖం ఒక పోజులో బాగుంటుందనుకోండి; ఫొటోగ్రాఫరు ఆ కోణంలోనుంచి ఆ ముఖాన్ని రమణీయంగా చిత్రబద్ధం చేస్తాడు. ఒక మనిషి ఒక క్షేత్రంలో మహోజ్జ్వలంగా భాసిస్తాడనుకోండి. ఆయన్ను చూచే దృక్కోణంతో చూచి ఆయన వ్యక్తిత్వాన్ని చిత్రించాలి. సవ్యమైన దృక్కోణంలోంచి చూడటమే ఈ ప్రక్రియలో ఉన్న ఔచిత్యం. ఆ ఔచిత్య పాలనం ఎంత సమర్థనీయంగా సాగితే రచయిత చిత్రణం అంత విశ్వజనీన మౌతుంది. శ్రీ తిరుమల రామచంద్రగారు 'ప్రొఫైల్' చిత్రణంలో సిద్ధహస్తులు వారి చిత్రణం విశ్వజనీనమైన కళాధర్మాలతో వెల్లివిరిసింది. ఒక్క ఉదాహరణం చూడండి- కృష్ణశాస్త్రిగారిని 'మరపురాని మనీషిగా' చిత్రిస్తూ-

"వారు వ్రాసింది ఎంత: అన్నది బాలిశుల ప్రశ్న. 'అమరుకకవేః ఏకః శ్లోకః ప్రబంధ శతాయతే' అన్నాడు ఒక సహృదయుడు. అది నాడూ, నేడూ నిజం. దేవులపల్లి వారి 'ఏకం పద్యం ప్రబంధ శతాయతే' అంటాను నేను. ఇది నేడూ రేపూ నిజం. సాహిత్య చరిత్రకారులు ఏమి వ్రాతలు వ్రాసినా, నేను మాత్రం దేవులపల్లివారిని నవ్యకవితా ప్రస్థానాచార్యులుగా పురస్కరిస్తాను"—

'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు?-నా యిచ్ఛయేగాక నాకేటి వెరపు?'-అని ముగించారు. కృష్ణశాస్త్రిగారి కవిత్వంమీద భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. తాను నమ్మిన సత్యాన్నే, తాను చూచిన దృక్కోణాన్నే రచనలో ప్రదర్శించాడు రచయిత. అది సార్వకాలిక సత్యమని సహేతుకంగా సమర్థించాడు. కృష్ణశాస్త్రి మాటలే తన మాటలుగా ముగించాడు తాదాత్మ్యంతో. ఈ విధమైన చిత్రణం కవిమీద ఎంత గౌరవం కల్పిస్తుందో రచయిత మీదకూడా పఠితకు అంత విశ్వాసాన్ని కల్పిస్తుంది పఠితల విశ్వాసాన్ని చూరగొనటం కంటె ఈ ప్రక్రియకు సార్థక్యమేముంది!

ఈ విధమైన సారస్వత ప్రక్రియకు పాశ్చాత్యుల్లో Izaak Walton లాంటి ప్రముఖులు రూపురేఖల్ని తీర్చిదిద్దారు. భారతీయుల్లో యం. చలపతిరావు లాంటి ప్రముఖ పాత్రికేయులు దాన్ని చేపట్టి పత్రికా రచనలో ఒక శాఖగా దాన్ని రూపొందించారు. తెలుగులో ఈ రంగంలో కృషిచేసిన పెద్దలూ, వెలువడిన రచనలూ కొన్ని ఉన్నాయి. అన్నింటినీ ఇక్కడ పేర్కొనటానికి నాకు శక్తి లేదు, అవకాశమూ లేదు. 'విశాలాంధ్రము' (అవటపల్లి నారాయణరావుగారు), ధన్యజీవులు (ఆచార్య రంగాగారు), పెద్దలు పరమపదించినప్పుడు నార్లవారు వ్రాసిన సంపాదకీయాలూ, 'జాతివెలుగులు' (గొట్టిపాటి బ్రహ్మయ్యగారు), 'మహానాయకులు', 'జాతినిర్మాతలు' (తుర్లపాటి కుటుంబరావుగారు), 'ఆణిముత్యాలు' (వేమూరి రాధాకృష్ణమూర్తిగారు), 'మన పండితులు కవులు

రచయితలు' (కోవెల సంపత్కుమారాచార్యగారు), 'చరిత్రకందని మృతవీరులు' (ఎ. పండరీనాథ్‌గారు), 'ఆంధ్ర నాటకకర్తలు' (వివిధ రచయితలు), 'మరుగుపడ్డ మాణిక్యాలు' (ఆచార్య బి. రామరాజుగారు), 'నవ్యాంధ్ర నిర్మాతలు'—మొదలైనవి ఎన్నో. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారి విశిష్ట సభ్యుల ప్రశంసలు (ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారి రచన) కూడా ఈ వరుసలో పేర్కొనదగిందే. ఇంక తెలుగు వార పత్రికలు, మాసపత్రికలూ ధారావాహితంగా మహాపురుషుల్ని పరిచయంచేసిన శీర్షికలను ప్రత్యేకంగా పేరొక్కొనాలి. 'తెలుగువెలుగులు' (ఆంధ్ర సచిత్రవారపత్రిక) ఆరుద్రగారి రచన; 'మరపురాని మనీషి' (ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక) తిరుమల రామచంద్ర గారి రచన; 'నటరత్నాలు' నటులను గురించి శ్రీ మిక్కిలినేని గారి రచన (ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక); 'సరిగమపా' సంగీత విద్వాంసులను గురించి నండూరి పార్థసారధి గారి రచన (ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక); చైతన్యమూర్తులు (వివిధ రచయితలు-ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక) - మొదలైనవి. ఇందులో అన్నీ పదచిత్రాలే కాదు; కొన్ని రేఖాచిత్రాలుకూడా ఉన్నాయి. పదచిత్ర ప్రక్రియలో ప్రసిద్ధిగాంచిన - 'మరపురాని మనీషి' శీర్షిక క్రింద వచ్చిన లేఖినీచిత్రాలను యువభారతి ఒక సంపుటంగా ప్రచురించటం ఎంతో ముదావహం. సమకాలీన సాహితీప్రియుల కీ గ్రంథం చక్కని ఆల్బంలా ఉపయోగిస్తుంది. పత్రికలో ప్రచురించిన ఫొటోలకు బదులు ప్రొఫైల్ స్వరూపాన్ని అందించే రేఖాచిత్రాలను పొందుపరచటం ఇందలోని విశేషం, ఔచిత్యం.

శ్రీ తిరుమల రామచంద్రగారు ప్రసిద్ధ విద్వాంసులు, పాత్రికేయులు, సంస్కృతాంధ్రాంగ్లాలలో వారికి గట్టి అభినివేశంతో కూడిన పాండిత్యం ఉంది. లిపి పుట్టు పూర్వోత్తరాలనుండి హైదరాబాదు లేఖ వరకూ వారి రచనలు తెలుగువారికి తీయంద నాలు పంచిపెట్టిన తేనెపట్టులు. రచయితగా, విశేషించి మనసున్న మనిషిగా ఎందరి మనీషుల చేతనో మన్ననలందుకొన్న మానిసి ఆయన. తెలుగువారికి 'మరపురాని మనీషి' శ్రీ తిరుమల రామచంద్ర. జాతిరత్నాల్లాంటి పదచిత్రాలను మనముందు ఉంచారు వారు. వైవిధ్యంతో కూడుకున్న వ్యక్తుల్ని ఎన్నుకోవటంలోనూ, ఎన్నుకొన్న వ్యక్తుల్లోని ఎన్నికైన గుణాలను మన్నికైన రచనంలో చిత్రించటంలోనూ వారు కృతకృత్యులయ్యారు. ఇందులో ప్రసిద్ధులైన కవులు, గాయకులు, రచయిత్రులూ, పండితులూ, పరిశోధకులూ, పాత్రికేయులూ, నటకులూ, ఆచార్యులూ, దేశభక్తులూ, కార్యకర్తలూ చిత్రింపబడ్డారు. రాజకీయ నాయకుల్ని ఈ వరుసలో చేర్చక పోవటంచేత ఇది సాహిత్యకళా రంగాలకే పరిమితమైన లేఖినీచిత్రాలని పేర్కొనవచ్చు. ప్రజలలో సాహిత్య చైతన్యాన్ని వ్యాపింపచేయటంలో యథాశక్తి కృషిచేస్తున్న మా యువభారతి ఈ గ్రంథాన్ని ప్రచురింపగలగటం అదృష్టవిశేషం. యువభారతి ప్రచురణల ప్రధాన సంపాదకుడుగా రెండుమాటలు ముందుగా వ్రాసే అవకాశం దొరికినందుకు నేను ఎంతో సంతోషిస్తున్నాను.

2-2-1975

జి.వి. సుబ్రహ్మణ్యం



శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి

1934 నాటిమాట. గుంతకల్లు రైల్వేజంక్షనులో గుంటూరుబండిలో దాక్కున్న ఒక యువకుణ్ణి కొందరు బలవంతంగా దింపి, పూనా బండి ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారు. వారంతా కొల్హాపూర్ వెళ్లుతున్నారు. ఆ యువకుడు "అబ్బే! నేనురాను. నాకు భయం వేస్తూంది. హరిప్రసాదరావుగారి లాగ మెప్పించగలనా హరిశ్చంద్ర వేషం? చూచిన వారు ఏమంటారు? గుంటూరుకు టిక్కెట్టుకూడా కొన్నానే. రానంటే రాను" అని గింజుకుంటున్నాడు. అందరూ కలిసి అతణ్ణి పట్టుకు లాక్కుపోయి ఉత్తరకుమారుణ్ని అర్జునుడు రథానికి కట్టివేసినట్టు పూనాబండిలో ఎక్కించి పెట్టె తలుపులు బిడాయించి, సీటుకు కట్టివేసినంత పనిచేశారు. బండి కదిలింది.

ఆ యువకుని చిన్ననాడూ - 1916 లో ఇలాటి తమాషాయే జరిగింది. రాజమండ్రికి ఏదో చుట్టపుచూపుగా వెళ్ళాడు. అతనిది కమ్మని శరీరం. చిన్ననాటినుంచే కమ్మగా పాడేవాడు కూడా. స్నేహితులు ఆయనను నాటకానికి పిలుచుకొని వెళ్లారు. పాట పాడుతాడని, 'పాడించండి అంటే పాడించండి' అన్నారు నలుగురూ. అక్కడి

నాటకసంఘం యజమాని కృత్తివెంటి గున్నేశ్వరరావు యువకుణ్ని కౌగిలించుకొని "మా కంపెనీలో ఉండిపోవోయ్! నెలకు 25 రూపాయలు జీతం" అంటూ బయానాగా 300 రూపాయలు దోసిట్లో గుమ్మరించాడు.

"నేను నాటకాలలో వేషాలు వేయడానికి రాలేదు. టీచర్స్ ట్రెయినింగ్ అయిన వాణ్ణి, మాస్టరీ చేసుకుంటాను" అని యువకుడు మొరపెట్టుకున్నాడు. పదిమందీ కలిసి ఎలాగో ఒప్పించారట. నెలకు పాతిక జీతం 300, బయానా అంటే యువకుని మనస్సూ కొంతమారింది. (స్కూలు మాస్టరుగా ఉంటే ఎలా ఉండేదో!)

ఆ యువకుడు ఎవరనుకున్నారు? దాదాపు నాలుగు దశాబ్దాలపాటు నటన రంగంలో కరుణారసప్రవాహాలు పారించి సహృదయులను ముంచెత్తిన నటసార్వభౌములు శ్రీ అద్దంకి శ్రీరామమూర్తి గారే.

నాటకరంగంలో అద్దంకివారు వేయని వేషమంటూ లేదు. వివిధ పాత్రలను నిర్వహించారు, అన్నిటా సమానమైన సమర్థతతో, పాత్ర వైవిధ్యంతోపాటు నటన వైవిధ్యమూ, నైపుణీ మెరుగెక్కువి. ఏ నాటకంలోనైనా కింది వేషం మొదలు పై వేషంవరకూ వేసేవారు. సీతతో ఆరంభించి దశరథునిలోను, మునికుమారునితో ఆరంభించి కణ్వునిలోను, సహదేవునితో ఆరంభించి ధర్మరాజులోను వారి అభినయ చాతురి పరాకాష్ఠ నందుకొంది.

ఎన్నో వేషాలు వేసినా, మూడింట మాత్రమే వారికి మన్ననా, మక్కువా ఎక్కువ. అవి ధర్మరాజు, కణ్వుడు, దశరథుడు. పాండవ విజయంలో వారు ధర్మరాజై మరణించిన అభిమన్యుని "ఆకర్ణాంతములైన ఆ కనులు . . . ఆ మోకాల్మీదికి జారు చేగవ" అని పద్యం పాడుతూ ఉంటే ప్రేక్షకలోకం ఏడిచేది.

అలాగే కణ్వుడుగా శకుంతలను హస్తినాపురికి పంపుతూ, కాళిదాసు శ్లోకం చదివి, "కొందలమందె డెందము" అని కందుకూరివారి పద్యం అందుకుంటే, ప్రేక్షకుల డెందాలు కొందలమందేవి.

దశరథ పాత్రధారణలో వారు పరాంకోటిని అందుకున్నారు. దశరథుడు ఎలాటివాడో ఎవరూ చూడలేదుగాని, అద్దంకి అపరావతారమేననే ప్రథ పడిపోయింది. అప్పుడు దశరథ పాత్రధారణలో పేరుగన్న ఆలమూరి పట్టాభిరామరావుగారు అద్దంకి వారి దశరథపాత్ర చూచి "ఇక నేను సంతృప్తిగా విరమించుకొంటాను" అన్నారట.

అద్దంకివారు ఈ మూడు పాత్రలూ సాధించారు. నాటకాలలో పద్యం చదవడానికి ఒరవడిపెట్టారు. వారి గమకం (పద్యపఠనం) పద్యానికేవన్నె తెచ్చేట్టుఉండేది. అవసరమైనంత రాగం, భావస్ఫురణకు ఆవశ్యకమైనంత మాత్రమే. దానితో ఏదో వచనంలో సంభాషిస్తున్నట్లే, స్వాభావికంగా ఉండేది. రాగం రేఖామాత్రంగా చూపే వారంటే సంగీతం రాదని కాదు. సంగీతంలో కచ్చేరిలు చేసిన విద్వాంసులు.

అద్దంకివారు ఇంతటి ప్రావీణ్యం గడించడానికి కారణమేమిటి ? "పూర్వం ప్రతి నాటక సంఘానికీ పాటలకు ఒక్కరూ, నటనకు ఒక్కరూ శిక్షకులు ఉండేవారు. అందువల్ల ఏ నాటకమైనా పక్వంగా తయారయ్యేది. బి. టి. రాఘవాచార్యులగారివద్ద ఒక్కొక్క పాత్రను ఎంతో అధ్యయనంచేసి నటించే వాళ్ళం. తర్వాత యడవల్లి సూర్యనారాయణ పెద్దన్నయ్యలాగ ప్రతిదీ నేర్పేవాడు" అంటారు వారు.

అద్దంకివారి పితృపాదులు వెంకటరాయడుగారు గొప్ప హరిదాసు. వంశమా భాగవత వంశం. పితృపాదులు ఒంగోలు తాలూకా కలువకూరులో నిర్యాణం చెంది నప్పుడు ఊరు ఊరే ఆయనకు పాదాభివందనం చేసిందట. ఆ సౌమ్యత, గాంభీర్యం పుత్రునిలోనూ ఉన్నాయి.

అద్దంకివారు 14వ ఏటనే, 1911 లోనే నాటకజీవితం ప్రారంభించారు. అప్పుడు వారు బాపట్ల బోర్డు హైస్కూలులో నాల్గవ ఫారం విద్యార్థి. శ్రీ పంచాపకేశయ్యర్ హెడ్‌మాస్టరు. తల్పగాయి, మద్రాసు మాజీ న్యాయమూర్తి చింతగుంట రాఘవరావు సతీర్థ్యులు. పాఠశాల వార్షికోత్సవంలో తొలిసారిగా రంగు పూసుకున్నారు. గయోపాఖ్యానంలో సహదేవుడుగా.

చిన్నప్పటినుంచీ వ్యాయామంపై ప్రీతి హెచ్చు. కుస్తీలు పట్టేవారు. ఉపాధ్యాయ శిక్షణలో డ్రాయింగు, జిమ్నాస్టిక్స్‌లో ముందుండే వారు. కాని, జీవితగతి మారి నాటకాలలో పడ్డారు. రాజమండ్రిలోని కృత్తివెంటి గున్నేశ్వరరావు నాటక సంఘంలో కొన్నేళ్ళు, ఏలూరులో మోతే నారాయణరావుగారి సీతారామాంజనేయనాటక సమాజంలో పదేళ్ళు పనిచేశారు. మైలవరం కంపెనీలో కొంతకాలం ఉన్నారు. యడవల్లి సూర్యనారాయణ, ఉప్పలూరి సంజీవరావు, పారుపల్లి సుబ్బారావు మొదలయిన వారు వారి సహనటులు. మోతే వారిని "ఆయన నాకు చాల సహాయంచేశారు. గొప్ప కళాభిమాని" అని ఎంతో గౌరవంతో స్మరిస్తారు అద్దంకివారు.

సంగీతం బాగా రానిదే ప్రయోజనం లేదనుకున్నారు. ఒకప్పుడు వేషాలు వేయడం మాని, పుష్కరం పాటు గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్యగారి వద్ద సంగీతం సాధనచేసి, పదేళ్ళపాటు పాటకచ్చేరీలు చేశారు. పారుపల్లి సుబ్బారావు జొన్నవిత్తుల శేషగిరిరావు మొదలయిన వారితో చేరి సంగీత నాట్యమండలి స్థాపించి నిర్వహించారు.

వివిధ పాత్రలను నిర్వహించారు. అందరినీ మెప్పించారు. పెక్కు సన్మానాలు పొందారు. 1924 లో మద్రాసులో కాశీనాధుని నాగేశ్వరరావుగారు బంగారు పతకం బహూకరించారు, దశరథ పాత్రకు విస్మితులై.

ఇంతలో నాటకాలను మింగి ముందుకువస్తున్న చలనచిత్ర కళ వీరిని ఆకర్షించింది. 1934లో హరిశ్చంద్ర వేషంతో సినిమా జీవితం ప్రారంభమయింది.(అప్పటి

సంగతినే మొదట పాఠకులు చదివారు) చంద్రమతి శ్రీమతి కన్నాంబ. అద్దంకివారు దాదాపు ఇరవై చిత్రాలలో నటించారు. ఈ సినిమాజీవితం 1948 లో నహుష పాత్ర ధారణతో ఆఖరయింది. పదిహేను సంవత్సరాలపాటు సినిమాజీవితం ఉజ్వలంగా సాగింది.

1949లో అద్దంకివారు సినిమానుంచి తిరిగివచ్చి చూస్తే, పరిస్థితి తారు మారయింది. నాటక ప్రపంచ స్వరూపమే మారిపోయింది. మునుపటి సాధన, గురు ముఖతః నేర్వడం అంతరించాయి. పౌరాణిక నాటకాలు అవసరం లేదనే వాదం బయలుదేరింది. ప్రాచీన నాటకాలపట్ల అభిరుచీ అంతంతమాత్ర మయింది. ముగ్గురు కృష్ణుల, నలుగురు ధర్మరాజుల, అయిదుగురు సీతల నాటకాలు వచ్చాయి. అయినా, వారు అడపా దడపా వేషాలు వేయడం ఉండనే ఉండేది.

1854 నుంచి విజయవాడలో బుడమేరు కొత్తవంతెనవద్ద తోటలో ఆశ్రమం వంటి ప్రశాంతమైన గృహంలో నివసిస్తున్నారు. ఇద్దరు కుమారులు, అయిదుగురు కుమార్తెలు సతీమణి శ్రీమతి దుర్గామహలక్ష్మిగారు. ప్రస్తుతం ఆరవైఅయిదో ఏడు. షష్టిపూర్తి దాటేవరకు జీర్ణన చీది ఎరుగరు. జ్వరమనేదే తెలియదు. తోటకు కాపలా రెండు జాతి జాగిలాలు. ఆయనకు కుక్కలంటే మొదటినుంచీ మోజే. కాని ఇప్పుడు అవసరమైంది.

ఇటీవల అమలాపురంలో శాకుంతలంలో కణ్వపాత్ర ధరించి "యాస్యత్యద్య శకుంతలేతి హృదయం సం సృష్ట ముత్కంఠయా" అని కంఠం బిగించి ఉత్కంఠ చూపబోయారట. నాల్గవ తరగతి ప్రేక్షక మహాశయుడు ఒకడు "పెద్దగానోయ్!" అని కేక వేశాడట. దానితో "ఇక లాభం లేదు. మానాటి సంస్కారం గలవారు తక్కువవుతున్నారు. మైక్ లేకనే హాలు నలుమూలలా పాకేలాగ ఎంతో ముచ్చటగా నొక్కులునొక్కే పద్ధతి ఇకలేదు. ఇక తగ్గడం మంచిది" అనుకున్నారు. ఆ భావం సంకల్పంగాను, క్రియగాను మారింది.

"అదేమిటి? ఆమధ్యన చెన్నపురి వి. పి. హాలులో మీరు 'ఏకచ్ ప్యాలా' అనే మహారాష్ట్ర సాంఘిక నాటకంలో (తెలుగు అనువాదంలో) బారిస్టర్‌గా ఎంచక్కగానో నటించారే! పౌరాణికాలే కావాలా? సాంఘికాలు లేవా?" అని ప్రశ్నించాను.

వారు కండలుతీరిన చేత్తో పొగాకు ఈనెనుతీస్తూ "కోడి రామమూర్తిగారి లాగ సర్కసు కంపెనీ లేవదీద్దామనుకున్నాను సంగీతంలో దిగాను. నాటకాలు, సినిమాలు- అలా ప్రవాహంలో కొట్టుకుపోయాను. నేను ఆగిపోయాను. ముందుకు సాగిపోతున్న వారిని పోనివ్వండి. వారిలో పడితే నేను రాణించనని అనుకుంటున్నాను. కనక, వారిలో దూరను. సంగీతంలోనే ఉంటే గొప్పవాడిని అయ్యేవాడిని" అంటూ చుట్ట చుట్టి వెలిగించారు.

కాని అద్దంకివారు అలా ఎంతమాత్రమూ పశ్చాత్తాప పడనక్కరలేదు. వారు సంగీతంలో ఉంటే అపర త్యాగబ్రహ్మ, వ్యాయామంలోనే ఉంటే రెండవరామమూర్తి అయ్యేమాట నిజమే. ఎక్కడున్నా వెలిగే జాతకమే. నటనలో దాదాపు అర్ధశాతాబ్ది ఆంధ్రావళిని తనియించి, తామూ తనివి చెందారు. సార్థక్యం పొందారు. ఇటీవలెనే వారిని ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడెమీ ఫెలోషిప్పుతో గౌరవించింది.

నేడు "అనేక యుద్ధముల నారియు తేరిన" అద్దంకి వారివంటి పెద్దల నటనానుభవం ఈ తరంవారు వినియోగించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

శ్రీ రాదిరాజు వీరభద్రరావు

గోలుకొండ సీమ తెలుగు కావ్యాలలో ఎవడో "చిత్తాబుఖాను విభుడు" కనిపించాడు. సొంత పాండిత్యం వెలిగించ దలచిన లేఖ కొత్తము డెవడో "చిత్తాబ్జఖాను విభుడు" అని సవరించుకొని వ్రాసుకొన్నాడు. చిత్తమనే అబ్జానికి ఖానుడేమిటి? అన్వయ మేమిటి? అర్థమేమిటి?—అనుకొని వీరేశలింగం పంతులుగారి వంటి వారే ఖానులోని 'ఖ' వ్రాలు సెబ్బర అనుకొని 'భ' గాదిద్ది చిత్తాబ్జ భానుడని సాధుపాఠం చేసుకొన్నారు.

ఇంతలో ఓరుగల్లు కోటలోని సంస్కృత శాసనాలలో ఒకవింత శాసనం కనిపించింది. దానిలో చిత్తాపఖానుడనే వాడు నాయకుడు. అతనికి దానిలోనే సీతాపఖాన అనే నామాంతరమూ ఉన్నది. ఓరుగల్లు కోటలో షితాబుఖాన్ దీవానే ఆమ్ (దర్బారు హాలు), షితాబుఖాన్ చబూతరా (వేదిక) అనేవి జనం అనుదినం చూస్తున్నవే. అంత వరకు ఇవేవో కట్టుకథలని అనుకున్న చరిత్ర పరిశోధకులను ఈ శాసనం నిజంవైపు మళ్లించింది. "పిడెవడో మనవాడే"నని షితాబుఖానును తనవాణ్ని చేసుకొనడానికి నిజాం

ప్రభుత్వం కలలు గనింది; పరిశోధించి తేల్చండని కొమర్రాజు లక్ష్మణరావుగారికి ఆ శాసన ప్రచురణకార్యం అప్పగించింది. కొమర్రాజువారు అదివరకే శివతత్త్వసారం పీఠికలో ఈవిషయాన్ని గుర్తువెట్టుకోడంవల్ల పరిశోధన సులువైంది. కాని, దురదృష్టవశాత్తు వారిని ఆ కాలంలో కాలుడు కబళించి వేశాడు. ఆ పరిశోధనను ప్రభుత్వపరంగా కాక పోయినా ప్రజలపక్షాన, ప్రజలకోసం కొనసాగించి, షితాబుఖాను హిందువే కాని తదితరుడు కాడని, ఏ ముస్లిం సల్తనత్తుకూ మూలపురుషుడు కాడని, సీతడు సీతాపతిఅయి, ప్రభావ దినాలలో షితాబుఖాను, చిత్తాపుఖాను అని బిరుదాలు ధరించిన వాడని ఖైఫీయతులు మొదలయిన ఉపపత్తులతో, సాహిత్యంలోని ప్రస్తావనల ఉట్టంకనలతో నిరూపించారు. కొమర్రాజువారికి దీటయినవారు మరొకరు; నిజాంప్రభుత్వం కలలనుకల్లలుచేశారు. వారే శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారు. అర్ధశతాబ్దిపై చిలుకు తెలంగాణా చరిత్ర తిరగవేస్తే, సేవారంగంలో శ్రీ ఆదిరాజు వీరిభద్రరావుగారు, శ్రీ మాడపాటి హనుమంతరావు గారూ కవలలుగా కానవస్తారు. మాడపాటివారు సంఘసేవకు అంకితులై పోతే, ఆదిరాజు వారు సారస్వతోద్యమానికి అంకితులయ్యారు. సేవారంగాలు వేరయినా, ఇద్దరిస్వభావాలు ఒక్కటే; ఒకే కార్యదీక్ష, తోటివారిపై ఒకే వాత్సల్యవీక్ష.; ఒకే నిదానం, ఒకే ఆదాన ప్రదానం; ఒకే నిసర్గ మధురప్రకృతి; ఒకే నిరాడంబరోదారాకృతి;ఒకే అసిధారావ్రతం. ఒకే అచంచల నియమానువ్రతం,ప్రజానిధుల నిర్వహణలో అదేపొదుపు, అదేఅదుపు.

ఆదిరాజు వారు మధిర తాలూకా దెందుకూరులో 1887లో జన్మించారు. నంది గామ తాలుకా ఆదిరాజు వారి పుట్ట. వారి ఐదేళ్ళ ప్రాయంలోనే కరోడ్గిరి (కస్టమ్స్)లో గుమాస్తాగా ఉన్న వారి తండ్రి లింగయ్యగారు పరమ పదించడంవల్ల, తల్లి వెంకమాంబ గారు చెల్లెలియింట, వారు (ఆదిరాజువారు) కొంతకాలం తిరువూరు తాలూకా, పెంగొలనులో మాతామహుల యింట కొంతకాలం పినతండ్రి, పెదతండ్రుల యింట గడపవలసి వచ్చింది. కనుకనే వారు 'నేను తండ్రిని ఎరుగను' అంటూ ఉంటారు. చింతకాణిలో పోలీసు ఠాణాలో నవిసిందా (రైటరు)గా పనిచేస్తున్న పెదతండ్రి రామకృష్ణరావు గారి యింట ఉన్నప్పుడూ, కొణిజెర్లలోనూ వారు వీధిబడిలో చదివారు. బడిలో వీణె సీతారామయ్య పంతులమెప్పు, ఠాణా లెక్కలు అని వ్రాసిపెట్టి పెత్తండ్రిగారి మన్ననా పొందేవారు. ఇలా పదమూడేండ్లు గడిచాయి.

కొడుకు ప్రయోజకత్వానికి వెంకమాంబగారు ఒకవైపు మురిసిపోతున్నా, ఆంగ్లేజీ చదువులు లేనిదే అతడు పెద్ద ఓహదేదారు కాడనే అనుమానం కలుగగానే, బల్దాకు (రాజధాని హైదరాబాదుకు) కొడుకుతో సహ పయనం కట్టారు. అప్పుడు రావి చెట్టు రంగారావుగారు హైదరాబాదునగరంలో ప్రముఖదేశభక్తులు, సారస్వతపోషకులు, వితరణశీలులు, తెలుగువారికి పట్టుగొమ్మ, నెలకు వంద రూపాయలు గౌరవవేతనం పొందుతున్న మన్సబ్‌దారు. వారి సతీమణి, వేంకమాంబ ఒకే యింటి ఆడబడుచులు. రంగారావు దంపతులు ఆ అభిమానంతోను, నిస్సంతువులు కావడంవల్లను, వారిద్దరికీ ఆశ్రయమిచ్చి ఆదిరాజు వారిని పుత్ర నిర్విశేషంగా చూడసాగారు.

ఆదిరాజు వారి జీవితం మారాకు తొడిగింది. చాదర్ ఘాట్ హైస్కూలులో ఇంగ్లీషు మూడవ తరగతి (ఫస్ట్ ఫారం) లో చేరారు. ఇంట్లో చెప్పించుకొని 1903లో అయిదవ తరగతి (థర్డ్‌ఫారం) ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. అప్పుడు అయిదవ తరగతిలో మిడిల్‌స్కూలుముగిసేది. తర్వాత ప్రిమెట్రిక్, మెట్రిక్, హైస్కూలు మొత్తం రెండు సంవత్సరాలే. వార్షిక పరీక్షలు డిసెంబరులో జరిగేవి. ఆదిరాజు వారు తర్వాత రెండు సంవత్సరాలు హైస్కూలులో చదివి మెట్రిక్ పరీక్షకు కట్టారు. కాని శీతకాలం వారి శరీర తత్వానికి సరిపోనందున పరీక్షకు వెళ్ళలేక పోయేవారు. అంత తోనే వారి బడిచదువు ఆగింది.

కాని రావిచెట్టు వారి గృహం ఆనాడొక సారస్వత కేంద్రం కావడంవల్ల, నేటి కృష్ణ రాయాంధ్రభాషానిలయం (1901) విజ్ఞాన చంద్రికా గ్రంథమాల (1905) నాడు వారి యింటనే మొలకెత్తడంవల్ల, రావిచెట్టు వారి పక్షాన సూనుగు మీసాల ప్రాయము ననే ఆదిరాజు వారే గ్రంథాలయాన్ని, గ్రంథమాలను నిర్వహించవలసి రావడంవల్ల కొమర్రాజు వారి మార్గ దర్శకత్వం ఆనుషంగికంగా లభించడంవల్ల ఆదిరాజు వారి ప్రతిభ వేయి రేకులుగా విరిసింది; బుద్ధి పరిశ్రమ ప్రవణ అయింది.

ఆదిరాజు వారు 1906 లో గృహస్థులయ్యారు. వారి సతీమణి శ్రీమతి లక్ష్మీ నరసమ్మగారు అన్నివిధాల వారికి ప్రతిచ్ఛాయ. కొమర్రాజువారు, మునగాల రాజాగారి దావాలకోసం మద్రాసులో ఉండటంవల్ల, ఇతర కారణాలవల్ల రావిచెట్టువారు విజ్ఞాన చంద్రికా గ్రంథమాలను 1908 లో మద్రాసుకు తరలించారు. ఆదిరాజువారు ఊరికే చుట్టపుచూపుగా చూసిరావడానికి మద్రాసు వెళ్ళారు. రావిచెట్టువారు వారిని అక్కడే అపివేసి, గ్రంథమాల పనులు చూడమన్నారు. అప్పుడు గ్రంథములకు గాడిచెర్ల హరి సర్వోత్తమరావుగారు కార్యదర్శి: వారు స్వరాజ్య పత్రికలో సర్ ఆర్థర్ లాల్‌ను 'అరెరే సర్ ఆర్థర్ లాల్ క్రూర వ్యాఘ్రమా !' అంటూ విమర్శిస్తూ వ్యాసం వ్రాసి నందుకు క్రిందికోర్టు ఎనిమిదినెలలు శిక్షవిధించింది. హైకోర్టుకు అప్పీలుచేయగా రెండు సంవత్సరాలని దీర్ఘచెప్పింది. అప్పుడు పోలీసు సోదా అతితీవ్రం గనుక ఆ కాగితా లన్నీ తగులబెట్టాము" అని ఆదిరాజువారు ఆ నాటి ముచ్చట్లను మహోత్సాహంతో చెబుతూ ఉంటే శ్రోతలు మైమరచి పోతారు.

మద్రాసు నివాసం వారి సర్వతో ముఖాభివృద్ధికి అవకాశాలు తీర్చింది. వారికి సహకార్యకర్తలు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, ఆదిపూడి సోమనాథరావుగారు. కొమర్రాజువారు ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ కార్యకలాపం కొంత ఆదిరాజువారితోనూ నడిపించేవారు. అయితే, వారి మద్రాసు నివాసం అట్టేకాలం సాగలేదు. 1910 లో రావిచెట్టువారు కాలధర్మం చెందారు. ఆదిరాజువారి తల్లిగారూ పరమపదించారు. కొమర్రాజువారుకూడా దావాలు పూర్తికాగానే నడిగూడేనికి మకాం మార్చారు. విజ్ఞాన

చంద్రికా గ్రంథమాలనిర్వహణ ఆచంట లక్ష్మీపతిగారి వశమయింది. ఈ పరిస్థితిలో మనస్సు బాగులేక 1914 లో ఆదిరాజువారు హైదరాబాదుకు తిరిగివచ్చారు.

తిరిగివచ్చిన తర్వాత వారి జీవితం వారి స్వభావానికి అనుగుణమైన, ప్రశాంత మైన ఉపాధ్యాయవృత్తిలో నల్లేరుపై బండివలె నడిచిపోయింది. మహబూబు కాలేజీలో ఏడేళ్ళపాటు, తాము చదువుకున్న చాదర్‌ఘాట్ హైస్కూలులో ఇరవయ్యేడేళ్ళపాటు ఆంధ్రోపాధ్యాయులుగాను, స్కౌట్ మాస్టరుగాను ఉండి 1948 లో పదవినుంచి విరమించారు. అనంతరం నారాయణగూడ బాలికల ఉన్నత పాఠశాలలో ఐదు సంవత్సరాలపాటు పనిచేసి, 1953 నుంచి సంగ్రహ విజ్ఞానకోశంలో ఎడిటోరియల్ సూపరెంటెండెంటుగా పనిచేస్తున్నారు. చిన్నప్పుడు కొమర్రాజువారివద్ద పొందిన అనుభవం విజ్ఞానకోశగ్రంథనంలో పనికివచ్చింది.

"జీవనోపాధికి వేరే పనిచేస్తూ, 'స్పేర్ టైం'లో ఏదో సారస్వతసేవ చేసే వాణ్ని"అని వారు తన సేవను చప్పరించి వేస్తారుగాని, తెలంగాణాలో వారు లేని సారస్వతోద్యమంలేదు: వారు కనిపించని సారస్వత సంస్థలేదు. కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయానికి వారు రకరకాల హోదాలలో సేవచేశారు. విద్యార్థిదశలోనే వారు దానికి మొట్టమొదటి లైబ్రేరియన్. ఆంధ్రోద్యమానికి మూలస్తంభాలలో ఒకరు. 1921 లో శ్రీ మాడపాటివారు మున్నగువారితోపాటు ఆంధ్ర జనసంఘం స్థాపించారు దానికి కార్యదర్శిగాను ఎన్నికయారు. దానికి అనుబంధంగా మరుసటి సంవత్సరం ఆంధ్ర పరిశోధకమండలి నెలకొల్పారు. దానిని కొమర్రాజువారి అస్తమయానంతరం లక్షణరాయ పరిశోధక మండలిగా మార్చారు. దానికి నేటివరకూ వారే కార్యదర్శి. ఆంధ్ర సారస్వత పరిషత్తు, విజ్ఞానవర్ధినీ పరిషత్తు, ఆంధ్రచంద్రికా గ్రంథమాల మొదలయిన పెక్కు సంస్థల మూలపురుషులలో వారూ ఒక్కరు. తెలంగాణా సాంస్కృతిక సారస్వత పునరుజ్జీవన చరిత్రే వారి సేవాచరిత్ర అంటేచాలు. అందుకే వారికి తెలంగాణాలో అన్నిచోట్లా సన్మానాలు, అంతటి గౌరవాదరాలూనూ.

వారి కార్యదర్శిత్వంలో లక్ష్మణరాయ పరిశోధకమండలి చేసినసేవ అసదృశం తెలంగాణా శాసనాలు రెండు సంపుటాలు, షితాబుఖాను ప్రచురించింది." అన్ని ఇబ్బందులలో అంతటి పని ఎలా చేయగలిగారు? అని ప్రశ్నిస్తే "ప్రతిదానికీ సర్కారు నిగా ఉండేది. అందులో నేను సర్కారు నౌకరును. అడుగడుగునాచిక్కులే. ఒకమారు శాసనాలకోసం నిరశన దీక్షకూడా చేశాను. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు అధికారరీత్యా తాళపత్రగ్రంథాల సేకరణకు వస్తేనే మొదట్లో నిజాం ప్రభుత్వం అనుమతించలేదు. తర్వాత లండన్‌నుంచి తాఖీదుగా తలఒగ్గింది." అని తమ తాళ పత్ర, శాసనగవేషణ గాధలు చెబుతూపోతారు వారు.

వారికి చిన్ననాటినుంచే సరళసుందర రచన అలవడింది. ఎప్పుడో పద్యాలూ చెప్పడానికి ప్రయత్నించారట. కాని కవనంకన్నా వచనం ఎక్కువ ప్రయోజన

కరమని ఆదిపూడి సోమనాధరావుగారి సలహాపై వచనరచనకే పూనుకున్నారు. వారి మొట్టమొదటి ముద్రితగ్రంథం రావిచెట్టు రంగారావుగారి జీవితం. అముద్రితాలు చిత్ర శాకుంతలం మొదలయినవి ఎన్నో! అప్పటినుంచి పుంఖాను పుంఖంగా చారిత్రక, మానవజాతి పరిశోధకవ్యాసాలు వందలాదిగా వ్రాశారు. వ్రాస్తున్నారు. వాటిలో కొన్ని ప్రాచీనాంధ్ర నగరాలు, తెలంగాణము, లలితకథావళి గ్రీకు పురాణగాధలు మొదలయిన సంపుటాలుగా వెలువడ్డాయి. 'గ్రీకు పురాణగాధలు'ను గురించి కొంత గాధవుంది. వారు చాదర్‌ఘాట్ హైస్కూల్‌లో ఏదో భారతీయ పురాణకధ పాఠం చెబుతున్నప్పుడు ఒక క్రైస్తవ విద్యార్థి ఆక్షేపించాడుట. 'జాతి ఎంత ప్రాచీనమైతే అంత ఐతిహ్యాలుంటాయి. బైబిలులో నీళ్లమీద నడవటంవంటి కథలలాగే ప్రతిపురాణ గాధలూ ఉంటాయి" అంటూ నచ్చచెప్పి ప్రాచీన పాశ్చాత్య మతగాధలు అవలోడించి, పూర్వగాధాలహరిలాగ 620 గ్రీకు పురాణకధలు వ్రాశారు. వాటిలో కొన్ని ఈ సంపుటం. వారి మరొక అపూర్వ పరిశ్రమ కాకతీయాంధ్ర దర్శిని.

ఆదిరాజువారు ఆలస్యంగా పడుకొని ఆలస్యంగా లేస్తారు. పగలు నౌకరీ, ఇతరవేళల్లో ప్రజాకార్యం చేయటంవల్ల ఇది అలవాటయింది. చదువూ, వ్రాతా రాత్రిళ్లే. ఉదయం, సాయంకాలం వారే పాలుపితుకుతారు. ఇప్పుడు వారింట ఉన్న గొడ్డూగోదా ఎవరో కసాయి కబేలాకు తోలుకుని పోతున్న నిండుచూలాలయిన గోమాత ఆరవతరం. తువ్వాయిలన్నీ వారి ఒడిలోనే పెరిగాయి. వారికి పిల్లలులేరు. తమకు నచ్చినవారిని పెంచడం, వారికి పెండ్లి పేరంటం చేయడం, వారి ముచ్చట్లు చూచి మురిసిపోవడం వారికి సరదా. ఈ సరదాలను వరుసగా తీర్చుతున్న వారి సతీమణి పరదాలు లేని మనస్సును మెచ్చుకోవాలి.

"నాకు తెలియని విషయాలు తెలుసుకున్నాను. వాటిని ఇతరులకు తెలుపుదామనే ఉద్దేశ్యంతో ఏ పనైనా చేశాను." అని వారు అన్నప్పుడు ఆ తరంవారిపైనే అపారభక్తి ఏర్పడుతుంది. అదొక కోవ. పాండిత్యం పండినకొద్దీ ప్రశ్రయంతో పరువమయ్యే చేవగలకోవ. ఆ గుణాలు నేడు రెండు పంక్తులు వ్రాయగానే డిండిమం వాయించుకునే వారికి అబ్బితే, ఎంతో మేధ సార్థకమయ్యాని!



శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవి

శ్రీ కామరాజు వెంకటప్పయ్యగారు 1928 లో నందిగామలో తాసీల్దారుగా ఉన్నప్పుడు తన కింది కరణాలను పిలిపించి తన కుమారితకు మంచి సంబంధంచూడ మన్నారు. అప్పుడు ఆమెకు పన్నెండేండ్ల ప్రాయం. రెండవఫారం చదువుతున్నది. కరణాలు శ్రద్ధగా మంచి సంబంధం చూశారు. ఇల్లిందల వారి అబ్బాయి. పేరు సీతా రామరావుగారు. తాసీల్దారుగారింటి పెండ్లి మహావైభవంగా జరిగింది.

పెండ్లి కుమార్తె కాపురానికి వెళ్ళింది. పుట్టిన ఇల్లూ, మెట్టిన ఇల్లూ నవీనతకు ఉన్ముఖమైనవే. కనుక ఆమె ఆంధ్రప్రదేశ్ రాజధానిలోని స్టాన్‌లీ గర్ల్స్ హైస్కూల్లో చేరింది. నాలుగేళ్ళు గడచాయి. మెట్రిక్యులేషన్ పరీక్షల సమయం. ఆమెకు మరొక పెద్ద పరీక్ష ఏర్పడింది. పిల్ల తల్లి అయింది. ఇంత చిన్నతనంలోనే తల్లి నయ్యానే అనే సంకోచంతో, పరీక్షకు వెళ్ళలేకపోయానే అనే ఆవేదనతో ఆమెలో జిజ్ఞాస వేయి పడగలతో విజృంభించింది. 'ట్రూ స్టోరీ మేగజైన్' వంటి ఉబుసుపోక కథల పత్రి కలను చదవడమే కాక, తీరని జిజ్ఞాసతో ఎంతో అధ్యయనం చేసింది. భర్త అప్పటికి ఎమ్మెస్సీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విజ్ఞాన శాస్త్రోపన్యాసకులు, ఎంతో ప్రోత్సహించారు. ఆమె జిజ్ఞాస జ్ఞానార్జనతోనే ఆగలేదు. ఆమెను కార్యప్రవీణురాలి నిగా చేసింది. ఆమె తన జ్ఞానాన్ని మహిళాజనసేవకు వినియోగించింది. తన మాట లను చేతలగానూ మలచింది. ఆమే శ్రీమతి ఇల్లిందల సరస్వతీదేవిగారు.

ఆ రోజులలో తెలంగాణాలో మహిళల పరిస్థితివేరు. ముస్లింలు చాల ముందంజ వేసేవారుగాని, హిందూ మధ్యతరగతి మహిళలు ఎంతో వెనుకబడి ఉండేవారు. ఇక పై తరగతి స్త్రీలసంగతి చెప్పనక్కరలేదు అసూర్యంపశ్యలు. విద్యార్థినీ దశనుంచే ఆంధ్ర మహిళాసభ కార్యకలాపాలలో ప్రత్యేకశ్రద్ధ వహిస్తున్న ఇల్లిందల సరస్వతీ దేవిగారికి హిందూ మధ్యతరగతి మహిళలకోసం ముఖ్యంగా తెలుగువారి ప్రగతికోసం ప్రత్యేకంగా ఒక సంస్థ నెలకొల్పడం అవసరమని తోచింది. శ్రీమతి యల్లాప్రగడ సీతాకుమారిగారితో కలిసి 1934 లో ఆంధ్ర యువతీ మండలి స్థాపించారు. శ్రీమతి రంగమ్మ ఓబులరెడ్డిగారు అధ్యక్షులు.

ఆంధ్ర యువతీమండలి స్థాపనమేమో జరిగింది. దానికి సభ్యురాండ్రను చేర్చడం మహాయజ్ఞ మయింది. అప్పటి కష్టానుభవాలను ఇల్లిందలవారు చెబుతూ ఉంటే ఆశ్చర్యం కలుగుతుంది, ముచ్చటగానూ ఉంటుంది. 'సభ్యురాండ్రను చేర్చుకొనడానికి బయలుదేరే వారం. గౌరవ కుటుంబాలవారు వెలుపలికి వచ్చేవారుకారు. సంస్థానాల రాణీగార్లు, జాగీర్దారిణీగార్లు మాతో ముఖాముఖిగా మాట్లాడే వారు కారు. పరదా వెనక లీలగా కనిపిస్తూ చెలిక త్తెలద్వారాగాని. ఆయాలతోగాని కబురు పంపేవారు. సముఖాన రాయబారం అంటే ఇదే కాబోలునని అనుకునేవారం. సభ్యత్వపు జాబితాలో తమ పేర్లు తమ బిరుదావళితో సహా వ్రాయాలని పదేపదే చెప్పేవారు. మండలికి కీర్తిశేషులు ప్రతాపరెడ్డిగారు 'అసతోమా సద్గమయ' అనే నినాదం సూచించారు. డాక్టర్ బూర్గుల రామకృష్ణారావుగారు నియమావళి సిద్ధపరచారు.

ఇల్లిందలవారు ఈ విధంగా శ్రమపడుతూ పన్నెండు సంవత్సరాలపాటు కార్యదర్శి, ఉపాధ్యక్ష పదవులను నిర్వహించి మండలిని పెంచి పెద్దచేశారు. డా. బూర్గుల రామకృష్ణారావుగారి సతీమణి శ్రీమతి అనంతలక్ష్మిదేవిగారు అధ్యక్షస్థానం అలంకరించినప్పుడు మండలి బర్కత్‌పురాలో పెద్ద భవనం నిర్మించుకొంది. మండలి నేడు శిశువిహారం మొదలయిన అనుబంధ సంస్థలతో పిల్లలకోడి లాగ, పండ్లతీగలాగ కనుల పండువు చేస్తున్నది. ఇల్లిందల వారిప్పుడు మండలికి శాశ్వతసభ్యులు.

ఇల్లిందలవారి కార్యదక్షత ఆంధ్ర యవతీమండలికే పరిమితం కాలేదు. వారు భారత సంఘ సంక్షేమ మహాసభ తాలూకు ఆహార సంఘంలో సభ్యులుగాను, బందీఖానాల, ఆస్పత్రుల పర్యవేక్షకులుగాను, శిశు సంక్షేమ సంఘసభ్యులుగాను ఉంటూ ఎన్నో నూతన పథకాలు సూచించారు. వాటిని ఆచరణలో పెట్టించారు. సంఘసేవ జీవితలక్ష్యం కావడం వల్ల సాహిత్య సంస్థలతోను వారికి సంబంధం అనివార్యమైంది. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వాహక సభ్యులుగాను హైదరాబాదు నగరంలో ప్రాచీన తమమైన కృష్ణదేవరా యాంధ్ర భాషానిలయానికి పెక్కు సంవత్సరాలు నిర్వాహక సభ్యులుగాను, దక్షిణభారత హిందీ ప్రచారసభ హైదరాబాదు శాఖకు కొన్నేళ్ళు నిర్వాహక సభ్యులుగాను, ఉపాధ్యక్షులుగాను, కేంద్ర గ్రంథాలయ శిశుశాఖ సభ్యులుగాను

ఉంటూ గుప్తంగా చేస్తున్న సేవ పలువురికి తెలియదు. ఇక సాంఘిక, సారస్వతసభలకు అధ్యక్షత వహించడం వంటిది లెక్కలేనన్నిసార్లు.

ఇల్లిందలవారు కళ కళకోస మన్నట్లుగా రచన రచనకోసం చేపట్టలేదు. వారు దానిని సంఘసేవలో సాధనంగాను, అజ్ఞాన తమస్సును పోగొట్టే కరదీపికగాను భావించే కథలు, వ్యాసాలు మొదలయినవి వ్రాశారు. వారి మొదటి కథ, మొదటి వ్యాసం 1933లో గోలుకొండ పత్రికలో ప్రచురితమయ్యాయి. తర్వాత పదేళ్ళలో హైదరాబాదులో రేడియో కేంద్రం నెలకొల్పడం, తెలుగుకు అవకాశం కలగడం తటస్థించాయి. శిశు మహిళా జనోద్ధరణ లక్ష్యంతో వ్యాసాలు, నాటికలు, కథలు మొదలయినవి వ్రాయవలసి వచ్చింది.

రచయిత ఏమి చెప్పినా కాలానుగుణంగా చెప్పాలి. అదొక కళ. ఆ కళను వారు జర్నలిజం ద్వారా నేర్చుకున్నారు. చెప్పదలచిన విషయానికి 'లింక్' ఇవ్వడం వారు ప్రత్యేకంగా గ్రహించారు. ఈ మెలకువతోనే వారు పెక్కు సమకాలిక పత్రికలలో వివిధ శీర్షికలక్రింద అనర్గళంగా వ్రాశారు. వారికిగల పత్రికా రచనానుభవాన్ని బట్టే, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జర్నలిజం తరగతులు పెట్టినప్పుడు వైస్ చాన్సలర్ డాక్టర్ దొరస్వామిగారు వారికి ప్రత్యేకంగా అనుమతి యిచ్చారు. అక్కడ కూడా వారు పరీక్షకు వెళ్లకపోవడానికి మరొక కేదో అడ్డువచ్చింది. వారు వ్రాసిన వివిధ రచనల సంపుటాలే జీవన సామరస్యము, నారీ జగత్తు, వెలుగుబాటలు, అక్కరకు వచ్చిన చుట్టము, ముత్యాల మనసు, పండుగ బహుమతులు, జాతిరత్నాలు, బాలవీరులు మొదలయినవి.

ఇల్లిందలవారి భర్త శ్రీ సీతారామారావుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రీడరుగాను, డీన్‌గాను ఉన్నారు. బూర్గులవారు విద్యామంత్రిగా ఉండగా వారు విశ్వవిద్యాలయం నుంచి ప్రభుత్వ విద్యాశాఖకు తక్కిన వారితోపాటు బదిలీ అయి ట్రెయినింగ్ కాలేజీ ప్రిన్సిపాలుగాను, విద్యాశాఖ డెప్యూటీ డైరెక్టర్‌గాను ఉండి, ప్రస్తుతం సిటీ సైన్సుకాలేజీ ప్రిన్సిపాలుగా ఉన్నారు. వారు చదివింది కెమిస్ట్రీ అయినా కవిత్వమంటేను, సంస్కృతసాహిత్య మంటేను మహా యిది. ఇల్లిందల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఇల్లిందలవారికి తోట పని, కసూతీపని చాల ఇష్టం.

ఇల్లిందలవారి తల్లి కామరాజు వెంకటలక్ష్మమ్మగారు బ్రహ్మసమాజ నాయకులు. దేశిరాజు పెదబాపయ్యగారి సోదరి కనుక ఇల్లిందల వారికి ఉగ్గుబాలతోనే సంస్కార భావాలు అబ్బినవి. కాని ఒక రిద్దరు పిల్లలు పోయిన తర్వాత సనాతనసాంప్రదాయం మీదా మక్కువ కలిగింది. కనుక తెల్లవారుజామున నాలుగు గంటలకే లేచి స్నానం చేసి ఆరుగంటలలోపుగా లలితా సహస్రనామం, శివ సహస్రనామం, శివపంచస్తవి పారాయణం చేస్తారు. మధ్యాహ్నం చదువు కుంటారు. సాయంకాలం సభల సమావేశాలలో పాల్గొంటారు. 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి ఏర్పడినప్పుడు, వారి సంఘసేవకు పరిగణనగా సభ్యత్వం లభించింది.

వారి రచనలో వర్తమాన సమస్యలు ప్రధానం. 'నీలో అనేక శక్తులున్నాయి. వాటిని పైకి తెచ్చుకొని ప్రకాశించడానికి ప్రయత్నించండి. మగవారిపై కోపం వద్దు. అనే నేను నా రచనలలో సాటి మహిళలను కోరుతున్నాను. ఏదైనా యాచించడం వద్దు. సంపాదించుకోవాలి- అనే నేను హెచ్చరించాను. మహిళల మనసులో మగవారి పైగల దురభిప్రాయాలు పోవాలనే నమ్మకంతో వ్రాస్తున్నాను" అంటారు వారు

పూర్వ విషయాలు ఇప్పటివారికి ఎలా చెబితే తెలుస్తాయో వ్రాయడానికి ప్రయత్నిస్తున్నాను. నేను నా అభిప్రాయాలను నా దృష్టితోనే కాక యావద్భారత మహిళల దృష్టితోను తెలిపాను. స్వయంవరాధికారం, చల్లటి తల్లులు మొదలయిన వ్యాసాలలో ఈ విషయాన్ని చూడవచ్చు. మన సంప్రదాయం సరిగా తెలియక పోవడంవల్లనే ఇప్పటి వారు వాటిని వదులుతున్నారు" అని వారి అభిప్రాయం. ఏమైనా వారిరచనలు ధార్మికదృష్టి గర్భితాలు. కాని నవీనత నవనవలాడుతుంటుంది. "విశ్వనాథ వారి పుస్తకాలు. ముఖ్యంగా వ్యాసాలు నన్ను ప్రభావితం చేశాయి. ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకీయాలు నన్ను కర్తవ్యోన్ముఖిని చేశాయి" అని వారు అన్నమాటల యథార్థ్యం వారి రచనలు నిరూపిస్తాయి.

"నేడు ఆడవారెవరైనా వ్రాస్తే! వారెక్కడ వ్రాసి వుంటారోయ్! ఎవరో ఆసరా ఉంటారు. లేదా వారి పేరుతో ఎవరో వ్రాశారు-అన్నది నేటి మగవారి మనస్తత్వం. ఇది మారాలి." అన్నారు వారు. దొంగపేర్లతో, ఆడపేర్లతో వ్రాసే మగవారు మాటు మణిగే వరకు ఇలాటి కువిమర్శలు పోవు.

ప్రస్తుతం ఇల్లిందలవారు పెద్ద నవల నొకదానిని వ్రాస్తున్నారు. ఇది వారి రచనల కన్నిటికీ మణిపూసలాగా, మహాకావ్యంలా ఆంధ్రుల చేతిని అలంకరించగలదనే నమ్ముతున్నాను. మూడు దశాబ్దాల లోకవృత్త పరిశీలనానుభవంతో, వివిధ విషయాధ్యయనంతో రెండు దశాబ్దాల పుంఖానుపుంఖ రచనలతో రాణించే వారి లేఖిని ఈ నవలనూ జాతిరత్నంగానే సృష్టిస్తుంది.



23

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ

అవి జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులు. జాతీయోద్యమానికి అంగోపాంగులుగా మహిళాభ్యుదయ సంఘ సంస్కార కార్యకలాపాలు శాఖోపశాఖలుగా విస్తరిస్తున్న రోజులు. ఎందరో మహిళలు ప్రబోధ వ్యాసాలు వ్రాసేవారు; ప్రచారోపన్యాసాలు జరిపేవారు, "మా చెట్టునీడ ముచ్చటలు" అనే శీర్షిక కింద లీలాదేవి అనే వారు వ్రాసేవారు. కొంతకాలానికి అవి ఆగిపోయాయి. "శారద లేఖలు" పుంఖాను పుంఖంగా శారద అనేవారు వ్రాసేవారు.

"మా చెట్టునీడ ముచ్చటలు" మదరాసు, నెల్లూరు, కర్నూలు, విశాఖపట్నం, గుంటూరు జిల్లాల అయిదుగురు ముత్తయిదువులు విజయవాడలో కాపురం ఉండి, ఆయింటి ఆవరణలోని నారింజ చెట్టుక్రింద కూర్చుని తమతమ యాసలతో వివిధ విషయాలను చర్చించే రచనలు. అవి దేశం స్వతంత్రం కావాలని పడిన ఆవేదనల

అచ్చట్లు. తెలుగునాడు సమైక్యం కావాలనే ముక్తా యింపుతో పొరపొచ్చం లేకుండా ఆడుకున్న ముచ్చట్లు.

"శారదలేఖలు" లో ఆ శారద ఒకొక్కప్పుడు కళా విశారదగా కనిపించేది. రాజకీయాల ప్రసక్తి వచ్చినప్పుడు, మహిషాసురమర్దనిగా సాక్షాత్కరించేది. సంఘ సంస్కరణ విషయాలు వచ్చినపుడు మైత్రేయిలాగ కనులగట్టేది. విద్యాసమస్యల చర్చలలో వాచక్కని గార్గిలాగ దర్శనమిచ్చేది.

ఎవరి లీలాదేవి? ఎవరి శారద? ఇద్దరూ ఒక్కరేనా? వేర్వేరా? అని పాఠకులు తహ తహలాడి పోయేవారు. మరోముచ్చటలో ఏమి తెలుపుతుందో, మరో లేఖలో ఏ పిడుగులవర్షం పడుతుందో అని వేయికళ్లతో వేచి ఉండేవారు.

ఆ లీలాదేవి, ఆ శారద పల్నాటి ఎర్రమట్టిరంగు ముతక ఖద్దరు చీర ధరించిన పెద్ద చదువూ, పదవీలేని కనుపర్తి వరలక్ష్మమ్మగారని అతిప్రయత్నం మీద తెలుసు కొన్న తర్వాత అందరూ ముక్కుమీద వేలువేసుకున్నారు. అయిదవ తరగతి అంతైనా చూడని ఈమె ఏమిటి? ఆ రచనా రామణీయకమేమిటి? ఈ సామి దేవమ్మ ఏమిటి? రచనలలో ఆ సంఘ సంస్కరణ జ్వాలలేమిటి? ఇంకా పట్టుమని పాతికేండ్లనా నిండని ప్రాయమే! వ్రాతలలో ఆ విజ్ఞానప్రభ లేమిటి? అనుకున్నారు అందరూను. కాని వరలక్ష్మమ్మగారి పుట్టిన ఊరూ మెట్టిన ఊరూ బాపట్లేనని, బాపట్ల ఆంధ్రోద్యమానికి పుట్టినిల్లు కావడమేగాక తక్కిన అభ్యుదయోద్యమాలకు కాణాచి అని ఎరిగినవారు మాత్రం "అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అనుకొని తల ఊపారు.

కనుపర్తి వారి అదృష్ట మేమిటంటే, అన్నలయిన పాలపర్తి నరసింహం, కృష్ణమూర్తి, భావనారాయణగార్లు చిన్ననాటి నుంచీ చదువు సందెల విషయంలో ప్రోత్సహించడమూ, 1909 లో వివాహమయిన తర్వాత కూడా విదేశాలకు వెళ్లి విద్యనేర్చి వచ్చిన భర్త హనుమంతరావుగారు సంస్కారాభిలాషి గనుక ఎలాంటి ఆటంకమూ చెప్పకపోవడమూ, చిన్ననాటినుంచే చోరగుడి సీతమ్మగారివంటి విదుషీమణి సంఘ సేవ పరాయణ సాంగత్యం లభించడమూను. సీతమ్మగారు 1913 లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ జరిపించిన చోరగుడి వెంకటాద్రి పంతులుగారి సతీమణి. సనాతనులకు ఆలవాలమైన బాపట్లలో త్రిపురసుందరీ సమాజమనే మహిళాసమాజం, యువతీ విద్యాలయం, రాత్రి పాఠశాల స్థాపించి సంఘసేవ చేసేవారు. సావిత్రి, హిందూ సుందరివంటి ఆనాటి స్త్రీ మాసపత్రికలలో వ్యాసాలు, కవితలు వ్రాసేవారు. ప్రథమాంధ్ర మహిళాసభను జరిపించిన వ్యవస్థా నిపుణురాలు. ఆమె కనుపర్తి వారితో పత్రికలు చదివించుకొని వినేవారు. కనుపర్తి వారిది చిన్ననాటినుంచే మంచి వాచకం. సీతమ్మగారు ఆమె చదువుతుంటే విని ఎంతగానో ఆనందించేవారు.

ఆమె ప్రోత్సాహం వల్లనే కనుపర్తివారు యువతీ విద్యాలయోపాధ్యాయిని చాట్రాతి లక్ష్మీనరసమ్మగారి వద్ద సంస్కృతం, తెనుగు, పంచకావ్యాలు చదివారు. అప్పటినుంచి కనిపించిన ప్రతి తెనుగు పుస్తకమూ చదువనారంభించారు. ఆఖరుకు

పొట్లాలు కట్టివచ్చిన కాగితంకూడా వదిలేవారుకారు. ఈ పరిశ్రమతోనే వారు నర్సాపురం తాలుకా అభివృద్ధి సంఘం స్త్రీల బహుమతి పరీక్షకు వెళ్లి ఉత్తమశ్రేణిలో గెలుపొంది బంగారుపతకం పొందారు. విజ్ఞానచంద్రికా పరిషత్పరీక్షలకు, భక్తి ప్రచారిణీ పరీక్షకువెళ్లి నెగ్గారు.

కనుపర్తి వారి రచనావ్యాసంగానికి కూడా అన్నగారే ప్రోదిచేశారు. వారి తొలి రచన అనువాదం. (మన సాహిత్యావతారమే అనువాదంతోకదా). ఒక ఆంగ్ల కధను అన్నగారి సాయంతో 'సౌదామిని' అన్న పేరుతో అనువదించారు. అది 1919 లో 'అనసూయ' పత్రికలో ప్రచురితమయింది. అప్పటినుంచి వారి రచనా వ్యాసంగం అ ప్రతిహతంగా కొనసాగింది.

ఇంతలో కనపర్తివారు తమ జీవితాన్నే సంఘసేవకు అంకితంచేసే సుసంఘటన జరిగింది. 1921 లో బెజవాడలో అఖిలభారత కాంగ్రెసుస్థాయి సంఘ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి గాంధీజీ మొదలయిన మహానాయకులు వచ్చారు. సమావేశం తర్వాత గాంధీజీ స్వరాజ్యనిధికోసం చరిత్రాత్మకమయిన భారత పర్యటన ఆంధ్రనుంచి ప్రారంభించి బందరు వచ్చారు. అప్పుడు బందరులో అన్నగారివద్ద ఉన్న కనుపర్తివారు జాతీయకళాశాలలో విడిసిన గాంధీజీని దర్శించి, తాము వడికిన ఖద్దరు నూలు, ఒక బంగారు ఉంగరం సమర్పించారు. అప్పుడు గాంధీజీ ఉల్లి పొరలాంటి గుడ్డలు ధరించిన కనుపర్తి వారిని చూచి "ఇక నుంచి ఖద్దరు ధరిస్తారా ?" అని ప్రౌఢేయపూర్వకంగా ప్రశ్నించారు. కనుపర్తి వారి ముఖం చిన్నబోయింది. "అలాగే" అని గాంధీజీకి వాగ్దానం చేశారు. అప్పటినుంచి ఖద్దరు వ్రతం పట్టారు. దానితోపాటే స్వరాజ్యలక్ష్మి వ్రతాలు రాట్నలక్ష్మిపూజలూను.

నాటినుంచి వారి జీవితధ్యేయమే మారిపోయింది. ఏది వ్రాసినా సంఘశ్రేయో లక్ష్య శుద్ధితో వ్రాయాలనే సంకల్పం కలిగింది. "మనంకథ వ్రాశామంటే, ఒక ఉత్తమమైన సందేశం ఇవ్వవలెననే ఉత్తమలక్ష్యంతో వ్రాయవలె. అంతేకాదు, తల్లీతండ్రీ, అన్నా తమ్ముడూ, అక్కాచెల్లెలూ అందరూ కలిసి అరమరలు లేకుండా ఒక్కచోట కూర్చుని చదువుకొని ఆనందించేదిగా ఉండాలె" అనే అన్నగారి ఉపదేశం ఉండనే ఉంది. కనుకనే ఆమె లక్ష్య శుద్ధి లేకుండా ఏమీ వ్రాయలేదు. అనవసరంగా ఏమీ వ్రాయలేదు. అందువల్లనే వారి రచనలతో అంత ఆవేగొ త్తేజాలు తొణికిసలాడడం. శారద లేఖలు రాజకీయాది వివిధ విషయాల చర్చకు స్వర్ణరేఖలు, సంఘదురాచారాలపై తీవ్రతర మయూఖలు కావడం.

కనుపర్తి వారు తమ పదునైన ఇతివృత్తం బలంతో పాఠకులను కథలవైపు ఆకర్షించారు. 'పెన్షను పుచ్చుకున్న నాటి రాత్రి' వంటి అపూర్వమైన కథలు దాదాపు అరవై వరకు వారి లేఖినినుంచి ప్రవహించాయి. పాఠక లోకాన్ని తన్మయం చేశాయి. వారి కథలు హిందీ తమిళ కన్నడాలలోను అనూదితాలయాయి. వారు కొన్నివందల వ్యాసాలు వ్రాశారు. 'స్త్రీ అబల కాదు' అనే గృహలక్ష్మి వ్యాసం పోటిలో వారికి

(1930 లో) సువర్ణ పతకం వచ్చింది. శారద లేఖలను డాక్టర్ కె.ఎన్. కేసరిగారు సంపుటంగా ప్రచురించి 1934 లో గృహలక్ష్మి సువర్ణ కంకణం బహూకరించారు. రచయిత్రులలో కంకణ స్వీకారానికి నాంది ప్రస్తావన కావించిన వారూ వారే.

'వసుమతి' వారి తొలి పుస్తకం, సాంఘిక నవల. వారి నాటకాలలో 'పద్మ' సాంఘిక నాటకం. 'పునఃప్రతిష్ఠ' చాంద్రీక నాటకం. ద్రౌపదీవస్త్ర సంరక్షణం, సత్యా ద్రౌపతి సంవాదం ద్విపద రచనలు. మహిళా ప్రబోధం బుర్రకథ. ఇంకా ఎన్నో రచనలు. మహిళాప్రబోధంలో ఇతివృత్తం ఉన్నవ లక్ష్మీబాయమ్మగారి జీవితం. శారదా నికేతనం రజతోత్సవంలో సమర్పించబడింది.

క్రమంగా వారి జీవితం బహుకార్య వ్యగ్రమయింది. 1931 లో బాపట్లలో స్త్రీ హితైషిణీ మండలి స్థాపించారు. 20 సంవత్సరాలపాటు కార్యదర్శినిగా పనిచేశారు. దానికి శాశ్వత భవనం 1942 లో నిర్మించారు. దానికి గ్రంథాలయమూ ఏర్పాటు చేశారు. కొన్నాళ్ళు కుట్టు, సంగీతం, హిందీ తరగతులూ నడిపారు. 1949 నుంచి మూడున్నర సంవత్సరాలపాటు గుంటూరు జిల్లాబోర్డు సభ్యత్వ గౌరవమూ పొందారు.

ఇప్పుడు స్త్రీ హితైషిణీ మండలి యువతీ సంక్షిప్త విద్యాలయం నడుపుతున్నది. దీనిలో రెండు సంవత్సరాలపాటు చదువుచెప్పి ఎనిమిదవ తరగతి ప్రభుత్వ పరీక్షలకు పంపుతున్నారు. విద్యాలయానికి స్వంత వసతిగృహంఉంది. ప్రభుత్వం ఐదువేల రూపాయల గ్రాంటు ఇస్తున్నది. స్వర్గీయ కోపల్లె హనుమంతరావుగారి కుమార్తె కుమారి కమలాదేవిగారు, కుమారి మద్దాలి శ్రీ లక్ష్మిగారు ఉపాధ్యాయినులు. శ్రీమతి కామరాజు వేంకటలక్ష్మమ్మగారు వార్డెన్. ఈ వసతిగృహంలో అన్ని కులాలవారూ, అన్ని మతాలవారు, అన్ని జిల్లాలవారు ఉన్నారు. రెండు సంవత్సరాలపాటు ఉచిత భోజనం, మూడు చీరలు, పుస్తకాలు ఇస్తారు.

"మీరు మహిళాభ్యుదయంకోసం ఎంతో పాటుపడ్డారు. నేటివరకూ కట్నాలు పోలేదు. కులభేదాలు కూలిపోలేదే?" అని అడిగాను. "మేము కట్నాలు పుచ్చుకోవద్దని ఎంతో ప్రబోధం చేశాము; కాని, వ్యర్థమయింది. చదువుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఇప్పటి సంపాదనలపై తలిదండ్రులు ఎంతోకాలం కట్నాలు ఇవ్వడం సాగించలేరు. కొంతకాలానికన్నా ఈ సమస్య తీరుతుందనే నా నమ్మకం" అని ఆమె సమాధాన మిచ్చారు.

శాఖాంతర వివాహాలే జరుగనప్పుడు కులాంతర వివాహాలు జరగడం ఎలాగని ఆమే ఆశ్చర్యం ప్రకటించారు. "వర్ణభేదం, వర్గభేదం అంతటా వుంది. అది కూలిపోవడం కష్టం. వర్ణభేదం మొండిగోడలుగా ఉన్నంతవరకూ సంఘ పరిస్థితులుఇంతే" అని వారి నిరంతర విచారం.

హృదయపూర్వకంగా కాంగ్రెస్‌ను అనుసరించేవారు తక్కువయారని, ప్రజా క్షేమంకోసం పనిచేసేవారూ కొరవడ్డారని వారి ఆవేదన. సంఘం బాగుపడాలంటే మంచి నాయకత్వం ఏర్పడి ప్రజలకు జ్ఞానం కలిగించాలని వారి సూచన.

"నా భర్త విదేశాలలో డిగ్రీ పొందారు. ఇంగ్లండు నుంచి తిరిగివచ్చినతర్వాత ఏ ఉద్యోగమూ చేయలేదు. ఇంట్లోనే వుండి దేవసేవచేయమన్నారు. కనుక వారియిష్ట ప్రకారం నడుస్తూ, నాకు స్వాతంత్ర్యం ఉన్నంతవరకూ సేవచేశాను. వారి ఆమోదం లేకపోతే ఇంతమాత్రమయినా సేవచేసేదాన్ని కాదు" అని వారు తమ పతిదేవుని తలచుకొని కనుకొలుకులలో నీరునిండగా. గద్గదకంఠంతో పలికినప్పుడు ఒళ్లు పులకరించింది.

తెల్లవారుజామునే లేచి వ్రాసే అలవాటు వారిది. అలా వ్రాసిన వాటికి తర్వాత సాపు వ్రాసుకుంటారు. ప్రస్తుతం వీరేశలింగంగారి సతీమణి రాజ్యలక్ష్మమ్మగారి జీవితం వ్రాస్తున్నారు. శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్ జీవితం వ్రాస్తారు. సూర్యోదయానంతరం స్నానంచేసి కాస్సేపు భగవత్ప్రార్థన చేసుకుని యువతీ సంక్షిప్త విద్యాలయం వసతి గృహానికి వెళ్ళి సరుకులు యిస్తారు. మధ్యాహ్నం చదువుకుంటారు. ప్రతిశుక్రవారం సాయంకాలం పాఠశాల విద్యార్థినులకు వార్తలు చదివి చెబుతారు. ప్రతి శనివారం మండలిలో భజనలు చేయిస్తారు.

వారికి రవీంద్రుని రచనలు చాల ఇష్టం. కళాపూర్ణోదయం మరీ ఇష్టం. విద్యాలయంలోను ప్రబంధాలు చదివిస్తారు. సాహిత్యం సభ్యంగా ఉండాలనీ, ఇప్పటికథలు చాల అసభ్యంగా ఉన్నాయని వారి విమర్శ. అయితే ప్రబంధ ప్రమాణంలో వ్రాసినప్పుడు శృంగారం ఫరవాలేదని వారి విశ్వాసం.

"బహుముఖప్రజ్ఞతో రచనలు చేసిన శ్రీమతి వరలక్ష్మమ్మగారి రచనలు తెలుగు సీమంతిమల హృదయసీమలకు కర్పూర నీరాజనాలు. శారదలేఖలద్వారా ఆధునిక నారీ యుగానికి వారుచేసిన సేవ, ఆధునిక ప్రపంచానికి వారిచ్చిన సందేశం అనల్పమైనవి."

44 సంవత్సరాలుగా వీరు మిగిలిన రచయిత్రులుగా సమకాలికుల మన్ననలు పొంది 64 శరత్తులు దాటిన కనుపర్తివారి కథలు, ఇతర వ్యాసాలు సంపుటాలుగా అచ్చయితే ఎంతో ప్రయోజనం.

శ్రీ రాళ్ళ కృష్ణశాస్త్రులు

రెండు తరాల క్రింది మాట. బందరు పురమందిరం కిటకిటలాడి పోతున్నది. దిగ్దంతులయిన పండితులు, మహాకవులు, పుర ప్రముఖులు చెవులు రిక్కించి వింటున్నారు. వేదికపై తిరుపతి వేంకటకవులు, నాదెళ్ళ పురుషోత్తమ శాస్త్రులు, మేధా దక్షిణామూర్తి శాస్త్రులు, శిష్టా నరసింహశాస్త్రులు, చల్లా రామనాథ శాస్త్రులు, బుక్క పట్టణం తిరుమల వేంకటాచార్యులు మున్నగు విద్వత్కవిశేఖరులు, పంద మందికి పైగా పృచ్ఛకులు ఆసీనులయ్యారు. జంధ్యాల గౌరీపతిశాస్త్రులు అధ్యక్షపీఠం అలంకరించారు.

ఈ పండిత గోష్ఠి మధ్యన ఒక సుందరమూర్తి, వాక్చతురుడు అయిన యువకుడు హాస్య ప్రసంగాలు, శాస్త్రార్థాలు జరుపుతూ, అసాధారణ ధారణాధోరణితో పృచ్ఛకులకు సమాధానం చెబుతున్నాడు. ఆయన కంఠధ్వని శంఖధ్వనిలాగ పుర మందిరాన్ని తరంగితం చేసింది.

కొంతసేపటికి పండితులందలూ ఒక్కమ్మడిగా లేచి, ఆ యువ పండితునికి కాశ్మీరు శాలువలు కప్పారు. పూలదండలు వేశారు. జయజయధ్వానాల మధ్యన "అవధాని శిరోమణి" బిరుదం ప్రకటించారు; వందల కొలది ప్రశంసా పద్యపుష్పాలు కురిపించారు. ఆదీని, స్వజన్మ స్థలంలో ఈ సన్మానం ఆ పండితునికి!

ఆ "అవధాని శిరోమణి" మరెవరో కాదు, నేటి మన ఆస్థాన కవివతంసులు శ్రీ కాశీ కృష్ణా చార్యులవారే.

తొంబయిరెండేళ్ళ పైబడి నేడు దేహంధనుస్సువలె వంగినా, తొణుకూ బెణుకూ లేని ఆ మాటతీరు, శరీరపాటవం కొద్దిగా సడలినట్టు కనిపిస్తున్నా, పొంగులువారే ఆ ప్రవచనోత్సాహం, తపస్సుతో,సారస్వత తపస్సుతో ఉజ్జ్వలించే ఆ ఆకార సంపద-కృష్ణాచార్యులవారిని చూచినవారు తొలిచూపుతోనే, ఏ కారణజన్ముడో దర్శించి కృత కృత్యుల మయామని తనిసిపోక తప్పదు.

కృష్ణాచార్యుల వంటివారు ఎక్కడైనా అపూర్వంగానే అవతరిస్తారు. వారొక మహాసంస్థ. ఇటు సాహిత్యం, తర్క వేదాంత గణితాదిశాస్త్రాలు, అమరవాణి మొదలు ఆంగ్లంవరకు అనేకభాషలు, అటు సేద్యం, సంగీతం, వీణావేణు వాయులీన మృదంగాది జంత్రవాద్యాల నైపుణి, వ్రడంగం, కమ్మరం, కుమ్మరం, నేత, ఈత, వంటకం, వ్యాయామం, కుస్తి. గరిడి—ప్రాచీనులు చెప్పిన చతుష్షష్టి కళలూ, ఇంకా మిగిలినవీ ఆపోశనం పట్టిన అగస్త్యులు. ఈ విద్యల కన్నిటికీ వెన్నెల మెరుగుగా. మెరుగు వెన్నెలగా హాస్యరసం. "నాకు హాస్యరసం చాల ఇష్టం. ఆది లేకపోతే అంతా నిద్ర పోతుంది" అంటారు వారు.

జీవితపు లోతులు, ఆశల అంచులు చూచిన పూర్ణవ్యక్తికి హాస్యాసక్తి కలగడంలో ఆశ్చర్యమేముంది? హాస్యమే వీరి అభిమానరసం కాకపోతే, నూనూగు మీసాల నూత్న యవ్వనంనుంచే అవధాన ప్రణిధానాలలోను, తర్క కర్కశ వాక్యార్థాలలోను, హరికథా పురాణ కాలక్షేపాలలోను, ఆపామరపండిత్యం ప్రజలను వినోదింప జేయడం ఎలా సంభవిస్తుంది? దాని బలంతోనే వారు పైలాపచ్చీసులో అరగంటకు నూరు పద్యాలు నుడివి షార్ట్‌హాండ్ వడినిగూడ గడగడమనిపించారు. అ శ్రుతానేక విశేషార్థాలతో పురాణేతిహాసాలు ప్రపంచించి "పౌరాణిక రత్న" అయ్యారు. కొన్ని వేలమంది శిష్య ప్రశిష్యులను సంతరించుకొని "విద్యావార్ధి" అయ్యారు "తర్క విద్వదుభయ కవిమిత్రులు" అయ్యారు.

ప్రకృతి చికిత్స అంటే ఆచార్యులవారికి పరమాదరం. చిన్ననాడే ప్రకృతి చికిత్సాభ్యాసం, యోగాభ్యాసం మొదలయినవి ఆచరణలో పెట్టారు. శ్రమజీవన గౌరవంకూడా గ్రహించిన వారు. వారి జీవితం నియమబద్ధం. ఎక్కు-పెట్టిన విల్లులాగ ఉన్న దేహయష్టితో, ఎక్కు-పెట్టిన నిష్ఠతో నేటికి పంచ పంచ ఉషఃకాలంలోనే శీతల జలస్నానం ఆచరించి, అనుష్ఠానానంతరం స్వగృహంలోనే ప్రతిష్ఠించిన వీరాంజనేయ మూర్తిని పూజించడం, నియతంగా ఆహారం ఆరగించి సాయంకాలం వరకు విద్యా గోష్ఠి నెరపడం వారి దినచర్య. ఈ గోష్ఠిలో హాస్యరసం చిప్పిలని మాటంటూ ఉండదు.

"మీరు ద్వైతులుగదాఃఅలంకారికులందరూ అద్వైతులే. వారి అద్వైతపరమైన రసస్వరూప నిరూపణంతో ఎలా ఏకీభవిస్తారుఃఁ అని వారిని నేను ప్రస్తుతం వారు స్థిరపడిన గుంటూరులో దర్శించుకొన్నప్పుడు ప్రశ్నించాను "నేను ద్వైతిని. ఇతరులనూ నేను ద్వైతులనుగానే భావిస్తాను. శంకరాచార్యులవారూ ద్వైతే అని నా అభిప్రాయం" అని వారు సమాధానం చెబుతూ,

"ద్వైతము లుబ్ధసుఖద, మ
ద్వైతము తస్కర సుఖప్రదంబు, విశిష్టా
ద్వైతము యాత్రిక సుఖదము,
భూతలమున మొత్తమునకు మూడును మెరుగే"

అంటూ ఎన్నడో సద్యస్స్ఫురణతో చెప్పిన పద్యం భళోక్తిగా ఉదహరించారు.

పది సంవత్సరాల ప్రాయంనుంచే పద్యాలు చెప్పటం ప్రారంభించి, 19 వ ఏట గుంటూరులో తొలి అవధానంతో అవధాన జైత్రయాత్ర సాగించినా, సహస్రాధికంగా శాస్త్రోత్థాలు జరిపినా, పది పన్నెండేండ్లపాటు ఆంధ్ర సంస్కృతోపాధ్యాయులుగా పని చేసినా, ఏదో వెలితి, ఏదో కొరత కనిపించింది వారికి. అమరవాణీ ప్రచారానికి జీవితం అంకితం చేయడం తమ లక్ష్యమని నిశ్చయానికి వచ్చారు.

ఇంతలో ఒక చిన్న సంఘటన వారి నిశ్చయానికి ప్రోదిజేసింది. ఒకమారు తండ్రి తద్దినానికి అధికారుల సెలవివ్వలేదు. దానితో "ఈ సేవకవృత్తి ఏమిటిఃఁ అని ఈసడించుకొని ఉద్యోగానికి స్వస్తిచెప్పి, సంస్కృత భాషా ప్రచారానికి సమాయత్తులయారు. "మాతృభాషా సమాజం" స్థాపించారు. "మాతృభాష" అన్న సంస్కృత పత్రికను నడిపారు. ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాలలో పర్యటించి ఖంగుమనే కంఠంతో ఉపన్యాసాలిచ్చారు. వారు స్వతహాగా మహావక్తలు. హాస్యచతురులు. సద్యస్స్ఫూర్తి వారి సొమ్ము. సభ ఎంత పెద్దదైతే అంత గొప్పగా వికసిస్తుంది వారి వక్తృత్వం. "అష్టవర్ష ప్రభృతి ఆశరీరపాతం అమరవాణీ సముద్ధరణే ప్రయతమానఃకాశీకృష్ణఃఁ ఆంటూ ఉంటారు. ఎల్లప్పుడూ మేఘగంభీర నిర్ఘోషంతో.

తమ ప్రచారానికి అనువుగా సంస్కృత బాలభోధినులు, సంస్కృత సంవాదం వాల్మీకి చరిత్ర మొదలయిన సంస్కృత గ్రంథాలు రచించారు. వారి సంస్కృత వాచకాల సరళతకు విస్తుపోయిన జర్మనీ పండితులు వారిని తమ దేశానికి ఆహ్వానించారు. ద్వితీయ ప్రపంచ యుద్ధసమయంలో "ఈ వయస్సులో ఈ కర్మణ్యదేశంవదలి ఆ శర్మణ్యదేశ నివాసమా" అని మనసార నవ్వి నవ్వించారు ఆచార్యులవారు, ఆ ఆహ్వానం అందజేసిన వారిని.

రెండు తరాల పిరి నిరంతర సారస్వత సేవకుమెచ్చి రెండు సంవత్సరాల క్రితం పీరిని రాష్ట్రపతి సంస్కృత విద్వన్మార్ధన్యులుగా సన్మానించారు.

"పత్రికలలో సంస్కృతపాఠాలు వ్రాయ దలచాను. శక్తి ఉడిగిపోతున్నది. అయినా, పిచ్చాశ ఉంది. విమానంలో తిరిగి సంస్కృత ప్రచారం చేద్దామని ఉంది". అంటారు వారు. "మురారే. తృతీయః పంథాః" లాగ సంస్కృతోద్ధరణకు పూనుకోడమేమిటి ఈ పరమాణు-రాకెట్ యుగంలో? అనుకోవచ్చు మనం. కాని, సంస్కృతం జాతీయభాష కాగలదని, విశ్వభాషే కాగలదని వారి నమ్మకం. అంతేకాక ప్రాచీన తత్త్వం పునశ్చరితం అవుతుందని వారి విశ్వాసం. "అవర్ సైన్సు బిగిన్స్ వేర్ వెస్టర్న్ సైన్స్ ఎండ్. కాలో విశాల. విపులాచ పృధ్వీ" అంటారు వారు. ఈదృష్టితోనే ఆశుప్రబంధః, సంస్కృత స్తోత్రాణి మొదలయినవి అచ్చు వేయిస్తున్నారు.

కృష్ణాచార్యులవారికి మరొక కోరిక ఉన్నది. సేవకు, జిజ్ఞాసకు సమాప్తి అంటూ లేదని వారి నమ్మకం 'ఓం' అనే శీర్షిక కింద, తమకు జ్ఞానం కలిగిన తర్వాత ఎనభై నాలుగు సంవత్సరాలుగా పొందిన అనుభవమంతా వ్రాయదలచారు. ఓం అంటే ప్రపంచం అని వారి నిర్వచనం గనుక, దీనిలో "గద్యాలు, పద్యాలు, శ్లోకాలు, పాకాలు" అన్నీ ఉంటాయట దీని రచనకు ఆరు మాసాలు తీరికగా కూచుంటే చాలునన్నారు.

వారికి ప్రస్తుతం—తొంభై రెండేళ్ళకు—చూపు కొంచెం తగ్గింది. అంతేవాసి శ్రీ అమరేశ్వర శాస్త్రి మొదలయినవారు గ్రంథాలు, అనుదిన పత్రికలు, ప్రూఫులు చదివి వినిపిస్తుంటారు. వారితో ఆచార్యులవారు దైనందిన చర్యలోను సంస్కృతమే వ్యవహరిస్తుంటారు. తప్పనిసరైతే తెలుగు.

ఆచార్యులవారికి ముగ్గురు కుమార్తెలు, మనుమలు, మునిమనుమలు ఉన్నారు. పౌత్రుతూ ఉన్నాడు. అయినా, తనను మించిన చెట్టంత కుమారుడు వ్యాసాచార్యులను కోల్పోయినప్పుడు మాత్రం వారి కంటిలో నీలి నీటితెరలు కనిపించాయి.

"నన్ను మించిన కొడుకును మన్ను చేసికొన్న పాపిని జూవలేకున్నవాడ!" అనికూడా ఆవేదనపడ్డారు. అయినా, అది క్షణికం. తర్వాత యథారీతిగా అమరవాణి సేవ సాగిపోయింది.

అంతటి చతుష్షష్టి కళాప్రపూర్ణుడు, సహస్రానేక శిష్యప్రశిష్య సంతతిగల కుల పతి, విద్యావారాంనిధి, "శిష్యోహం సర్వలోకానాం, నమే శిష్యోస్తి కశ్చన"అని అన్న ప్పుడు ఎంతటి వారికైనా ఒళ్లు జలదరిస్తుంది. వీరు వాస్తవంగా ఆర్షసంప్రదాయ ప్రతినిధులు, ఆస్థాన కవిసింహాసనార్హులు సుమా ! — అని తమకు తెలియకుండానే గౌరవభావం మనసులో పొటమరిస్తుంది.

ఆచార్యులవారి వయస్సుకు అనుగుణంగా తొంభయి రెండువేల రూపాయల నిధిని పోగుచేసి, ఏ విశ్వవిద్యాలయంలోనో వారి నామధేయంతో సంస్కృత భాషా పీఠం నెలకొల్పాలని వారి అభిమానులూ, అంతేవాసులూ చేస్తున్న కృషి సార్థకం కానీ !



శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు

హౌరాస్టేషన్‌లో బండి ఆగింది. ఒక మొదటి తరగతి పెట్టెనుంచి ఒక ప్రయాణీకుడు దిగాడు. అంత పొడుగూ, పొట్టీ కాని కాయవాటు తెల్లని శరీరం;సౌమ్యమైన ఆకృతి విశేషం; నిరాడంబరమైన ప్రవర్తన; అంతరంగంలోని ఆశయాలను, ఆదర్శాలను తెలుపుతున్నవా అన్నట్లున్న తెల్లని ఖద్దరుదుస్తులు- పంచ, లాల్చీ, ఉత్తరీయం, ఏ ప్రాణికి ఏంబాధ కలుగుతుందో అని చూచి అడుగులు వేసే శ్వేతాంబర జైనాచార్యులలాగ. "అతి నాజూకు" నడక తీరు. మాట నోటినుంచి వెలువడితే ముత్యాలు రాలుతాయేమోనన్నంత మౌన ముద్ర- ఎవరో పెద్దమనిషి అని చూచిన వెంటనే ఎవరైనా అనుకుంటారు.

ఆయనకోసం ప్లాట్‌ఫారంమీద వేచి ఉన్నవారు ఆయన దిగీ దిగగానే చేతిలోని చిన్నపెట్టె అందుకోబోయారు. "ఏమంత బరువుఁ" అని ఇంగ్లీషులో అంటూ ఆయన

వారి నందరినీ వారించారు. ఇంతలో ఎవరో అడిగారు "తమరే రావలసివచ్చిందా? మరెవరినైన పంపితే పోయేదే" అని దానికి ఆయన బాధ్యతతో కూడినపని. సొంతంగా చూచుకోడం రచయిత లందరిని కలుసుకోడం ఉచితం కాదా?" అని చిన్న నవ్వుతో సమాధాన మిచ్చారు. స్విచ్ తీసివేసినట్టు వెంటనే నవ్వూ, మాటలూ ఆగిపోయాయి.

ఒకా నొకమారు ఆయనను ఆయన కార్యాలయంలో చూచాను. తీర్చి దిద్దిన ట్లున్న పరిసరాలు- ప్రాతమేజావద్ద ఒకమూల ముఖ్యమైన పుస్తకాల బీరువా, మేజాపై కలం, కాగితం, పేపరువెయిటు మొదలయినవి ఎక్కడి వస్తువులక్కడ "చిత్రార్పితా రంభం" లాగ, కుర్చీకి వెనకాల గాంధీజీ దండియాత్ర ఛాయాచిత్రం, ఎంతటివాగుడు కాయనుగూడ ఆటకట్టించే పరిసరాలు. ఇంతలో ఎవరోవచ్చి తాను ఎందుకువచ్చిందీ సవినయంగా తెలియజేశారు. ఆయన లేచి ఎంతో ఆప్యాయంగా పలకరించి. కుర్చీ చూపి, వెంటనే ప్రక్కగదిలోకి వెళ్ళి, చెక్కుచెదరకుండా పెట్టిన వ్యాసాల దొంతరను గాలించి, ఒక వ్యాసం తీసుకొని, మరల వరుసవారీగా అమర్చి మా వద్దకువచ్చి ఫలానా సంచికలో ఇది ప్రకటితమవుతుంది. ఇదివరకే నిర్ణయమైనట్లు మీకు తెలియ జేశాము కూడా" అని రెండు మాటలతో పరిస్థితి వివరించి కూర్చున్నారు.

ఆ ప్రశాంతతా పరాకాష్ఠ. ఆ ధాధ్యతా పరిజ్ఞాన పరమావధి, ఆ మౌనపరాకోటి బహుకార్యావ్యాపృతులై తొందర, తొట్రుపాటు తొణికిసలాడేవారిని వెర్రెత్తించేమాట వాస్తవమే. కాని, పొంగే పాలలాటివారు కాక, కాగి చల్లారిన పాలలాటివారే శాశ్వత బహుళ శ్రేయోదాయికాలయిన మహాకార్యాలు చేయగలరనడంకూడా వాస్తవమే నని గ్రహించినప్పుడు శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావుగారి పద్ధతి మనలను ముగ్ధులను చేస్తుంది.

ఈస్వభావం కోలవెన్నువారికి ఈ 68 వ యేట అబ్బినదికాదు; చిన్ననాటినుంచే అలవడినది. ఆ నాళ్ళలోనే వారికి విలక్షణమైన తలంపొక్కటి- దేశంలోని వివిధ ప్రాంతాలను, ప్రజలను ఒక్క కొలికికి తీసుకరావడానికి సాహిత్యం వినా ఉత్తమ సాధనం మరొకటిలేదు. కనుక పరిపాలన భాష అయిన ఇంగ్లీషు ద్వారానే ఆ మహా కార్యానికి పూనుకోవాలని, తెనుగు సొబగులను ఇతర ప్రాంతాలవారికీ, ఇతర దేశాల వారికీ అందించాలని — మనస్సులో తళుక్కుమన్నది. ఈ దృష్టితోనే విద్యార్థి దశ నుంచే ఆంగ్ల సాహిత్యాన్ని ఆకళించుకోడం, రచన సాగించడం, తెనుగు సాహిత్యం ఆంగ్లంలోకి అనువదించడం కొనసాగించారు. పట్టభద్రులై, చెన్నపురిలో న్యాయ కళా శాలలో చదివేటప్పుడు, వివిధ ప్రాంతాల మిత్రుల ప్రోత్సాహంతో తలంపు బలపడి సంకల్పమయింది. న్యాయశాస్త్ర పట్టభద్రులయిన తర్వాత రెండుమూడేళ్ళపాటు (1918-20) నరసరావుపేటలో కోర్టు కచ్చేరీలు ఎక్కారు. ఇంతలో సహాయ నిరా కరణోద్యమం ముమ్మరంగా రాగా, న్యాయవాది వృత్తికి స్వస్తిచెప్పి, ప్రజోద్య

మంలో దూకారు. కాసి, మనసులోని చిన్ననాటి తలపు - కెలకవేయక మానలేదు. కనుక ప్రకాశంగారి స్వరాజ్యపత్రికలో ఖాసా సుబ్బారావు, కృపానిధిగార్లతో కలిసి కొంతకాలంపాటు సహాయ సంపాదకులుగా పనిచేశారు. అప్పటికిగాని వారిసంకల్పం ధృడతరంకాలేదు. స్వరాజ్యను వదిలి చెన్నపురినుంచే 'త్రివేణి' అనే ఆంగ్లసాహిత్య మాసపత్రికను వెలువరింప నిశ్చయించారు.

ముప్పయి అయిదు సంవత్సరాలనాడు (1927) 'త్రివేణి'వారి సంపాదకత్వంలో అవతరించింది. చిన్ననాటి సంకల్పం సిద్ధించింది. తెనుగువారేకాక మహారాష్ట్ర కన్నడాది భాషా సాహిత్యవేత్తలు వారి కృషికి అమోఘంగా తోడ్పడ్డారు.ఈనాడు సాహిత్య అకాడెమీ, పి.ఇ.ఎన్. సంస్థలు నిర్వహిస్తున్న పనికి త్రివేణి మార్గదర్శకమైంది. త్రివేణి సాధించిన భావసమైక్యం అనిదంపూర్వం; ఆంగ్లంద్వారా దేశంలోని వివిధ సాహిత్యాల సౌందర్యం దేశవాసులు, విదేశవాసులు ఆస్వాదించేట్టు చేసింది. దక్షిణాపథ సాహిత్యాల, ముఖ్యంగా తెనుగు సాహిత్యపు నిగ్గును ఇతరులకు అందజేసి, తెనుగు సాహిత్యం ఉత్తమ ప్రపంచ సాహిత్యానికి ఎంతమాత్రం తీసిపోదని, క్రాంతదర్శులు ఎక్కడివారైనా, దేశకాలావధులు దాటి దర్శనమిస్తారని దిగంతాలకుచాటింది; పలువురు క్రొత్త రచయితలను ప్రోత్సహించింది; వారితో అపూర్వసేవలుచేయించింది.

"రాజనీతిజ్ఞులకన్నా సాహిత్య వేత్తలే భారత సమైక్యం సాధించగలరని నా విశ్వాసం. ఇతర భారతీయభాషలను మనం చక్కగా పరిశీలించినట్టయితే, సంస్కృతానికి, ఆంగ్లానికికూడా మనం ఋణపడి ఉన్నామని తేలుతుంది. ఏ భాషను గురించిగాని ద్వేషమన్నది ఎన్నడూ పెంచుకోరాదు" అన్నది కోలవెన్నువారి కఠోరనియమం.

ఒకవైపు త్రివేణి సేవ చేస్తూనే, కోలవెన్నువారు, కోపల్లె హనుమంతరావుగారి నిర్యాణానంతరం బందరు జాతీయ కళాశాల ప్రిన్సిపాలుగాను, ముట్నూరి కృష్ణారావుగారి కాలధర్మం తర్వాత కృష్ణాపత్రిక సంపాదకులుగాను, కొంతకాలం సౌత్ ఇండియన్ బుక్ ట్రస్ట్‌లో తెనుగు సంపాదకులుగాను పనిచేశారు. కేంద్ర సాహిత్య అకాడెమీ సలహా సంఘ సభ్యులుగాను ఉన్నారు.

ప్రస్తుతం వారు స్వస్థలమైన నరసారావుపేటలోనే స్థిరనివాసం ఏర్పరచుకున్నారు. అరవై ఎనిమిది శరత్తుల వయసన్నప్పుడు దేహపాటవం తగ్గుతున్నదని చెప్పనక్కరలేదు. వీలైనంతవరకు విశ్రాంతిగా ఉండాలనే వారి కోరిక. ఇటీవల చూపుకూడా తగ్గడంవల్ల వారు ఎక్కువగా చదవటమూ మానివేశారు. ఉదయం రెండు మూడు గంటలపాటు కళాశాల విద్వాంసులతోను, ఇతరులతోనుగోష్ఠి, భోజనానంతరం మధ్యాహ్నం విశ్రాంతి; సాయంకాలం రెండు మూడు మైళ్ళు వాహ్యాళి వారిదైనందిన చర్య. వారి మనస్సుకు ప్రతిబింబంవంటి సతీమణి శ్రీమతి రాజ్యలక్ష్మమ్మ

గారు వారికి సేవలు చేస్తుంటారు. ఇటీవలనే (అపుత్రస్యగతిర్నాస్తి అని కాబోలు) ఒక బాలకుని పెంచుకున్నారు.

తెనుగు నవకవితోద్యానంలో నవనవానర్ఘ పుష్పాలు పూయించిన అడవి బాపిరాజు, నండూరి సుబ్బారావు, బసవరాజు అప్పారావుగార్లు కోలవెన్నువారికి ప్రాణ మిత్రులు, "వారు దివంగతులయిన తర్వాత ఒంటరివాణ్ణియాను. నాకు అత్యాప్తులలో ఒక్కరయిన కాటూరి వెంకటేశ్వరరావుగారు అస్తమించడంతో ఒంటరివాణ్ణియాను" అని వారు ఆవేదన పడుతారు.

పాశ్చాత్య సాహిత్యం, ముఖ్యంగా ఆంగ్లసాహిత్యం తరచి చూచిన కోల వెన్ను వారికి నేడు ఆయా సాహిత్యాలలో చెలరేగిన కొన్ని కొత్త పోకడలనబడేవి గిట్టవు. డి.హెచ్. లారెన్సు, జీన్‌పాల్‌సార్త్రే వంటి వారి రచనలు కొన్ని జుగుప్సాకరమైనవి, మానవునిలోని నీచ ప్రవృత్తిని రేకెత్తించేవేనని వారి విమర్శ. మానవ స్వభావాన్ని చక్కగా చిత్రించినంత మాత్రాన, చక్కని శైలిలో వ్రాసినంత మాత్రాన అలాటివి ఉత్తమ సాహిత్యానికి చెందవని, అవి తాత్కాలికంగా కొంత వినోదోల్లాసాలను కలిగించవచ్చునేమోకాని, కాలగర్భంలో కలిసిపోయేవేనని, డిక్కెన్సు మొదలయిన వారివి నిలుస్తాయని వారి నిశ్చయం. వర్డ్స్ వర్త్ రచనలు, థామ్‌సన్ రచనలు ఉపనిషత్తుల పథంలో ఉన్నాయని వారి విశ్వాసం.

ఇక నేటి 'యాంగ్రీయంగ్‌మెన్' ప్రతిభామంతులు, నూతనసృష్టి చేస్తున్నారు, కొంత సాధిస్తున్నారు; కాని లక్ష్యశుద్ధి లేనివారని వారి విచారం. "మన సాహిత్యం వైపు చూస్తే, ప్రతి సాహిత్యంలోను ఆటుపోటులు ఉంటాయి. విజయనగర సామ్రాజ్యం ఛిన్నాభిన్నమయిన తర్వాత చిన్నచిన్న జమీందారీలు ఏర్పడడంతో ఉన్నత లక్ష్యం దూరమయింది. అప్పటి రచనలలో కవిత్వానికి లోటు లేదు; శైలీ బాగానే ఉంటుంది; అయితే జీవంలేదు. దక్షిణాంధ్ర సాహిత్యం లోస్థాయిది. దేశంలో ఉత్తమ కార్యాలు జరిగే కాలంలో కవులు, గాయకులు, ఉత్తమస్థాయికి వెళ్ళగలుగుతారు. అంతరంగా ఎంత పరిణతి పొందినా పరిసర ప్రభావం తప్పించుకోలేరు. ఏమైనా, పశుత్వంనుంచి మానవత్వానికి, మానవత్వంనుంచి దైవత్వానికి దారి తీసేది ఉత్తమ సాహిత్యం" అని నొక్కి వక్కాణిస్తారు కోలవెన్నువారు.

ఆంగ్ల సాహిత్యం తెనుగు సాహిత్యానికి ప్రమాదంతెచ్చి పెట్టిందనే మాటలకు వారు ఆశ్చర్యపడతారు. ఏ భాషవల్లా మరొక భాషకు ప్రమాదంలేదనీ, అంతేకాదు "మనకు హిందీ, ఇంగ్లీషు రెండూ అవసరమే. కనుక కాలపరిమితులు లేకుండా ఆంగ్లం అధికార భాషగాగాని, పరిపాలన భాషగాగాని ఉండాలి. రాజ్యాంగంలో తక్కిన భాష లతోపాటు ఇంగ్లీషునూ చేర్చాలి. మన వారసత్వంలో ఆంగ్లసాహిత్యంకూడా చేరింది. ఆంగ్లమంటే ఆంగ్లంద్వారా వచ్చిన ఇతర సాహిత్యాలుకూడా" అనీ వారి వ్యాఖ్యానం.

"మహోజ్వలంగా కాకపోయినా, ఉత్తమస్థాయిలోనే త్రివేణి నడిపానని నాకెంతో తృప్తి ఉన్నది. తీరని కోర్కెలంటూ నాకు లేవు" అని వారు అంటూ ఉంటే తామే త్రివేణిగా, త్రివేణే తాముగా సేవాదీక్షపట్టి, సర్వస్వం త్రివేణిలో ధారపోసిన త్యాగ సంపన్నులు ఆ మాత్రం సంతృప్తి పడడం సహజమేననిపిస్తుంది. సహజమని అని పించనిదల్లా వారు చేసిన సేవకు తగిన రాణ, తగిన పరిగణన రాలేదనడం, ఎన్నో కారణాలవల్ల మనసు మార్చుకొనే ప్రభుత్వం ఎలా ఉన్నా, ప్రజలు-సాహిత్యాభిమాను లైన ప్రజలు-కూడా సీతకన్ను వేశారనడం మాత్రమే.

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం

సాహిత్య సార్థవాహులు కొందరు పట్టాభిషిక్తులకు, బరాయ్యేం నవాబులకు బరాబరులుచేస్తూ, పొగడితల రగడలు రచిస్తూ, నిజాం ప్రభుత్వంలో పదవులు పట్టుకుని, ఎంతో అధికారం ఉన్నా ఇరుగుపొరుగులకు ఇంతైనా ఉపకారం చేయకపోగా, ఏవిటో తవ్వి తలకెత్తినట్టు మేకపోతు గాంభీర్యంతో మసలుతూ, పరివారగణంతో నవ్యరీతులకు నారులు పోసినవారని, సాహిత్యానికి కొత్త సొబంగులు సమకూర్చినవారని, చరిత్రకు చరిత్ర యిచ్చినవారని కైవారాలు చేయించుకుంటున్న సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అద్దంలో కొండలాగ, నివురులో నిప్పులాగా, కుండలో దీపంలాగ ఉంటూ న్యాయానికి, ధర్మానికి పట్టుగొమ్మగా ఉన్న యిద్దరు ముగ్గురు ఆచార్యులలో శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ఒకరు.

శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనంగారు అనువు కానిచోట మాత్రమేకాదు, అనువైన చోటకూడా అధికుణ్ణని చెప్పుకోలేదు. పై అధికారులు రికార్డులలో ఎన్ని అవకతవక

ఎంట్రీలు చేసినా, వారు విద్యార్థుల సహృదయాలు, విద్వాంసుల మన్ననలు చూరగొన్న వారు గనుక తొణకలేదు బెణకలేదు; మనసు చీకాకు పరచుకొని తగాదాలకు దిగలేదు. కర్తవ్యనిర్వహణలో ఏమరుపాటు చూపలేదు; ఆత్మవిశ్వాసం కోల్పోయి అధికారుల ఆదర కటాక్షానికి అంగలార్చలేదు. ఆనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుకు ఇంతటి స్థానం లభించేదికాదు. తెనుగు భాషపై కూరిమే వారి ఓరిమికి కారణం.

ఇంతటి అభిమానధనులు, విద్యార్థివత్సలులు అయిన ఖండవల్లివారు తూర్పు గోదావరి జిల్లా కొత్తపేట తాలూకా బెల్లంపూడి గ్రామంలో 1908 లో జన్మించారు. బెల్లంపూడి సమీపంలోని ఉడుమూడిలో ప్రాథమిక విద్య, అమలాపురంలో రెండవ ఫారం ముగించారు. వారి జనకులు శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారు అప్పుడు వరంగల్లు మత్తెవాడలోని త్రిలింగాంధ్రాయుర్వేద కళాశాలలో సంస్కృత పండితులు కావడంవల్ల ఖండవల్లివారూ వరంగల్లుకు వచ్చి, హనుమకొండ హైస్కూలులో మూడవ ఫారంలో చేరి మెట్రిక్ ముగించి, 1924 లో రాజధానిలోని నిజాం కాలేజిలో ప్రవేశించి బి. ఎ. లో సంస్కృతంలో విశ్వవిద్యాలయ ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. తర్వాత సిటీకాలేజిలో ఇంగ్లీషు టిచరుగా పనిచేయసాగారు. 1936 లో తెనుగు—సంస్కృతం ఎం. ఎ. లో ఉత్తమశ్రేణిలో ఉత్తీర్ణులై ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో లెక్చరరుగా చేరారు. శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి పదవీ విరమణ తర్వాత ఆచార్య (ప్రొఫెసర్) పీఠం అధిష్ఠించి, నేటిదాక ఆ పీఠం అలంకరిస్తున్నారు.

వారికి విద్యార్థి దశనుంచే శ్రీ ఆదిరాజు వీరభద్రరావుగారి వంటి పరిశోధకుల తోను, గోలకొండ పత్రికా సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిగారి వంటి ప్రజా సాహిత్య సేవకులతోను, లోకనంది నారాయణగారి వంటి సాహిత్య పోషకులతోను పరిచయం కలిగింది. విశ్వవిద్యాలయంలో రెక్టార్ కిషన్‌చంద్ వంటి ధర్మపరాయణుల బలం చేకూరింది. లక్ష్మణరాయ గ్రంథాలు వారిని విశేషంగా ప్రోత్సహించాయి. 1936 నుంచే సాహిత్యసేవ ప్రారంభించారు. "తెలుగుదుక్కి" శీర్షికక్రింద వ్యాసాలు వ్రాశారు. ఆధునిక కవితను గురించి త్రివేణి మొదలయిన ఆంగ్లపత్రికలలో పెక్కు వ్యాసాలు ప్రకటించారు. కొన్నాళ్ళు కవితా చెప్పారు.

తెలంగాణాలో సారస్వతసేవకు ఆలవాలమయిన కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం వారి కృషిని ఉద్దీపితం చేసింది. రెండు సంవత్సరాలపాటు (1936-37) ఆ భాషానిలయానికి కార్యదర్శిగా ఉన్నారు. తర్వాతకూడా పుస్తకాల సేకరణకోసం, చందాలకోసం తెలంగాణ అంతటా పర్యటించారు. వర్ధంతులు, జయంతులు ఎన్నో జరిపారు. సారస్వత పరిషత్తుకు సభ్యులుగా ఉండి దాని విస్తృతికి కృషి చేశారు. నిజాం రాష్ట్ర గ్రంథాలయ సంఘం కార్యదర్శిగా ఉన్నారు. సర్కార్ నౌకరీ మిన హాగా ఏమిచేసినా అనుమానించే పోలీసుల నిగా ఎక్కువ కావడంవల్ల ఈ కార్యకలాపం కొంత కట్టి వెట్టవలసి వచ్చింది.

ఇలాటి నిగాలు, గుమానులు పడే పనులకంటె శాశ్వత ప్రయోజనంగల కృషికి పూనుకోడం మేలని వారికి తోచింది. కొమర్రాజువారు వదలిపెట్టిన విజ్ఞాన సర్వస్వం పూర్తి చేయాలనే కోరిక కలిగింది. ఇద్దరు ముగ్గురు ఆప్తమిత్రులతో కలిసి గ్రంథావలోకనం, విషయ సంగ్రహణం ప్రారంభించారు. 1940 ప్రాంతంలో యుద్ధం మూలంగా విద్యుద్దీపాలు లేనందున ఆముదం దీపాల వెలుగులోనే చదువు, వ్రాత కొనసాగించారు. 1944 నాటికే విజ్ఞాన సర్వస్వం పూర్తి చేద్దామనుకున్నారు. మహా రాష్ట్ర జ్ఞానకోశ్ ఉండనేఉంది. దానిని ఆదర్శంగా పెట్టుకొన్నారు. నాలుగైదు సంపుటాల విషయం ఐదారు నెలలలో సిద్ధమయింది. దానిని ముద్రణకు ఇద్దామని సైకిలు కారియర్‌కు కట్టి బయలుదేరారు. దారిలో పనిబడి ఒక దుకాణం వాకిట్లో సైకిలు ఆపి లోపలికివెళ్ళారు. తిరిగివచ్చి చూస్తే సైకిలు, విజ్ఞాన సర్వస్వం, సర్వస్వం పోయాయి. ఏ సాహిత్య ప్రేమియో, సైకిల్ ప్రేమియో కొట్టుకుపోయాడు. ఆ ప్రయత్నం అంతటితో ఆగింది.

ఇంతలో శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు పదవీ విరమణ చేయడంవల్ల ఖండవల్లివారు ఆచార్య పదవి అధిష్ఠించవలసి వచ్చింది. విశ్వవిద్యాలయంలో సంస్కృతిని గురించి పాఠాలు చెప్పవలసి వచ్చింది. దానికోసం చేసిన అధ్యయన ఫలితమే "ఆంధ్రుల చరిత్ర-సంస్కృతి", "ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం" వంటి ఉద్గ్రంథాలు. కొన్నాళ్ళకు దేశం స్వతంత్రమైంది. తమను అభిమానించినవారు మంత్రులు, మహామంత్రులు అయ్యారు. దానితో ఖండవల్లి వారికి విజ్ఞాన సర్వస్వం పునరారంభవాంఛ రేకెత్తింది.

"బిడుకు వేంకటశేషయ్యగారు, లోకనంది నారాయణగారు, రావాణవారు విజ్ఞాన సర్వస్వం కోసం మాలాగే అదివరకే ప్రయత్నించి విఫలులయ్యారు. మా మిత్రులు, అభిమానులు తోడ్పడుతారనే నమ్మకంతో 1958 లో శ్రీ చేతనభట్ల విశ్వనాథంగారూ, నేనూ కలిసి వర్ణక్రమానుసారంగా విజ్ఞాన సర్వస్వం తయారు చేద్దామని మరల పూనుకున్నాము. ఒకసంఘం నియమించుకొని శ్రీ మామిడిపూడి వేంకట రంగయ్యగారిని చెయిర్మన్‌గా పెట్టుకొన్నాము. చందాలు పోగుచేశాము. ప్రభుత్వం పదివేల రూపాయలు మంజూరు చేసింది. తర్వాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లక్ష రూపాయలు విరాళమిచ్చింది. మద్రాసులోని తెలుగు భాషా సమితివారు చేస్తున్న కృషి అప్పటికిగాని మాకు స్పష్టంగా తెలియలేదు. కనుక మా సంఘం పేరు "సంగ్రహ విజ్ఞానకోశ సమితి" అని మార్చుకొన్నాము. ఇప్పటికి మూడు సంపుటాలు వచ్చాయి. నాలుగవది ముద్రణలో ఉంది"-అన్నారు ఖండవల్లివారు.

వారు ఆంధ్ర రచయితల సంఘానికి అధ్యక్షులుగా ఉంటూ, దాని పక్షాన సిద్ధేశ్వర చరిత్ర, ప్రసన్న రాఘవ నాట్య ప్రబంధం సంస్కృత లిపిలో అహోబల పండితీయం (ఆంధ్ర వ్యాఖ్యా సహితం) ప్రచురించారు. ఓరియంటల్ కాలేజి స్థాపించి,

1958 లో బి.ఓ.ఎల్., డి.ఓ.ఎల్., వంటి ప్రాచ్య పట్టాలు విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశారు. స్వామి వివేకానంద కమిటీ హైస్కూళ్లకు కార్యదర్శిగా ఉండి, దానికి భవనం కట్టిస్తున్నారు.

ఖండవల్లివారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేసిన సేవ తెనుగుకు, తెనుగు వారికి బహుకాల బహుఫలాలు కలిగించే నిరుపమసేవ. వారు ఆచార్య పదవి అధిష్ఠించిన తర్వాత తెనుగుకు స్థాయి, హాయి ఏర్పడ్డాయి. తెలుగు విద్యార్థి తలఎత్తుకొని తిరుగసాగాడు. ఎం.ఎ. తరగతిలో సంస్కృతం, ద్రావిడ భాషల్లో ఏదో ఒకటి తప్పక తీసుకొనే ఏర్పాటు చేశారు. తెనుగును 'సెకండ్ లాంగ్వేజ్' చేయడంకోసం అకేడమిక్ కౌన్సిల్‌లో పోరాడి గెలిచారు. పి.హెచ్.డి. పెట్టించారు. విద్యార్థులకు తెలుగంటె మన మాతృభాష అనే ఆదరం కలిగించారు. విద్యార్థులతో పలువురు కవులపై చర్చాగోష్ఠులు జరిపించి, వారికి పరిశోధనాభిరుచి పుట్టించారు. మహాభారతంపైన, నాటకాలపైన, శ్రీ నాథునిపైన సదస్సులు జరిపించి వాటిని గ్రంథ రూపంగా ముద్రించడానికి ఏర్పాట్లు చేశారు. శ్రీనాథ పదప్రయోగ సూచిక తయారు చేయించి ముద్రిస్తున్నారు.

ఖండవల్లివారు అత్యంత నిరాడంబరులు. రాత్రి తొమ్మిది గంటలకు పడుకొని, రెండు గంటలకు లేచి వ్రాసుకుని, ఉదయం మరల కొంతసేపు పడుకోవడం వారి అలవాటు. సంగ్రహ విజ్ఞానకోశానికి వారు ప్రధాన సంపాదకులు. దాని పనితోను, థీసేస్‌ల పర్యవేక్షణతోను వారికి వ్యవధే ఉండదు. చిన్నప్పుడు హాకీ, ఫుట్‌బాల్ ఆడేవారు. ఈత వారికి చాలా యిష్టం. "1929 లో స్కౌట్ మాస్టర్‌గా గద్వాలకు వెళ్లాము. నా వెంట నా తమ్ముడు బాలేందు శేఖరం వచ్చాడు. కృష్ణకు వెళ్లాము. నా తమ్ముడు గట్టుసరిగా చూడక నీళ్ళలో దిగాడు. కొట్టుకుపోయాడు. నేను వెంటనే దూకి, అతన్ని రక్షించాను. ఎన్నోసార్లు ఈతలోను, బోట్ రేస్‌లోను ఫస్ట్‌గా వచ్చాను" అంటూ వారు చిన్ననాటి ముచ్చట్లను ముక్తసరిగా చెబుతారు. వారి సతీమణి శ్రీమతి భ్రమరాంబగారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు.

ప్రస్తుతం వారు సాహిత్య చరిత్ర నవ్యరీతులలో వ్రాస్తున్నారు. చాలావరకు అది పూర్తయింది.విశ్వవిద్యాలయం పక్షాన మరి మూడు గొప్పపనులు ప్రారంభించారు.

"(1) విశ్వవిద్యాలయం పక్షాన ఆంధ్రమహాభారతం పునర్ముద్రణ చేయించడానికి ప్రయత్నిస్తున్నాను. ప్రాథమిక చర్యలు పూర్తయ్యాయి. పాఠాంతరాలను నేకరించే పని సాగుతున్నది. ఈ ప్రణాళికను విశ్వవిద్యాలయోపాధ్యక్షులు డాక్టర్ డి.ఎస్. రెడ్డి ఆశీర్వదించారు. విశ్వవిద్యాలయార్థిక సహాయ సంఘాధ్యక్షుడు డాక్టర్ కొఠారి ప్రశంసించారు.

(2) తెలంగాణాలోని మాండలికాల అధ్యయనానికి పథకం సిద్ధపరచారు.

(3) ఆంధ్రదేశపు చారిత్రక భూగోళం (ది హిస్టారికల్ జాగ్రఫీ ఆఫ్ ఆంధ్ర) రచించాలని ప్రయత్నిస్తున్నాను. శాసనాలను, సారస్వతంలోను ఉన్న స్థలాల పేర్లు సేకరిస్తున్నాము. ఇవన్నీ ఎలా ఉన్నా మహాభారత ప్రకటన కొనసాగితే చాలు" అన్నారు వారు.

అమృత హస్తులైన ఖండవల్లివారు ఆరంభించినదేదీ విఫలం కాలేదు. "స్లో అండ్ స్టడీ విన్స్ద రేస్" అన్నది వారు ఏనాడో జీర్ణించుకొన్న నీతివాక్యం. అదే వారి అఖండ విజయానికి నాందీ వాక్యం. భండార్కర్ పరిశోధన సంస్థవారు (పూనా) సంస్కృత మహాభారతాన్ని అనిదంపూర్వంగా, అసదృశంగా సంస్కరించి ప్రకటించినట్టు ఉస్మానియా విద్యాలయంకూడా ఖండవల్లి వారి సంపాదకత్వాన ఆంధ్ర మహాభారతాన్ని నిర్దుష్టంగా, నిరుపమానంగా ప్రచురించగలదనే నా మనస్సు చెబుతున్నది.



శ్రీ గన్నవరపు సుబ్బరామయ్య

సుబ్బరామయ్యగారు— అంటే ఎలా తెలుస్తుందిఁ ఆ పేరుగలవారు ఎందరో మరిఁ కాని, గన్నవరపు సుబ్బరామయ్యగారు అంటే, వెంటనే తడుతుంది. ఇప్పుడు పేరుమోసిన రచయితలందరికీ, పండితులందరికీ భారతి పత్రికే తాముగా, తామే భారతి పత్రికగా నవరచయిత లందరినీ తీర్చిదిద్దినవారనీ, పాత రచయితలందరినీ పట్టుగా నడిపించినవారనీ, భారతిలో రచన పడడమంటే ఏ మంగళాప్రసాద పారితోషికం పొందినట్లో, ఏ ప్యూలిట్జర్ బహుమతి సంపాదించినట్లో భావించే ప్రమాణం, ప్రతిష్ఠా సంతరించిన కులపతి ఆసీ.

ఫాలాక్షుడు వచ్చినా పక్షపాతం చూపనిపట్టుదలా, ఎవరేమనుకున్నా నమ్మిన దానిని ఒంటరిగా అనుసరించే గుండెనిబ్బరం, జన్మవిరోధం ఏర్పడినా జంకక తోచిన అభిప్రాయం తెగవేసి చెప్పే తెగువ, తమవల్ల పలువురికి మేలు జరుగాలనే తపన, తాముచేసే పని అన్నివిధాల ప్రజలు మెప్పు పొందాలనే వ్యగ్రత—సమిష్టిగా గన్నవరపు వారి స్వరూపమంటే కొంతవరకు సరిపోతుంది. వారికి ఇలాటి గుణాలు అబ్బడానికి కారణం జీవితంలోను, జీవికలోను పొసగిన వైవిధ్యమే అనుకుంటాను. ఇలాటిది పత్రికా సంపాదకులలో ఏ కొద్దిమందికో కాని లభించదు.

గన్నవరపువారి స్వగ్రామం నెల్లూరుజిల్లా సూళూరుపేట తాలూకా సూరప్పాగ్రహారం. కాని, వారు జన్మించింది చెన్నపురిలో (15-3-1890) మాతామహుల ఇంట తర్వాత స్వగ్రామంలో పితామహులు శ్రీ శేషశాస్త్రిగారి వద్ద తెనుగు సంస్కృతాలు నేర్చుకున్నారు. పూర్వాపరాలు సంత చెప్పుకున్నారు. పన్నెండో సంవత్సరంవరకు వారికి ఎ. బి సి. డి. లు రావు. అంతేకాదు, ఆ పన్నెండో ఏటి మేనత్తకుమార్తెను

పెండ్లాడడంవల్ల తక్కిన చదువు అటకకెక్కి "వివాహోవిద్యానాశాయ" అనే సామెతను సార్థకం చేసింది. దురదృష్టవశాత్తు వారి 18 వ ఏట ఆమె కాలధర్మం చెందడం, ఆయేటి ద్వితీయ వివాహంకావడం, అప్పటినుంచి మాతామహుల ఇంటికి మద్రాసుకు రాకపోకలు ఎక్కువకావడం-వీటివల్ల చదువంటే మరల ఆసక్తి పెరిగి జీవితం మరొక మలుపు తిరిగింది. మొదటి పెండ్లయిన తర్వాత స్వగ్రామంలోనే ఒక రిట్రైర్డు మెట్రికు లేటును ఆశ్రయించి నేర్చుకొన్న ఇంగ్లీషు కొంత అభివృద్ధి అయింది. చెన్నపురి పెక్కు భాషల కూడలి కావడంవల్ల క్రమంగా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, గుజరాతీ, బెంగాలి భాషలూనేర్చారు. బుక్‌కీపింగ్, షార్ట్‌హాండ్, టైప్‌రైటింగ్ మొదలయిన సద్యో జీవికాదాయక విద్యలూ కరచారు.

వారికి 1912 లో శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ వేదం వేంకటరాయశాస్త్రి గారు వంటివారితో సన్నిహితత్వం ఏర్పడింది. శ్రీ ప్రభాకరశాస్త్రిగారి స్థానంలో నాలుగేండ్లు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారంలో పండితులుగా పనిచేశారు వారి దస్తూరి ముత్యాలకోవ. పిదప పన్నెండేండ్లూ రకరకాలపనులు చేశారు. శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారివద్ద సూర్యారాయాంధ్ర నిఘంటువులో సహాయ సంగ్రాహకులుగా కొంతకాలం, విదేశీయులకు దేశభాషాధ్యాపకులుగా కొంతకాలం, మద్రాసు ప్రభుత్వం యాంటీ హుక్‌వర్మ కాంపైన్‌లో స్టెనోగ్రాఫర్‌గా కొంతకాలం-ఇలా ఏవేవో వృత్తులతో గడిపారు.

ఇంతలో శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారికి ఉత్తమసాహిత్య మాస పత్రిక ప్రచురిద్దామనే సంకల్పంకలిగింది. దాని నిర్వహణకు వివిధ ప్రాచ్యభాషా పాండిత్యం మాత్రమేకాక ఆధునిక విజ్ఞానం, రాజకీయాలతో పరిచయం, దక్షతగల వారు అవసరమని పంతులుగారు అన్వేషించారు. వారిచల్లని చూపు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి ప్రౌఢ్బలంమీద గన్నవరపు వారిపై ప్రసరించింది. పత్రిక 1924 నుంచి వెలువడింది.

వెనుకటి పత్రికలు కేవలం పదచర్చలతోను, పట్టుదలలతోను ఒకే దారిని సాగేవి. అలాకాక భారతి నానా మార్గాలలో నానా ముఖంగా అభివృద్ధికి ప్రయత్నించాలనే పంతులుగారి సంకల్పాన్ని గన్నవరపువారు ప్రజలకు దేశానికి మంచిదని తాము నమ్మినతోవలో అనుసరించారు. పంతులుగారు ఎప్పుడూ వారికి అడ్డుచెప్పలేదు.

"సాహిత్య పత్రిక కదా? నాకేమీ రాదే: ఏమిటి చేయడం? — అనుకున్నాను. అప్పటికి వచ్చిన వ్యాసాలుచూచి ఫరవాలేదనిపించింది. పత్రికను అన్నిమార్గాలలోను నడపగలననే ధైర్యము కలిగింది" అన్నారు వారు.

వచ్చిన రచనలలో నచ్చిన మంచి రచనలను ఏరుకోవడం, సంస్కరించి పంతులుగారితో సంప్రతించి ప్రకటించడం వారు తొలిరోజులలో చేసినపని. మనవి మాటలు, మీగడ తరకలు, గ్రంథసమీక్షలు, వ్యాసాలు, కలగూరగంప —ఎన్నో స్వయంగా వ్రాసేవారు. మనవి మాటలు మల్లెరేకులవంటి శైలి, మీగడ తరగల నిస్సాక్షిక వాఖ్య,

గ్రంథసమీక్షల నిశితదృష్టి, కలగూరగంప విషయ మధు సంగ్రహణం, శాసనాలు, రసచర్చలు మొదలయిన వాటిపై జరిగిన వివిధ వాద వివాదాలను సరసంగా సమాప్తి చేసినతీరూ ఆంధ్ర జగద్విదితాలు.

"సంవత్సరంపాటు కొందరు విద్యావంతులను, యువకులను గ్రంథాలయాలలో అధ్యయనం చేయడానికి వదులుదాము. వారు ఆయావిషయాలు చదివి వ్రాసిన వ్యాసాలను పరిశీలించి, సంస్కరించి పత్రికలలో ప్రకటిద్దాము. సంవత్సరానికి ఇద్దరిని అలా వదులుదాము" అని వారు పంతులుగారికి సలహాయిచ్చారు. సలహా పూర్తి కాకపోయినా కొంతవరకూ అమలు జరిగింది. దాని ఫలితమే భారతి వాస్తు శిల్పాది వివిధ శాస్త్రాలకూ, శాసన చరిత్రాది పరిశోధనకూ, సాహిత్యవిమర్శకూ ఇతర భాషలవారూ వరవడి తీసుకోదగినంత అపూర్వంగా కృషిచేయగల్గడం. ఇప్పటికీ సాహిత్యపత్రికలు ఈ సలహా పాటించడం అవసరమనే నా నమ్మకం.

"భారతి తొలిరోజులలో తగిన వ్యాసాలు ఏరుకోవడమంటే సామాన్యం కాదు. రచయితలందరూ తమ వ్యాసాలే మంచివని పోట్లాడేవారు. నన్ను దూషిస్తూ ఉత్తరాలు నాకూ, పంతులుగారికీ వ్రాసేవారు. పంతులుగారు ఆ ఉత్తరాలు చదువుకొని, నన్ను పిలిపించి నవ్వుతూ నాకు అందించేవారు. అంతే. ఏమీ చెప్పేవారుకారు. రాను రాను రచయితలతో ఈ సంఘర్షణ తగ్గింది" అని తమ అనుభవం వివరించారు వారు.

పంతులుగారు శివైక్యం చెందేవరకు గన్నవరపువారు భారతి సంపాదకులుగా ఉన్నారు. తర్వాత 1938లో "తుది మొక్క"తో వారికి భారతితో సంబంధం తీరిపోయింది. పిదప మూడేండ్లు ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రకటించిన రంగనాథ రామాయణం సంపాదకత్వంలోను, పరిష్కరణలోను శ్రీ వేటూరివారికి సహాయపడ్డారు. అటు పిదప దాదాపు పదకొండు శరత్తులు నెల్లూరులోని ఎ.బి.ఎమ్ బాలికల ఉన్నత పాఠశాలలో తెనుగు పండితులుగాను, 1956 నుంచి నాలుగేండ్లపాటు తెలుగుభాషా సమితివారి విజ్ఞాన సర్వస్వంలో అసిస్టెంట్ కంపైలర్‌గాను ఉన్నారు. అప్పటికి డెబ్బయి ఏండ్లు నిండాయి.

గన్నవరపువారు ప్రస్తుతం డెబ్బయిరెండు ఏండ్ల ముదిమిలోను మరెవరూ చేయని గొప్ప పనిచేశారు. సుప్రసిద్ధ కేరళ నవలా రచయిత శ్రీ తకళి శివశంకర పిళ్ళై రెండు నవలలు — రెండు ఇడంగళి, చెమ్మీన్ అనే వాటికి కేంద్ర సాహిత్య అకాడెమీ పక్షాన తెనుగుచేశారు. చెమ్మీన్‌లోని మలయాళదేశపు సెంబడుల వ్యవహారాన్ని తెనుగులో పెట్టడం సామాన్యంకాదు, శ్రమసాధ్యం. వారు చిన్ననాడు నేర్చిన మలయాళం ముదిమిలో ఉపయోగించింది.

నేటి సాహిత్య పరిస్థితికి, పత్రికా రచనా పరిస్థితికి వారు చాలా ఆవేదన పడతారు. "నేడు కొన్ని రచనలు అందరికీ అందుబాటులో లేవు. మరికొన్ని మరీ తేలికగా ఉంటున్నవి. ఎంగిలి కూడు తప్ప తాము వండుకున్నకూడు తక్కువగా కనిపిస్తున్నది అంతా లోతుకువెళ్ళని పరిశోధనే. ఇప్పుడు అందరి దృష్టి డబ్బే కాని,

సాహిత్యం కానట్టు తోస్తున్నది. డిగ్రీలు సంపాదించడం ఉద్యోగం కోసమే కాని, జ్ఞానంకోసం కాదు. ఈ పరిస్థితి మారేవరకూ సాహిత్యాభివృద్ధికి అవకాశాలు కనిపించవు. డబ్బే ప్రధానంగా చెప్పే పద్ధతి కళాశాలలో ఒకప్రొఫెసర్ చెప్పిన నోట్సు అనుశ్రుతంగా చెప్పేపద్ధతి పోవాలి."అంటారు వారు.

"తకళి నవలల వంటివి ఆధునిక తెలుగు సాహిత్యంలో ఏవీ?" అని వారి సూటిప్రశ్న. బహుభాషాకోవిదులైన సంపాదకుల ప్రశ్న ఇది.

"జర్నలిజం దేశోన్నత్యాన్ని సాధించేదిగా ఉండాలి; సంఘ మర్యాదను కాపాడేదిగా ఉండాలి. ఇప్పుడు ఆదృష్టి తగ్గినట్టు తోస్తుంది. ఇప్పుడు చాలామంది రచయితలు ఏర్పడ్డారనే సంతోషమే తప్ప నిజమైన అభివృద్ధి కానరాదు. ఇది బలుపుకాదు. వాపే. ఇతర దేశాలలో అలాకాదు. వారి దృష్టి వారి సంఘాభివృద్ధివి మీరి పారదు" అని వారి వలవంత.

అంతమాత్రాన వారిది రాష్ట్రీదురభిమాన మనికాని, సంకుచిత మనోవికారమని కాని భ్రాంతి పడతారేమో! వారిది మానవత్వమతం. ఈ విషయం వారితో పరిచయమున్న ప్రతివ్యక్తికీ తెలుసు. ఆనాళ్ళలో నేడూ—వారి యిల్లు తీర్థం. ఇంటికివచ్చిన సాహిత్య బంధువులను వారెప్పుడూ కులగోత్రాలు అడగలేదు. అతిధి సత్కారాదులలో వలపక్షం చూపలేదు. ఈ విషయంలో వారి శ్రీమతి వారికి మించిన విశాల హృదయ.

పేరూ ఊరూలేకనూ, ఏవేవో పుటాక్షరాలతోను వారు వ్రాసిన వ్రాతలన్నీ అచ్చువేస్తే కొన్ని— కనీసం ఇరవై అయినా సంపుటాలవుతాయి. వారు ఎప్పుడూ అలాటి ప్రయత్నం చేయలేదు. ఆ వ్రాతలన్నీ సమసామయిక ప్రచార ప్రయోజనం కలవేనని శాశ్వత ప్రయోజనం కలవికావని వారి ఉపేక్ష. వారి వ్రాతలు వారనుకొన్నట్టు అన్నీ కాకపోయినా, కొన్నయినా ప్రయోజనకరమైనవనే ఇప్పటికీ నాతలంపు.

రామానంద ఛటర్జీ చేసిన కృషి భారతీయ సాహిత్య సంస్కృతులను ముందుకు తీసికొని వెళ్ళినట్టు, మహావీరప్రసాద్ ద్వివేదీ పరిశ్రమ హిందీ సాహిత్యం ఎన్నో యోజనాలు ముందు నడవడానికి ఉపకరించినట్లు తెనుగు సారస్వత చరిత్రలో శాశ్వతంగా నిలిచే గన్నవరపువారి కార్యదీక్షా తెలుగు సంస్కృతి, తెనుగు సారస్వతం ముందుకు వెళ్లేట్టు చేసిందనే పలువురితోపాటు నా నమ్మకం. దానికి తార్కాణంగా నేడు పలువురు పండితులు, పరిశోధకులు, కథకులు, కవులు, నవలాకారులు, విమర్శకులు ఉన్నారు; వారి రచనలూ ఉన్నాయి.

వయసుతో, అనుభవ వైవిధ్యంతో, పత్రికా రచనాపారంగతితో సంపాదక భీష్ములైన గన్నవరపువారి సలహాలు ఇప్పటికి, ఎప్పటికీ పథ్యాలే, పాథేయాలే నవ, యువ రచయితలకు.

8-4-63 నాడు ఉదయం 10-30 కు మరణించారు పాపం!



శ్రీ గిడుగు సీతాపతి

"నాహం సంస్కృత పండితః నచ కవిః
కింత్వేష యత్నః కృతః
విజ్ఞాతుం బహుమాని తాంధ్రకవితా
మాధుర్య మాంధ్రేతరే,
కాంక్షంతీతి భ్రశం విచింత్యకతిచి
త్పద్యాని గేయా న్యహం
ప్రీత్యాసంస్కృత భాష యా వ్యరచయం
మా మాద్రి యాంతాం చుదాః"

అని డాక్టర్ గిడుగు వెంకటసీతాపతిగారు తాము రచించిన కవితోదయ చంద్రికలో వినయంగా పండితులను కోరారు. సంస్కృతం నుంచి, ఇతర భాషలనుంచి తెనుగు లోకి అనువదించడానికే మనం అలవాటు పడ్డాంగాని తెనుగు వెలుగుజిలుగులను ఇతర భాషలలోకి తళుక్కు మనిపించడం సకృత్తిగానే జరుగుతున్నది. గిడుగు సీతాపతి గారు ఆంధ్రేతరులు ఆంధ్రకవితా మాధుర్యాన్ని తెలుసుకొని ఆనందించడం కోసం కవితోదయ చంద్రిక అనే పేరుతో తెనుగు ప్రభంధాలలో మనోజ్ఞాలయిన పద్యాలను ఘట్టాలను, చాటువులను, క్షేత్రయ్య మొదలయినవారి పదాలను ఎంచి శ్లోకాలుగాను,

గేయాలనుగాను సంస్కృతీకరించి తెలుగు సాహిత్యపు సొబగులను దిగంతాలకు విస్తరింప జేస్తున్నారు.

గిడుగువారు 'నేను సంస్కృత పండితుడినికాను, కవినికాను,' అని చెప్పడం వినయం కొద్దీకాక మరేమి ? వారికి ఒక్క సంస్కృత భాషేకాదు. గ్రీకు, లాటిన్, జర్మన్ మొదలయిన పాశ్చాత్యభాషలు, శబరాది అనాది భాషలు, తెనుగు, తెలుగు తోబుట్టువులు వాచో విధేయాలు. ప్రాచీన శబ్దశాస్త్రం, నవీనభాషాశాస్త్రం వారి అభిమాన శాస్త్రాలు. పరిశోధన, పదప్రయోగ పరిశీలన, లిపిపఠనం, నిఘంటురచన వారికి పైతృకంగా వచ్చిన సొమ్ము. చరిత్ర వారు తరంపాటు భోధించిన విషయం. విజ్ఞాన సర్వస్వం ప్రధాన సంపాదకత్వమే వారి భాషాసేవకు తార్కాణం. 79 వ ఏటనూ వారి సింహసంహాననత్వమే వారి సర్కసుఫీట్లకు, కుస్తీపట్లకు, వివిధక్రీడల మల్లగుల్లాలకు నిదర్శనం. వారి నటనా చాతురికి, సామాజిక రంజనానికి నాటకాలు, సినిమాలు ఉదాహరణలు. వారి సంఘసేవకు పర్లాకిమిడిరాజాతో పోరాటాలు, లండన్‌కు రాయబారాలు, వలసలు- అనంతంగా పేర్కొనవచ్చు. వారిలాగా జీవితంలో వివిధ రంగాలను మెట్టి, నిమ్నోన్నతాలను చూచినవారు సాహిత్య మహారథులలో అరుదు.

గిడుగువారు విశాఖపట్టణం జిల్లా భీమునిపట్టణంలో 1885 జనవరి 28 వ తేదిన జన్మించారు. తండ్రిగారయిన వేంకటరామమూర్తిగారు అప్పుడు పర్లాకిమిడిలో ఉపాధ్యాయులుగా ఉన్నందున గిడుగువారి బాల్యం పర్లాకిమిడిలో గడిచింది. గిడుగువారి ప్రతిభ నాలుగోయేటే కనిపించింది. వారి నాయనమ్మ

"చింతామణి యను బ్రాహ్మడు
పంతానికి గోడమీద షట్‌మని వ్రాసెన్
అంతట వర్షము కురిసెను
కాంతామణికంటిమీద కాకరపూచెన్"

అంటూ ఏవేవో పద్యాలు, పాటలు వారికి చెబుతూఉండేవారట. పండితకోటికే పిడుగువంటి గిడుగువారి తండ్రి రామమూర్తిగారు కొంచెం విసుక్కునేవారట, తలా తోకాలేని పద్యాలేమిటని. కాని, అప్పుడుగిడుగువారు "అదికాదునాన్న! గోడమీద కాంతామణిపటం రాస్తే, వానపడితే, బొమ్మకన్ను తడిసింది. అందులో నీరుచుక్క ఒకటి కాకరపువ్వు అయ్యింది" అని నాయనమ్మను సమర్థించారట. ఆమె పొంగిపోయిందట. ఈ తెలివి తేటలేకాదు, వారి అల్లరికి అంతుఉండేదికాదు; రోషంకూడా ఒకపాలు హెచ్చే. ఎనిమిదోఏట ఒకమారు తండ్రిగారు పాఠంచెబుతూ కొడితే, విజయనగరానికి కాలినడక న బయలుదేరిన పట్టుదల వారిది.

గిడుగువారు ఎఫ్. ఎ. వరకు పర్లాకిమిడిలోనే గడిపారు. తర్వాత మద్రాసు క్రిష్టియన్ కాలేజీలో బి. ఎ. పూర్తిచేశారు. వారు రెండవఫారంనుంచీ రెండవ భాషగా

సంస్కృతం చదివారు. బి. ఎ. లో అదృష్టవశాత్తు వేదం వేంకటరాయశాస్త్రిగారి వంటి వారు వారికి గురువులు. హైస్కూళ్లు రోజులులోనే వారికి నాటకాలన్నా, కసరత్తు కవాతులన్నా ఇష్టం కలిగింది. బుర్రా శేషగిరిరావు మొదలయిన సహాధ్యాయులతో కలిసినాటకాలు, సర్కసులువేసేవారు. అప్పటికి ఆర్మోనియం ప్రచారంలోకి రాలేదు. ఇత్తడిబిందెల అంచులపై లావుపాటి చీపురుపుల్లలు నిలబెట్టి వేళ్లతోరాస్తూ నాదం పుట్టించేవారు.

గిడుగు వారికి లాయరు కావాలనే ఆశ ఉండేది. చెన్నపురిలో విద్యార్థిగా ఉన్నప్పుడు వీలయినప్పుడల్లా హైకోర్టుకు వెళ్లుతూ భాష్యం అయ్యంగారు, కృష్ణస్వామి అయ్యరు, నార్టన్ ఎట్లా ప్రసంగించేవారో వింటూండేవారు. కాని వారి తండ్రిగారికి లాయరువృత్తి ఇష్టంకాలేదు. రెవెన్యూశాఖలో చేరితే ఉత్తరోత్తరా గొప్పగా సంపాదించవచ్చునని వారివాదం. లాయరువృత్తి ప్రాప్తం కానప్పుడు ఉపాధ్యాయవృత్తే మెరుగనుకుని వారు ఎల్. టి. ట్రెయినింగు అయి పర్లాకిమిడి హైస్కూలులో చరిత్రోపాధ్యాయులుగా ప్రవేశించారు. తర్వాత సంవత్సరంపాటు కోరాపుట్టిలో హైస్కూలు హెడ్ మాస్టరుగిరి చేసి 1911 లో పర్లాకిమిడిలో వారి తండ్రిగారు ఫించను పుచ్చుకోవడం వల్లా, వారిస్థానంలో చరిత్రోపన్యాసకులుగా చేరారు.

అప్పటినుంచి ఇరవై సంవత్సరాలు వారిజీవితం వివిధ రంగాలలో కష్మచ్చున లాగిన బంగారుతీగెలాగా సాగింది. వారి తండ్రిగారు 1906 వరకు తెలుగులో అంతగా పరిశ్రమ చెయ్యలేదు. తర్వాత యేట్స్, శ్రీనివాసయ్యంగార్ల సలహాతో తెనుగును పిడిపట్టడం ప్రారంభించారు. వ్యవహార భాషవాదం పుట్టుకురావడంతో వారిపరిశ్రమ ముమ్మరంగా సాగింది. రాత్రి భోజన సమయంలో తమ పరిశ్రమనంతా కుమారునికి చెప్పేవారు. "బాడుదల పట్టితెమ్ము" అనే భారతప్రయోగం చర్చవచ్చింది. శబ్దరత్నాకరంలో ఏదో అసంబద్ధమైన అర్థంఉంది. కాని మూలంలోని జీవగ్రాహం అన్నది, కన్నడంలోని బాళుదల మొదలయినవి పరిశీలించగా ప్రాణాలతో పట్టుకుని అన్న అర్థం తేలింది. తండ్రిగారి పరిశ్రమంతా అయాచితంగానే తమకు లభిస్తుండడంవల్ల, బాల కవి శరణ్యంవంటి గ్రంథాలలో తండ్రిగారికి తోడ్పడడంవల్ల,వారి వాగ్ధాటి సహజంగానే తర్కబద్ధమైనందువల్ల గిడుగువారు వ్యవహారభాషలో "సరస్వత విలాసం" అని శార్దూలమాలిక మొదలయినవి రచించారు. పెక్కు ప్రసంగాలు చేశారు "కొద్దిమొర్ర" అనేపేరుతో కొలది కొద్దిగామారి ప్రాచీనకవుల ప్రయోగాలలో చేరిన తీరును వివరిస్తూ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి వాదానికి సమాధానం వ్రాశారు. చారిత్రక సభలు సవరభాషా పరిశ్రమ, వివిధ భాషలలో నాటకాలవేర్పాట్లు మొదలయినవి నిర్వహించి పర్లాకిమిడి రాజాగారి మెప్పునూపొందారు. మద్రాసు విశ్వవిద్యాలయం సెనేట్ సభ్యులుగాను, తెలుగు గరల్స్ హైస్కూలు గౌరవ సూపరెండెండెంటుగాను ఉన్నారు.

కాని, రాజాగారి అనుగ్రహం రాజకీయాలమూలంగా తప్పింది. పర్లాకిమిడి తాలూకాను కాబోయే ఒరిస్సారాష్ట్రంలో చేర్చాలని రాజాగారు చేసిన ప్రయత్నంలో

తెలుగువారంటే సహజంగా ద్వేషం పెచ్చింది. ఆ సమయంలోనే 1932 కాకతాళీయంగా గిడుగువారు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సవరలను గురించి పరిశోధన చేసేవారు. ఆ ఆదనుచూచి గిడుగువారంటే పడనివారు కొన్ని సమిధలు వేశారు. రాజాగారు గిడుగువారికి ఆ సంవత్సరం జీతం నష్టంపై సెలవియ్యడమేకాక, ఏవోసాకులతో వారిని పనినుంచి తొలగించారుకూడా. దీనికి ప్రధాన కారణం ఆంధ్రోద్యమం. ఒరిస్సా రాష్ట్రంలో చేర్చవలసిన భాగాలను సూచించడం కోసం ఓడోనెల్ కమిషన్ ఏర్పడింది. పర్లాకిమిడి తాలూకా అంతా ఒరిస్సాలో కలపాలని రాజాగారి కోరిక; కాని, ఆతాలూకా తెలుగువారి పక్షాన గిడుగువారితండ్రిగారు సాక్ష్యమిస్తూ 1931 నాటి జనాభా లెక్కల ప్రకారం పర్లాకిమిడి తాలూకాలో నూటికి 60 మంది తెలుగువారని, కనుక తాలూకాను చేర్చరాదని, గంగవంశరాజుల మాతృభాష తమ రాజధానిని ముఖలింగం నుంచి కటకానికి తరలించేవరకు తెలుగేనని వాదించారు. రాజాగారు తండ్రిపై కోపాన్ని కుమారునిపై చూపి, ఉద్యోగం ఊడదీశారు. దానితో గిడుగువారి జీవితం కొత్తపుంతలో పడింది.

వారు ఇక బాహాటంగానే ఆంధ్రోద్యమంలో పాల్గొన్నారు. రాజాగారితో పోటీపడి తాలూకా బోర్డు ఎన్నికలలో తెలుగువారిని అధికసంఖ్యలో గెలిపించి తాలూకాబోరు అధ్యక్షులుగనూ ఎన్నికయ్యారు. పర్లాకిమిడి తెలుగువారిపక్షాన 1933 లో జాయింటు పార్లమెంటరీ కమిటీ ఎదుట వాదించడానికి లండన్ వెళ్ళారు. అక్కడ 45 నిమిషాలసేపు సర్ శామ్యూయల్ హోర్ మొదలయిన వారిఎదుట వాదించి వారిని ఒప్పించారు. ఇంగ్లాండులో ఉన్నప్పుడు సర్ జార్జి గ్రిమర్సన్‌వంటి పలువురు విద్వాంసులను కలుసుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం మొదలయిన విజ్ఞాన పీఠాలను దర్శించారు. వారు లండన్‌నించి తిరిగివచ్చినప్పటి ఆనందోత్సహం చెప్పనలవి కాదు. తెలుగువారు తిలారు రైలుస్టేషన్‌నుంచి పర్లాకిమిడి వరకు - 26 మైళ్ళవరకు- మోటారుకారులో బాండుమేళాలతో వారిని ఊరేగించి; గ్రామగ్రామాన సన్మానించారు.

ఏమైతేనేం? ఆంధ్రుల మొరలన్నీ అరణ్యరోదనాలయాయి. రాజాగారి పలుకుబడే చెల్లింది. పర్లాకిమిడి తాలూకాతో సహా 1936 లో ఒరిస్సా రాష్ట్రం ఏర్పడింది. అనాడే గిడుగువారి తండ్రిగారు, తల్లిగారు అర్ధశతాబ్దంపైగా నివసించిన పర్లాకిమిడి విడి రాజమహేంద్రవరం బయలుదేరారు. గిడుగువారు మాత్రం తమకు జరిగిన అన్యాయంకోసం రాజాగారిపై దావా వేయడంవల్ల ఫలితం కోసం తర్వాత రెండేళ్లు అక్కడ నిలువక తప్పలేదు. కాని ఆ దావాకూడా రాజాగారి పుణ్యాన వారికి ప్రతికూలంగా అయింది. వారు ఆర్థికంగా చాలా బాధలకు లోనుకావలసివచ్చింది. ఇంతలో తలవని తలంపుగా, ఒక క్రైస్తవ మిషన్ పక్షాన సవర భాషలో బైబిలు అనువదించే పని పడింది. పర్లాకిమిడికి 20 మైళ్ళలో కొండలపై ఉన్న సరంగ్ అనే గ్రామంలో ఉంటూ ఆరు మాసాలకు మూడు గాస్పెలులు అనువదించారు. ఆ సమయంలో సవరలపై

రేడియో ప్రసంగంకోసం చెన్నపురి రావడం తటస్థించింది. అప్పుడే గూడవల్లి రామబ్రహ్మంగారితో పరిచయం లభించడం, దాదాపు తొమ్మిదేండ్లపాటు ఆరేడుచిత్రాలలో నటించడం జరిగాయి. వారు స్వర్గసీమలో పన్నెండు పంక్తుల వాచికాన్ని ఏకదమ్ముగా చెప్పినా, వారిది ఎప్పుడూ టేక్ వన్నేకాని, టేక్ టూ కాకపోయినా "సినిమాలోఎక్కువ ప్రతిభకు అవకాశంలేదు. సినిమానటుని జీవితం డైరెక్టరూ, ఎడిటర్ చేతుల్లోవుంది. నాటకరంగం మీద రాణించేవాడు సినిమాలో దెబ్బతింటున్నాడు" అని వారికి తోచింది. అంతేకాక సినిమా జీవితం ఆర్థికంగా ఉపకరించినా, వారి దృష్టి సాహిత్యకృషి వైపే ఉండడంవల్ల వేటూరి ప్రభాకరుల గొప్ప పీఠికతో ప్రాచీనకవుల వ్యావహారిక ప్రయోగాల సర్వస్వ మనదగిన 'భారతీశతకం' పూర్తిచేశారు. సవరలను గురించి, వారి సాహిత్యాన్ని గురించి తెనుగు, ఇంగ్లీషులలో పెక్కు వ్యాసాలు వ్రాశారు. సవర పాటలను ఆంగ్లీకరించారు. వాటికి వాషింగ్టన్‌లోని ఇంటర్నేషనల్ అకాడెమీవారు 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' బిరుదు ఇచ్చారు.

ఆ రోజుల్లోనే పిఠాపురం మహారాజా వారితో వారికి పరిచయం కలిగింది. వారి ప్రోత్సాహంతో సూర్యరాయాంధ్ర నిఘంటు పునర్ముద్రణ, రత్నపాంచాలివారి నాటకాల అనువాదంచేశారు. 1948 లో తెలుగుభాషా సమితి ఏర్పడి. విజ్ఞాన సర్వస్వం ప్రారంభమయింది. మొదట పది సంవత్సరాలపాటు ప్రధాన సంపాదకులుగా ఉన్నారు. తర్వాత మూడుసంవత్సరాలు రచనాలయానికి డైరెక్టర్‌గా పనిచేసి పలువులు రచయితలను తీర్చిదిద్దారు. సాహిత్య అకాడెమీ సభ్యులుగాను మద్రాసుబోర్డు ఆఫ్‌స్టడీస్ చెయిర్మెన్‌గాను ఉన్నారు. 1955 నుంచి ఆరేండ్లపాటు మరల సెనేట్ సభ్యులుగా ఉన్నారు. హిందీ విశ్వకోశ్, కన్నడ విజ్ఞాన సర్వస్వం సభ్యులుగాను ఉన్నారు. పెక్కు పుస్తకాలకు బహుమతులు పొందారు. వారు 1914 లో వ్రాసిన 'హిస్టారికల్ టేల్స్' పది ముద్రణలు పొందింది. ఇటీవలే వారు తెలుగు సాహిత్య చరిత్రను ఆంగ్లంలోవ్రాశారు. దానిని సాహిత్య అకాడెమీవారు ప్రచురిస్తున్నారు.

వారికి చదరంగం అంటే చాలాఇష్టం. బైసికెల్ పోటీలన్నా చాలాసరదా. చిన్ననాడు 55 మైళ్లు ఏకధాటిన తొక్కారు. 40 వ సంవత్సరం వరకు జ్వరమంటే ఏమిటో ఎరుగరు. ఉదయం అయిదుగంటలకే లేచి వార్తాపత్రిక చదువుతారు. ఉదయం భోజనానంతరం కొంచెంసేపు కునుకుతీస్తారు. రాత్రి నిద్రపట్టదు. అప్పుడు ఏదో పద్యమో, పదమో ఆలోచిస్తారు.

"మా నాయనగారు శబ్దరత్నాకరాది నిఘంటువులలో అర్థాలలోను, ప్రయోగాలలోను తప్పులనిచూపిన వాటిని కనీసం వేయింటినైనా నాకు ఆయుర్దాయం ఉంటే ప్రకటించాలనుకున్నాను. ఆలస్యమయినందుకు విచారించను. సరైనపాఠ నిర్ణయానికి మన సిసాలు ఎంతో తోడ్పడుతాయి" అన్నారువారు.

వారి మరొక మహాప్రయత్నం తెనుగుభాషా చరిత్ర. పూర్వం చెప్పితి వేనిన్ అనేది చెప్పితేన్ అనే ప్రశ్నతోనే సంభంధించి ఉండేది. నన్నయకాలానికి పురుషంతో అన్వయం పొందింది. ఇది ఇలాటి పరిణామగవేషణతో సాగుతున్నది. తర్వాత దీనిని తెలుగుచేస్తారు.

వీటికంతా మరి రెండేండ్ల ఆయువుచాలు నన్నారువారు. ఆ రెండుకు ఇవతల ఒక సున్న ఉండాలని, భాషాచరిత్రే కాదు. పదచరిత్రా, ఇంకా ఏన్నో చరిత్రలు వారి నుంచి వెలువడాలని, అవికూడా 'తెలుగులో చందోరీతులు' లాగే పాండితికి నికషంగా శాశ్వతత్వం సంపాదించుకోగలరని ఆశిద్దాం.



శ్రీగుండేరావు కాకాజీ

ఆ విద్వద్వతంసులగు ప్రతి ముస్లిం ధార్మిక సమావేశానికీ ఆహ్వానించే సంప్రదాయం ఏర్పడింది. వారు పదవాక్య ప్రమాణ పారావార పారీణులు. ద్వైతా ద్వైత విశిష్టాద్వైత వేదాంత నిష్ణాతులు. వేదాలనుతరచి నిరుక్తాన్ని తెనుగుచేసిన "విద్యావాచస్పతులు" అరబ్బీ, ఫారశీ, ఉరుదూభాషలను పుక్కిటబట్టి ఇస్లాంతత్త్వ శాస్త్రాన్ని భారతీయ తత్వభావనతో సమన్వయపరచి, ఖురాన్ షరీఫ్‌ను అరబ్బీనుంచి మస్నవీ షరీఫ్‌ను (సూఫీ మధురాద్వైతాన్ని) ఫార్సీనుంచి సంస్కృతీకరించిన రచనా ధౌరేయులు. ఆంగ్లంనుంచి పలువురి కవితలను, నాటకాలను సంస్కృతీకరించిన కవిశేఖరులు. మితాక్షరను ఉరుదూ చేసిన న్యాయాధీశులు. తాము పరిపాలించిన జిల్లాలో అందరి మన్ననలు పొందిన అవ్వల్ తాలూక్దార్లు (కలెక్టరు).

ఏటా జరిగే బారహ్‌వీ షరీఫ్ (మహమ్మద్‌వారి జన్మదినోత్సవం) నాడు యథారీతిగా వారూ ఆహూతులై వెళ్ళారు. ఆనాడు ఉరేమాలసంబరం హెచ్చుగానేఉంది. అరే

బియానుంచి హబీబ్‌రఫయ అనే మహావిద్వాంసుని రాక అనాటి ఉత్సవం విశిష్టత. ఆయనకు అరబ్బీ భాష తప్ప మరొకభాషరాదు. కనుక చర్చ అరబ్బీలోనే జరుగుతున్నది. బలులసంగతి, ముఖ్యంగా గోబలుల సంగతి ప్రసక్తానుప్రసక్తమయింది. "మీరు అన్యధర్మంవారు?" ఈ విషయంలో మీ అభిప్రాయం ఏమిటో అని ప్రశ్నించారు. వారు నెమ్మదిగాలేచి "బిస్మిల్లా ఇర్రహమాన్, ఇర్రహీమ్" అనిమొదట అవిఘ్నమస్తు చదివి, దానికి సంస్కృతాను వాదం

"వంద్యస్య వ్యాహరన్ నామ
ప్రారభే పరమాత్మనః
అపార కరుణాపారా
వారస్య కరుణావతః"

అని పఠించి "మీకూ బకర్" (అరబ్బీలో బకర్‌అంటే ఆవు) పవిత్రమైందే. ఒక ఆవు ఏడు దుంబా గొర్రెలతో సమానం; పది ఆవులయితే ఒక ఒంటెతో సమానం అని హదీస్‌లో (కురాన్ ఇతిహాసంలో) వక్కాణించి ఉంది. ఒంటెను బలిదానం చేయడం గొప్ప. వేయి ఒంటెలను బలిగా చంపడంకన్నా అహంకారాన్ని చంపడం 'నఫ్‌సే అమ్మారా బెకుష్' (అహంకారాన్ని చంపు) గొప్ప అన్నారు. మేము గోవును పూజించి గౌరవిస్తాము. మీరు భగవంతుని పేర బలిఇచ్చి గౌరవిస్తారు. దారులు వేరేకాని, భావం సమానమే. అలాగే బుత్‌పరస్తి (మూర్తి పూజ) విషయమూను. మీరు అసలే మూర్తి పూజ వద్దనీ మూర్తులను కొట్టివేస్తారు. మేము అధికార తార తమ్యాన్నిబట్టి అవసరమంటాము. మూర్తిని మీరు నిరాకరించినా కాబావంటి వాటిలో పోలేదు. మూర్తినికొడితే దేవుడు చస్తాడా? ఉద్దేశాలు ఇద్దరివీ పవిత్రమైనవే, కాలదేశాలనుబట్టి మార్గాలు మారాయి" అన్నారు. తత్వదర్శి అయిన హబీబ్ రఫయా ఈ భీమబలులను ఆలింగనం చేసుకున్నారు; ఆనందభాష్పాలు రాల్చారు.

ఆ విద్యావారంనిధులు శ్రీ హర్కారే గుండేరావుగారు. హర్కారేవారు బిదర్ దగ్గర ఒక అగ్రహారంలో 1887 మార్చి 13 న జన్మించారు. ఆరు నెలలకే మాతృ వియోగం సంభవించింది. వారి తండ్రి హైదరాబాదు హైకోర్టులో ముంతజిం (ఆఫీసు సూపరింటెండెంటు) గా ఉండేవారు. తల్లిలేని కొడుకుగదా అని తండ్రి అల్లారుముద్దుగా పెంచినా, హర్కారేవారు చెడిపోలేదు. చిన్ననాటినుంచే వారిబుద్ధి నైశిత్యం వెలుగులు విరజిమ్మింది. మాతృభాష మరాఠీ; దేశభాష తెనుగు; మతభాష కన్నడం. నాగరిక భాష ఉరుదూ—ఈ నాలుగుభాషలూ హర్కారే వారికి మాటలు రావడంతోటే పట్టుబడ్డాయి. వారి చిన్ననాటి విద్యాభ్యాసం, హైదరాబాదు సమీపంలోని షా-ఆలీ-బండాలోని వైదిక ధర్మప్రకాశికా పాఠశాలలో కొనసాగింది. రాజధాని సమీపంలోని పాఠశాలలో ఆ కాలంలో తెనుగు అంతగాలేదు. పార్శీ, అరబ్బీలే హెచ్చు. కనుక వారు మెట్రిక్యులేషన్ పూర్తిచేసే వేళకే అష్టభాషా విశారదులయారు. మెట్రిక్యులేషన్

తర్వాత బిదర్ సమీపంలోని కళ్యాణ్ (బసవేశ్వరుని జన్మస్థలం) లోని మహావిద్వాంసులు శ్రీ మాణిక్యశాస్త్రిగారి వద్ద, సంస్కృత నాటకాలంకారాలు చదివారు. కనకాపురం శ్రీనివాసాచార్యుల వద్ద న్యాయ (తర్క) వేదాంతాలు చదివారు.

ఇంతలో తండ్రిగారు పరమపదించడంవల్ల పొట్ట చేతపట్టుకొని బయలుదేర వలసివచ్చింది. సిటీసివిల్ కోర్టులో జప్తీగుమస్తాగా చేరారు. తర్వాత బెంచిక్లర్కుగా పని చేసారు. ఈ గుమస్తాగిరి వెలిగిస్తూనే వకీలు పరీక్షకు చదివి కామ్‌యాబ్ అయ్యారు. ఇతరత్రా గోష్ఠులలో, వాగ్వాదాలలో పాల్గొంటూ తమకువచ్చిన భాషలను పెంపొందించుకుంటూ, న్యాయసాహిత్య శిరోమణి పరీక్షలలో ఉత్తీర్ణులయారు. రెండు పి. ఓ. ఎల్. పరీక్షలలోను నెగ్గారు.

వారి వివిధ భాషాపాండిత్యాన్ని, న్యాయశాస్త్ర వైశారద్యాన్ని గుర్తించి, సమున్నత బలిష్టమూర్తిని చూచి ప్రభుత్వం వారిని మున్సిఫ్ మేజిస్ట్రేటుగా నియమించింది. దానిని వారు సమర్థతతో నిర్వహించి, జిల్లా జడ్జి పదవికి వెళ్ళారు. వారిని ప్రభుత్వం అవ్వల్ తాల్లూక్‌దార్ (జిల్లా కలెక్టర్) గా నియమించింది. కాని వారు పరిపాలనశాఖ కంటే న్యాయశాఖనే అభిమానించడం వల్ల సెషన్స్ జడ్జిగా తెలంగాణలో పెక్కుచోట్ల పనిచేసి, ఆ పదవినుంచి విరమించారు.

వారి ప్రతిభ మొట్టమొదటసారిగ, గద్వాల పండిత పరిషత్తులో ప్రకాశించింది. అక్కడి వైయాకరణులతో వారు వాక్యార్థానికి తలపడ్డారు. ఆ సమయంలో వారినుంచి అకస్మాత్తుగా—

"రామన్నామ జ్యాయః
గ్రావాణో యద్వశాత్, ప్లవంతే హి,
త్యక్తో రామేణ హి యత్
... ... "

అంటూ సంస్కృత కవిత వెలువడింది. అప్పటి నుంచి గద్వాల రాజాగారు ప్రతి ఏడూ పండితసభకు రావాలని వారిని కట్టడి చేశారు.

హర్కారేవారు పాల్గొనని ఓరియంటల్ కాన్ఫరెన్సులేదు. ప్రతి సమావేశంలోను ప్రతిపాదించని మౌలిక విషయంలేదు. వారి నిశితబుద్ధి, తర్కజటిల వాదపటిమ తిరుగులేనివి. వారి ప్రచండ పాండిత్యానికి పూనా పండిత పరిషత్తు మెచ్చి "విద్యావాచస్పతి" బిరుదం ఇచ్చి గౌరవించింది. ఇటీవల జరిగిన ఓరియంటల్ కాన్ఫరెన్స్ రసనిష్పత్తిలో ధ్వనికారుని ప్రత్యభిజ్ఞావాదాన్ని ఖండిస్తూ వ్యాసం చదివినప్పుడు ఆలంకారికులందరూ దిగ్భ్రాంతులయారు.

యాస్కుని నిరుక్తానికి (వేద నిఘంటువును) వారి తెలుగు అనువాదం గోల్కొండ పత్రికలో ప్రచురితమయింది. వారు ఖురాన్, షరీఫ్‌ను సంస్కృతీకరించడంతో దాని

లోని క్రియాపదాలు ఏ లకారాలలో ఉన్నాయో, తద్ధితాంతాలు ఎలా ఉన్నాయో సంస్కృతంలోను ఆ లకారాలు, ఆ తద్ధితాంతాలు వృతంగా వాడారు. మితాక్షరను, ఉరుదూలో తర్జుమా చేయడం మౌల్వీలకు కాజీలకు ఎంతో సహాయకారి అయింది. మస్నవీ షరీఫ్‌ను (సూఫీ అద్వైతాన్ని) ఫార్సీ నుంచి సంస్కృతీకరించడంలో వారు భారతీయ, పారసిక, అరబ్ భావనాధారల సమన్వయ దృష్టిని అనుసరించాయి.

వారు ఉరుదూ, సంస్కృతాంగ్లాలలో అసంఖ్యాకంగా వ్యాసాలు వ్రాశారు. ఉద్యానపత్రిక, మధురవాణి సంస్కృతం మొదలయిన పత్రికలు వారి వ్యాసాలతో అలంకృతమయాయి. ఉరుదూ ఆంగ్లాలలో వ్రాసిన వ్యాసాల విషయాలు హిందూ సంస్కృతి వైదిక సంస్కృతి మొదలగునవి. ఉరుదూభాషేతిహాసం మరాఠీ సాహిత్య చరిత్ర తెనుగులోవ్రాశారు.

పెక్కు ఆంగ్ల రచనలను సంస్కృతీకరించారు. థామస్ గ్రే కవి 'ఎలిజీ'ని వర్డ్‌స్‌వర్త్ కవి "ఏన్ వోట్ టు ఇంటిమేషన్ ఆఫ్ ఇమ్మోర్టాలిటీ'ని గోల్డ్‌స్మిత్‌కవి 'ట్రావెలర్'ను షేక్స్‌పియర్ 'మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీం, హామ్‌లెట్' మొదలయిన నాటకాలను సంస్కృతీకరించారు. "ప్రశ్నోయం సముపస్థితో మమపురః జీవామ్యా జీవామి వా" అంటూ హామ్లెట్ సంస్కృతంలో ఆలోచిస్తాడు. థామస్ గ్రే కవి 'ది కర్ఫ్యూం టోల్స్ ది నెల్ ఆఫ్ పార్టింగ్ డే" పాదంతో ప్రారంభమయ్యే ఎలిజీని—

"వాదత్యేషా తపన విరహ
ద్యోతినీ నైశ ఘంటా
ప్రత్యాయాంతి స్వయ మిహ శనైః
గోచరాద్గో ధనాని,
స్వీయం వేశ్మానుసరతి పరి
క్లిన్న గాత్రః కృషీకః
యుంజన్ గుహ్యై నిభృతజగతో
మాంచ గాఢాంధకారం"

అంటూ "చైత్య విలాపః" అన్న ఖండకావ్యంగా మధుర గంభీరంగా అనువదించారు.

హర్కారేవారు ఓరియంటల్ కాన్ఫరెన్స్ శాశ్వతసభ్యులు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీసభ్యులు. ప్రస్తుతం వారు చార్‌మీనార్ ఆవల ఉన్న అలీయాబాద్‌లోని గోవిందాబాగ్ అనే సొంత తోటలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఓపిక ఉన్నప్పుడు సేద్యం చేయిస్తారు. ప్రతిదినం ఉషఃకాలంలోనే లేచి, స్నానాద్యనుష్ఠానాలు తీర్చుకుని, పార్థివలింగపూజ చేస్తారు. ఆహార నియమంతో, వచ్చినవారిని సత్కరిస్తూ నిరాడంబరంగా సంతృప్తితో ఉన్నందువల్లనే కాబోలు, ఈ 77 వ సంవత్సరము లోను వారినడుము వంగలేదు; చూపుతగ్గలేదు. వాదపటిమ విడనాడలేదు. సమున్నత విగ్రహంసడలలేదు. వారికి సంతులేదు. ఒకరిని దత్తుతీసుకున్నారు.

ఆయన ఎల్. ఎల్. బి. పాసయి ఆంధ్ర హైకోర్టులో ఉద్యోగిగా ఉన్నారు.

"నా లక్ష్యం ఫార్సీ, ఉరుదూ, ఇంగ్లీషులద్వారా సంస్కృత భాషాప్రచారం. పాణినీయంమీద ఒక మిషన్ తయారుచేసి, పరిశీలిస్తున్నాను వేద సంహితకు కాండ సూచి సిద్ధపరుస్తున్నాను. వాటిని పూర్తిచేయాలి. 'ఉపనిషత్తత్త్వ ముక్తావళి' అన్న పేరుతో స్రగ్ధరలో ఎప్పుడో ప్రారంభించిన ఉపనిషద్భాష్యం ఇంకా పూర్తికాలేదు. ప్రతి ఓరియంటల్ కాన్ఫరెన్స్ నాప్రాణం. ఈసారి వెళ్ళలేకపోయాను. వ్యాసం మాత్రం పంపాను" అన్నారు వారు ఆవేదనతో.

నిజమే. హర్కారేవారిది అపూర్వవ్యక్తిత్వం. సజాతీయ, విజాతీయ సంస్కృతులను జీర్ణించుకొని, పాండిత్యంతో పరిణతిపొంది, సాహిత్యంలోను, న్యాయాధీశుడుగా అసిధారావ్రతంతో మెలిగే వారి వంటివారు మననాడులో అరుదు. వారి విజ్ఞానభండారం వ్యర్థం కాకూడదు. వారి వ్యాసాలు, గ్రంథాలు పెక్కు సంపుటాలవుతాయి. వాటిలో కనీసం నిరుక్తం ఆంధ్రానువాదం, మస్నవీషరీఫ్ సంస్కృతీకరణం; ఆంగ్లరచనల అనువాదాలనైనా సాహిత్య అకాడెమీవంటి సంస్థలు ప్రచురించి పుణ్యం కట్టుకోవాలి. ఈ విషయంలో విద్యారణ్యంలో హర్యక్షులవంటి హర్కారేవారి సహకారమూ కూడ గట్టుకోవాలి.

శ్రీ గుర్రం జాషువా

వినుకొండలో జన్మించిన శ్రీ గుర్రం జాషువాగారి సమున్నతోదార గంభీర విగ్రహం విష్ణుకుండినుల అకుంఠిత ధర్మనిష్ఠ, వారి నిరుపమాన నిర్మాణనైపుణి తొణికిసలాడుతూ రూపుకట్టినట్టు పొడగట్టుతుంది. అయితే, విష్ణుకుండినులది మతావేశం. గుర్రంవారు విశ్వమానవ మాతాభినివేశంతో కరుణరసం కలబోసి భారతమాతకు కల్పనానల్ప కవితామందిరాలు నెలకొల్పారు. వారి భారతమాత హిమమేరు కిరీట, త్రిసముద్ర రశనకాదు. జగన్మాత. విష్ణుకుండినులది పురాణ కథలకు మారురూపు. గుర్రంవారు ప్రకృతి పరిశీలన పారవశ్యంతో అత్యంత మధురోహలను మేళవించి, సువిశాల విశ్వంలోని అనంత ఖండాలకు ప్రతిగా ఖండకావ్య కుసుమాలు, కావ్య కుసుమాలు పూయించి విరాట్స్వరూపుని ఆరాధించారు. విష్ణుకుండినుల శిల్పశైలి తర్వాతి వారికి ఒరవడి అయింది. నవకవి చక్రవర్తుల శైలి తర్వాతి పలువురికి రాజపథమయింది.

ఏది కవిత్వమనే గోదాలో బయలుదేరిన మల్లయుద్ధం శతాబ్దాలు గడచినా అమీ తుమీ తేలక, ప్రబంధ సంబంధ నిబంధనల సాముగరిడీల కాకలుదీరి కరుడుగట్టిన వృద్ధమల్లులొక మూల, ఛందోబందోబస్తులను ఫెళఫెళార్భటులతో తెంచివేసిన కుర్ర కైసరిజెట్టి లొకవంక తొడలు చరచి, ఒడలు విరుస్తూంటే, వారో, వీరో— కొనకు గోదాలో నిలిచినవారితో జట్టి పెట్టుకొనడానికో, చెట్టాపట్టాల్ కట్టడానికో మిడిమల్లులు మరొకవంక ఉసిగుల్పి కసి పెంచుతుండగా, కుర్రజెట్టిల ఒడుపులను, వృద్ధమల్లుల మలుపులను, వారి సులువులను. వీరి బలువులను ఆకళించుకొన్నారు గుర్రంవారు.

నేడు చెల్లుబడిలో ఉన్న నుడికారంపై వారిది అద్వితీయమైన అధికారం. ప్రాచీన సంప్రదాయానికి వారితో సంపూర్ణ సహకారం. సమసామయిక విషయాలతో కొత్త సమయాలు కల్పించుకొని, జాతీయాలు సృష్టించుకున్నారు. కనుకనే, వారు సూర్య సూనుడు కర్ణుడుగాని, సూర్యుని చూచి కబోది అయ్యే గబ్బిలాన్నిగాని, రేణుక చరితనుగాని; రేడియోచేడియ చలిదిపాటనుగాని, లవణాన్నిగాని, లైకానుగాని, శారదసుగాని, శ్మశానాన్నిగాని—దేనినిగాని పొదిగిన ప్రతి మాట మన మనస్సున హత్తుకు పోతుంది. మరణంలేని మానవత్వాన్ని కామించే కవితావీణను వ్యథిత హృదయంతో మీటుతారు. అవును ఘోరవ్యథ మనస్సును పగలగొడితే ఆ వెనక ఉన్న నిజం దానం తట అదే బయటపడుతుంది, చాల పదునుగా దూసుకుని వస్తుంది. అప్పుడే అది ప్రతిభ అవుతుంది.

కాదూ, మరిఁ గుర్రంవారు జన్మించిన నాటి (1895 అక్టోబరు 28) కాలం ఎలాటిదిఁ కులమత కర్కశక్రకచకరాళదంష్ట్రిలు కరకరలాడుతున్న కాలం. వారి జనకులు శ్రీ వీరయ్యగారు, మాతృదేవి శ్రీమతి లింగమ్మగారు వారి భవిష్యత్తును తీర్చి దిద్దడానికి ఎంత ప్రోదిచేసినా, ప్రకృతే వారికి ప్రధానాచార్య అయింది. కనుకనే వారి పద్యగుచ్ఛాలలో ఆ పారిజాత పరిమళాలు.

"దొరల రాచరికమె మెరుగయ్యె ననిపించె మారుపల్కవేల మంతిరన్నఁ"

అని గద్దించగల ఆ ధైర్య సాహసాలు; తాము పదాలకు ప్రాణంపోసి నడపగలిగినా, ద్వారంవారి వ్రేళ్ళలో ఏ వరముందో అంటూ,

"చెవులు బట్టి పిండి శిక్షించి జడమైన కట్టెకెట్లు విద్య గరపినాడొఁ"

అని సహజసుందరంగా చోద్యాలుపోయే ఆ గడుసుతనాలు; వైరస్యం కలిగించే వైరి రసాలను

"కలవా రిచ్చిన పట్టువస్త్రములతో
గన్పట్టు నన్ జూచి శ్రీ
గలవా డీత డటంచు నల్వురన నా
కర్ణించి నాకన్న కొ

డుక్కులు, జుట్టాలును డబ్బులేదనిన సం
కోచింతు రీనాటి క
న్యుల మాటేల? ప్రచారమందు ఋతమున్
శుద్ధాన్నతంబయ్యెడిన్"

అంటూ, సర్కస్ రింగ్‌మాస్టర్ పులి, మేకవంటి సహజవైరులను కలిపి నడిపినట్టు ఏకధాటిగా నడిపే రసప్రస్తానాచార్యుల ఆ రాజసచాకచక్యాలూను.

గుర్రంవారు ఉన్నత పాఠశాల చదువు పూర్తయిన పిదప 1919 నుంచి తొమ్మిదేండ్లపాటు గుంటూరు ప్రెయినింగుస్కూలులో కొలువుచేసినా, తర్వాత ఉభయ భాషాప్రవీణులై పదిహేనేళ్లు గుంటూరు జిల్లాబోర్డు పాఠశాలలో తెలుగు పండితులయినా, పిదప మూడేళ్లు యుద్ధప్రచారకోపన్యాసకులయినా, అనంతరం కొన్నేళ్ళు రేడియోలో ప్రొడ్యూసర్ పదవి నిర్వహించినా, పదపడి నౌకరీలు చాలించుకున్నా "చిన్నప్పుడే పెండ్లాడిన" కవితను మాత్రం వదలక ఫిర్‌దౌసి, గబ్బిలము, స్వప్న కథ, కాందిశీకుడు, ముంతాజ్ మహల్; నేతాజీ, స్వయంవరము, అనసూయ, క్రీస్తు చరిత్ర, శివాజీ చరిత్ర మొదలయిన కావ్యాలు (ఆరు సంపుటాల) ఖండకావ్యాలు, వీరాబాయి, తెరచాటు మొదలయిన నాటకాలు; నా కథ (తమ కథ) రచించారు. ఆ చిన్ననాటి చెలి వారికి గండపెండెరం తొడిగించి, ఏనుగెక్కించి, కనకాభిషేకము చేయించి వారిని వదలక, కీర్తిని దిగంతాలకు వెళ్ళగొట్టింది.

ప్రస్తుతం వారు గుంటూరు అరండల్‌పేటలో గోపాలకృష్ణయ్యతోట ప్రాంతంలో "మతముల్ వర్ణము లడ్డుగోడలయి ప్రేమన్ రాక్షసత్వంబుతో హతమార్పం బ్రయత్నించే" ఈ కాలంలోనూ సాహిత్యాభిమానులు కట్టించి ఇచ్చిన గృహములో కాపుర మున్నారు. ఆ సాహిత్య ప్రేమికులే

"పక్కా ఖద్దరు శాలువల్, బిరుదముల్,
పద్య ప్రశంసావళుల్,
నక్కీదండలు దక్క నక్కరలకున్
ద్రవ్యంబు లే కుల్లమున్
ముక్కల్ సేయు విచార భారమున
నప్పుల్ చేసి జీవించు..."

వారి చిక్కులు తీర్చారు. లేకపోతే "కవిత్వ మేమిటికి కూటికి గుడ్డకు రాదురాకవీ!" అని ఇంకా ఎంత మథనపడేవారో!

ఇంతయినా వారు, కావ్యాలలోనేకాక జీవితంలోనూ నిండుగా నవ్వగల దండి గుండెగలవారు. హాస్య సంభాషణలంటే వారికి చాల ఇష్టం. హాస్యమంత చింతాపనోదనం మరొకటి లేదని వారు తరచు అంటుంటారు.

"నవ్వును జంతువుల్, నరుడు
నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్
దివ్వెలు, కొన్ని నవ్వు లెటు
తేలవు, కొన్ని విషప్రయుక్తముల్,
పువ్వులవోలె ప్రేమరస
మున్ వెలిగ్రక్కు విశుద్ధమైన లే
నవ్వులు సర్వదుఃఖ దమ
నంబులు వ్యాధులకున్ మహౌషధుల్"
అని రకరకాల నవ్వులను వింగడించారు వారు ఒకప్పుడు.

గుర్రంవారు తెల్లవారుజాము నాలుగు గంటలకే లేచి, కాల్యకృత్యాలు తీర్చుకొని, వాహ్యాళికి బయలుదేరుతారు. తర్వాత ఒకమారు బజారుకు వెళ్ళిరావడం మామూలు. తొమ్మిదిన్నరకు భోజనంచేసి, కొంచెంసేపు విశ్రమించి, పద్యాలు వ్రాసుకుంటారు. ఎవరన్నా వస్తే, మధ్యాహ్నం మాట్లాడుతారు. సాయంకాలం ఎక్కడికీ వెళ్ళరు.

కుక్కలను, పక్షులను పెంచడం వారి సరదా. వేట వారి అభిమానవినోదం. పద్యాలువ్రాసుకోడం, మిత్రులతో ముచ్చటలు వారి అభిమానవిషయాలు. రాజకీయాలు వారికి సుతరామూ గిట్టవు. రాజకీయాలను వెన్నాడుతుంటాయి కులమతాల నీడలు.

గుర్రంవారు ఒకమారు వర్ధాకు గాంధీజీ దర్శనంకోసం వెళ్లారు. అక్కడున్న ఒక జర్మన్ పండితునికి ఒక రాజకీయ నాయకుడు వారిని "దిస్ ఈజ్ ఎ క్రిస్టియన్ పొయట్" అని పరిచయం చేశారట. ఆ విదేశ పండితుడు ఆశ్చర్యపడి ఆ నాయకుని వైపు చూశాడట. కవితకు కులమతాలు అంటగట్టడం ఎలాటి సభ్యతో అర్థంకావడం లేదంటారు గుర్రంవారు. ఇలాటి కట్టుబాట్లు, పట్టింపులు పటాపంచలు చేయటానికే వారు శ్రీ గోరా (గోపరాజు రామచంద్రరావు) గారితో వియ్యమందారు.

"విశ్వమానవ సౌభ్రాత్రం, నిర్మతనిర్జాతి సంఘం నా ఆదర్శం. ఒక జాతికి ఒక మతానికి చెందిన కవిత్వాలు మంచివి కావు. అవి కవిత్వాలేకావు. అలాటివి వీలునామా కవిత్వాలు అంటాను. నా భావం సామాన్యులకు అందివ్వడానికే ప్రయత్నించాను. గహనసంచారంలేని కవిత్వం నా లక్ష్యం" అని స్పష్టపరిచారు వారు.

ప్రాచీన కవితా సంప్రదాయాలు వారికి కరతలామలకమయినా, నేడవి నాటు సరుకని వారి నమ్మకం. "చమత్కారం, అలంకారాలు పూర్వం ఉపయోగపడ్డాయి. ఇప్పుడు కవి సమయాలపట్ల హృదయపరివర్తనం జరుగదని నా విశ్వాసం" అంటారు వారు; కనుకనే విశిష్టమార్గం తొక్కారు తమ రచనలలో.

"ఎక్కువ మందికి మంచిదీ, అనుకూలమయినదీ సభ్యత, బహుజనామోదం పొందినదీ సభ్యత. ఈ దృష్టితోను, వయస్సునుబట్టి, పరిస్థితినిబట్టి, మానవ మనఃపరిణామాన్నిబట్టి నా మనస్సు మారింది. రాష్ట్రీయతే సముచితమని తోచింది." అందువల్లనే వారి రచన లన్నిటికీ పసిడిమెరుగు జాతీయత.

"గబ్బిలం శాశ్వతంగా ఉంటుందని నా నమ్మకం" అన్నారు వారు. గబ్బిలం కావ్యం తాను చేసుకొన్న పాపకారణ మేమిటో తనకే తెలియని ఒక అభాగ్యుని అశ్రువుల గాధ దానిలో అతని బాష్పసందేశం ప్రధానం; దేశవర్ణన గౌణం, అనుషంగికం, పరమనికృష్టాంధకారం నుంచి హిమధవళ కైలాసోన్నతులలో నివసించే పరమశివుని వరకూ పాకినగాధ అది. కవి కరుణాహృదయం కుమ్మరించిన కధ అది. దానిపై వారికి ప్రత్యేకాదరం ఉండడం సహజమే.

కాని, గిజిగాడు గూడు అల్లుతున్నంతకాలం, సాలీడు వల వేస్తున్నంతకాలం, నెలబాలుడు వెన్నెలలు విరజిమ్ముతున్నంతకాలం, ముక్తక ముక్తాఫలాల నీరు నిగనిగలాడుతున్నంత కాలం గుర్రంవారి ప్రతి పద్యమూ వెలుగుతుంది, ప్రతి పదమూ మిగులుతుంది,

*

శ్రీ ఘులాం జిలానీ

మొన్నటి మార్చినెల నాల్గవ వారం సాలర్ జంగ్ మ్యూజియంలో లలితకళా ప్రదర్శనం జరిగింది. ఒక శిల్పం ముందు జనం మూగారు. అది ఒక సామాన్య మానవుడు.-అచ్చం-తెలుగువాడు-విజయోత్సాహంతో మద్దెల వాయిస్తున్నట్టున్న శిల్పం; మెరుగులు, జిలుగులు లేక కేవలం సమానాభి, నివేశం, విజయోత్సాహం ముద్దకట్టి నట్టున్న శిల్పం. ప్రస్తుతం సమర సమయమేమో, ప్రేక్షకులను మరింతగా ఆకర్షించింది ఆ శిల్పం పేరు 'విజయగీతి' (సాంగ్ ఆఫ్ విక్టరీ).దానిని నిర్మించిన శ్రీ ఘులాం జీలానిపై వాహ్వాలవర్షం కురిసింది; శబాషుల చూపులు మెరిశాయి.

కాని ఇరవై యేళ్ళనాడు మాత్రం ఒక వర్గం ప్రజలు జీలానీ వారిపై విరుచుకు పడ్డారు. వారు చేసిన శిల్పాన్ని తుత్తినియలు చేయడానికికూడా ముందుకు దూకారు. ఆ ప్రజలకు అంతటి కోపకారణమైన శిల్పం "బక్రీద్ పుట్టుక". వారికి విగ్రహారాధన గిట్టదు. విగ్రహ నిర్మాణం అసలే గిట్టదు. అందులోనూ తమ మతంలో అతి పవిత్ర మైన త్యాగస్వరూపమైన బక్రీద్-పండుగకు రూపకల్పన చేయడమా? వారు మహో గ్రులయారు. ఇబ్రాహీం భక్తిని పరీక్షించగోరి సకల లోకవంద్యుడు-అల్లా అతాలా-ఆయన తన కుమారుణ్ణే బలిగా సమర్పించబోగా, ప్రసన్నుడై బలిపశువును దివినుంచి స్వయంగా తెచ్చి ఇస్తున్నట్టు నిర్మించిన ఆ నిలువెత్తు సుందర శిల్పం; భక్తిశ్రద్ధలకు పరిశ్రమ నైపుణులకు పరాకాష్ట అయిన ఆ శిల్పం క్షణంలో ముక్కలయ్యేదే! కళాభిమానుల కరుణతో, మన భాగ్య విశేషంతో మనకు దక్కింది. జిలానీ వారు మతావేశానికి అతీతులు. మనస్సును వికసింపచేసే ప్రతిదీ వారికి మతసదృశమే. ఆత్మోన్నతి కలిగించి మానవత్వాన్ని ముందుకుతీసుకొనిపోయే ప్రతిదీ వారికి మతమే. "మజ హబ్ నహీ సిఖాతా ఆపస్ మే బైర రఖనా" అన్న ఇక్బాల్ సూక్తి వారిజీవితంలో అనుక్షణం పునశ్చరితమౌతూ ఉంటుంది. వారి తండ్రి అబ్దుల్ రహీంగారు హైద్రాబాద్‌లో బట్టల వర్తకం చేసేవారు. జీలానీవారు 1919 లో హైదరాబాద్‌లో జన్మించారు. చిన్ననాటి నుండి వారికి చిత్రాలన్నా, శిల్పాలన్నా అభిరుచి హెచ్చు. తలుపులమీద చెక్కడపు బొమ్మలను, ద్వారబంధాలమీది లతాదులను అనుకరిస్తూ చిత్రాలు గీచేవారు. చెక్కడం-కూడా చేసేవారు. తెలంగాణా ప్రజల వేషభాషలు పరిశీలించే గుణమూ అలవడింది. దీనికితోడు గుల్బార్గాజిల్లా యాదగిరిలో వ్యాపారం చేస్తున్న అన్నగారివద్ద ఉంటూ చదుకోవడంచేత కన్నడ మహారాష్ట్ర పౌరుల వేషభూషాదులు పరిశీలించే అవకాశమూ కలిగింది. వారు యాదగిరిలో మెట్రిక్యులేషన్ అయి డ్రాయింగ్‌లో ఎలమెంటరీగ్రేడ్ పరీక్షల నెగ్గారు. వారి అన్నగారు సరసహృదయులు." ఇదేమిటి అని ఈసండించ కుండా వారి లలిత కళాభిరుచికి దోహదం చేసారు.

ఆ సమయంలోనే జిలానీవారు పూర్తిగా అభిరుచులను ఫలింపజేసుకొనే సదవ కాశం కలిగింది. అన్నగారు వ్యాపారంకోసం బొంబాయిలో స్థిరపడటం తటస్థించింది. అన్నగారితోపాటే వారూ బొంబాయికి వెళ్ళి, జెంషెడ్‌జీ జీజీబాయి స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఆఖరు సంవత్సరములో చేరి 1935 లో వర్ణచిత్ర లేఖనంలో డిప్లొమా పొందారు. అంత చిన్న వయసులో ఆ డిప్లోమా పొందినవారిలో వీరే ప్రథములు. తరువాత శిల్పంలో ఐదు సంవత్సరాలు శిక్షణపొంది డిప్లోమా సంపాదించారు.1940లో హైద్రాబాద్‌లోని లలితకళా పాఠశాలలో (కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో) శిల్పశాఖాధ్య క్షులుగా నియమితులయ్యారు. నేటివరకు ఆ పదవిని నిర్వహిస్తూ ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రభుత్వం జిలానీ వారిని శిల్పంలో ఉన్నత శిక్షణకోసం లండన్‌కు పంపింది. అక్కడ వారు మూడుసంవత్సరాలపాటు వివిధ లలిత కళాశాలల్లో తర్ఫీదుపొంది ఎన్.డి.డి.ఎన్. (నేషనల్ డిప్లోమా ఆఫ్ డిజైన్స్ అండ్

స్కల్ప్చర్) పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు కాంస్య విగ్రహాలపోత సున్నితమైన శిలలు చెక్కడం నేర్చుకున్నారు. స్వదేశానికి తిరిగి వచ్చేముందు చిత్ర శిల్పప్రదర్శనం జరిపారు. ప్రముఖుల ప్రశంసలు పొందారు. సుప్రసిద్ధ ఆంగ్లశిల్పి హెన్రీమూర్ వారిని ఇంటికి ఆహ్వానించి వారి శిల్పాలను భారతీయ శిల్పాలను, వాస్తవిక శిల్పాలను అభినందించారు. శిల్పం నేర్చుకోడానికి వెళ్ళిన జీలానీ వారు భారతదేశానికి తెచ్చిన కీర్తికి భారత ప్రభుత్వం చాలా సంతోషించింది. 1954 లో అత్యున్నత శిల్పశిక్షణకోసం యుగోస్లావియాకు పంపింది. వారు అక్కడికివెళ్ళి ఆర్ట్ అకాడమీ ఆఫ్ జాగ్రెబ్‌లో చేరి రకరకాల శిల్పాలు నేర్చారు డిప్లొమా పొందారు. నాలుగు సంవత్సరాల శిక్షణను వారు ఒకే సంవత్సరములో పొందారు. ఇలాటిది యుగోస్లావియాలోనే తొలిసారి జరిగిందని ఆ ప్రభుత్వం పేర్కొన్నది. జాగ్రెబ్‌లో వారు పింగాణీ పోత, అల్యూమినియం పోత, కుడ్యచిత్రాలలో నూతన పద్ధతి మొదలయినవి నేర్చుకొన్నారు, లండన్‌లో ఉన్నప్పుడు మృణ్మయవస్తువులు, శిల్పాలు చేయడం తెలుసుకున్నారు.

వారు జాగ్రెబ్‌లో, 1955 లో తమ శిల్పచిత్ర ప్రదర్శనం జరిపారు. వాటిలో ఎన్నో అమ్ముడుపోయాయి. పలువురు కళాభిమానులు ఆర్ట్ గ్యాలరీలవారు కొన్నారు. వందలాదిగా ప్రశంసావర్షం కురిపించారు. వారి అపూర్వకళా నైపుణిని భారతీయత తొణికిసలాడే వారి కళాఖండాలను చూచి ముగ్ధుడైన ఒక కళాభిమాని "వైటు ఇమి జేట్ యూరప్ వెన్ ఇండియా ఈవెల్తియర్" అని ప్రశ్నించాడు. భారతీయులు నేడు చేస్తున్న పరానుకరణ ఆ విమర్శకునికి కష్టమనిపించింది. జాగ్రెబ్‌లో వారి కీర్తిని విస్తృతం చేసిన శిల్పాలు ధ్యానమగ్న మాయ మొదలయినవి. భక్తి ఆస్తికత ఉట్టి పడే ధ్యానమగ్న భారతీయ భావనకే శిల్పదీపిక అని పలువురు ప్రశంసించారు. నిజంగా అది తత్ప్రశంసార్హమైనదే. యుగోస్లావియా అధ్యక్షుడు మార్షల్ టిటో హైద్రాబాద్‌కు ఏ తెంచినపుడు జిలానీవారు యుగోస్లావ్ భాషలో కుశలప్రశ్నలు వేసి 'మాయా' శిల్పం బహుకరించగా ఆయన అశ్చర్యపడ్డాడు. మాయ అజంతా చిత్రాలలోని మాయాదేవి చిత్రానికి శిల్పానుకృతి. వారు విదేశాలలో సంపాదించిన అనుభవాన్ని విద్యార్థులకు ధారపోయడానికి ఎంతో తహతహ పడుతూ ఉంటారు. ప్రస్తుతం వారి శిల్పశాఖలో 15 మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ఇద్దరు మూగవారు కావడం విశేషం. ఈ దైవోపహతులలో ఒక్కడు జిస్టిస్ శ్రీ మనోహర్ ప్రసాద్ కుమారుడు శ్రీ ధన్‌రాజ్ ప్రసాద్. రెండవవాడు ఆడిటర్ శ్రీ సయ్యద్ ఘులాం దస్తగిర్ కుమారుడు సయ్యద్ సిరాజ్. ఈ మూగవారికి శిల్పంవంటి లలిత కళను వివరించడంలో వారి ఓరిమిని ప్రశంసించక తప్పదు.

జన్మతః విద్యలు వస్తాయనే మాటలో నాకు నమ్మకంలేదు మానవుడు శ్రద్ధా సక్తులు చూపినచో ఎంతో సాధించవచ్చు— పరిసరాల సహకారంతో పాటు- అని నమ్మేవాణ్ణినేను. కాని జీలానివారి వంటి మేధావులను చూచినపుడు నా నమ్మకం కొంచెం సడలుతుంది. వారు పరంగిసుద్దతో శిల్పం తీర్చుతున్నా, శిలను మలుస్తున్నా

కర్రను చెక్కుతున్నా, కంచు పోతపోస్తున్నా, పింగాణి ద్రవాన్ని రంగరిస్తున్నా కనిపించే అంగుళీ విన్యాసం, హస్తలాఘవం, ఆపాదమస్తకం విద్యుత్తులాగ పారే చురుకుదనం అపూర్వాలు. వారు శిల్పంకోసమే జన్మించారనిపిస్తుంది.

హైదరాబాదులో ఇటీవల స్థాపించిన రాజబహదూర్ కాంస్యవిగ్రహాన్ని వీరు మువ్వైనాళ్ళలో పోతపోసి ఇచ్చారు. ఆ నేర్పుతోనే వారు మౌలానా ఆజాద్ విగ్రహం నిర్మించారు. దానిని ప్రధాని శ్రీనెహ్రూ చూచి వాస్తవమనిభావించి దిగ్భ్రాంతులయ్యారు. "ఏది మీకు నచ్చిన శిల్పం మీ శిల్పాలలో?" అని అడగండి. "అన్ని శిల్పాలు నాకు మంచివే. అన్నిటిలోనూ నా హృదయం పెట్టాను. తండ్రికి అందరు పిల్లలూ ఇష్టమైనట్టు నావన్నీ నాకు ఇష్టమే" అంటారు వారు. వారు చాలా నిరాడంబరులు. పొగైనా త్రాగరు. వారి ఇల్లొక చిన్న శిల్పప్రదర్శనశాల. నయనానందకరం. దానికితోడు వారి ఆదరసత్కారాలు మరింత ఆనందం కలిగిస్తాయి, వారు ఉదయం ఐదు గంటలకే లేచి నిత్యకృత్యాలు తీర్చుకొని నమాజు పఠించి మూడు నాలుగు గంటలపాటు శిల్పచిత్ర రచనలో నిమగ్నులవుతారు. తరువాత కళాశాల మొదలయినవి. ఎపుడైన టేబిల్ టెన్నీసు ఆడుతారు. "శిల్పం, చిత్రాలు మాత్రమే నా వినోదాలు" అంటారు వారు. ఇలాటి మాటలు వారుతప్ప ఇంకెవరు అనగలరు.

"మాలలిత కళాశాలలోని శిల్పశాఖను ఆధునికంగా ఏర్పాటుచేశాను. విదేశాల శిల్పశాఖలతో పోల్చదగినట్టు చేస్తున్నారు. మా ప్రిన్సిపాల్‌గారు శిల్పశాఖను ఇంకా ఎంతో అభివృద్ధిపరచడానికి వాగ్దానంచేశారు.

ఎన్నో విషయాలు శిల్పంలో ఎక్స్‌పరిమెంట్ చేయదలిచాను నా కోసం ప్రభుత్వం ఎనభైవేల రూపాయలు ఖర్చుపెట్టింది. నన్నుబాగా వినియోగించుకోవాలి గదా? నేను ఎప్పటికప్పుడు వస్తున్న కొత్తపోకడలను నేర్చుకోడానికి యత్నిస్తున్నాను" అన్నారు వారు. ఈ జిజ్ఞాసతోనే వారు లండన్ విశ్వవిద్యాలయానికి చెందిన రాయల్‌కాలేజ్ ఆఫ్‌అర్ట్స్‌కు, కాలిఫోర్నియా కళాశాఖకు దరఖాస్తులు పెట్టుకొన్నారు. మీరు చాలా గొప్పవారు. ఇక్కడ మీకు మేము నేర్పేదేమిలేదు. అని సమాధానాలొచ్చాయట. మీ పిల్లలకు కళాభిరుచి ఉందా? అని ప్రశ్నిస్తే (వారికి ముగ్గురు కుమారులు ఒక కుమార్తె. కాలేజీలో చదివే పెద్దకుమారుడు, హైస్కూలులో చదివే రెండవ కుమారుడు సంస్కృతము ఐచ్ఛికభాషగా తీసుకున్నారు.) బాగా అడుగుతున్నారే? వారికి అభిరుచిఉంది. అన్నారువారు.

సహస్రాబ్దాలుగా శిల్పలక్ష్మికి విలాసభూమి అయిన తెలుగునాడు ఈ మహాశిల్పి నైపుణ్యాన్ని వినియోగించుకోవాలి. తగిన ప్రోత్సాహమివ్వాలి. నాడు నాటికి వెలుస్తున్న కొత్త శిల్పరీతులలో ఆంధ్రావళి వెనుక బడలేదని నిరూపించుకోవాలి.

శ్రీ తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రి

వారు వివిధశాస్త్ర పారావారాలను చుళుకించిన విద్వద్వ్రతంసులు. ప్రాచ్య పాశ్చాత్య రామణీయక వాదాలసారం చూచిన విమర్శకులు. అనేకానేక భాషల సాహిత్యోద్యానాలలో మూలమూలల విహరించి, బహువిధ రచనా కుసుమాలను ఆస్వాదించిన రసలోలుపులు. కొత్త ఫణితులు చూచి బిత్తరచూపులతో కుంచించుకొనిపోని ధీరులు. నవకవికుమారులు కంటబడగనే అసహనంతో, అసహ్యంతో రంధ్రాన్వేషణ చేయక, వికటంగా నవ్వక, వెన్నుతట్టి సానుభూతితో సమూహ్యాదించే సరసోదారులు.

కనుకనే వారు ఆనాడు నవకవితాశాఖకే ఆలవాలమయారు, నైకవిధ నూతన ప్రక్రియలతో అఖండధారగా రచనలు కురిపించి, నూతన కవి విమర్శక పండిత కోటికి మహావటవృక్షమయారు. తర్కకర్కశపండిత పుండరీకుల ధాటికి ఆగలేని కవికుమారులకు శ్రీరామరక్ష అయారు. వేనకువేలు నవ్యకావ్యరత్నాలను వెలకట్టి సహృదయ విపణికి వెదజల్లిన రత్న పరీక్షకులయారు. ఆనాటి భావకవి సదస్సులకు సభాపతి అయారు. వారు శ్రీ తల్లావఝ్ఝుల శివశంకరస్వాములవారని ఎవరూ తెలుపకనే అందరికీ తెలిసిపోతుంది.

తల్లావఝ్ఝులవారి జన్మస్థానం గుంటూరు జిల్లా, మంగళగిరి తాలూకా, కాజ గ్రామం. జననం 1892 లో. వారిది శ్రీకృష్ణలీలా తరంగిణి పాడిన శివనారాయణ తీర్థులవంటివారు అవతరించిన వంశం, సంగీత సాహిత్యాలకు పేరుగన్న వంశం. వారి

జనకులు కృష్ణశాస్త్రిగారు సంపన్నులు మంచి వ్యుత్పన్నులాను. తల్లావజ్ఝులవారు ఆధునిక సాహితికి ఆచార్యపీఠం వహించ వలసిఉండగా బడిచదువులకై ఆసక్తి ఎందు కుంటుండి? మెట్రిక్యులేషన్‌తో బడిచదువు ముగించి, పలువురు మహాపండితులవద్ద న్యాయవ్యాకరణ వేదాంతాలు సాంప్రదాయికంగా అభ్యసించారు. వివిధ భాషలు నేర్చారు. ఆంగ్లం మధించారు. పాశ్చాత్య భాషలన్నిటికీ మూలకందమయిన లాటిన్ నేర్చారు. గ్రీక్, ఇటాలియన్, ఫ్రెంచ్, జర్మన్ భాషాసాహిత్యాలలో మజ్జనమాడారు. ఇక భారతీయభాషలా? సంస్కృత ప్రాకృతాలను పుక్కిటబట్టినవారు గనుక హిందీ, మరాఠీ, బెంగాలీ, కన్నడాది భాషలను అతి సులభంగా నేర్చారు. దక్షిణాపథ భాష లలో వారికి కన్నడం చాల ఇష్టం.

శరీర వ్యాయామం, వ్యవసాయం, ఉద్యానకళ వారికి చాల ఇష్టమైనవి. చిన్న నాడు గొలుసులు, ఇనపతీగలు తెంపేవారు. ఒక పంజాబీ వస్తాదునుచూచి, సర్వే రాళ్ళను చేత్తో పగులగొట్టి చూపారట. ఈతలో, గుర్రపు సవారిలో అఖండులు. గుర్రంమీదినుంచి ఎన్నోసార్లు పడ్డారు. ఇక ఆటలలో క్రికెట్, టెన్నిస్, బేస్‌బాల్ అంటే మహాప్రీతి.

వారి దృష్టి సౌందర్యాపేక్షిణి గనుక చిత్రకళపైనా ప్రసరించింది. నీటిరంగుల చిత్రాలు పెక్కుగీశారు. అజంతా చిత్రాలెన్నో నకలుచేశారు. 1916లో బొంబాయిలో శిల్పంనేర్చుకున్నారు. 1924లో బందరు జాతీయ కళాశాలలో ప్రమోదకుమార్ ఛటర్జీ వద్ద కళ అభ్యసించదలచారు కాని, కుదరలేదు. అయినా నేటికీ, వారికి నీటిరంగు చిత్రాలు చేయగలననే నమ్మకం ఉంది.

వారు పన్నెండవ ఏటనే కవితకు శ్రీకారంచుట్టినా, అచ్చయిన మొట్టమొదటి రచన "జీవనప్రభాతం"అనే వంగ నవల అనువాదం. 1913 లో. 1915 లో మొదటి మౌళిక రచన 'గాదె' అన్నకథ. అప్పటినుంచి పుంఖాను పుంఖంగా హృదయేశ్వరి, పద్మావతీ చరణచారణ చక్రవర్తి, రాజజామాత, నోణకభార్య, వరపరీక్ష, వకుళమాల, దీక్షితమహిత, రత్నాకరము, ఆవేదన, కవిప్రియ, మహారాష్ట్ర జీవనప్రభాతం, జీవన సంధ్య-మొదలయిన పద్య, గీతినాటికలు, కావ్యాలు, నవలలు వ్రాశారు. 1952 లో షష్టిపూర్తి సందర్భంలో వారి కావ్యాలుకొన్ని రెండు సంపుటాలుగా పునర్ముద్రితాలు.

వారు జాతీయోద్యమ సమయంలో కేవలం సేవాభావంతో తెనాలి జాతీయ కళా శాల మొదలయిన సంస్థలలో ఏడెనిమిది సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఉప్పు సత్యాగ్రహంలోను, తర్వాతను రెండుమార్లు, కారాగారక్లేశం అనుభవించారు, గుంటూరుజిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పదవిని రెండుమార్లు, రాష్ట్రకాంగ్రెస్ సంఘ సభ్య త్వాన్ని కొంతకాలం నిర్వహించారు. పెక్కు గ్రంథమాలలు, పత్రికలు నడిపారు. సభాపతిగా, వ్యక్తిగా నేర్పు అలవరచుకున్నారు. ఎంతచెప్పాలి, ఎంతవరకు చెప్పాలి అనే విషయం వారికి వెన్నతో పెట్టినవిద్య. విమర్శలో మార్దవం, సంయమం అవసర

మన్న సంగతి వారికి తెలిసినట్టు చాలమందికి తెలియదు. ఊరూరూ తిరిగి, తామే సభాపతిత్వం వహించి, నవకవుల రచనలనుదిద్ది, చదివించి, ఆ ప్రేక్షకులను ప్రాచ్యపాశ్చాత్యాలంకారికుల వాక్యోదాహృతితో పారదోలి, నవ్యసాహితీ క్షేత్రయాత్ర సాగించారు. వెక్కిచోట్ల కవితా పట్టాభిషిక్తులయారు.

నిరుడే వారి సప్తతిపూర్తి వైభవోపేతంగా జరిగింది. ప్రస్తుతం వారు ఒంగోలులో కుమారుడు శ్రీ కృత్తివాస తీర్థులుగారితో ఉంటున్నారు. చిన్ననాడు శరీర వ్యాయామం, యోగాభ్యాసం చేసిన వారేమో నేటికి జెట్టిగానే కనిపిస్తారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత ప్రాయటం, చదవటం వారి అలవాటు. పదకొండు గంటలలోగా భిక్ష (భోజనం) ముగించుకుని, రెండు గంటలపాటు పడుకొని, తర్వాత ఉత్తరాలు ప్రాస్తారు. ఏరోజు ఉత్తరాలకు ఆరోజే సమాధానం తంచన్‌గా వెళ్ళవలసిందే. సాయంకాలం ఏ పార్కులోనో కూర్చుని విద్వాంసులతో కాలక్షేపం చేస్తారు. రాత్రి పొద్దుపోయేదాకా చదువుకుంటారు. ఊరికే ఉన్నప్పుడు జపయోగం ఏకాంతవాసం ఇష్టం. పూర్వులు తొమ్మిదితరాలనుంచి యతీశ్వరులు. పారమార్థిక దృష్టి ఉన్నదిగనుక. ప్రపంచస్థితి తెలియటంవల్ల వారు సన్యసించారు. ఇటీవలనే పిల్లలకోసం జాతకకథలు అనువదించి, రెండు సంపుటాలు ప్రకటించారు. లోగడ కథా సరిత్సాగరం అనువదించారు.

సంస్కృతంలో వచన గ్రంథం నవల లాంటిది ఒకటి, పద్యకావ్యమొకటి త్వరలోనే ఆరంభించదలచారు. "ఆంధ్రంలో వచన గ్రంథమొకటి. మహాకావ్యమొక్కటి (మహాకావ్యం అనటం తప్పు నేడు సుదీర్ఘకావ్యం), జీవితలక్ష్యం ప్రతిపాదించేది తలపెట్టాను. సిద్ధాంత ప్రకారం ప్రాయను. జీవితమే రేకులు విచ్చాలి". ఇదీ వారి వార్ధక్యలక్ష్యం.

ఇప్పటి అసంతృప్తి, అగమ్యగోచరత ఇక దశకంలో స్పష్టరేఖలు గోచరించి, తొలగి విశిష్టమార్గం తోచవచ్చునని వారి ఆశాభావం. "1914 నుంచి 1940 వరకు జాజ్వల్యమానమని నాకు తోస్తుంది. తర్వాత చెడిపోయిందని అనను. కాని, అప్పటి విద్యాప్రీతి, సహనం, గ్రహణధారణ పటుత్వం ఇప్పుడు నాకు కనబడటంలేదు" అని వారి ఆవేదన.

సక్రమమైన సంప్రదాయంలో, నవీనదృష్టితో, నూతన కల్పనలతో సాహిత్యం పెంపొందించటమే లక్ష్యంగా వారు జీవించారు, "మరీ విశృంఖలంగా ప్రవర్తించాలని నేనెవరికీ చెప్పలేదు. నూతనత్వం కావాలనే అన్నాను, అంటున్నాను. ఆంధ్రులలో నిగ్రహం కొంత తక్కువ కావటంచేత వివిధ మార్గాలలో ఇష్టం వచ్చినట్టు వెళ్ళారు. గమ్యం మనసులో ఉంచుకుని మధ్యమ మార్గంలో వెళ్ళడం సుఖమని, శ్రేయోదాయక మని నా అభిప్రాయం. ఇంగ్లండులో ఆధునిక కవులు అలెగ్జాండర్ పోప్, మాథ్యూ

ఆర్నాల్డ్ పద్ధతులకు వెళ్ళినట్టు మన రచయితలు కూడా మళ్ళీ ఉత్తమ ప్రాచీన దృక్పథం అలవరచుకుంటారనుకుంటాను" అంటారు వారు మరింత ఆశతో.

ఉత్తమ దృక్పథం, ఉత్తమసాహిత్యం అంటే వారి నిర్వచనమిది : "ఉత్తమ సాహిత్యం భావప్రపంచం ఉన్నంతవరకు పని చేస్తుంది. కాఠిన్యం తొలగించి ఆర్ద్ర భావం కలిగించి, ఒక విధమైన చిత్తశుద్ధిచేసి, ఉద్రేకాలు తగ్గిస్తుంది. ఏమైనా స్వానుభవంతో వచ్చిన సాహిత్యం మంచిది. అనుభూతి ముఖ్యం".

ఇంతటి మహాపండితులయినప్పటికీ తల్లావజ్ఝులవారు తామెప్పుడూ రచనలలో పాండిత్య ప్రకర్ష చూపలేదు. భాషావిషయంలో సరళత, విశేష జనాదరంగల పలుకుబడీ అనుసరించడం అవసరమని వారి అభిప్రాయం.

"పదాలు లోకధర్మి, శాస్త్రధర్మి అని రెండు విధాలు. లోకధర్మాన్నిబట్టి కొన్ని పదాలు ఉద్గీర్ణమవుతాయి. ఒక్కొక్క బుద్ధిమంతుని నోట ఒక్కొక్క శక్తివంతమయిన పదం బయలుదేరవచ్చు. వెరసి, కొంతకాలానికి సమర్థపదజాలం సిద్ధం కావచ్చు. కాకపోతే సంకేతాలు ఏర్పాటు చేసుకోవచ్చు" అనే ధైర్యం వారిది.

వారు తమ రచనలలో పాశ్చాత్య సంప్రదాయాలెన్నింటినో మధురంగా మేళవించినా, వారికి ప్రాచ్యవాసన పోలేదు. ఎలా పోతుంది ? అంతర్ముఖులయినవారినుంచే ఉత్తమ సాహిత్యం వెలువడుతుందంటారు. తపోబలంతో ఉత్తమసాహిత్యం కలుగాలనీ, 'పలికించెడివాడు రామభద్రుండట' అనే మోస్తరుగా వాక్కులు రావాలని వారు అంటారు. "జగత్తుకు ఉత్తమమార్గం చూపాలంటే, భారతీయ యోగమే ప్రధానం. సక్రమమార్గంలో (భంగు మొదలయిన మాదక ద్రవ్యాలు లేకుండా) పాతంజలయోగం అనుసరిస్తే, ఒడుదుడుకులు ఉండవు. అప్పుడు సమాధిచ్యుతి జరిగి, తైత్తిరీయం చివరిలోవలె. అప్రయత్నంగా ఒకవిధంగా అపౌరుషేయంగా ఉద్భాసించే తత్తమ సూక్తి మహాకావ్యత్వం; మంత్రత్వం పొందుతుంది. దానివలననే సంసార తరణం" అనివారి ఉద్బోధ.

వారికి భక్తి గీతాలంటే చాల ఇష్టం. భగవద్రామానుజుల వారి గద్యత్రయమంటే ప్రాణం. అది అన్నమయాదికోశాలు దాటి, ఉత్తమకోశంలోనుంచి, తన్మయత్వంనుంచి, అఖండ సంగీత దృష్టితో చెప్పినదని వారి భక్తి ప్రపత్తులు.

వారికి ఆధునిక భారతీయ కవులలో బేంద్రే అంటే మరీ ప్రీతి మనిషిమీదనూ చాల అభిమానం. "ఆయన మండోదరిని అనువదించవలసిందిగా బళ్లారి రాఘవ కోరారు. కాని నేను చేయటం పడలేదు." అని వారు చింత ప్రకటించారు.

ఇన్ని భాషలు నేర్చిన తల్లావజ్ఝులవారు "మనభాష కాక మరి రెండు భాషలు ప్రతివారికీ రావాలి" అనటంలో ఆశ్చర్యమేముంది ? సత్యాగ్రహాలు, కారాగారక్లేశాను

భోక్తలు అయిన తల్లావలజ్ఝులవారు "హిందీయే మనకు జాతీయభాష. ఇంగ్లీషు కొంత కాలం ఉండవచ్చు" అనుడమూ కొత్తేమీ కాదు.

తల్లావజ్ఝుల వారొక విజ్ఞాన సర్వస్వం. సంచార గ్రంథాలయం, చైతన్యంతో తొణికిసలాడే మహాసంస్థ. వారి రచనలన్నీ సంపుటాలుగా పునర్ముద్రితం కావాలి. వారి అనంతానుభవం తెలిపే ఆత్మకథ సాహిత్య పాంథులకు మార్గదర్శకంగా ఉంటుంది. నవ్యసాహిత్యాన్ని లగ్గలకెత్తిన వారి త్రివిక్రమ, శివశంకరపాత్ర నవ్య సాహిత్యం నవనవలాడుతున్నంతవరకు నవ్యకాంతులీనుతూ వెలుగొందుతుంది.

శ్రీశ్రీ పీఠికలు

వెదవి దాటితే పృథివి దాటుతుందన్న సమయం. ఆ సంయమమూ ఎప్పుడయినా సడలుతుందేమోనన్నట్లు తరుచు చుట్ట బిగింపు; ముక్తసరిగా సూత్రప్రాయమయిన మాట తీరు, న్యాయంకోసం ఎంతటి వారినయినా ఎదిరించగల దిట్టతనం: తమ భావాలను ఎదుటివారికి సౌమ్యంగానయినా కచ్చితంగా చెప్పే కరకుతనం; మత భేదం కలిగినపుడు కుమారుణ్ణేకాదు, మరొకరినయినా సహించగల ఔదార్యం, తెలియని ఏ చిన్న విషయమయినా ఏ చిన్నవాడు తెలిపినా స్వీకరించే సరసత. పరస్పరం పోటీలుపడి జీవితం నడిపిన జిజ్ఞాసాపరిశ్రమలు; తప్పని తెలిసిన తరువాత చప్పున సవరించుకొని ముందడుగు వేసే గుండెనిబ్బరం; శతృత్వంతో సమీపించిన వారినైనా

మిత్రులనుగా మార్చే సరళతరప్రవర్తన; కీర్తికోసం కాని, కాంచనం కోసంకాని, కక్కుర్తిపడని వుదాత్తత; పాండిత్యప్రకర్ష కోసం కాక పరిశోధితాంశాలు పదిమందికి తెలియజేయడానికే చేపట్టిన రచనాదీక్ష; గడ్డంతోపాటే అందంగా పెరిగిన అంతరంగం; తాత్సారమేమోనన్నంతగా ఒకొకప్పుడు తలపింపజేసే తాపీతనం—ఈధర్మాలన్నీ సమపాళాలుగా పోతపోసినవ్యక్తిత్వం శ్రీ తాపీ ధర్మారావుగారిది అంటే—పలురంగాలలో పాతకొత్తలకు పసిడి వంతెనవంటి- వారిని గురించి శాఖాచంద్రన్యాయంగా చెప్పినట్టవుతుంది.

తాపీవారి నాయనగారు నరసింగరావుగారు. పెద్ద గవర్నమెంటు డాక్టరు. అప్పన్నగారు - అన్నగారు- యిద్దరూ డాక్టర్లే. నాయనగారు బరంపురానికి బదిలీ అయినపుడు 1887లో తాపీవారు జన్మించారు. వారి చిన్ననాటి చదువు సాములు శ్రీకాకుళంలో సాగాయి. వారు విజయవాడలో మెట్రిక్యులేషన్ చదివి, పర్లాకిమిడిలో ఎఫ్. ఏ. పూర్తిచేసి, మద్రాసు పచ్చయప్ప కళాశాలలో పట్టభద్రులయారు.

తాపీవారికి పసితనంనుంచే తెలుగు సాహిత్యమన్నా, విషయ జిజ్ఞాస అన్నా ఆసక్తి, అభిరుచీ వుండేవి. కాని, నాయనగారు పూర్తిగాదొర. పద్యాలు అల్లితే పడతిట్టేవారు. తెలుగు చదివితే తన్నేవారు; కనుక తాపీవారు నాయనగారు మేడమీదకు వెళ్ళేవరకూ ఏ ఇంగ్లీషు పుస్తకమో చదువుతున్నట్లు నటించి తర్వాత పద్యాలు వ్రాసుకునేవారు.

నాయనగారి క్రమశిక్షణకూడా కరుకైనదే. తమ పిల్లలు ఇంగ్లీషుబాగా చదివి, గొప్పవాళ్ళయి, పెద్దపెద్ద సర్కారు ఉద్యోగాలు వెలిగించాలని వారి ఆశయం. తాపీవారు చిన్నప్పుడు ఒకనాడు తాంబూలం నములుతుండడం నాయనగారు చూచారు. "తాంబూలం వేసుకుంటే చదువురాదు" అని శాసించారు. తాపీవారు తమ్ములం మరెప్పుడూ తాకనైనా తాకలేదు. కాని చుట్టమాత్రం అనుంగుచుట్టం వలె అర్థశతాబ్ది వారిని వెన్నాడింది. తండ్రికొడుకుల ఒడ్డూ పొడుగూ ఒకటే. అందువల్ల పొరపాటున ఒకరి దుస్తులు మరొకరు ధరించడం సంభవించేది. నాయనగారు కోటుజేబుకో స్టెతస్కోపుకోసం తముడుకుంటే, చుట్టముక్కలు తగిలే వేళకు కొంచెం తికమకపడేవారు. ఏమంటారు తమంతటి కమారుణ్ణి!

తాపీవారు తలచుకునే వుంటే వారి యోగ్యతనుబట్టి నాయనగారి పలుకుబడినిబట్టి, గొప్ప సర్కారు ఉద్యోగమే దొరికేది. కాని వారికది యిష్టంలేదు ఒక్కదానికి అంటి పెట్టుకుని వుండడంకూడా ఆ స్వేచ్ఛాచారులకు, సాహితీప్రియులకు గిట్టలేదు ఉన్నంతలో ఉపాధ్యాయవృత్తే వుత్తమమని బరంపురంలో కళ్ళికోటరాజా కళాశాలలో లెక్కల మేష్టారుగా చేశారు. అప్పుడే (1910—11) కొందరు మిత్రులతో కలిసి వేగుజుక్క గ్రంథమాల స్థాపించారు. విజ్ఞానచంద్రికా గ్రంథమాల. ఆంధ్రభాషాభివర్ధినీ సభ తాకని విషయాలపై గ్రంథాలు ప్రచురించడం యీ గ్రంథమాల లక్ష్యం. తదనుగుణంగానే తెనుగులో మొట్టమొదటి ఆంధ్ర వాఙ్మయచరిత్రను "తెలుంగనెడు కాంత" స్వీయచరిత్ర రూపంలో "ఉషఃకాలము" అనే పేరుతో ప్రకటించారు. మొదటి

నిరూపకనవల "వాడే వీడు" మొదటి భావపరిణామనవల "క్రొవ్వూరాళ్ళు", మొదటి ఆంధ్ర చారిత్రక నాటకం "ప్రేమము" మొదలయిన గ్రంథాలు వెలువరించారు. వారి కార్య వ్యగ్రతకు ప్రోత్సాహకరంగా మొట్టమొదటి ఉగాది సంచికలో (1911 లో) "ఆంధ్రుల కొక మనవి" అన్న వ్యాసం ప్రచురితమయింది. అదే వారి తొలి వచన రచన. సమకాలంలోనే ఆంధ్రపత్రికలో (అప్పుడది బొంబాయినుంచి వెలువడుతున్న వారపత్రిక)

"నల్లిరొ నిన్ను జేకొని ఘనంబగు నా తపమందువై చి, నీ
వల్లలనాడుచుండ, దరహాసము జేయుచు జూచుచుండు నీ
కల్లరి వాని దూరవు; ముఖంబున గోపము జూప; వెంతయో
చల్లగనోర్చి; తార : ఘనసౌఖ్యము నాకమునందు గాంచవే"

అంటూ "నల్లిపై కారుణ్యము" అన్న శీర్షికతో ఎలిజీ వ్రాశారు. అవే వారి అచ్చయిన మొట్టమొదటి పద్యాలు. ఆంగ్లంలోని అనేక వాఙ్మయశాఖలను అనుసరించి, మన రచనలను కొత్త పుంతలకు తిప్పాలని రకరకాల రచనలు జేశారు.

ఇంతలో నాయనగారు కాలధర్మం చెందడం వల్ల వారు విశాఖపట్టణం తిరిగి రావలసి వచ్చింది. అప్పుడు "కొండెగాడు" అనే కానీ పత్రిక పెట్టి—

"పత్రార్థేన ప్రవక్ష్యామి
యదుక్తం గ్రంథ కోటిభిః"

అనే హెడింగ్‌తో పి.టి. శ్రీనివాసయ్యంగారు మొదలయిన పెద్దల రచనలను ఘాటుగా విమర్శించారు. సెట్టి నరసింహంగారి వసంతసేనకూడా ఈ కొండెగాని కఠినవిమర్శను తప్పించుకోలేదు. దానితో వారి ప్రసిద్ధి విస్తరించి, కలెక్టర్ వెర్నాన్ దృష్టిలో పడింది. మైనర్ జమీందార్లకోసం కోర్టాఫ్ వార్డ్స్ మద్రాసులో పెట్టిన న్యూయింగ్టన్ కాలేజీలో ట్యూటర్-గార్డియన్ పదవికి వెర్నాన్ తాపీవారిని సిఫార్సుచేశారు. తాపీవారు 1918 నుంచి పదహారు సంవత్సరాలపాటు ఊర్కాడు, చుండి, సౌత్‌వల్లూరు, మందసా మైనరు జమీందారులకు ఉపాధ్యాయులుగా వుంటూ వాకివెంట దక్షిణ భారతమంతా తిరిగారు. వారికి ఆప్తులుగా నిజమయిన సంరక్షకులుగా వుంటూ వారి హృదయాలను చూరగొని, వారిని క్రమశిక్షణలో పెట్టారు. ఒక జమీందారు కుమారుడు న్యూయింగ్టన్ కాలేజీ ప్రిన్సిపాలును కోపంతో తుపాకీతో కాల్చి చంపాడు. కాని, తాపీవారు మాత్రం ఎప్పుడూ ఆచార్య గౌరవాన్ని కోల్పోలేదు.

అటు తర్వాత వారు విజయనగరంలో సంవత్సరంపాటు ట్యూటోరియల్ కాలేజి నడిపారు. అలా ఉంటూనే బొబ్బిలి దివాన్‌గిరి (హెడ్ మేనేజరీ) చేశారు. అప్పుడే జస్టిస్‌పార్టీ పత్రిక 'సమదర్శిని' సంపాదకులయ్యారు. సత్యాగ్రహం ముమ్మరం కావడంవల్ల సమదర్శినిని దినపత్రిక చేయడం, చెన్నపురిలో వాసం అవసరమయ్యాయి. పత్రిక జస్టిస్ పార్టీదయినా, భావాలు జాతీయాలు. కనుక ఆ పత్రిక తాపీ వారి హయాములో ఎంతో ప్రజాసేవచేసింది. వారు ఒక్కరూ వార్తలువ్రాసి వేళ్లు కాయలుకాచేవట.

ఆ రోజులలోనే భాషా విషయంలో వారి మతం మారింది. వారు మొదట్లో వీర గ్రాంధికవాదులు; గిడుగువారికి పర్లాకిమిడిలో ప్రియశిష్యులయినా వ్యావహారిక భాషా వాదంలో వారిని ఎదిరించినవారు; 1907 లో వ్రాసిన "విలాసార్జున" నాటకంలో గుర జాడ వారిని దుయ్యబట్టిన వారుకూడ. మతం మారడంతో 'కొత్తపాళీ' పేరుతో ప్రజా మిత్రలో ధారావాహికంగా భాషావిషయిక వ్యాసాలు వ్రాశారు.

ఇంతలో దేశంలో ఎన్నికల సంరంభం బయలుదేరింది (1936). పిఠాపురం రాజావారు తమ పార్టీకోసం ఆంగ్ల తమిళ తెలుగులలో మూడు పత్రికలు పెట్టారు. వాటిలో తెనుగు పత్రిక 'జనవాణి'కి తాపీ వారు సంపాదకులు. ఇప్పుడు పేరు మోసిన పత్రికా రచయితలలో చాలమంది వారివద్ద శిక్షణ పొందినవారే. జనవాణి మూడేళ్ళ పాటు నడిచింది. తర్వాత వారు స్వతంత్రంగా 'కాగడా' వారపత్రిక కొన్నాళ్ళపాటు నడిపి, మద్రాసుపై బాంబులు పడగానే, పత్రిక ఆపి, చల్లపల్లికి వెళ్ళి మూడేళ్లపాటు యుద్ధంకోసం అసిస్టెంట్‌పబ్లిసిటీ-రెక్రూటింగ్ ఆఫీసరుగా పనిచేశారు. 1936 నుంచే సారంగధర చిత్రంతో వారికి సినిమాతో కలిగిన సంబంధం 46-47 లలో పూర్తిగా జీవనాధారమయింది. అప్పటినుంచి ఇంతవరకు దాదాపు 50 చిత్రాలకు సంభాషణలు మొదలయినవి వ్రాశారు, 49 నుంచి ఐదేళ్లపాటు 'జనవాణి' అనే వారపత్రిక నడిపారు. తర్వాత నేటి వరకు తమ పాత రచనలను పునర్ముద్రించడంలో నిమగ్నులయి ఉన్నారు.

చుండి జమీందారుకు సంరక్షకులుగా ఉన్నప్పుడు వారికి నెల్లూరు ఉనికిపట్టు. అప్పటి నెల్లూరును గురించి చెప్పనక్కరలేదు-అదొక సకల కళాకేంద్రం. అక్కడ మహావిద్వాంసులు వేదం వేంకటాచలయ్య (న్యాయవాది) గారితో తాపీ వారికి పరిచయ మయింది. "వారి ప్రభావం నాపై ఎంతో ప్రసరించింది. వారు నాతో తప్ప ఎవ్వరి తోనూ మాట్లాడే వారుకారు. వారి పుస్తకాలు నాకు తప్ప ఎవరికీ ఎరవిచ్చేవారుకారు. అప్పుడే నేను మిథిక్ సొసైటీ సభ్యుడు, లిటరరీ సొసైటీ సభ్యుడు కావడం. పెళ్ళి పుట్టు పూర్వాలు, దేవాలయాలపై బూతు బొమ్మలు మొదలయిన విషయాలు పరిశోధించాను." అని పాతవిషయాలు చెబుతున్నప్పుడు తాపీ వారి సంయమం సడలినట్టే కనిపిస్తుంది.

14 వ ఏటే వారు విజయవిలాసం చదివారు. నెల్లూరిలో మిత్రులతో బిలియర్డ్స్ ఆడుకుంటూ, పద్యాలు చెప్పుకుంటూ వినోద కాలక్షేపం చేసుకొనే టప్పుడు ఒక మిత్రుడు విజయవిలాసంలోని పద్యం చదివి అవిపట్టంఅంటే ఏమి టన్నారు. వేదం వెంకటరాయశాస్త్రిగారి వ్యాఖ్యానం చూడగా, వారికి సంతృప్తి కలుగ లేదు. అలాగే గుట్టసియాడవంటి పద్యాల వ్యాఖ్యా వారికి నచ్చలేదు. ప్రతి పదంలోను జాతి, వార్త, చమత్కారం గుప్పించాలని ప్రతిజ్ఞ చేసిన వేంకటకవి హృదయం ఇంకా బాగా తెలుపాలనే సత్సంకల్పంతో విజయవిలాస వ్యాఖ్య ప్రారంభించారు. ఒక పత్రి కలో కొంత ప్రకటించారు సమదర్శిని సంపాదకులుగా ఉన్నప్పుడు పారిజాతాపహర ణానికి భావప్రవేశిక వ్యాఖ్య వ్రాసి ప్రతికలో ప్రచురించారు.

ఊర్కాడు సంస్థానంలో ఉన్నప్పుడు శృంగేరీ పీఠాధిపతులు తాపీ వారిని "ఆంధ్ర విశారదా !" అని సంబోధించి, దుశ్శాలువలతో సన్మానించారు. అప్పుడు తాపీవారు చెప్పిన "అక్షరశారదా ప్రశంస" అన్న కవిత మనలిపి పుట్టుపూర్వాల ప్రామాణికమైన చరిత్ర సంగ్రహమే.

తాపీవారు ఆగర్భ శ్రీమంతులు; నూనూగు మీసాల కాలంనుంచి సంస్థానాధీశులతోనే మెలగి, సకల భోగాలూ అనుభవించి, వివిధ మానవ ప్రవృత్తులూ తరచిన వారు. ఆడంబరాలన్నా, ఆర్భాటాలన్నా వారికి గిట్టవు కనుకనే 'రావు బహదూర్' బిరుదం నిరాకరించారు. చిన్నప్పుడు గోల్ఫ్, చదరంగం మొదలయిన ఆటలు ఆడేవారు. గుర్రపు స్వారీలో నిపుణులు. వారి ఇరువురు కుమారులు శ్రీ మోహనరావు, శ్రీ చాణక్య తండ్రికి కీర్తి తెచ్చేవారే.

తాపీవారు ప్రస్తుతం హైదరాబాదులో శ్రీ చాణక్యవద్ద ఉన్నారు. పాత రచనల పునర్ముద్రణ చూచుకోడం, సాహిత్య అకాడెమీ పనులు చేయడం వారి నేటి దినచర్య. వారు తమ దృష్టినంతా నేడు విజయవిలాస వ్యాఖ్యాన ప్రచురణలో కేంద్రీకరించి ఉన్నారు. దేవాలయాలమీద బూతబొమ్మలెందుకన్న రచన రెండవ ముద్రణం పెక్కు ఫోటోలతోను, విదేశాల మ్యూజియంలలోని చిత్రాలతోను ఉదాత్త పరిశోధక ప్రచురణగా ముద్రింపడానికి యత్నిస్తున్నారు.

తాపీ వారిది తాబేటి నడక అని ఈ తరం ఆత్రగాళ్లు అనుకోవచ్చు. ఆ గుణమే వారి పాత కొత్త పాళీలనుంచి సంఖ్యాతీతంగా వివిధ రచనలను వర్షింపజేసింది. వివిధ రంగాలలో భీష్ములుగా దర్శనమిస్తూ, పాత కొత్తలకు పూవుల వంతెనగా కానవస్తూన్న తాపీవారు వేదోక్తాయువ్రతో తమ రచనలన్నింటినీ సంపుటాలుగా ముద్రించి తమ ధర్మాన్ని నిర్వర్తింపజేస్తారు. సందేహంలేదు.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.

77

శ్రీ తుమ్మల సీతారామమూర్తి

శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారికంటే గొప్పగా కవిత చెప్పినవారు ఉండవచ్చు వారికంటే గొప్ప పండితులూ ఉండవచ్చు. కాని, వారిలాగా చెప్పినదానిని ఆచరణలోపెట్టి బ్రతికేవారుమాత్రం అరుదు అరుదేమిటి? నేడు వారి పేరు కనిష్ఠికాధిష్ఠితమే.

జీవితానికి రచనకు సంబంధంవుంటే వ్యక్తిత్వం, రచన రాణిస్తాయని తుమ్మల వారి విశ్వాసం. ప్రాచీనాలంకారిక సమయమూ ఇదే. దీనికి అనుగుణంగా వారు తొక్కిన తోవ మురారిమార్గం వంటిది. వారి రచనలు మొదటినుంచీ ఎప్పటికప్పుడు ఆత్మపరిశోధన, ఆత్మపరీక్ష చేసుకుంటున్నట్టే సాగాయి. "ఇది అకావ్యం, ఇది అకర్తవ్యం" అంటూ జాతికి ఆదేశం చెప్పడం అలవరచారు. తదనుగుణంగా వారు జీవితాన్ని దిద్దుకొనడానికి అహరహం ప్రయత్నించారు. ప్రయత్నిస్తుంటారు.

"ఇన్ని నీతులుచెప్పితి నింత వెక్కి
రించితిని ధర్మువున్ గికురించువారి
నన్ను నే డిద్దుకొంటినా అన్న మధన
మేను విడకయించుక తలయెత్తగంటి"

అన్నారువారు. ఆ ఎత్తిన తల గౌరీశంకర శిఖరంలాగ అత్యున్నతం.

వారిని గాంధీవాదం, రాష్ట్రీవాదం పట్టుకున్నాయి. "నా రచనలు మొదటినుంచి సందేశాత్మకాలు, సమసామయిక రాజకీయవస్తుప్రధానాలు కావడంవల్ల కళకు, శిల్పానికి, అవకాశం తక్కువ. పల్లెటూళ్ళు, మొదలయినవాటిని గురించి చెప్పిన 'బంగారు భూమి" వంటి వాటిలో శిల్పానికి, కళకు ప్రాధాన్యం ఉంది" అంటారు వారు. కాని, వారి పద్యం ఒక్కటి చదివినా, ఈ వాదంతో ఏకీభవించము. మీదుమిక్కిలి దాని కవితాశిల్పం జక్కనాచార్యుని కైవాడంలాగ, తిక్కనాచార్యుని కైతలాగ ఎంత సుతారంగా ఉంటుందో తెలుసుకొని తన్మయులవుతాము. వారి రచనలు యింతటి శిల్పవైభవం సంతరించుకొనడానికి, జిగితో, బిగితో సొబగు వారడానికి కారణం వారి వైష్ణికజీవితమే. వారి జీవితగానమే వారి కవిత. వారి కవిత వారి జీవితానికి పదశిల్ప ప్రతిరూపం.

తుమ్మలవారి జన్మస్థలం గుంటూరుజిల్లా కావూరు (జననం 25-12-1901). పిన్నతనంలో పన్నెండు సంవత్సరాలతో, వీధి బడితో చదువు ముగిసింది. వారి పదవయేట ఒక తమాషా జరిగింది. చెరకుపల్లిలో కారెంపూడి రాజమన్నారుగారనే శతావధాని ఉండేవారు. వారి అవధానం తుమ్మలవారు ఒకమారు చూచారు. ఆ శతావధాని "శునకమ్మయ్యేను విష్ణుదేవుడహహా చోద్యంబుగా నత్తరిన్" అనే సమస్యను ఈ శునకు అమ్మ అయ్యేను అని పూరించారట. తుమ్మల వారికి కుతూహలం కలిగింది. వచ్చిరాని పదాలతో ఆయనలాగే పూరించారు. ఆప్పటినుంచీ వారి కవితాహృదయం పొంగింది. రచయిత కావాలనే ఆరాటం పరవళ్లు తొక్కింది.

కాని, పైతృకమైన వృత్తి వ్యవసాయం. తండ్రికి బాసటగా ఉండక తప్పని పరిస్థితి. కనుక స్వయంకృషే అనివార్యమయింది. ఒకవైపు మడి సేద్యం, మరొకవైపు సాహిత్య కృషి సాగించారు. తండ్రి నారయ్యగారు, బావగారు వారి సాహిత్యాభిరుచిని ప్రోత్సహించారు. భాషాభండారం నిండారడానికి ప్రాచీన సాహిత్యం, సంస్కృతం అవసరమని వారు గుర్తించారు. చందనవోలులోఉన్న తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారివద్ద "అథప్రజానామధిపః ప్రభాతే" ఆరంభించి, కాళిదాసత్రయం చదివారు. వ్యవసాయకాలంలో, పనివాళ్ళతో పగలు తీరిక దొరకేదికాదు. రాత్రిళ్లు నాలుగుమైళ్లు నడిచివెళ్ళి పాఠం చెప్పుకొని తిరిగి వచ్చేవారు.

వ్యవసాయంలో శరీరం, సాహిత్యంలో పలుకు రాటుదేరాయి. ప్రాయంలో ఐదెకరాల చేనుకు సరిపోయే నారు ఒక్కరే పీకారు 240 మోపులగడ్డి ఒక్కరే కట్టారు. రాత్రికూడా కలుపు తీశారు. కుప్పలు నూర్చారు. గడ్డి కోసేవారు. వెంట్లు

కట్టేవారు. పది మోపుల గడ్డిపనలను ఒక్కరే ఎత్తారు. వీటితో వారి ఆరడుగుల ఆజానుబాహువిగ్రహం తీర్చి దిద్దినట్టయింది. ఇటు సాహిత్యక్షేత్రంలోను హరికథల నారులుచల్లారు. శతకాల కుప్పలునూర్చారు. దోషాల కలుపులుతీశారు. అక్షరాల వెంట్లు కట్టారు. ఆజానుతెనుగు విగ్రహం తీర్చిదిద్దుకున్నారు.

దేశం స్వాతంత్ర్యోద్యమంలో ముమ్మరంగా కొనసాగుతున్నది. 1920 లో గాంధీజీ సేనాని అయ్యారు. గడ్డి పోచలను గండుమగలుగాను, మట్టిగడ్డలను మహావీరులుగాను మలచి రవిఅస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదిరించారు. ఆ మహాసేనాని ప్రభావం తుమ్మల వారిపై ప్రసవించింది; వారి కవితపైన ప్రసరించి, దానిని ప్రసన్నం చేసింది. గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా బ్రతకాలని, నిరాడంబరంగా ఉండాలని వారు శ్రమింపసాగారు.

1923 లో కాకినాడలో కాంగ్రెసు మహాసభ జరిగింది. తుమ్మలవారూ అక్కడికి వెళ్ళారు. వెళ్ళి వచ్చిన తరవాత మరికొందరు ఉత్సాహితులతోపాటు కావూరులో హిందీ పాఠశాల పెట్టారు. దానితోపాటు తిలక్ జాతీయకళాశాల ప్రారంభించారు. ఆ జాతీయ పాఠశాలలో "తెలుగు నీవే చెప్పాలి" అని సాటి దేశసేవకులు తుమ్మల వారిని బలవంతం చేసారు. అప్పటినుంచి మొదలయింది వారికి పంతులపని.

తెలుగు చెప్పడంతోపాటు జాతీయ కార్యక్రమం-ఖద్దరు విక్రయం, కాంగ్రెస్ ప్రచారం సాగించారు. పాఠశాలలో పదహారు రూపాయలు నెలజీతం. అది పుచ్చుకోడమే వారికి బాధగా వుండేది. నెలవుల్లో ఖద్దరు మీదపెట్టుకుని అమ్మి, రూపాయకు అణా చొప్పున ఇచ్చిన కమీషను జాతీయపాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ భక్తి పూడి రామచంద్రరావుకు అప్పగించేవారు. 1920 నుంచి పదేళ్లపాటు జిల్లాకాంగ్రెస్ సభ్యులుగాను, రాష్ట్రీకాంగ్రెస్ సభ్యులుగాను ఉన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. కావూరు కాంగ్రెస్ కార్యదర్శిగా పనిచేస్తారు.

తెలుగు పండితులు కావడంతో వారి కవిత 1928 లో తొలిసారిగా "ఆత్మార్పణము" రూపంలో సాక్షాత్కరించింది. ఇది కపోతవస్తువయిన చిన్న కావ్యం. ఆప్పటినుంచి సేద్యానికి స్వస్తిచెప్పారు ఒజ్జనమే జీవిక అయింది. కాని, తెలుగు క్షేత్ర మాగాణిలో "పెద్దకాపు" కాపించారు. 'పరిగపంట', 'ఏరాకు'. 'ధర్మజ్యోతి', 'అమర జ్యోతి' వెలిగించారు. 'గీతాంగణం'లో 'రాష్ట్రీగానం', 'ఉదయగానం', 'సర్వోదయ గానం' చేశారు. కవితా ఖండాలతో 'శబల' ను తీర్చారు. జీవితం ఉత్తరార్ధంలో వ్రాసినవి 'పైరపంట'లో చేర్చదలిచారు.

"నా రచనలలో వస్తుగౌరవం గల బాపూజీ ఆత్మకథే శాశ్వతంగా ఉంటుంది. అందులో తెనుగుముద్రకూడా హెచ్చుగా వుంది. ఉదాత్త భాషలోను పొదిగాను"— అంటారు వారు.

నిజమే. సమకాలిక పరిస్థితులను ఆకళించుకొని ముందంజవేసే రచయితే మహాకవి; క్రాంతదర్శి. గాంధీజీ ఉదాత్తచరితం భారతజాతికి అవిస్మరణీయం, నిత్యస్మర

ణీయం రామాయణ, భారతాలవలె దానిని తుమ్మలవారు ఛందోమకుటంతో అలంకరించినారు. డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారు దీని తిలకరచనలో అన్నట్టు "తిక్కనతో సజాతీయుడైనవాడు మన చౌదరి. అనగా, సరిసమానుడని అతిశయోక్తి బలికి అపాయముదేకు. ఆ వర్గమున నగ్రాసనము లేకున్నను ఆసనత్వము గలవాడు. తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని ఆస్థానకవి. ఈ స్థానము శాశ్వతము."

తెలుగు ఒజ్జగానేవారు తరంపైగా గడిపారు: పొన్నూరులోను, అప్పికట్లలోను గండపెండేర, గజారోహణ, కనకాభిషేకాద్యనేక సన్మానాలు పొందారు. నలుగురు కుమారులతో, ఒక్కకుమార్తెతో ముద్దుముచ్చట్లు తీర్చుకున్నారు. షష్టిపూర్తి పండుగ చేసుకున్నారు. చిన్నప్పుడు

"అర్రుపులిసి గిత్త అంకెవైచిన తరి
నడుముకట్టి పట్టె మెడకు దాల్చి
ఊబిలోన బండి నూపి-రేపిన మొన
గాడు" వయసు మళ్ళిమళ్ళగానే ఉదరశూలతో సగమైపోయారు. గుప్పెడు కారప్పొడితో, చేరెడు నేతితో మొదటి కబళం కలిపే తిండి పుష్టిపోయింది. అన్నపూర్ణ వంటి సతీమణి అన్నపూర్ణమ్మగారు సేవచేసినా తగ్గలేదు. దానికోసం ఉప్పుకారంలేని చప్పిడి భోజనం అలవాటు చేసుకున్నారు. రాత్రి గోధుమన్నం, మజ్జిగ పుచ్చుకుంటారు. దీనికి కారణం సేద్యంమాని ఒజ్జకం చేయడమేనని కోపం కలిగింది. "బలభద్రులకున్ బడికొల్వు గిట్టదు" అని తిట్టిపోశారు. అంతలో పంతులాటవల్లనే కవితపండిందనే సత్యం గోచరంకాగానే వినయంతో, ఆత్మప్రత్యయంతో

"రాష్ట్రసిద్ధి కొరకు రక్తమ్ము కార్చిన
కవిని నేను గాంధి కవిని నేను
బడలి బడలి తల్లిబాస కూడెమునేయు
కవిని నేను దేశి కవిని నేను;"
అని ఆనందించారు. ఆంధ్రావళి ఔనని తల ఊపింది.

ప్రస్తుతం వారు అప్పికట్లలో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు తెల్లవారి కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత పత్రికా పఠనం, గ్రంథపఠనం, వచ్చిన వారితోగోష్ఠి: రచన వారి దైనందిన చర్య. రాత్రి రెండుగంటలప్పుడూ ప్రాస్తారు. 1930 నుంచీ డైరీ (దినచర్య) ప్రాయడం అలవాటు. ప్రతి జమాఖర్చూ ప్రాయవలసిందే; దమ్మిడీ కూడా సరిపోవలసిందే; గాంధీవాదులు కావడంవల్ల ప్రత్యేక అభిరుచులులేవు.

కవిత్వానికి ప్రత్యేకమైన భాషంటూ ఉండదు. దాని నిర్మాణం వేరు. దాని హుందా తగ్గకుండా చూడడంకోసం సరైన మార్గంలోనే నడవాలని వారి నమ్మకం.

"ఇప్పటి సాహిత్యం జడావస్థలోనే ఉంది. ప్రజాసేవ లేకుండానే రాజకీయవాదులు పదవులు కోరినట్టు పాండిత్యం కొరకు ప్రయత్నించకుండానే రచయితలు కావాలనే అరాటం నేటి యువకులలో ఉంది. కావ్యం ఎవరికి అంకితంచేసినా వచ్చే

గొప్పదనంలేదు, కష్టపడకుండానే సంపాదిద్దామనే దురాశ ప్రతిరంగంలోను నేడు అలుముకుంది. ఈ పరిస్థితి మారక తప్పదు. ఏ రూపంలో మారుతుందో నా బుద్ధికి అందడం లేదు" అంటారు వారు.

కాలానుగుణమైన భావ విప్లవం అవసరమనే వారి అభిప్రాయం. భాషావిప్లవం మాత్రం వారికి గిట్టదు. ప్రబంధ యుగపు పాకం కాకపోయినా సరళ సలక్షణ భాష లోనే కాలానుగుణమైన సందేశం చెప్పినప్పుడే కవిత అవుతుందనేది వారి నిశ్చయం.

"కవితా పరమావధి రసం, ఆనందం, మానవహృదయాన్ని, సంస్కరించడానికిగాని, శాంతి కలిగించడానికిగాని ఉపయోగపడేదే ఆనందం. ఆ ఆనందం ఉద్బుద్ధం కావడానికి సృష్టించేకవిత సరళంగా ఉన్నా, సలక్షణంగా ఉండాలని నా నమ్మకం. విషయప్రధానమైన రచనలు ఏలాటి భాషలో ఉన్నా, ఎంత తేలికగా ఉన్నానష్టం లేదు." ఇది వారి అభిప్రాయం.

అయితే, నేటి పరిస్థితిలో కవి బాధ్యత ఏమిటి? "కవి తన సందేశం మృదువుగా చెప్పడమే చేయదగిన పని. రచయితలలో మొదట సంస్కారం రావాలి. రచయితలు సంఘానికి సరైన సందేశం ఇచ్చినప్పుడు, సంఘంకూడా వారి సందేశానికి కొంత విధేయమవుతుంది." అని వారు సూచించే పరిష్కార మార్గం.

"నేర్చిన యొకింత గట్టిగా నేర్చినాడ
కూర్చిన రవంత తిన్నగా కూర్చినాడ

అని తుమ్మలవారు "వినయమ్మెసరేగ శిరమ్ము వంచినా" వారి సారస్వతసేవ రవంతకాదు. కొండంత, బంగారు కొండంత. విశాలాంధ్ర రాష్ట్రభావన నవనవంగా ఉన్నంతవరకూ, గాంధీజీ సిద్ధాంతాల సౌరభం గుబాళిస్తున్నంతవరకూ, పరిగపంటలూ, పైరపంటలూ నాడులో కొనసాగుతున్నంతవరకూ వారి కవిత చెన్ను విడదు.



శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి

"రంగము మీది కెక్కుదము,
రా, మరి ? కావ్యము సేయ నేర్తునో ?
ఖంగున ఒక్క పద్యము సు
ఖంబుగ పాడగనేర్తువో ? రసా
భంగుర భంగి అర్థ పరి
పాటి వచింతువో ? లోక తత్వ పా
రంగతులైన సభ్యులవు
రాయని మెచ్చ నుపన్యసింతువో ?
రంగముమీది కెక్కుదము, రా !"

అంటూ శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు తమకు శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి తోను, ఇతరులతోను కలిగిన పదాల పోరాటంలో మారుపేర్లతోను, పేర్లు లేకను ఆశ్లే పిస్తూ వ్రాసేవారిని సవాలుచేస్తూ చెప్పిన పద్యాలు తరం కిందివే అయినా, నేటికి పండిత గోష్ఠులలో మారుమ్రోగుతూనే ఉంటాయి. ఇక, ఆ వాదాలు విన్నవారూ, పాల్గొన్నవారూ పులకరింపులతో పొంగిపోతారంటే అతిశయోక్తి ఏముంది ?

దీపాలవారి మూర్తి చిన్నదైనా, స్ఫూర్తి, కీర్తి దొడ్డవి. పదాల పోరాటంలో ముక్త పదగ్రస్తంలాగ, నాల్గవపాదం తర్వాత మొదటి పాదాన్ని అందుకుని ముక్త పాదగ్రస్తంగా పద్యాలు ఆశువుగా చెబుతూ ఉంటే, నాటక ఫక్కీలో వాద వివాదాలు కొనసాగిస్తూఉంటే, సభంతా నోరుతెరచుకొని ఉండిపోయేది. వారిలాటి గమకి అరుదుగాకనిపిస్తారు. చిన్ననాటినుంచి చేసిన సంగీతసాధన, దానికితోడు శ్రావ్యమైనగొంతు గంభీరమైన శారీరం, వాద వివాదాలలో ఒడుపు, ఎదిరిని బెదరిగొట్టే సమయస్ఫూర్తి, వీటన్నిటికి దీపాల వెలుగుగా

"భయమేలా బయటికి రా,
నయమార్గంబుననె బుధులు నలువురు వినవా
జ్ఞయ చర్చ చేసికొందము,
జయము పరాజయము లేదుచదువులలోనన్"

అనే సరసతా, దీపాలవారిని ప్రతివాది భయంకరులనుగానే కాక, ప్రతివాది శివంకరులు గాను తీర్చాయి.

"ఎగిరి వెక్కిరించి యిగిలించుకొన్నట్టు
కాదు కవులతోడి కతలు వెతలు,
కవుల జెనక నూరకయ పోవునా? అది
కుమ్మరడుసు గాదు, కమ్మరడుసు"

అన్న హెచ్చరిక అప్పటివారికే కాదు, ఇప్పటి వారికీ, ముందువారికీ గుండె గుభేలు మనిపించేదే.

దీపాలవారు గుంటూరుజిల్లా, వినుకొండ తాలుకా, బొమ్మరాజుపల్లెలో 1894 మే నెలలో జన్మించారు వారి బడిచదువు వినుకొండలో బోర్డు హైయరుగ్రేడ్ ఎలిమెంటరీ స్కూలులో సాగింది. పితృపాదులు శ్రీ వేంకటనరసయ్యగారి వద్దనే సంస్కృతాంధ్రాలు చదువుకున్నారు. మొదటినుంచి సారస్వతాభిరుచి, కూనిరాగాలు తీయడం ఉండనే ఉన్నాయి. సంగీతంలో పరిశ్రమ చేశారు. కాని, ఏమీ సాధించకపోయినా, పద్యం, శ్లోకం, వచనం మంచి గమకంతో చదివే తీరు విలక్షణంగా సొంతం చేసుకున్నారు. పద్యాలు చెప్పే ఉబలాటం పరవళ్లువారగా పదిహేనవ ఏటనే,

"రాతిన్ నాతిని జేయు మంచడు గగా
రాలేదు; ప్రత్యర్థికిన్
భీతిం జెందియు చేరలేదు, క్రతువుల్
వేవేగ రక్షింప రా
వే తప్పంజనదంచు పల్కగను లే
దే, దర్శనం బిచ్చినన్
చేతోమోదము నందెదంటి గద తం
డ్రీభక్త కల్పద్రుమా!"

అంటూ, "భక్త కల్పద్రుమా" మకుటంతో శతకం చెప్పారు. ఇదే వీరి మొదటి కృతి కూడా.

ఇలా కాలం గడుస్తుంగా, వారి పందొమ్మిదవ ఏట (1915 లో) వారిని మహా పండితులుగాను, సారస్వత పరిశోధకులుగాను తీర్చిదిద్దే సంఘటన, సత్సంగం ఏర్పడ్డాయి. అప్పుడు వినుకొండ ప్రాంతానికి శేషగిరిరావుగారనే సాహిత్య పిపాసితులు ఫారెస్టు రేంజరుగా వచ్చారు. వారికి దీపాలవారిపై అవ్యాజవాత్సల్యం కలిగింది. వారి వద్ద తాము ప్రాచీన ప్రబంధాలు చదివి, కవిత చెప్పడం నేర్చుకోసాగారు. ఒక ప్రభుత్వాధికారికి, తనకన్నా పెద్ద వారికి ప్రబంధాలు చెప్పడమంటే, ఎంతో పరిశ్రమ అవసరం దీపాలవారు రేంజరుతోపాటు కొండలలో, కోనలలో గడుపుతూ, స్వయంగా ప్రబంధానుసంధానం చేస్తూ, అధ్యాపనం సాగిస్తూ ఉండేవారు. ఇప్పటి పంచవర్ష ప్రణాళికా ప్రచారరూపకాలలాగ సంఘ ప్రయోజన దృష్టితో, రేంజరు ప్రోత్సాహంతో దీపాలవారు అప్పుడు 'కానన ప్రహసనం' వ్రాశారు :

"క్ష్మానాథున్ జయమొందుగాక యనుచున్
ఫారెస్టు వర్నాకులర్
ట్రైనింగ్‌స్కూలు కళార్థులే ప్రహసన
ప్రాయంబునై కాననా
నూనానేక ఫలంబులన్ తెలుపు చెం
తో వింతయౌ నాటకం
బీనాడిచ్చట చూపువారు మది కెం
తే తోష ముప్పొంగగాన్"

అంటూ నాంది ప్రస్తావనతో

ఆ ఫారెస్టు రేంజరుకు గుర్రం ఉండేది. దీపాలవారు ఆ గుర్రమెక్కి పరిసర గ్రామాలకు వెళ్ళి, తాళపత్ర గ్రంథాలు సేకరించి రేంజరును మెప్పించేవారు. ఈతాళపత్ర గ్రంథాల సేకరణలోనే వారికి శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి పరిచయమైంది. వేటూరివారు ప్రభుత్వపక్షాన తాళపత్ర గ్రంథాలు సేకరించేవారు. దీపాలవారు వారితో కలిసి చాటు పద్యాలు సేకరించారు. చాటు పద్యాలకోసం తిరుగుతూ నెల్లూరువచ్చారు. అక్కడ వాటిని "చాటుపద్య రత్నాకరము" అనే పేరుతో సంపుటంగా ముద్రించారు. నెల్లూరులోనే స్థిరనివాసమేర్పరచుకున్నారు.

అప్పటి నెల్లూరు శ్రీ వేదం వేంకటరాయశాస్త్రిగారు, శ్రీ దర్భా సుబ్రహ్మణ్య శర్మగారు వంటి విద్వత్కవులకు ఆటపట్టు. నెల్లూరులో దీపాలవారికి సారస్వతాభిమానులైన రెడ్ల ఆశ్రయం లభించింది. ఆ రెడ్లు వారికి ఇల్లూ, పొలమూ ఇచ్చి ఆదుకున్నారు. వారేమో అవధానాలు, ఉపన్యాసాలు, గోష్ఠులు జరుపుతూ 'భారతి' మొద

యిన కావ్యాలు చెబుతూ, సాహిత్య వ్యాసాలు వ్రాస్తూ, తమ ఆశ్రయదాతలను సంతోషపెట్టేవారు తీరికనాళ్లలో తాళపత్ర గ్రంథాలు సేకరించి, ఆంధ్ర సాహిత్య పరిషత్తుకు బహూకరించడంకోసం శ్రీ జయంతి రామయ్య పంతులుగారికి పంపేవారు.

వారు ఆ కాలంలో సాగించిన పదచర్చలు, వాగ్వివాదాలు, వేదంవారితో జరిపిన శబ్దసమరాలు 'జితకాశి' లోను, 'ఓదార్పు' లోను చూడవచ్చు.

అన్నేండ్లవరకూ విస్మృంఖలులుగా ఉన్న దీపాలవారూ నలభయ్యో ఏట ఉపాధ్యాయవృత్తి అవలంబించారు. అప్పటికి స్థిరంగా ఒకచోట తప్పనిసరిగా ఉండవలసి రావడంవల్ల జిజ్ఞాసుల హితంకోసం తీరికగా, ముమ్మరంగా సారస్వత పరిశ్రమ చేయవలసి వచ్చింది. దాని ఫలితమే రఘువంశ దశకుమార చరితల, భాస భారతరూపకాల సుందరాంధ్ర వచనానువాదం, మేఘసందేశ, ప్రణయకుసుమ, సువర్ణమేఖల, నెల్లూరి గాలివాన ఆది మనోహర కావ్యాలు, సారంగధరాది వ్యాఖ్యలు, సాహిత్య సమీక్ష, ద్రోణప్రశస్తివంటి పరిశోధనోద్గ్రంథాలను, వారి మేఘసందేశం అనువాదం కాళిదాసు తెలుగువాడై పుట్టి కలంపట్టినా ఔరా అనేట్టుంటుంది. సాహిత్య సమీక్ష వారి పాండిత్య ప్రాభవానికి, పరిశోధన దీక్షకు సరస్వతీకటాక్ష వీక్ష.

దీపాలవారు వారి "రంగముమీదికి" ఆహ్వానింప నేర్తురు. ఖంగున పద్యంపాడగా నేర్తురు. అర్థ పరిపాటి వచింపనేర్తురు. సభ్యులవురా అని మెచ్చనుపన్యసింతురు. వారు హాస్య సరస వచోనిపుణులు. "అన్యుల మనముల్ నొప్పించక, తానొవ్వక" హాస్యోక్తులతో తమ అభిప్రాయం మొగమోటమి లేకుండా చెప్పగల దిట్టలు. ఒకప్పుడు వారి ఆశ్రయదాతలలో ఒక్కరైన ఒక పెదరెడ్డిగారు ఏవో పద్యాలు వ్రాసి, చూడమన్నారట. చూచి, చదివి బాగున్నా యన్నారట. దీపాలవారు. "శాస్త్రులుగారూ, తప్పులున్నాయని నా మిత్రులు అంటున్నారే?" అని రెడ్డిగారు ప్రశ్నించారట. దీపాలవారు వెంటనే "కవులు మూడు రకాలవారు—వరకవి, నెరకవి, దొరకవి అని. తమరు దొరకవి" అన్నారట. "అన్ననా" అంటూ ఆ రెడ్డిగారూ నవ్వారట.

ప్రస్తుతం వారు నెల్లూరులో ఉస్మాన్ సాహెబ్ పేటలో సొంత ఇంటిలోనే నివసిస్తున్నారు. ఉదయం స్నానసంధ్యానుష్ఠానాల తర్వాత, అభిషేకించి అలంకరించిన శివలింగంలా విభూతి పిండికట్లతో వెలిగిపోతూ, పుస్తకాల దొంతర్ల మధ్యన కూర్చుని, ప్రాచీన కావ్యపాఠ పరిశీలన చేస్తుంటారు. ప్రస్తుతం ధూర్జటి కాళహస్తిమాహాత్మ్యం పాఠ పరామర్శ చేస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరుకుమార్తెలు. ఏదో ఆలోచనలో ఉన్నప్పుడు, పద్యాలు చెప్పేటప్పుడు డాబామీద అటూ ఇటూ పాదచ్ఛాయలు వేస్తూ పచారుచేయడం వారి అలవాటు.

"నా ఆదర్శం ప్రభాకరశాస్త్రిగారు. ప్రాచీన కావ్యపాఠ పరిశీలనం నా ముఖ్యోద్దేశం ప్రాచీన కావ్యాలు పూర్వం లేఖక ప్రమాదాలవల్ల, నేటి అచ్చుతప్పులవల్ల చెడి

పోతున్నాయి. కనుక వాటిని ఇతర గ్రంథాల పాఠ పరామర్శతో సంస్కరించాలి." అంటారు దీపాలవారు.

నిజమే. నేడు విస్మృతికి ప్రాధాన్యంకాని, గంభీరతకు కాదు. ఏ భాషయినా నేర్చుకోవలసిందే. కాని, మన వికాసానికి మూలకందమైన తెలుగునే మరచిపోగూడదు కదా! నేడు మహామహా పండితులనబడేవారే గుజ్జనగూళ్ళంటే గూళ్ళనుకుని గూళ్ళు కట్టుకుంటున్నట్లు ప్రయోగించారు. బిడ్డకుట్లంటే ప్రసవవేదన అని తెలియక వేవిళ్లని ఒక మహా వ్యాఖ్యాత వ్యాఖ్యానించారు. ప్రేతస్నానమంటే ప్రాతస్నానమనుకుని ప్రయోగిస్తున్నారు. (గరిట గెరిటె అవుద్ది గదా, ప్రాత ప్రేత కాకపోతుందా! - అనుకున్నారేమో!) దీనికంతా కారణం నుడికారమంటే ఏమిటో తెలియక అవ్యవస్థ ఏర్పడడమే.

"ఇలాటి అవ్యవస్థపోయి సరైన భాషరావడానికే పదప్రయోగాల, పాఠాల. పలుకుబళ్ళ పరిశీలన జరగాలి. భాష మళ్ళీఉద్ధరించబడాలనే దానికోసమే నేను ప్రయత్నిస్తున్నాను. ఒక్కడు ఒక్కపని చేయగలడు. నేను ఈపని చేస్తున్నాను. ఇప్పటి పండితులుకూడా అరకొరజ్ఞానంతో ప్రాచీన కావ్య పరిచయం లేక వ్రాస్తున్నారు. వారిని సక్రమంగా దిద్దడానికి భాషా పరిశోధన అవసరం" ఇదే వారి లక్ష్యం.

ఈ లక్ష్యంతో దీపించే దీపాలవారు, ఈ లక్ష్యసాధనతో దీపించే దీపాలవారు భాషాస్వరూప జిజ్ఞాసువులకు, కావ్యరస పిపాసువులకు, సత్యాన్వేషకులకు గండాదీపంగా అఖండదీపంగా వెలుగులు వెలార్చుతూ వెలుగొందుతుంటారు.

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రిగారిని తలచుకున్నప్పుడు మధుర మధుమాసం, దానిలో విరగబూచిన గున్నమామిడి, దాని కొమ్మనెక్కి పల్లవం మెక్కి పాడే కోయిల; ప్రావృడంభోధరస్వామి, వాని ఎదుట ఆపాదచూడం పుష్పించిన కుటజనిటపి, దాని సరసన మత్తెక్కి వర్తించే జిలుగువన్నెల నమలిరేడు; శరత్కాల నీలాభ్రసరసి, దానిలో విహరించే నిండు జాబిల్లి, ఆ జాబిల్లినుంచి జాలువారే వెన్నెలజల్లు; నవ విభాత మహోత్సవం, దానిలో దోబుచులాడే ఉషాకల్యాణలావణ్యం; గంధర్వలోక మధురసుషమా సుధాగాన మంజువాటి, దానిలో వినిపించే వియోగగీతిక; పచ్చ తటాకుల పచ్చితావులు వెదజల్లే వెండ్లి పందిరి, కన్నెమిన్నలు చిలకరించే పన్నీరు, ఒత్తుగా ఆకాశంచలాలకు సాగిపోయే అగరువత్తుల ధూపధూమశిఖలు, మేలిమిపసిండి మలామాల మంచిగంధం జ్ఞాపకం వస్తాయి.

వారి మాటలు వింటూ ఉంటే, ఉన్నత పర్వతాగ్రంమీదో, సంజమబ్బుల పవడాల ఛాయలలో నదితీరానో, ఉద్యానవనంలోనో, సముద్రపు అంచులలోనో విహరిస్తున్నట్టు అనిపిస్తుంది. చీదర్లు, చికట్లు పటాపంచలయినట్టు పరమానందమవుతుంది; పానకం తాగుతూ ఉన్నట్టే ఉంటుంది. గిరీశం అన్నట్టు వారి మాటలు వినడమే ఒక 'ఎజుకేషన్'. వారి సాంగత్యం ఒక మత్తు. విడిచి రాబుద్ధిపుట్టదు అదేదో అద్భుత వశీకరణ శక్తి; కొంపలు మునిగి పోతున్నా, వదల మనసురాదు. అదేదో అసదృశమైన మాగ్నటిజం!

వచనంలోను కవిత్వం ఉంటుందా-అన్నది ఒకప్పుడు వివాదాంశం. 'గద్యం కవినాం వికషం వదంతి' అని దండ్యాచార్యులు మొదలయిన అలంకారికులు చెప్పినా సందేహం సమసిపోలేదు. కాని, దేవులపల్లివారి మామూలు పలకరింపులలోను కవిత్వం చిప్పిలితూ ఉంటుంది. మనను వారు ఏ వయోవృద్ధునికో 'వీరు ఫలానా' అని పరిచయం చేస్తారనుకోండి. "కంటిచూపు తగ్గింది బాబూ, చెబితేగాని తెలీదు నాయనా" అని ఆ వృద్ధు అంటారు. దానికి దేవులపల్లివారు "మీరు ఎంతో అదృష్టవంతులు. చెబితే తెలుస్తున్నది. చెప్పినా తెనియనివారు ఎందరున్నారో భారతదేశంలో!" అంటారు వెంటనే. మనకు నవ్వు ఆగదు. ఇలా అను నిమేషం వారి వాక్కులలో చిల్లర విషయాలూ చమత్కారంతో కవితగా కనవస్తాయి, వినవస్తాయి. అందువల్లనే కాటూరి వేంకటేశ్వరరావుగారు తరచు అనేవారు "మా కృష్ణశాస్త్రి మామూలు మాటలలోనే కవిత్వం ఉంటుంది. చాలమంది వాటితోనే తృప్తిపడిపోతారు. ఆయన కవిత్వం చెప్పదలచుకుంటే, అంతకన్నా పై స్థాయి ఉండాలి. అందువల్లనే ఆయన హెచ్చుగా వ్రాయలేకపోయాడు" అని.

గుణంకన్నా గుణానికి, రాశికన్నా వాశికి ప్రాధాన్యమిచ్చే దేవులపల్లివారు 1897 లో తూర్పు గోదావరిజిల్లా చందనంపాలెంలో జన్మించారు. ఈ గ్రామం కూచిమంచి తిమ్మకవి నివసించింది. దేవులపల్లివారి పూర్వులది ఆకిరిపల్లి, తాతగారు వలస వచ్చారు. తండ్రిగారి దాక పండితులు కానివారుగాని, రామభక్తులు కానివారుగానిలేరు. కనుకనే "దేవులపల్లి వంశమున దేవులు పుట్టిరి" అని చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రిగారూ ప్రశంసించారు. దేవులపల్లివారి జనకులు వేంకటకృష్ణశాస్త్రిగారు కూచిమంచి తిమ్మకవి మునిమనమడు వేంకట్రాయమంత్రివద్ద కవిత్వపు మెలకువలు తెలుసుకున్నారు. వారూ, పెత్తండ్రి సుబ్బారాయశాస్త్రిగారూ పీఠికాపురాస్థాన విద్వత్కవులు. కనుక దేవులపల్లి వారికి పుట్టుకతోనే గొప్ప సంస్కారం అబ్బింది. తండ్రిగారు, పెత్తండ్రిగారు చిన్నప్పుడు పద్యాలువ్రాసి వినిపించి "ఏది బాగుంది?" అని అడిగేవారట. వ్యస్తాక్షరి చేయించేవారట. అప్పటినుంచే దేవులపల్లివారికి పదాల సంగీతం తెలిసింది; ఏది మధురమో తెలిసికొనే జ్ఞానమూ కలిగింది. ఈ సంగీత సంగతితోనే వారు ఏడవ ఏటే సామర్లకోటలో "నంద వందన ఇందిరానాథ వరద" అని తొలిసారిగా పద్యం

చెప్పారు. తర్వాత పదవ ఏట రామతీర్థంలో కవిత చెప్పారు. కాని, దురదృష్టవశాత్తు వారికి తమతండ్రి పెత్తండ్రిగార్లవద్ద బహుకాలం శిక్షణపొందే అవకాశం లేకపోయింది. పెత్తండ్రిగారు 1909 లోను, తండ్రిగారు తర్వాత రెండేండ్లకు కాలధర్మం చెందారు. కాని దేవులపల్లివారు వారి రచనలను పారాయణంచేశారు. "నా కవితలో నాన్నగారి లిరికల్ ఫెర్వర్, పెదనాన్నగారి జిగీవచ్చాయి" అంటారు వారు.

వారి విద్యార్థిదశ పిఠాపురంలోను, కాకినాడలోను గడిచింది. పిఠాపురం హైస్కూల్‌లో హెడ్మాస్టరు కూచి నరసింహంగారు. కాకినాడ కళాశాలలో రఘుపతి వేంకటరత్నంనాయుడుగారు, రామానుజాచార్యులుగారు వారిని తీర్చిదిద్దారు. "చిన్నతనంలో కూచి నరసింహంగారు, తర్వాత నాయుడుగారు నాకు ఆంగ్ల సాహిత్యంలో అభిరుచి కలిగించారు" అని వారు తరచు భక్తితో అంటారు. అంతేకాదు. "సరకు నాన్నగారు ఇచ్చారు. ఆధునిక యుగధర్మానికి అనుగుణంగా కిటికీలు తెరిచి, కొత్త చూపు ప్రసాదించినవారు వేంకటరత్నంనాయుడుగారు. సారస్వత ప్రియత్వమే కాక లోకమంతటినీ ఆప్యాయంగా ఆలింగనం చేసుకొనే అనురాగబంధం ఆయన శిష్యత్వం వల్ల లభ్యమయింది; జీవితంలోని ప్రతి అల్పానుభవాన్ని ఒక ఉదాత్తదృష్టితో అనుభవించే శక్తి ఆయనవల్ల కలిగింది" అంటారు వారు.

దేవులపల్లివారు 1918 లో పట్టభద్రులై జీవితంలో అడుగుపెట్టే వేళకు బ్రహ్మసమాజోద్యమం, వ్యవహార భాషావాదం తీవ్రంగా ఉన్నాయి. వాటితో వారు ప్రభావితులయారు. రెండేండ్లపాటు కాకినాడ, పెద్దాపురం మిషన్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, "ధర్మసాధని" అన్న పత్రికలో పిఠాపురం రాజాగారికి వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాశారు వాటిఫలితం కోటనుంచి వచ్చే వార్షికం ఆపివేత. ఆ సమయంలోనే సతీవియోగం సంభవించింది. వారి కరుణాంతరంగం కరిగి 'కన్నీరు' ఖండకావ్యంగా తరంగితమయింది. ఇదే వారి తొలి ఖండకావ్య సంపుటి (1923). తర్వాత ద్వితీయ వివాహమై పిఠాపురం హైస్కూల్‌లో నౌకరీ దొరికింది. కాని, అది కొన్ని నెలలపాటే. వారి భావాలు రాజాగారికి నచ్చనందున పనిమాని, పది సంవత్సరాలపాటు దేశమంతా తిరిగారు. మళ్ళీ 1933 నుంచి పదేళ్ళపాటు కాకినాడ కళాశాలలో ఉపాధ్యాయులుగా ఉన్నారు.

దేశం తిరిగిన పది సంవత్సరాలూ వారి జిజ్ఞాసకు, కవితకూ పరువం. వారికి హరీంద్రనాథ చట్టోపాధ్యాయుడు, సాహితీసమితి సభాపతి శ్రీ శివశంకరులు వంటి విద్వత్కవితంసులతో ఆత్మీయత కలిగింది. శాంతినికేతనంలో పలువురు సాహిత్యబంధువులయారు. వారు ప్రాచ్య పాశ్చాత్యకవుల రచనలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు.'ఏకోరసః కరుణ ఏవ' అన్న భవభూతివాదం ప్రియమైనది. రొమాంటిక్ ఉద్యమ ప్రవాహం వారిని ముంచెత్తింది. ప్రాచీనుల సంప్రదాయానికి సమకాలిక జీవితం మేళవించారు.

"ఆకులో ఆకునై పూవులో పూవునై
కొమ్మలో కొమ్మనై నునులేతరెమ్మనై
ఈ అడవి దాగిపోనా, ఎట్టైన
నిచటనే యాగిపోనా?"

అంటూ గొంతు విప్పారు. కరుణ విప్రలంభాలు కరవైన తెనుగులో ఆరని దివ్వెలు వెలిగించారు. ఔను మరి: "కలికిపాటల కోయిలకులము" వారిది. విలక్షణత వారి సొమ్ము. 'కృష్ణపక్షము'తో (1925) తెనుగులో కన్నీటికెరటాల వెన్నెలల మహోజ్జ్వల పక్షమే స్థాపించారు. "ఊర్వశి"తో (1928) తెనుగుకు నూతన శ్రీవిలాస హాసాలు అందించి, నూత్నకల్యాణతూర్య మనోజ్ఞ గాన నృత్య కోలాహలం చెలరేగించారు. అప్పుడు వారు హరిజనసేవలో నిమగ్నులయి ఉండేవారు. కరుణరసం వారికి మానవాకించనత్వాన్ని కనులగట్టించి,

"కురియుమురా కన్నీటిని
మరిమరి విలపింపుమురా"

అంటూ భక్తి కీర్తనల రూపంలో ప్రవహించింది. వారి దారుణ దురంత హృదయవేదన ఈ కీర్తనలలో కట్టలు తెంచుకుంది. విన్నవారికి ఉప్పెనవలె ఆవేదన పొంగి వస్తుంది. వాటిని ఇతర మతాలవారూ కొంచెం మార్పులతో పాడుకుంటున్నారంటే వాటి ప్రాచుర్యం ఏమనాలి:

1942 నుంచి వారు చెన్నపురిలో ఉంటూ మల్లీశ్వరి మొదలయిన సినిమాలకు మాటలు, పాటలు వ్రాశారు. రేడియో ప్రసారంకోసం క్షీరసాగర మథనం, విప్రనారాయణ చరిత్ర, మాళవికాగ్నిమిత్రం యక్షగానాలు, రామానుజ కథ, ముఖలింగం, శివకవికథ, ప్రసన్న పారిజాతం, సాయుజ్యం మొదలయిన భక్తినాటికలు, విద్యాపతి కార్తికి, కృష్ణాష్టమి మొదలయిన లిరికల్ నాటికలు వ్రాశారు. హైదరాబాదు రేడియోలో ప్రయోక్తగా చేరిన తర్వాత, 'ఏడాది పొడుగునా' అనే నాటకంలో సంవత్సర గ్రామజీవితం చిత్రించారు. 'ఋతుచక్రం'లో "చౌరాస్తా ఆహిస్తా" అంటూ నగర శ్రమజీవుల జీవితం వర్ణించారు. ఇటీవల వారు రచించిన 'కొత్తకోవెల' (గాంధీ సమాధి) 'ఆండాళ్' నాటికలు అసదృశమైనవి.

"తన కంఠమున దాచి హాలాహలం
తలనుంచి కురిపించి గంగాధరం
మనిషి శివు డవడమే గాంధీవరం
బాపు ననుసరిస్తె చాలు మనమందరం"

అంటారు కొత్తకోవెలలో.

"నవ్వంటే జాబిల్లి
పువ్వంటే మల్లి
నవ్వేటి పూవంటె
నా చిట్టి తల్లి"

అంటూ పిల్లల పాటలు మొదలు దంపుళ్ళపాటలు, అమ్మలక్కల పాటలు, ఆకలి పాటలు—అనంతంగా వ్రాశారు. "నేనేదో భక్తకవిని కాను. మీరనుకునేంత భక్తుణ్ణి కాను. కొందరు అనుకునేంత దుర్మార్గుణ్ణికాను. ఎప్పుడో హృదయావేదన భరించ నప్పుడుకేక పెడతాను. అది కీర్తన అవుతుంది" అన్న వారి మాటలు ఎంత హాయి!

వారి రేడియో ప్రసంగాలలో మలుపు తిరిగితే, రిక్షావాలా; బూట్‌పాలిష్ వంటివి సాహిత్యదృష్టిలోను ఉత్తమమైనవి.

దేవులపల్లివారు ఏది రచించినా, ప్రతిపదానికి రంగూ, రుచీ, వాసనా ఉన్న వన్న సూక్ష్మపరిశీలనతో, శిరీష కుసుమకోమల పదాలలో హరజటా పారిజాత లతాంత మధుపేశల భావాలు మలచి, వేయి కన్నులతో వీక్షించి, స్వాదు సంగీత కలనా లసద్విపంచిమీద ప్రోయించారు.

వారి పద్యాలు చదువుతున్నా, వింటున్నా "నాకు కవిత్వం పుట్టలోని పాము లాగ, తెల్లవారి తలుపులు తట్టి వచ్చిపడే అతిథిలాగ, రేకులు విచ్చుతున్న పూవులాగ రకరకాలుగా వస్తుంది" అన్న వారి మాటల సత్యం గోచరిస్తుంది.

"మీరు ఏదీ మహాప్రబంధ నిర్మాణానికీ ఇతిహాస రచనకూ పూనుకోలేదే?" అని ప్రశ్నిస్తామనుకోండి. "రామాయణం మానవ రచితమైన గొప్ప ఇతిహాసం; కల కాలానికి వర్తించేది. కాళిదాసు కవిత కవితాగుణాలన్నీ పుంజీభూతమైంది. పాతవారికి అంతా సత్యం. రామాయణం ఇప్పుడు ఎవరైనా వ్రాస్తే, నప్పదు. నన్నయ, తిక్కన మానవుల లోతులు, ఎత్తులు సులభంగా తెలిపారు" అని వారి సమాధానం.

"కవికి నిజాయితీ ఉండాలి. ప్రేమ ఉండాలి మానవత ప్లస్ నిజాయితీ అన్న మాట. కవులు రెండు రకాలవారు, తాము చెప్పదలచింది నిజాయితీతో చెప్పేవారు. వారిది కొంతకాలం నిలుస్తుంది. కాలానుగుణమైన సత్యాన్ని — యుగధర్మాన్ని నిర్వచించేవారు రెండవవారు. వారిది శాశ్వతంగా ఉంటుంది మానవత అంటే విభేదా లకు అతీతమైన రసాస్వాదనం. ఈ దృష్టితో కవులందరూ విశిష్టాద్వైతులు. ఆధునిక యుగంలో రెండు ఉద్యమాలు బయలుదేరాయి. ఒకటి మానవోద్యమం, మరొకటి హిందూ ధర్మ పునరుద్ధరణోద్యమం. మొదటి దానికి ప్రవర్తకుడు రామమోహన్‌రాయ్. నేను మానవోద్యమానికి చెందినవాణ్ని. నా మానవతావాదానికి ఆచార్యులు నాయుడు గారు. నాకు ఆయన విశ్వమానవ దృష్టి ఇచ్చారు" అంటారు వారు.

కనుకనే వారు కవిత్వంలోను జాతులు, మతాలు చూస్తే వెర్రెత్తిపోతారు. విశ్వ

మానవ భావన లేనివాడు గొప్పకవి ఎలా అవుతాడని వారి ప్రశ్న. పరమత సహనం వేరు; ఎక్కడ ఏ మంచిఉన్నా తనది చేసుకొనడం వేరు. ఈ దృష్టితో వారు మతాన్ని గాని, ధర్మాన్నిగాని సులభంగా కవితలో ఒంటబట్టించుకున్నారు. అందువల్లనే వారు "నేను హృదయవాదిని. నాకు వేదాంతం తర్కం తలకెక్కవు. నన్ను ఎడారిలో కూర్చోబెట్టి వేయి పుస్తకాలు ఇస్తామన్నా వద్దు. ఒక్క పుస్తకమూ అక్కరలేదు. పనికి మాలినవారు, చెడ్డవారు, వికారరూపులు అయినా సరే — జనం మధ్యన నన్ను పడేయండి. నేను ఆరోగ్యంతో ఎంతకాలమైనా బ్రతుకుతాను. మనుష్యులు లేకపోతే కాయిలా పడుతాను" అని ఎన్నోసార్లు అన్నారు.

మనమింకా నాటకాల ప్రాంగణంలోనే ఉన్నామన్నది వారి నమ్మకం. "జాతి వయస్సులో ఉన్నప్పుడు టాగూరులాంటివారు పుట్టారు. సంఘదృష్టి కలిగితే మంచి నాటకం, మంచి సాహిత్యవిమర్శ వస్తాయి. కవిత చాల ఆత్మాశ్రయం. వయస్సులో వచ్చేది. పెరిగాక నాటకకర్త అవుతాడు. నాటకకర్త ఇంటి యజమాని వంటివాడు" అని వారి వివరణ.

వారి బాహ్య వ్యక్తిత్వంలాగే వారి వక్తృత్వంకూడా విశిష్టం. కవితను, వ్యక్తిత్వాన్ని అనుకరించినట్టే దానినీ పలువురు అనుకరించి కృతార్థులు కాలేకపోయారు. షష్టిపూర్తి దాటి ఆరేండ్లయినా నూనూగుమీసాలు, ముసిముసి నవ్వులు, ఉంగరాల జుట్టు, దుస్సహదురంత వేదనలున్నా మనవికారాలను గరళకంఠునిలాగ దిగమింగు కోవాలి కాని ఏడుపు ముఖంపెట్టి వికారరూపంతో ఉండడం సంఘద్రోహచర్య అన్న సిద్ధాంతంతో పసందైన వేషం, మాటలో, చేతలో, భావనలో, ఇంటా, వంటా శుచీ, సౌందర్యం తొణికిసలాడే వారి వ్యక్తిత్వం అనుకరించడం సాధ్యమా? మిత్రులు కన బడితే వదలలేని ఆప్యాయతచూపే వారి చేతులు అనుకరించడం సాధ్యమా?

ప్రస్తుతం వారు వేంకటరత్నంనాయుడుగారి చరిత్ర వ్రాస్తున్నారు "బ్రహ్మర్షి మాట" మకుటంతో నాయుడుగారి సుభాషితాలు గుదిగుచ్చి, వారు పరమపదించి నప్పుడు

"ఈ జడ జీవితమ్ము పలి
కించితి, నే యమపంకమందు నం
భోజము మొల్వజేసితి, వ
పూర్వము నీ దయ యీ నిశీథి నీ
రాజన మెత్తినావు విపు
లమ్ముగు నీ యెద నిండెనే శర
ద్రాజిత చంద్రకాంతు లన్ను
తమ్ములు స్వర్గలతాంత వాసనల్"

అని వాపోయిన దేవులపల్లివారు వ్రాసే ఈ చరిత్ర తెనుగుకు వెన్నెల నివాళిగానే ఉంటుంది. తమ అనుభవాలు—జ్ఞాపకాలు వ్రాయదలచారు. వారికి రకరకాల మనుష్యులతో సంబంధం ఉంది. అవి తళుకు బంగరు తారలుగానే తెనుగు ఆకసాన్ని అలంకరిస్తాయి. నాయుడుగారి శిష్యరికంవల్ల వారికి సమయపాలన అబ్బలేదనేది పలువురి ఫిర్యాదు. కాని, వారిప్పుడు చేతికి గడియారం కట్టారు. తప్పక మాట నిలబెట్టుకుంటారు. దేనినైనా చిత్రికపట్టే స్వభావం గనుక కొంత విలంబనను సహిద్దాము.

"నాది చిక్కని కవిత అని నా నమ్మకం. అన్ని వర్గాల పరిశీలనా ఉంది" అన్నారు వారు. ఎంత వద్దనుకున్నా కాళిదాస భవభూతుల. యామున వేదాంతదేశికుల తిక్కన పెద్దనల, కబీరు సూరదాసుల, షెల్లీ బైరనుల వరుసలో నిలబడే దేవులపల్లి వారికి అంతమాత్రం అనుకోడానికి అవకాశం ఇద్దాము. రాచవీటిలో పెరిగి జీవితంలోను, కవితలోను అబ్బిన రాజసాన్ని గౌరవిద్దాము.

"వారు వ్రాసింది ఎంత?" అన్నది బాలిశుల ప్రశ్న. "అమరుక కవేః ఏకశ్లోకః ప్రబంధ శతాయతే" అన్నాడు ఒక సహృదయుడు. అది నాడూ, నేడూ నిజం. దేవులపల్లివారి "ఏకం పద్యం ప్రబంధ శతాయతే" అంటాను నేను. ఇది నేడూ, రేపూ నిజం. సాహిత్య చరిత్రకారులు ఏమి వ్రాతలు వ్రాసినా, నేనుమాత్రం దేవులపల్లి వారిని నవ్యకవితా ప్రస్థానాచార్యులుగా పురస్కరిస్తాను.

"నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు?
నా యిచ్ఛయే గాక నాకేటి వెరపు?"

శ్రీదేవ్‌లపల్లి రామానుజరావు

ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. రెండు చెక్కలుగాఉన్న తెలుగునాడు ఏకీకరణకు ఉద్యమం ఉధృతంగా సాగుతున్నది. రామాయణంలో పిడకల వేటలాగ కేంద్ర ప్రభుత్వందృష్టి ఉస్మానియా విశ్వవిద్యాలయంపై పడింది. ఆ విద్యాలయంలో బోధన భాష ఉరుదూకావడం, అక్కడి పారిభాషిక పద రచనా శాఖ అద్వితీయంగా ఉండటం ఢిల్లీవారి నోట నీరూరేట్టుచేశాయి. ఫారశీలిపిని దేవనాగరలిపిగా మార్చి, ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని హిందీ విశ్వవిద్యాలయంగా పరకాయం చేయడానికి పూనాకున్నారు. తెలుగునాట, ముఖ్యంగా తెలంగాణా ఆందోళన చెలరేగింది. భాషాప్రయుక్త రాష్ట్రాలతో మాతృభాషకు ఏమో ఒరుగుతుందని ఆశిస్తే, ఉన్నసంస్థే చేయిజారిపోతున్నదేమని, ప్రముఖ పౌరులతో ప్రతిఘటన సంఘం (సిటిజన్స్ కమిటీ) ఏర్పడింది. దాని సమావేశకర్తను అంతకుముందు చూడనివారు, తొలిసారిగా చూచినవారూ ముక్కుమీద వేలు పెట్టుకున్నారు; ఎవరు ఈ వామనుడు, ఏమిటి ఈ పైజమా-షేర్వాణీవేషం ఆకాశం చూస్తూ ఐమూలగా అంగలువేసే ఈ నడకేమిటి-అని. కాని ఆయన ఆకారంలో వామనుడైనా తెలివితేటలలో, వ్యవస్థాపన పాటవంలో త్రివిక్రముడని తెలిసినవారు మాత్రం ఉద్యమం సఫలంకాక తప్పదని ఎప్పుడో నిర్ణయించుకున్నారు. వారి నిర్ణయం నిజమయింది.

ఔనుమరి అంతకుముందు ఆరేళ్ళుగా హైదరాబాదు సారస్వత పరిషత్తు కార్య భారం వహించి, తెలంగాణలోను ఇతరత్రాను ఉన్న మారుమూల పల్లెలకూ కాళ్ళు అరిగేలాగ తిరిగి, సారస్వతోద్యమం వ్యాపింపజేసి, రాజధాని నగరం నట్టనడుమన దానికొక సువిశాలమైన స్థలం సంపాదించి, తలయెత్తి చూడదగిన. సర్వాంగ సుందర మైన భవనాన్ని నిర్మింపజేసి, తెలుగువారు తలయెత్తుకొనేట్టు చేసిన నిర్మాణదక్షుడు ఆయన. ఆంధ్ర రాజధానిలో ఆయనను చూడనివారు, చూచి గుర్తించనివారు ఉండరు. ఆయన శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు.

శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు ఓరుగల్లు పట్టణంలో 1917 ఆగస్టు 24న జన్మించారు. మెట్రిక్యులేషన్‌వరకు హనుమకొండలో చదివారు. తరువాత హైదరాబాదులోని నిజాంకాలేజీలో 1939 లో పట్టభద్రులయారు. సంపన్నకుటుంబం. జీవితంలో కష్టాలేవీ ఎదుర్కొవలసిన అవసరం కలుగలేదు. డొక్కకోసం రెక్కలు ఆడించవలసిన దుర్గతి అసలే లేదు. కనుక బి ఏ పట్టా పుచ్చుకున్న తరువాత రెండేళ్ళపాటు గ్రంథాలయోద్యమంలోను మరిరెండేళ్ళపాటుయువజన కాంగ్రెసులోను పాల్గొన్నారు. ఆ సమయంలో ప్రజాసేవకులందరికీ కలిగినట్లే వీరికి న్యాయవాది కావాలనే కోరిక కలిగింది. నాగపూర్ వెళ్ళి ఎల్. ఎల్. బి.తరగతిలోచేరి ఉత్తీరులయారు. తిరిగివచ్చి వకాలతీ ప్రారంభించారు.

అప్పుడు హైదరాబాదు రాష్ట్ర రాజకీయ వాతావరణం భయానకంగా ఉంది. అజాద్ హైదరాబాదు నినాదాలు విజృంభించాయి. వాటికితోడు రజాకార్ల హా హా రవాలు, దేవులపల్లివారి తెలుగుతనం పరవళ్ళు తొక్కింది. ఈ అభివృద్ధి నిరోధకులను ప్రతిఘటించడానికి గొంతువిప్పాలి. దానికి తాము నడుపుతున్న "శోభ" సారస్వత మాసపత్రిక చాలదు అనుకున్నారు. "నాకు న్యాయవాదవృత్తే చాలఇష్టం. గొప్ప న్యాయవాది కావాలనే మొదటినుంచి ఆశ. కాని వెర్రితలలు వేసిన ఉద్యమాలను ఎదుర్కొనడం విద్యుక్తధర్మం. నా భావాల ప్రకటనకు దారి చూస్తుండగా గోలకొండ పత్రిక దినపత్రిక అయింది. దాని సంపాదకుడుగా నా వ్రాతలకు 'కూతల' కు ధారాళంగా అవకాశం దొరికింది. ఈ కారణంగానే నేను ఒక ఉద్యమంనుంచి మరొక ఉద్యమానికి శాఖా చంక్రమణం చేయడం సంభవించింది. నా జీవితం ఈ విధంగానే గడచిపోతోంది అన్నారు దేవులపల్లివారు.

గోలకొండ పత్రిక సంపాదకత్వం 1947 నుంచి నాలుగేండ్లవరకే సాగింది. 1948 డిసెంబరునుంచి సారస్వత పరిషత్తుతో సంబంధం కలిగింది. 1952-53 లో దానికి అధ్యక్షులుగాను ఇప్పటి వరకు ఉపాధ్యక్షులుగాను ఉన్నారు. తర్వాత, తర్వాత ఆ సంస్థ భవనాలులేచాయి. "నాతో ఎవరికి విరోధంలేదు. నా పనులు ఎంతో సవ్యంగా సాగిపోయాయి నరోత్తమరెడ్డి, పునిజాల హనుమంతరావు; గడియారం రామకృష్ణశర్మ

నా పనులకు ఎంతో తోడ్పడ్డారు. మేము నలుగురము కలసే పనిచేసాము" అన్నారు వారు.

ఏ పని ఫలమైనా కర్త, కారయిత మొదలయిన ఆరుగురికి చెందుతుందని అభియుక్తోక్తి, కాని కర్త కంటే కారయితకే ప్రాధాన్యత హెచ్చుగా ఇవ్వాలని నా అభిప్రాయం. ఏ పనైనా చేయడంకన్న చేయించడం కష్టం. తను ఏదో తనకునచ్చింది చేయడం సులువు. తన ఇష్టానిష్టాలు తగ్గించుకుని, పదుగురితో పనిచేయడంకష్టం. పదుగురితో పనిచేయించడం మరీకష్టం. ఆ విధంగా ఇతరులతో పని చేయించినవారే మొదటినుంచి గొప్పవారయ్యారు. గొప్పపనులు సాధించారు. కొందరు తమ మేధతోను సౌజన్యంతోను పదుగురునీ ఆకట్టుకోగా కొందరు అధికారంతోను. ఈవితీను ఆకట్టుకుంటారు. మేధ సౌజన్యం లేకపోతే విద్యారణ్యుల వారు వేదభాష్యనునే మహాధ్వరాన్ని ముగించే వారేకాదు.

ఏ తావతా :

వ్యవస్థాపన శక్తికి కలసికట్టుతనం కన్నతల్లి. దానికి దేవులపల్లివారు పుట్టినిల్లు. ఆ శక్తి మరొక శక్తితో కలసి ఉండకపోతే రాణించదు. దానికి వారి రచనాశక్తి తోడయి వన్నెతెచ్చింది. దానికి సహకారిణి వారి ప్రసంగచాతురి. ఎవరినీ నొప్పించక గంటల తరబడి విషయైక దృష్టితో మాట్లాడగలరు. వాటన్నిటి ఫలితాలే నవ్యకవితా నీరాజనము, సారస్వత నవనీతము, నవనీతము, వ్యాసమంజూషవంటి సాహిత్యమిమర్శ గ్రంథాలు; మనదేశము, ఆదిమవాసులు, తెనుగుదేశము, జవహర్‌లాల్ నెహ్రూ; గౌతమబుద్ధుడు వంటి బాలసారస్వతము, పచ్చతోరణమువంటి పద్యకావ్యాలు; తెలుగుసీమలో సాంస్కృతిక పునరుజ్జీవనమువంటి సాంస్కృతిక గ్రంథాలూను. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన వెంటనే "తెలంగాణములేని ఆంధ్రరాష్ట్రము అసమగ్రము. ఆంధ్రజ్యోతి సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రనాయకులు-ఏ ప్రాంతము వారైనను-బద్ధకంకణులై కృషిచేసి ఆంధ్రరాష్ట్రమును సమగ్రముగావించ విశాలాంధ్ర సాధనకు దీక్ష వహించవలసియున్నది. అని ఘోషించిన తొలిబంతి వారితో వారొకరు. దానికోసమే వారు అయ్యదేవర కాళేశ్వరరావు మొదలయిన పెద్దలతో కలసి విశాలాంధ్ర నిర్మాణోద్యము నడిపారు. 'హైదరాబాదు స్వాతంత్ర్యోద్యమము, విశాలాంధ్ర రాష్ట్రము' అన్న గ్రంథాలు రాశారు. కార్యసిద్ధి తరువాత 'విశాలాంధ్ర' వచ్చింది అనే పుస్తకం వ్రాశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం బదిలీ ప్రతిఘటనోద్యమం ఫలితం మొదటే తెలిపాను.

వారితో సంబంధంలేని సారస్వత సంఘమంటూ విద్యాసంస్థఅంటూ రాష్ట్రంలో లేదు. కొంతకాలం ఉస్మానియా విశ్వవిద్యాలయం సెనెట్‌లోను, రాష్ట్రప్రభుత్వ విద్యా సలహా సంఘంలోను, కేంద్ర పాఠ్యపుస్తక సంఘంలోను, ఆల్ ఇండియా రేడియో సలహాసంఘంలోను సభ్యులు. టాగూరు శతవార్షిక జయంతి సంపుటి కార్య

దర్శులు, గురజాడ శతవార్షిక జయంతి సంపుటి సంపాదకులు. అయినప్పుడు, వారు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ఏర్పడినప్పటినుండి కార్యదర్శి పదవి అలంకరించడం కేంద్రసాహిత్య అకాడెమి కౌన్సిలు సభ్యులుకావడం, సాహిత్య ప్రతినిధులుగా రాజ్య సభలో ఆసీనులు కావడం ఆశ్చర్యంకాదు.

ఏ ఉద్యమానికన్నా సహకారమే మూలమయినప్పుడు, వారు సహకారోద్యమంలో పాల్గొనడం సహజాతి సహజం. వారు కో-ఆపరేటివ్ జనరల్ ఇన్స్యూరెన్స్ సొసైటి డైరెక్టర్ల బోర్డు సభ్యులుకూడా.

"నాకు ప్రాచీన సాహిత్యంలో భారతం, భాగవతం ఇష్టమైనవి. నవీనులలో, గురజాడ, రాయప్రోలు, విశ్వనాథ, అబ్బూరి, దువ్వూరి, జాషువ, దాశరధి చాల ఇష్టమైనవారు. తెలుగు సాహిత్యంలోని వెలుగులను హిందుస్తానీ వారికి తెలుపడానికి ఉరుదూలో తెలుగు సాహిత్యచరిత్ర ప్రచురించాను. హాలీ, గాలిబ్, వచనకారుడు మౌలానా షిబ్లీ నాకు చాల సన్నిహితులు. జాతీయోద్యమానికి సంబంధించినంత వరకు హాలీ రచనలను తెలుగులో ప్రచురించాను"; అనివారు అంటూ రంజకంగా ఎంతసేపైనా సంభషిస్తారు.

"ప్రాచీన సంస్కృతిలోని ఉదాత్తతను కాలానుగుణంగా మలచుకోవాలని ఆ నిగ్గును రక్షించుకోవాలని కోరేవారిలో నేనొకడ్ని. ప్రాచీనతతో సంబంధం ఉండాలనేవాణ్ని. భారతీయ సంస్కృతిలో విశ్వజనీనత ఉంది. దానినే మనం రక్షించుకోవాలి. ఆ విశ్వజనీనతే మన సంస్కృతిని శాశ్వతం చేస్తున్నది" అని వారి విశ్వాసం.

వారు తెల్లవారు జామున నాలుగున్నరకే లేచి, స్నానాదులు ముగించుకుని, ఆరున్నరనుంచి ఎనిమిదిన్నర వరకు ముఖ్యమైన వ్రాతపనులు చూచుకుంటారు. తర్వాత సారస్వత పరిషత్తు కార్యాలయానికి వచ్చి, పరిషత్తు, సాహిత్య అకాడెమీల పనులు చేస్తారు. పన్నెండు గంటలకు ఇంటికివెళ్ళి భోజనం ముగించి, గంటన్నర విశ్రమిస్తారు. సాయంకాలం నాలుగున్నరనుంచి పరిషత్తు కార్యాలయంలో మరల కార్యక్రమం ప్రారంభం. సాయంకాలం ఆరుగంటలకు వాహ్యాళికి బయలుదేరుతారు. వారికి బ్రిడ్జి ఇష్టం. ఇప్పుడులేదు. షేర్వానీ, పైజామా నచ్చిన దుస్తులు.

వారికి తోటపని చాల ఇష్టం. "నాకు బాదరబందీ ఏమీలేదు. నా కుమారుడు ఎదిగి వస్తున్నాడు. నాకు ఏ జంజాటమూ ఇక ఉండదు. ఆఖరుకు వరంగల్లుకో స్థిరపడి, తోటపని చేసుకుందామని ఉంది" అని వారు అంటున్నప్పుడు ఎన్నో ఉద్యమాలకు, సంస్థలకు నారుపోసి, నీరుపోసి, పెంచి పండించుకున్న దేవులపల్లి వారు తోటలనూ బాగానే పెంచి పండ్లు అనుభవించగల రనడం నిస్సందేహమని అనిపిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ సాహిత్య ఆకాడెమీ పక్షాన మంచి తెలుగు నిఘంటువును ఒకటి నిర్మింపజేయాలనీ, సారస్వత పరిషత్తుకొక గొప్ప రిఫరెన్స్ లైబ్రరీ ఏర్పాటుచేయాలనీ వారికి ప్రస్తుతం ఉన్నకోరికలు. ఇన్ని సాధించినవారికి ఇవి ఏపాటివి ?

సృజనాత్మకశక్తి, దానిని మించిన నిర్మాణ దక్షతగల శ్రీ దేవులపల్లి రామానుజ రావుగారు ఈ రెండు కోరికలతోనే సంతృప్తిపడక, తెనుగు సాహిత్యం, తెలుగువారి అభిరుచి దేశంలోని ఇతర భాషలవారికి ఒరవడి అయ్యేటట్టు సారస్వత మహాధ్వరానికి పూనుకుంటారని ఆశిస్తున్నాను.

శ్రీనాయని సుబ్బారావు

"అన్నా, మామామ యిదివరకే నాకు కూతు నీయ ననెను. నేను నాలుగేండ్ల నుండి యుద్యమములో జదువు మానిన తరువాత 'దినుటకు దిండి లేదు. వానికి బిల్ల నెవరిత్తు'రని యన్నాడట. పిల్లమాట యెట్లున్నను, స్వరాజ్యము వచ్చునని చదువు మానితిని. వచ్చుననుకొన్న స్వరాజ్యము రాలేదు. రాదనుకొన్న శశి మరీ రానట్లున్నది"

"—కిరీటి యొయ్యారమైన విలాసమైన పసి సిగ్గు వెలిగ్రక్కు చిరునవ్వు బల హీనమైన మొగమున దాండవింపజేసెను. చచ్చిపోవుచున్న తీగ కెరు వుంచి నీరు పోయగా మరునాడు నిలద్రొక్కుకొని మొండివడిన కొమ్మ కణువులో కనబడీ కనబడ నంత సన్నని లేత చివురు కనిపించినట్లున్న దా నవ్వు. రెండు రోజులలో కిరీటిమరల మనిషివలె కనబడజొచ్చెను. శరీరమునందు బలహీనముగానున్నను, కొద్దిగా లేచి తిరుగుటకు నుత్సాహము తనలో గనబడుచుండెను. స్నేహితులందరకును శుభలేఖలు వ్రాయబడినవి. కిరీటి తాను స్వయముగా వ్రాసెను. పెండ్లి బాపట్లలో. వివాహమునకు

బంధువులకన్న స్నేహితులే ఎక్కువమంది వచ్చిరి. కిరీటి ప్రణయకథ స్నేహితులంద రెరుగుదురు. చివరకు వారి యిద్దరకును బునస్సమాగమము కలుగుచున్న దనుటచే సంతోషించని మిత్రుడు లేడు—"

'వేయి పడగలు'లో ప్రణయ తపస్వి ప్రణయ సిద్ధుడు అయిన ఈ కిరీటి మరెవరోకారు; శ్రీ నాయని సుబ్బారావుగారే.

కవి కేవలం దాగి ఉండి ఏ నాయికా నాయకులతోనో మాట్లాడించడం కాక స్వయంగా తన హృదయాన్ని విప్పి చూపడమనే ఆత్మాశ్రయ కవితా నూతన ప్రవాహంలో ఉవ్వెత్తుగా లేచిన మహాతరంగమైన శ్రీ నాయని వారు నెల్లూరుజిల్లా పొదిలె తాలూకాలో 1899 లో జన్మించారు. వారి నాయనగారు శ్రీ కృష్ణారావుగారు. వెంకట గిరి సంస్థానంలో తాసీల్దారు. పొదిలెలోనే వారి ప్రాథమిక విద్యాభ్యాసం జరిగింది.

నాయనివారికి ముగ్గురు సోదరులు, ముగ్గురు సోదరీమణులు. తండ్రిగారు వారందరినీ చుట్టూ చేర్చుకొని నేర్పుతో కథలు చెప్పేవారు. వారి నాయనమ్మ పర్వతమ్మగారు మహాభక్తురాలు. వారి వెంట నాయనివారు పొదిలె కొండమీది నిర్మమేశ్వరాలయానికి వెళ్ళుతూ, కీర్తనలు, స్తోత్రాలు వినేవారు. దానివల్ల నాయనివారికి తెనుగు అన్నా, సత్ప్రవర్తనమన్నా లేలేత హృదయంలోనే నారులు పడ్డాయి.

వారు మేనమామల యింట, ఒంగోలులో ఉంటూ మిడిల్ స్కూలులో చేరినప్పుడు వారి కవితాభిరుచికి మంచి ప్రోది ఏర్పడింది. అక్కడి ఉపాధ్యాయులు వీఱుపాటి వేంకటరంగయ్య, కురుగంటి శ్రీరామశర్మ, అక్కిరాజు నరసింహారావు మొదలయిన వారు ఇతర విషయాలు బోధించేవారయినా, విద్యార్థులతో తెలుగు పద్యాలు చదివించి, తోక పద్యాలు (అంత్యాక్షరి) చెప్పించేవారు. నాయనివారు మిడిల్ స్కూలునుంచి మిషన్ హైస్కూలులో చేరినప్పుడు, ముక్తినూతలపాటి గోపాలకృష్ణశాస్త్రిగారు చాల అభిరుచి కలిగించారు.

అప్పుడే తెనుగు పుస్తకాలు కొనడంకూడ వారికి అలవాటయింది. ఒకమారు ఒక పుస్తకం కొనదలచారు. చేతులో పది అణాలే ఉన్నవి. ఎవరూ చూడకుండా అత్తమ్మగారి పోవులపెట్టెలోని చిల్లరడబ్బులు తీసుకుని ఉడాయించారు.

నాయనివారు 1916 లో స్కూలు ఫైనలు తర్వాత ఒక సంవత్సరం ఊరికేనే ఉన్నారు. అప్పుడే అడపా దడపా ఒక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆ సంవత్సరమే తొలిసారిగా పద్యాలు చెప్పారు— క్షీరసాగరమథనం పేరుతో. అప్పటికి వారికి ఛందస్సంటే ఏమిటో తెలీదు. గుజిలీ భారతం ప్రతి చతువుతూ ఉండగా, పద్యం రెండవ అక్షరాలన్నీ ఒక్కటిగా ఉండడం కనిపించి ఆశ్చర్యపోయారు. ఆ విషయం తామే కనిపెట్టినంతగా ఆనందించారు.

సంవత్సరం తర్వాత వారు బందరు వెళ్ళి నోబెల్ కళాశాలలో ఏఫ్. ఏ. లో చేరారు. వారికి తెనుగు, సంస్కృతం, లాజిక్ తీసుకుందామని ఉండేది. కాని, అన్న

గారు శ్రీ నాయని నరసింహారావుగారు చరిత్ర తీసుకోమన్నారు. అన్నగారి ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ.

నాయనివారు బి. ఎ. ఆఖరు సంవత్సరంలో ఉన్నారు. దేశంలో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమయింది. కృష్ణా క్లబ్బులో ఉపన్యాసాలు జరిగేవి. జాతీయత ఒంటబట్టింది. సహాధ్యాయులయిన కాటూరి వేంకటేశ్వరరావుగారు డిసెంబర్‌లోనే చదువు మానుకున్నారు. నాయనివారు, కళా వెంకటరావు, పులిగండ్ల వేంకటకృష్ణయ్య (నెల్లూరు), భాగవతుల లక్ష్మీనారాయణ మున్నగువారు పరీక్షకు డబ్బుకట్టి మానుకున్నారు. బందరుకు గాంధీజీ విచ్చేశారు. వారికి మౌలానా షౌకతాలీ, మౌలానా మహమ్మదాలీ అంగరక్షకులు. ఆ దృశ్యం చూచిన నాయనివారు పలువురు మిత్రులతో కలిసి మహావేశంతో వెళ్లి ఒక ముస్లిం దుకాణంలో తేనీరు తాగివచ్చి, కళాశాల బోర్డు మీద "వందేమాతరం గీతము సాటింపుడీ" అంటూ వ్రాసి ఒంగోలుకు పయనమయ్యారు.

నాయనివార్ పరీక్ష మానుకుని తిరిగిరావడం ఒంగోలులో మేనమామగారింట్లో ఎవరికీ ఇష్టంలేదు. నాయనివారు వారి కోరచూపులు, గిరమాటలు తప్పించుకొనడానికి ఒంగోలు కొండమీద విహరించడం ప్రారంభించారు. కొండ అవతల భావిలో ఈత, కొండమీది సుందర ప్రకృతి ఊత — ప్రణయ కవిత ఉప్పెనగా వచ్చింది.

"చెప్పె నత్తమ్మ చేతిలో చేయి వైచి
నీ కుమారున కిచ్చెద నా కుమార్తె
ననుచు మును నాన్న; నేడు పేరాస దగిలి
తోసిరాజనె జేసిన బాస లన్ని"

అంటూ 'వత్సల వలపు'గా రూపొందింది. దానిని వెంటనే 'సాహితి' పత్రికకు పంపారు. (1922) ముద్రితమైంది. అదే నాయనివారి తొలి ముద్రిత రచన.

ఆ రోజులలో ఒంగోలులో ప్రకాశంగారింట్లో జాతీయ పాఠశాల నెలకొల్పబడింది. నాయనివారు ఆ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. భూగోళశాస్త్రం చెప్పేవారు.

ఏమైనా బి ఎ. ముగించక తప్పలేదు. మరల బందరు వెళ్ళారు. అప్పుడే విశ్వనాథవారితో పరిచయమయింది. విశ్వనాథవారు జాతీయ కళాశాలలో ఉపాధ్యాయులు. వారి సోదరులు శ్రీ విశ్వనాథ వేంకటేశ్వరులుగారు కృష్ణాపత్రికలో ఉప సంపాదకులు కనుక వారి పరిచయంతో కృష్ణా పత్రికకు తప్పనిసరిగా పద్యాలు వ్రాయడం అలవడింది. కవితా వ్యాసాంగం కొనసాగింది. కాని, మాతృ వియోగం సంభవించింది. తల్లడిల్లిపోయారు. ఆ దుఃఖంలో "మాతృగీతాలు" ఆరంభించారు. మాతృప్రేమ పొర్లిపారని సాహిత్యం ఏ దేశంలోనైనా ఉంటుందా? ఆ సాహిత్యంలో

ఈ గీతాలు మణిపూసలు: అమ్మనుంచి అమ్మలగన్న యమ్మవద్దకు; ముగురమ్మల మూలపుటమ్మ వద్దకు హృదయాన్ని కొనిపోయే కరుణావాహినులు.

మాతృవియోగంతో ఆ ఏడు, మరుసటి సంవత్సరం వివాహంవల్ల పరీక్ష పోయింది. పరీక్షలో ఇంగ్లీషు పరీక్షనాడు తమ ప్రణయ తపఃపరమావధిగా సిద్ధిని పొందినందుకు 'ఫలశ్రుతి'గా—

"అంత శ్రమపడి పావన మ్రభగంగ
ధారుణికి దెచ్చినాడు భగీరథుండు
అంత మధియించి కలశ రత్నాకరమ్ము
అమృత భాండమ్ము పడసినా రమర నరులు"

అన్నపద్యం వ్రాసి తిరిగి వచ్చారు. పద్యం చదివి ప్యాసుచేసే పరీక్షక మహాశయుడు ప్రపంచంలో పుట్టలేదు మరి : నాయనివారు 1925 సెప్టెంబరులో బి. ఎ. పూర్తిచేసి, మరు సంవత్సరం నెల్లూరులో ప్రొబేషనరీ సబ్ రెజిస్ట్రారుగా చేరారు. ఎనిమిది నెలలే ఈ నౌకరీ సాగింది ఈ భావుకులకు. అయిదు గంటలకే ఇంటికి వెళ్లేవారు. దానితో తగాదా వచ్చింది; మానివేశారు. తర్వాత విశ్వవిద్యాలయంలో (విజయవాడలో)లోవర్ డివిజన్ గుమాస్తా గిరితో కొంతకాలం గడిచింది.

ఇంతలో నాయనిగారి కవితా జీవితమూ, జీవితమూ ఒక్క స్థాయిని ప్రస్థానం చేసే గొప్ప సంఘటన జరిగింది. సాహిత్యోపాసకులకు కల్పవృక్షమయిన శ్రీ బెల్లంకొండ రాఘవరావుగారు నాయనివారి ప్రతిభను గుర్తించి, వారికి నరసారావుపేటలో ఉపాధ్యాయ పదవి కల్పించారు. నాయనివారు అక్కడే ప్రధానోపాధ్యాయులై పదవిని విరమించారు.

నాయనివారు దాదాపు ఒక్కతరం కాల్పనిక కవితను ఆరాధించారు. తక్కిన భావకవులేమో ప్రణయాన్ని తదేకంగా భావించినవారు. నాయనివారు ప్రణయాన్ని దేవీమూర్తిలోని ఒక అంశగా, ఒక కళగా దర్శించారు. తల్లి ఉద్బోధతో వలవులజ్యోతినే కనుగొనడానికి బయలుదేరి, తల్లికొరకే యాత్ర సాగించి; సమగ్ర దేవీమూర్తినీ మాతృభావంతో దర్శించి, ఏకదేశంగా తన ప్రియురాలిలో ప్రణయ భావాన్నిచూచారు. సాటి కవులలో కనిపించనిదీ, వీరిలో కనిపించేదీ విశేషమిదే.వారి సర్వకృతుల సంకలిత సంపుటి "నాయని సుబ్బారావు కృతులు".

వారి పద్యాలు జీవితాన్ని చీల్చుకొనివస్తాయి. చక్కగా చిక్కగా, అతి వేలమైన సంయమంతో. అనంతమైన భావనతో పద్యాలు చికిలీ పెడుతారు. కనుకనే వారికి తిక్కన పదబంధం, తిక్కన మెలకువలు చాల యిష్టం. కేతనదశకుమార చరిత కథాకథనమూ ఇష్టమే. కేతనా తిక్కన పధం వాడేగా!

నాయనివారు 1957 లో హైదరాబాదు చేరారు. ప్రస్తుతం హైదరాబాదు రేడియో కేంద్రంలో రచనా ప్రయోక్తలు. దాదాపు పదహారు రేడియో నాటికలు వ్రాశారు.

వారికీ నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె శ్రీమతి నాయని కృష్ణకుమారి ఉమెన్స్ కళాశాలలో ఆచార్య. వారి సతీమణి శ్రీమతి హనుమాయమ్మగారు. ఆమే వారి ప్రణయ కవితకు ఆలంబన సదృశయైన వత్సలాదేవి.

నాయనివారు ఉదయం ఆరు గంటలకే లేచి, కాలకృత్యాలు తీర్చుకుని పద్యాలు ఆలోచించి, చికిలీవెట్టడం తలపోస్తుంటారు. సాయంకాలం వాహ్యాళి వెళ్ళుతారు. వారికి నడక చాల యిష్టం. సహాయ నిరాకరణోద్యమంలో రోజుకు పది పదిహేను మైళ్ళు తిరిగేవారు మరి.

వారు ఆంగ్ల సాహిత్యమూ ఎంతో పఠించారు. కాని ఏ కవిముద్రా వారి హృదయంపై పడలేదు. "కవిత్వానికి నన్ను ప్రేరేపించింది ఘటనలే. ప్రేమ, మాతృవియోగం, నరసారావుపేటలో పడిన బాధలు, స్వస్థలాన్ని వదలినప్పటి బాధ నన్ను కవిగా చేశాయి. ఆ బాధాఫలమే 'వేదనా వాసుదేవము' అంటారు వారు. ఇప్పుడు తమ చిన్ననాటి అనుభవాలు చెప్పుకునే 'జన్మభూమి', 'కథ కంచికి —?' అన్న ఖండికలో సూచినట్టు "అశరీర వధువు" అన్నకావ్యం ప్రాయగోరుతున్నారు. వారు సంకల్పసిద్ధులు. కవితామతల్లి ఒడిని నింపుతారు.

ఉపాధ్యాయ వృత్తిలోనే అనుభవం పండి, విజ్ఞానం నిండారినవారు గనుక విద్యారంగంలో వారి అభిప్రాయాలు విలువైనవి. నరసారావుపేట ఉన్నత పాఠశాలలో తెనుగు బోధనభాషగా చేరినవారిలో ప్రముఖులు వారు.

"ఇంగ్లీషు ప్రమాణంతో మనకేమిపని ? ప్రయోజనం? దాని ఉపయోగం ఎంత వరకనేది గ్రహిస్తే చాలు" అంటారు వారు.

"నేడు విద్యార్థులలో విషయగ్రహణం హెచ్చింది. ఇంగ్లీషు ప్రమాణం పడిపోవడం వల్ల నష్టం లేదు. చిన్నప్పుడు మాతృభాష క్షుణ్ణంగా నేర్చుకుంటే ఇతర భాషలు నేర్చుకోవడం సులభం. భాషల మూలసూత్రాలన్నీ సమానమే కనుక మాతృభాష మూలసూత్రాలు ఒంటబట్టాలి. మూడవఫారందాక తెలుగులోనే చెప్పాలి. తర్వాత మూడేళ్ళలో కళాశాలా ప్రవేశానికి తగినంత ఇంగ్లీషు సునాయాసంగా నేర్చవచ్చు.

"మనం ఎంతో పరిభాషను సంస్కృతం నుంచి తెచ్చుకుంటున్నాము. సంస్కృతంలో విదేశ పరిభాషాపదాలు ఎన్నో చేరాయి. అలాగే మనం పారిభాషిక పదాలను ఇతర భాషలనుంచి స్వీకరించి మలచుకోవచ్చు. దీనివల్ల ఉత్తరోత్తరా, స్వతంత్రంగా ఆలోచించి పరిశోధనలు జరుపడానికి వీలవుతుంది" అంటారు వారు.

మితభాషులు, నివురుగప్పిన నిప్పువంటివారు అయిన నాయనివారు తమ సహజ సుకుమార సౌజన్యంతో ప్రకృతిని ఆరాధిస్తూ, కవితను సేవిస్తూ, తాము తలపెట్టిన రచనలన్నిటినీ పూర్తిచేసి ఆంధ్రావళికి అర్పిస్తారనే విశ్వాసం ఆంధ్ర ప్రజలకుఉన్నది.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావు

అన్యాయం ఎక్కడ, ఏరూపంలో తలయెత్తినా ఎదిరించే అప్రతిమాన సాహసం మంచి ఏ కొంచెమైనా ముక్తకంఠంతో ముచ్చటించే ఔదార్యం; మిన్ను విరిగి మీద పడినా కర్తవ్యంనుంచి కాసంతయినా కదలని కఠోరదీక్ష; సమస్యలు ఒక్కొక్కమ్మడిగా విరుచుకొని పడినప్పుడు ధర్మదృష్టితో వివేచించి దారిచేసుకొనిపోయే వివేకం; ప్రశంసలకు పొంగిపోక, అభిశంసలను ఆహ్వానించి ఆనందించే ఆత్మగుణం, నమ్మినదానిని నిక్కచ్చిగా చెప్పి, చేసిచూపే నిబ్బరం; తన ఇరుగుపొరుగు వారంతా తనను మించి పోవాలనే తహతహ; దౌష్ట్యశిక్షణకు కలాన్ని కరకు కత్తిగావాడే పరాక్రమం, చేపట్టిన వృత్తిపై అపారగౌరవం కలబోసినట్టు కానవస్తారు, శ్రీ నార్ల వేంకటేశ్వరరావుగారు.

నార్లవారిని తలచుకొన్నప్పుడల్లా నాకు పత్రికా సంపాదకులుగా వారు చూపిన ధైర్యసాహసాలు ఎన్నో అహమహమికతో గుర్తుకువస్తాయి; కమ్యూనిష్టులు కనబడితే కాల్చిచంపు-అన్న ఉత్తర్వులు వీరవిహారం చేస్తున్న గడ్డురోజులవి. నేను ఇంటినుంచి కాలినడకన బయలుదేరాను ఆంధ్రప్రభ కార్యాలయానికి. నార్లవారి నివాసానికి కొంత

దూరంలో ఉన్న బస్సుస్టాపులో పెరోల్‌పై వచ్చిన కమ్యూనిష్టులు శ్రీ కాట్రగడ్డ రాజ గోపాలరావు, శ్రీమతి సూర్యావతీదేవి నిలబడి బస్సుకోసం ప్రతీక్షిస్తున్నారు సూర్యావతీదేవి చేతిలో ఏదో పొట్లంఉంది. నా దృష్టి దానిమీద పడింది. పొట్లం కట్టిన కాగితంపై నల్లటి తారు చారలున్నాయి. 'ఏమిటండీ ఇవి ?' అని అడిగాను. వారూ ఆశ్చర్యంతో పొట్లంవైపు చూచారు. అది వివాహాలు, వ్యాపార ప్రకటనలు వినా తక్కిన చోటల్లా నిలువునా తారుపూసిన ఆంధ్రప్రభ దినపత్రిక పుట. నాకు ఆశ్చర్యం కలిగింది. జాతీయ పత్రికఐన ఆంధ్రప్రభకు ఇదేమి దుర్గతిః -అని. కారాగారాధికారులు పత్రికను ఈ విధంగా సెన్సారుచేసి తమకు అందిస్తున్నారని వారు వివరించారు. నా ఒళ్లు పులకించింది. పక్కవీధిలోనే ఉన్న నార్లవారి ఇంటికి వారిని నడిపించాను. వారు కుశల ప్రశ్నల తర్వాత ఆ చారల కాయితాన్ని బల్లపై పరిచారు. నార్లవారి కళ్లు ఆశ్చర్యానందాలతో మిల మిలలాడాయి. దీనిని ఉన్నపాళంగా బ్లాకుచేసి ప్రకటిద్దాం అంటూ నిగరెట్టు ముట్టించి, ఆలోచనలోపడ్డారు. అది బ్లాకయింది; మరుసటి సంచికలోనే యథాతథంగా ప్రచురితమయింది, సంపాదకీయంతోసహా. దానిపై ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం దర్యాప్తుజరిపి, భయంకరమైన ఆ సెన్సార్ పద్ధతిని తగ్గించడం కారాగారానికి వెళ్లే పత్రికలకు తారువాతలు తప్పడం విషయాంతరం.

ఒకమారు వైశ్యులంతా విరుచుకుపడ్డారు "కోమటియుక్తి" అని ఏదో శీర్షిక పెట్టడం చూచి "యుక్తి కోమట్లకేనా, ఇతర కులాల వారికిలేవా ? మీ పత్రికవంటిది కూడా కులాలను ఆక్షేపించడమా ?" అని జాబులవర్షం కురిపించారు; మాననష్టం దావాల బెదరింపులతో నార్లవారు కులాలమీద ఉండే సామెతలను కొన్నిటిని సేకరించారు; మరునాడే ఇలాటి సామెతలు ఎప్పుడో కులాల స్వభావాన్ని బట్టి రూపొందినవని కులాల స్వభావాలు, వృత్తులు మారినా, అవి సాహిత్యంలో మిగిలిపోయాయని, వాటిని ప్రయోగించడంలో ఆంతర్యం భావతీవ్రతను తెలుపడమేకాని, కులాలను కించపరచడం కాదని సంపాదకీయంలో స్పష్టపరచిన తర్వాతగాని, వైశ్యులు శాంతిచలేదు.

'క్విట్ ఇండియా' ఉద్యమంలో జరిగిన దౌర్జన్యకాండకు కలతపడిన గాంధీజీ ఉపవాసం ప్రారంభించారు. దానిని పలువురు పలుతీరులు వ్యాఖ్యచేశారు. కానీ, నార్ల వారు 'ఆత్మసంశోధన' అనే సంపాదకీయంలో 'మహాత్ముల జీవితం సత్యాన్వేషణ, నిరంతర సంఘర్షణ. వారికి శాంతి ఉండదు; సౌఖ్యం ఉండదు; సంతృప్తి ఉండదు. వారి లక్ష్యాలు ఎంత మహోన్నతమైనవో అంత కష్టసాధ్యమైనవి. .....కాంతితో పాటు ఉష్ణాన్ని ప్రసాదించడం సూర్యమండల ధర్మం. కాంతితోపాటు శైత్యాన్ని ప్రసాదించడం చంద్రమండలధర్మం వాటి ధర్మాలను ఎవరు మార్చగలరు ? మహాత్ముల నిర్ణయాలు సయితం అట్టివే" (1944 అక్టోబర్ 25) అని ధైర్యంగా సమర్థించి గాంధీజీని అపార్థం చేసుకొన్నవారికి కనువిప్పు కలిగించారు. నార్లవారి కలం బలం అలాటిది. అది ఇరువైపుల పదనుగలది; ఒకవైపు పతితను ఆలోచనా పరాయణుని చేస్తుంది మరొకవైపు గుండెను నిండుగా చేస్తుంది. విశ్వకవి అస్తమించినప్పుడు వారి

సంపాదకీయం "ఒక కోయిల మూగవోయింది, ఒక దీపిక ఆరిపోయింది. ఒక నక్షత్రం రాలిపోయింది. ఒక వటవృక్షం కూలిపోయింది. ఒక సత్యవధికుడు కన్ను మూశాడు. (1945 జనవరి 3) అని అంగలార్చినపుడు కన్నీరు నింపని సహృదయుడు కానరాలేదు. 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని అణచివేయడానికి బ్రిటిష్ ప్రభుత్వం పడినపాటును విమర్శిస్తూ, భారతీయుల స్వాతంత్ర్య భావన ఎన్నటికీ చావదని ఎప్పటికైనా బ్రిటిష్‌ప్రభుత్వాన్ని దహించక తప్పదని తెగవేసి చెబుతూ వ్రాసిన "అమరజ్వాల" అనే సంపాదకీయం నార్లవారి ధైర్యానికి, పత్రికారచనా పాటవానికి అమరసాక్షిగా ఎన్నికాలాలకైనా నిలుస్తుంది.

నార్లవారికి ఈ గుణాలన్నీ హఠాత్తుగా కలిగినవికావు; చిన్ననాటినుంచే అలవడినట్టివి. ఔనూ, పూవుపుట్టగనే పరిమళిస్తుందని పెద్దలు అననే అన్నారు. నార్లవారి లేలేతహృదయంపై కొల్లి సత్యనారాయణచౌదరి, చెరకువాడ వెంకటనరసింహం పంతులు వంటి బ్రహ్మసమాజనాయకుల ప్రభావం పడింది. అప్పటినుంచే, విగ్రహారాధనపైన, బోగంమేళాలపైన మనసుతిరిగింది. కాకినాడలో విద్యార్థిగా వున్నప్పుడే, వినాయకచవితి ఉత్సవాలలో జరిగే బోగంమేళాను ప్రతిఘటిస్తూ ఉద్యమం ప్రారంభించారు; ఆ డబ్బుతో గుడ్డలుకొని, చందాలు, అత్యవసరవస్తువులు సేకరించి తుఫాను బాధితులకు ఆర్తులకు పంచిపెట్టేవారు. ఈ అలవాటే తర్వాత ఆంధ్రప్రభ సంపాదకులుగా ఉన్నప్పుడు తలఎత్తి, రాయలసీమ క్షామనివారణనిధికి, గోదావరి వరదబాధితుల సహాయనిధికి, తూర్పుగోదావరి తుఫానుబాధితుల సహాయనిధికి ఆంధ్రప్రభ పూనుకొని దాదాపు పదిలక్షలరూపాయలు సేకరించడంలో కృతకృత్యమైంది; ఈ నిధులను రామకృష్ణమఠంవారు సవ్యంగా వినియోగించారు. జాతీయ భావాలుకలవారు కనుక విద్యార్థిదశలోనే, అధికారుల దౌర్జన్యాలపైకినిసి విప్లవవాదులతో చేయికలపడం 1927 లోనే మద్రాసు కాంగ్రెస్ మహాసభలలో పాల్గొనడం మొదలయిన కారణాలవల్ల వారి చదువు కాకినాడ, గుడివాడ, గుంటూరు, కాకినాడ, మచిలీపట్నంలలో కొనసాగింది. 1934 లో పట్టభద్రులయ్యారు. ఎం.ఎ. చదువుదామని వారికి కోరిక ఉండేది; కాని పత్రికాలోకం అదృష్టవశాత్తు వారు జీవికకోసం పత్రికలకు వ్యాసాలు వ్రాయడం, పనిచేయడం అవసరమైంది. దానితో వారి జీవితగతి మారింది. జస్టిస్ పత్రికలో కొన్నాళ్ళు జీతంలేని అప్రెంటీసుగా పనిచేసి, జనవాణి, ప్రజామిత్ర పత్రికల సంపాదకులుగా ఉండి 1939 లో ఆంధ్రప్రభలోచేరి 1942 నుండి 1959 వరకు సంపాదకులుగా సేవచేశారు. తర్వాత 1960 నుంచి విజయవాడలో 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక స్థాపక సంపాదకులుగా సేవచేస్తున్నారు.

సంపాదకులుగా ప్రజాభిప్రాయాన్ని రూపుదిద్దడంలో నార్లవారికి నార్లవారే సాటి. వారిశైలి పఠితను భావావిస్టుల్ని ఆలోచనాపరుణ్ణిచేసి, కర్తవ్యపరాయణతతప్ప గత్యంతరంలేదనే నిర్ణయానికి తెస్తుంది. ఇది వారి విద్యార్థిదశలోనే వ్రాసిన తొలి

పుస్తకం "స్వదేశసంస్థానాలు"లోనే వ్యక్తమయింది. అది ఆనాడే వెయ్యిప్రతులు అమ్ముడుపోయిందంటే నేటికి ఆశ్చర్యమే. దానిని ముట్నూరి కృష్ణారావువంటి పెద్దలు కృష్ణాపత్రికలో సంపాదకీయంతో ప్రశంసించడం మరింత ఆశ్చర్యం.

పనిచేయడంలో నార్లవారు బడే "టాస్క్‌మాస్టర్." గంటకు కాలం మౌలికంగా నైనా అనువాదమైనా వ్రాయని జర్నలిస్ట్ ఎందుకు?—అనేది వారిసూత్రం. జగ్గయ్యపేట బుద్ధసంచికకు ఆగ్నేయాసియాతో బౌద్ధమత విస్తరణనుగురించి "నాలుగు కాలాలవ్యాసం "రేపు సిద్ధపరచండి" అని సాయంకాలంచెప్పి వెళ్ళిపోయారు "ఆనాడు నేను పడినబాధ వర్ణనాతీతం. లైబ్రరీలచుట్టూ రాత్రి ప్రదక్షిణంచేసి ఏదో మొక్కుబడి చెల్లించాను. కాని అట్టి అసిధారావ్రతం లేనిదే ఎవరూ ఏమీ సాధించలేరన్నది నిజం. ఈ దృష్టితో "నా సహచరులు చాలమంది గొప్పరచయితలయారు" అది నాకెంతో సంతోషం కలిగిస్తున్నది" అని వారు అన్నప్పుడు నిజం అంటూ కృతజ్ఞత ప్రకటించాను.

ప్రపంచంలో, ఏమూల, ఏ గొప్పసంఘటన జరిగినా, వారి హృదయం స్పందించకతప్పదు. దాని ఫలితం సంపాదకీయ స్వరూపందాల్చకనూ తప్పదు.

నార్లవారు అప్పటినుంచి నేటి రష్యా కొత్తగడ్డ అనే నాటికల సంపుటి, మాటా మంచీ పిచ్చాపాటి అనే వ్యాసాల సంకలనాలూ నార్లవారిమాట, జగన్నాటకం అనే కావ్యాలు, మావూరు అనే గేయసంపుటి, జాబాలి పంచరత్నం అనే నాటికలు వీరేశలింగం, వేమనలపై ఆంగ్లపుస్తకాలు, రష్యన్‌కథలు. మరెన్నో వ్యాసాలూ పుస్తకవిమర్శలు వ్రాశారు. నాకుమాత్రం వారు పత్రికారచనకు సాహిత్యస్థాయి సంతరించిన మహారచయితలుగా, ఆంగ్లంలో ఉన్న వినోద విజ్ఞానదాయక వ్యాసాలు వరవడిని తెలుగులోకి తెచ్చిన భగీరథులుగా దర్శనమిస్తారు.

వారు 1958 నుంచి రెండుసార్లు రాజ్యసభ సభ్యులుగా ఉన్నప్పుడు, ఆంధ్రప్రదేశ్ పత్రికారచయితలసంఘం అధ్యక్షులుగా వున్నప్పుడు సాహిత్య అకాడెమీ సభ్యులుగా ఉన్నప్పుడు, రాజ్యసభ సభ్యులుగా వివిధ సాంస్కృతిక ప్రతినిధివర్గాల సభ్యులుగా విదేశాలలో పర్యటించినప్పుడు, దేశహితం, దేశగౌరవం ఇనుమడింపజేశారు. ఇలాటి వారిని ఆంధ్రవిశ్వవిద్యాలయం 1973 లో 'డాక్టరేట్'తో గౌరవించడం ఆశ్చర్యమేమీకాదు.

నార్లవారు తాము 1908 లో జబ్బల్‌పూర్‌లో పుట్టినప్పటిస్థితిని, ప్రతికికెడిన సంసారంలో కలిగే ఉత్పాతాలను చెబుతూ, అప్పుడు తమకు తోడ్పడిన దూరపు జ్ఞాతి నార్ల వెంకటరామన్నగారిని, ఆ కష్టసమయంలో తమ కుటుంబం నిలబెట్టి తమ నందరినీ చదివించినతల్లి శ్రీమతి మహాలక్ష్మమ్మగారిని మద్రాసులో తమకు తోడ్పడిన ప్రజాబంధు మొదలయిన పత్రికల సంపాదకులు ఎస్.జి. ఆచార్యగారిని కృతజ్ఞతతో కళ్ళుమూసుకొని స్మరిస్తారు. వారి తల్లిగారి వయస్సు 92 సంవత్సరాలు.

వారు పూర్వం రాత్రిళ్లు పొద్దుపోయే వరకు పనిచేసి ఉదయం ఏడెనిమిది గంటలకు లేచేవారు. "ఇప్పుడూ అట్లాగేనా ?" అని అడిగాను. "ఇప్పుడు అలాకాదు. రాత్రి 9 గంటలకే పడుకొని ఉదయం నాలుగుకే లేచి వ్రాసుకుంటున్నాను" అన్నారు.

సిగరెట్ తెగతాగేవారు నార్లవారు.-శృంఖలాధూమవాయి అని మా పత్రికల వారు వారికిచ్చిన బిరుదు. "ఇప్పుడుచూస్తే సిగరెట్టు మానుకొన్నట్టున్నదే!" అన్నాను. "ఔను! కాఫీకూడ మానివేశాను. ప్రకృతి చికిత్స పొందుతున్నాను" అన్నాడు. అంతటి బలమైన అలవాటును ఎలామానుకున్నారా, అనుకుంటుండగా, నాకు 1946 లో ప్రకటితమైన 'కదంబం' అనే వ్యాససంపుటంలోని 'అలవాట్లు' అనే వాస్యం జ్ఞాపకం వచ్చింది. "అలవాటయిన పనిలో ఆనందం తక్కువ. అంచేత ఒక్కొక్కప్పుడు అలవాట్లు అతిక్రమించగోరుతాము. కాని, దానికి చాలా మానసిక దార్ఢ్యం కావాలి; సంకల్పం కావాలి.....కాని, వాస్తవికంగా జీవిత మాధుర్యాన్ని అనుభవించగలవాడు అలవాట్లకు అతీతుడైనవాడే." అనే ఆ వ్యాసంలోని కొన్ని వాక్యాలు ఏకరువు పెట్టాను. వారు మందహాసం చేశారు.

వారు పూర్తిగా వ్యావహారిక భాషావాదులు, "నా వాదం మహామహోపాధ్యాయ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు సయితం అంగీకరించారు. పత్రికల నిర్వహణకు వ్యవహారభాష ఉచితమని వారు నాకు ఎప్పుడో ఉత్తరం వ్రాశారు. వారు కీర్తిశేషులు కావడానికి ముందు వారినుంచి నాకొక ఉత్తరం వచ్చింది. తమభావం ఏమీ మారలేదంటూ" అని వారు సగర్వంగా చెప్పుకున్నారు.

"తిడుతూ వ్రాసిన ఉత్తరాలను జాగ్రత్తగా ఉంచాను" అంటూ వారు కొన్ని ఉత్తరాలు చూపారు. వాటిలో ఒక మారని చెక్కువుంది. దానిపై నా చూపు పడిందో లేదో "ఇది సంభావన చెక్కులేండి. పాములపాటి వెంకటకృష్ణయ్య చౌదరిని విన్నారుగ, ఆయన పంపారు. నే నేదో సాహిత్యసేవ చేస్తున్నానని, నూటపదార్లకు" అంటూ ఎత్తి చూపారు. దానిపైన 25-10-1951 తారీఖువుంది.

హైదరాబాద్ నగరంలో బంజారా హిల్స్‌లోని వారి ఇల్లు నాడూ, నేడూ సరస్వతీ భండారం. ఇంటి నిండా పుస్తకాలే. నాటక సాహిత్యం, చరిత్ర, పురావస్తు గ్రంథాలు కోకొల్లలు. కనీసం నాలుగైదులక్షల రూపాయల విలువగల పుస్తకాలైనా వుంటాయి. ఇవి కాక చిన్ననాటినుంచి సేకరించిన కళాఖండాలను ఐదారు గదులలో అలంకరించారు. "ఇది శివరూమ్, ఇది బుద్ధరూమ్, ఇది కృష్ణరూమ్, ఇది రాజస్థాన్ రూమ్" అంటూ ఆయా శిల్పాలు అలంకరించిన గదులు చూపుతారు. వివిధ దేశాల వస్తువులు అమర్చిన హాలును చూచి నేను "దీనికి అంతర్జాతీయ రూమ్" అని పేరు పెట్టండి అన్నాను. వారి గ్రంథాలయం చూచిన మీదట వారి వ్యాసం "స్వంతపుస్తకం" లోని కొన్నిమాటలు అప్రయత్నంగా నా నోటినుంచి వచ్చాయి. పుస్తకాలు కొనడమంటే నాకు చెడ్డసరదా. జేబులో డబ్బున్నా లేకపోయినా మంచి పుస్తకాన్ని చూడగానే బేరం చేస్తాను. ఆ పుస్తకంతో నాకు అవసరం వుండవచ్చు లేకపోవచ్చు. ఒకసారి

చదివిన తర్వాత మరి దానితో పనిలేకపోవచ్చు. అయినా దాన్ని కొనేదాకా మనస్సు రెపరెపలాడుతుంది. అప్పుచేసికూడ పుస్తకాన్ని కొనడం అనేకసార్లు సంభవిస్తూ వుంటుంది. — పుస్తకాన్ని ఎరువివ్వక తప్పదు. అది పోవడమూ తప్పదు. అలాగని అసలు వాటిని కొనడమే మానలేము. ఇతరుల సంగతి తెలియదుగాని, నా విషయంలో ఇంతే. ఇప్పటికీ, ఎప్పటికీ"

నార్లవారికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు. మొదటి కుమారుడు పిహెచ్. డి. తక్కిన వారంతా డాక్టర్లు. నార్లవారి గొప్ప అదృష్టం వారి సహధర్మచారిణి శ్రీమతి సులోచనాదేవిగారని నా సంపూర్ణ విశ్వాసం. ఆ గొప్పఇల్లాలు వారిని కంటికి రెప్పవలె అనపాయినిగా కాపాడుతూ, ఇంటిని నిర్వహించడంవల్లే వారికిఅభ్యుదయ పరంపర కలిగిందని నా నమ్మకం. మూడు దశాబ్దాలకు పైగా ఆమెను దర్శిస్తున్న నాకు, ఒకమారైనా విసుగు, చీవర ఆమెలో కనిపించలేదు. "నాకు డాక్టరేట్ ఇచ్చారు. మా ఆవిడకు డాక్టరేట్ ఎవ్వరూ ఇవ్వడంలేదు" అన్నారు నార్లవారు ఛలోక్తిగా. ఇంతకన్నా ఏమి డాక్టరేట్ కావాలి. ఆమెకు- భర్త డాక్టర్; పిల్లలంతా డాక్టర్లు అనిపించింది నాకు.

"మొన్నటి 1974 డిసెంబరు 1 వ తేదీకి మీకు 66 నిండినవి. మీరు మీ సులోచనాదేవిగారూ ఆరోగ్యభాగ్యాలతో వేదోక్తమయిన ఆయుస్సుతో ప్రజాహితం కోసం పాటు పడుతూ వుండాలి" అంటూ సెలవు పుచ్చుకున్నాను. వాని గదులలోని శిల్పాలు తథాస్తు అని తలలు పంకించినట్టు నాకు అనిపించింది.

శ్రీనిడుదవోలు వేంకటరావు

"అంకెల బారులంబడి య
హర్నిశ మిట్టటు గొట్టుకొంచు నే
వంకను బుద్ధి కిన్నెడ ర
వంతయులేకను సాహితీ రసం
బింకగనున్న వేళ నను
నెంతయు బ్రీతి దెలుంగువారి ది
వ్యాంకము నందు నిల్పిన మ
హాప్రభు నెన్నెద సూర్యరాక్విభున్"

అని ఆనందబాష్పాలు కురిపిస్తారు "పరిశోధన పరమేశ్వరులు" శ్రీనిడుదవోలు వేంకట రావుగారు. ఔను; నిడుదవోలువారు బెర్నార్డ్‌షావలె బ్యాంకిగుమాస్తాగా జీవితం ప్రారం

భించారు. ఆ అంకెల గారడీని ఆకళించుకున్నారు. కాని, ఉక్కు కటకటాల వెనుక ఉక్కు తెరలమధ్య బ్యాంకిలో (ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో) పని వారికి నచ్చలేదు. విసిగిపోయారు. అంకెల లంకెలతో సహజంగా సాహిత్య పిపాసగలవారు, విసిగిపోక మరేమవుతారు? ఆ విసుగు వారే అప్పుడు చెప్పిన

"చనియెన్ ద్వాదశ హాయనంబులపయిన్
షణ్మాసకాలంబు బ్యాం
కునకే దేహపుటస్థి చర్మములు రెం
డున్ థారగాబోసి జీ
వనమున్ బుచ్చితి సేవజేసితి మనో
వాక్కాయ కర్మంబులన్
వినియోగించితి నాదు ధీపటిమ వ
న్నెందెచ్చు నెద్దానిలోన్!"

అనే పద్యంలో స్పష్టమవుతుంది. ఆలాటి పరిస్థితిలో తమను సాహిత్య మార్గంలో పెట్టిన పెద్దమనిషిని ప్రశంసించడం సహజం.

నిజానికి నిడుదవోలువారి సాహిత్యజీవితం విద్యార్థి దశనుంచే ప్రారంభమయింది. 1918 లోనే వారు పరవస్తు రంగాచార్యుల మీద, 1919 లో గాంధీజీ 50 వ జన్మదినోత్సవం సందర్భంగా గాంధీజీ మీద పద్యాలు చెప్పడంతోనే దీనితో తెలుగులో పద్యాలలో సాహిత్యానికి నాందికూడ వీరే పలికారు. ఈ పద్యాలు విజయనగరం నుంచి వెలువడే 'భారతమాత' అనే వారపత్రికలో ప్రచురిత మయాయి. నిడుదవోలు వారు సహాయనిరాకరణోద్యమంలో విద్యార్థిగా వున్నప్పుడే పాల్గొని "విద్యార్థివీరుడు" అనే ఖ్యాతి పొందారు.

"గాంధీజీ 1924 లో విజయనగరం వచ్చారు. హిందీలో గాంధీజీతో సంభాషించేవారు ఎవరైనా ఉన్నారా?-అని ఎవరో ప్రశ్నించారు. మా నాన్నగారు హిందీ వచ్చినవారు. ఆ సంగతి నాకు తెలీదు. వారువచ్చి గాంధీజీ భాషణాన్ని తెలుగులోకి అనువదించారు. "చర్ఖాపంచకం" అనే పద్యాలు చెప్పారు. నేను గాంధిజీని కనులారా దర్శించాను" అని నిడుదవోలువారు సంతృప్తితో అన్నారు.

నిడుదవోలువారు 1903 లో విజయనగరంలో జన్మించారు. విజయనగరం పండితప్రకాండుల పుట్టినిల్లుగనుక చిన్ననాటినుండే సారస్వత సమీరాలు వారిపై వీచాయి. విద్యార్థిదశ సి.బి మిషన్ హైస్కూలులోను, ఎ.వి.ఎన్. కళాశాల మహారాజ కళాశాలలోను గడిచింది. 1926లో పట్టభద్రులై ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో గుమాస్తాగా చేరారు. అప్పూ సప్పూ చేయక గడవని సంసారం. బ్యాంకి ఉద్యోగం నిత్యకృత్యాలకుకూడ నియమబద్ధమైన కాలపరిమితి, తండ్రి శ్రీ సుందరంపంతులుగారి తాళదళ సంపుట ప్రకర కాంతారం"లో నిర్నిద్ర పరిశ్రమ-వీటివల్ల వీరిధారణ రాటుదేరి,

ఏకసంథలోనే విషయాలు మెదడులోని అరలలోచేరి, అవసరమైనప్పుడు గూళ్ళ నుండి గునగునమంటూ వచ్చే పావురాళ్ళవలె అసలసలనే ఊతపదంతో వెలికి వస్తూంటాయి.

1923, 1924 లలో జరిగిన సంఘటనలు విద్వత్కవిలోకానికి నిడుదవోలు వారిని సన్నిహితం చేశాయి. 1923 లో తణుకులో శ్రీ వేలూరి శివరామశాస్త్రిగారి అధ్యక్షతన జరిగిన విద్వత్సభలో "రాణికి పాదముల పట్టు రాణ విధించెన్" అనే సమస్యను ఈయన—

"ప్రాణికి నాయువు పట్టును
వాణికి రసనమ్ము పట్టు, వరకంకణ సు
శ్రేణికి కైపట్టును, పా
రాణికి పాదములుపట్టు రాణ విధించెన్"

అని పూరించారు. 1924 లో మద్రాసులో జరిగిన ఓరియంటల్ కాన్ఫరెన్సు తృతీయ వార్షిక సమావేశంలో 'నన్నెచోడుని కాలము' అనే పరిశోధన వ్యాసాన్ని ఆంగ్లంలో చదివారు. ఈ రెండు సంఘటనలతో నిడుదవోలువారిపై విద్వత్కవుల, పరిశోధకుల దృష్టి పడింది. కాని, ఈయన పండితులను ఆశ్చర్యచకితులనుచేసింది 1934 లో వీర శైవశాస్త్ర గ్రంథమైన 'వీరశైవ అష్టావరణ ప్రమాష్టకాభరణము' అనేదానిని,1935లో 'త్రిపురాంబకోదాహరణము'ను సవిమర్శకంగా ప్రచురించడం. ఈ రెండిటితో నిడుదవోలువారు కొమ్ములు తిరిగిన అప్పటి పరిశోధకుల సరసన పీట వేసుకొన్నారు. కాని బ్యాంకు బంధాలు ఇంకా వదలలేదు. అప్పటికి అవి తొలగడమూ విచిత్రంగానే జరిగింది.

నిడుదవోలువారికి విజయనగరం నుంచి కాకినాడలోని ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖకు తబాదతా అయింది. 1936 లో పిఠాపురం రాజా సూర్యారావు బహద్దరుగారు తమ ఆస్థాన విద్వత్కవులైన ఓలేటి వేంకటరామశాస్త్రిగారి వద్ద నన్నెచోడుని కుమారసంభవం చదువుతున్నారు. దానిలోని వీరశైవాగమ సంప్రదాయాలు తెలుసుకొనడానికి తగిన వీరశైవాగమజ్ఞులు కావలసివచ్చింది. సుప్రసిద్ధ విమర్శకులు నడకుదుటి వీరరాజుగారు "బ్యాంకులో వేంకటరావు వుండగా ఎందుకు మహారాజా ఆలోచన?" అని రాజాగారికి నివేదించారు. బ్యాంకి గుమాస్తాలలో ఇంతటి వారుం టారా అని ఆశ్చర్యపడ్డారు పిఠాపుర ప్రభువులు. వెంటనే నిడుదవోలువారిని పిలి పించారు. అప్పటినుండి పరిచయం పెరిగింది ఇద్దరి మధ్యా. ఇలాటి విద్వాంసుడు బ్యాంకిలో అంకెలసంకెళ్ళలో పడడం సమంజసం కాదనుకున్నారు రాజాగారు. కనుక గుమాస్తాపనికి ఇస్తీఫా ఇప్పించి తమ కళాశాలలో ట్యూటరుగా నియమించారు. ఇది జరిగింది 1939లో. సంవత్సరంపాటు అక్కడ పనిచేసి, రాజాగారి సూర్యరాయాంధ్ర నిఘంటు' కార్యాలయంలో పదసంగ్రాహకులుగా చేరారు నిడుదవోలువారు.

ఈయనకు ఇప్పటికి సరైన పనిదొరికింది. ఈయన ధారణశక్తికి నిఘంటు ప్రధాన సంపాదకులైన శ్రీ జయంతి రామయ్యపంతులుగారు, శ్రీ వెంపరాల సూర్యనారాయణశాస్త్రిగారు మొదలైనవారు ఆశ్చర్య పడేవారు. కాని నిడుదవోలువారి దృష్టికి పడిన ప్రతిపదానికి ప్రయోగం వెంటనే స్ఫురించవలసిందే. 'నేను చదివాను అన్నట్లుకాక ఈయనకు కంటబడ్డ ప్రతి విషయమూ ఒంటబట్టి పోవలసిందే. ఆ యా గ్రంథాల ముద్రణాది వివరాలతోసహా ఏ విషయమైనా అడిగిందే తడవుగా చెప్పడంలో ఈయనకు ఈయనే సాటి. తీగ కదిలిస్తే డొంకంతా కదుల్తుందన్న సామెత ఈయన యెడల సార్థకం. ఒక్క పదం ప్రస్తావించండి, నన్నయ మొదలు నేటిదాక అన్ని గ్రంథాలలోని ఆ పదప్రయోగసరళి నిర్ఝరపాతంగా మనపై దూకవలసిందే. ఝంఝామారుతంగా మనమీద వీచవలసిందే. అందుకనే ఎవరో ఈయనను "ప్రయోగమూషిక మార్జాల" అని అన్నారు. ఈయన తెలుగు సాహిత్యంలో చదివి మరచిందిలేదు; ఒడలు మరచి చదవందిలేదు. తెలుగుభాషలో ఏ మూల ఏమున్నదో చూపగల జగదివిటి నిడుదవోలువారు. కనుక త్వరలో సూర్యారాయాంధ్ర నిఘంటువులో అసమగ్రమైన మూడవసంపుటి సమాప్తి కావడానికి, నాలుగవ సంపుటం సిద్ధం కావడానికి కృషిచేశారు ఈ పని చేస్తూ, 1941 లో మద్రాసు విశ్వవిద్యాలయం ఎం. ఎ. లో సర్వప్రథములై సువర్ణపతకం పొందారు. పిదప ఒక యేడు పి. ఆర్ కాలేజీలో పనిచేసి, 1944 లో మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో సహాయోపన్యాసకులుగ చేరి 1949 నుంచి తెలుగు శాఖాధ్యక్షులై 1964 లో షష్టివర్షాలు పూర్తి కావడంవల్ల పదవినుంచి విరమించారు. అనంతరం హైదరాబాద్‌కు తరలివచ్చి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో యూనివర్శిటీ గ్రాంట్సు కమీషన్ ప్రొఫెసరుగా నాలుగేళ్లు పనిచేశారు.

ఈయన ప్రతిభ, పరిశోధన, రచనా వ్యాసంగం 1944 నుండి 1974 వరకు అవిచ్ఛిన్నంగా ముప్పయి సంవత్సరాలపాటు బహుముఖంగా ప్రవహించాయి. విశ్వవిద్యాలయాలలో అధ్యాపన పరిశోధనలు, వావిళ్ల సంస్థవారితో ప్రాచీన కావ్యాలను పీఠికలతో శాస్త్రీయ సంస్కరణలతో ప్రకటింపజేయడం ఆంధ్ర పత్రిక, భారతి పరిశోధన అన్నల్స్ ఆఫ్ ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ మొదలయిన పత్రికలలో పరిశోధన వ్యాసాలు వ్రాయడం, మద్రాసు ప్రభుత్వ ప్రాచ్యలిఖిత పుస్తకాలయం, తంజావూరు సరస్వతీమహలు గ్రంథాలయాల ప్రచురణ సంఘ సభ్యులుగా అముద్రిత అపూర్వ గ్రంథాలను బృహత్పీఠికలతో ప్రచురింపజేయడం- ఇలా నాలుగుపాయలై ప్రవహించెను. ఆయన ప్రజ్ఞాప్రవాహిని. ఈ వాహినిలో అనర్ఘరత్నాలు కొట్టుకొని వచ్చి ఆంధ్రావళికి అందాయి. ఈ విధంగా అందినవే తెలుగు కవుల చరిత్ర, ఆంధ్ర వచన వాఙ్మయం, దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయం మొదలైన మౌలికరచనలు. త్రిపురాంతకోదాహరణం, ఆంధ్రహనన వాఙ్మయం తెలుగుభాషా సమితి (మద్రాసు) బహుమతిని, కర్ణాటాంధ్రముల పరస్పర ప్రభావము, విజయనగర సంస్థానము-సాహిత్య పోషణ. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ బహుమతిని పొందాయి. ప్రాచీన గ్రంథ

పరిష్కరణలో మానవల్లి రామకృష్ణకవి, వేటూరి ప్రభాకరశాస్త్రి గార్లకు దీటైన నిడుదవోలువారు విపుల పీఠికలతో ప్రచురించిన ప్రాచీన ప్రబంధాలు, శాస్త్రగ్రంథాలు కోకొల్లలు ఖడ్గలక్షణ శిరోమణి, కట్టావరదరాజు రామాయణము మొదలైనవి 56 వుంటాయి పెక్కు నవీనరచనలకు పీఠికలు వ్రాశారు. ఆంధ్రాంగ్ల భాషలలో శతాధిక వ్యాసాలు, శతాధిక ఆకాశవాణి ప్రసంగాలు, ఇంక సదస్సులలో, గోష్ఠులలో ప్రసంగాలు ఇన్నీ అన్నీ కావు.

అన్నీ ఒక ఎత్తు అగస్త్యుడు ఒక ఎత్తు అన్నట్లుగా ఈయన రచనలన్నీ ఒక ఎత్తు, ఉదాహరణ వాఙ్మయచరిత్ర ఒక ఎత్తు. రెండు శతాబ్దాలుగా మరుగుపడిన ఉదాహరణ వాఙ్మయశాఖను ఈయన పునరుద్ధరించి ఈనాడు విశ్వనాథ సత్యనారాయణ మొదలైన మహాకవులు ఈ శాఖను చేపట్టే విధంగా ఉదాహరణ వాఙ్మయచరిత్ర మూలంగా దీనిని ప్రవర్తింప జేశారు నాటినుంచి ఈనాటి వరకు 35 గురు కవులు ఈ ప్రక్రియను చేపట్టి ఈయనను "ఉదాహరణ వాఙ్మయోద్ధారక" అని కీర్తించారు.

కృష్ణమాచార్యులవారి సంస్కృత సాహిత్య చరిత్రలో ఆంధ్రదేశ సంస్కృత కవి పండితులను గూర్చిన విషయాలన్నీ వ్రాసి సాహాయ్యంచేశారు. ఇదివరకు సంస్కృత వాఙ్మయచరిత్రకారులకు తెలియని మయూరకృత సూర్యదండకం, శివస్తవం మొదలయినవానిని వెలుగులోకి తెచ్చారు. నన్నయ నుంచి నేటివరకుగల అపూర్వ విషయాలను 35 సంపుటాలలో సేకరించి పెట్టారు. అవన్నీ ముద్రణకు ఎదురు చూస్తున్నాయి. సాహిత్యమే నిత్యకర్మానుష్ఠానంగా జీవితం సాగిస్తున్నాడు గనుకనే "పరిశోధన పరమేశ్వర", "జంగమ విజ్ఞాన సర్వస్వం", "ఏక సంథాగ్రాహి" అని బిరుదాలు పొందారు. వీటన్నిటికీ మాకుటాయమానంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈయనను 1973లో "కళాప్రపూర్ణ" బిరుదంతో సత్కరించడం.

"వ్రథిత వేదము వేంకటరాయశాస్త్రి
పొందగా బుట్టిన కళాప్రపూర్ణ బిరుదు
సార్థకంబయ్యే సాహిత్య జగతి నేడు
నిడుదవోల్వేంకటరాణ్మనీషివలన"

అని ఆ సమయంలో కవులు కైవారంచేశారు.

ఈ పరిశోధన పరమేశ్వరునిచూపు సజ్జనసాహిత్యం మీదనూ పడింది. అచ్చ తెలుగులో ఆరితేరినవారు గనుక, విద్యార్థిదశనుంచే కైత చెప్పగలవారు గనుక

"నుడులబెడంగును నడకల
యొదికము వడివడితనంబు నుడివోవని కూ
ర్పుడరించు చదువు చదరును
గడివోవని తలపు"

గల తెలుగుకబ్బము "మించుపల్లె", "తెలుగుపొలుపు"లను ఆంధ్ర నలందా శతకము, శ్రీ రామగీతామృతము, శ్రీ రామలింగేశ్వర శతకము, గాంధీ సాహిత్యము మున్నగు కృతులు చెప్పారు. చాటు పద్యాలు వందలు.

నిడుదవోలువారికి వైయక్తికంగాను, సాహిత్యదృష్టితోను మంచి అలవాట్లున్నాయి. తాము చూచినవీ, తమకు తోచినవీ చిన్న నోటుబుక్కులో ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవడం అలవాటు. అలా గుర్తువేసుకొన్నవాటిలో సూక్తులు చాలవున్నాయి. "ఆంధ్రులకు ఐకమత్యం యతిలోనేగాని, మతిలో లేదు; బలి దానంవల్ల అడుగున పడిపోతే పొట్టి శ్రీరాములు బలిదానంవల్ల పొడుగైనాడు: మన విద్యావిధానం "కా" గుణింతంతో ప్రారంభమై కాన్వకేషనుతో ముగుస్తుంది; మనకిప్పుడు రెండే పనులు - మరపని, మరుపని; దేశభాషలందు తెలుగులెస్స అన్నది ప్రాతమాట, ఇలగలుగు భాషలందెల్ల తెలుగు లెస్స అన్నది నేటిమాట. ఇలాటివి ఎన్నోసూక్తులు.

ఈయన తెల్లవారుజామునే లేస్తారు. దంతధావనాదికలు ముగించి, మూరెడు పొడుగు కంచుగ్లాసుతో కాఫీసేవించి, గ్రంథపర్యాలోకనం ప్రారంభిస్తారు. షడ్రసోపేతమైన భోజనం, భోజనానంతరం ముంతమామిడి పప్పో, కిస్మిసో, ఖర్జూరాలో నమిలి తాంబూలం వేసుకొని కొంచెంసేపు ఉయ్యాలలో ఊగి, కోటూ, ఉత్తరీయం వేసుకొని గొడుగు పట్టుకొని విశ్వవిద్యాలయానికి బయలుదేరే వారు. ఉద్యోగసమయంలో. ప్రస్తుతం భోజనానంతరం కొంత విశ్రాంతి, తర్వాత సారస్వతసేవ, శబ్దార్థ పునరాలోచనం, వ్రాతమొదలైనవి.

ఈయనకు ఐదుగురు కుమార్లు, ఇద్దరు కూతుళ్లు జ్యేష్ఠకుమారుడు శివసుందరేశ్వరరావు తండ్రికి దీటైనవాడు. 'పుత్రా రిచ్ఛే త్పరాజయం' నానుడిని సార్థకం చేస్తాడు. మనుమరాండ్రలో జయసుధ తమిళ చలనచిత్రరంగంలో తారాస్థాయినందుకొంది.

"ప్రతి పదానికీ ప్రయోగంచూపి, ప్రామాణికమైన గొప్ప నిఘంటువును అదిన్నీ అనుకూల సాహాయసంపత్తి లభించినప్పుడు ఒకే సంపుటంలో పదిహేను వందలో లేక రెండువేల పుటలలో రచించి, ఆంధ్ర మహాజనులకు అందజేయాలనివుంది అందజేయగలననే విశ్వాసమూవుంది" అని పదేళ్ళక్రితం నేను కలుసుకున్నప్పుడు అన్నారు. తర్వాత శబ్దరత్నాకరాన్ని అనుబంధంతో ప్రచురించారు, క్రిస్టియన్ లిటరేచర్ సొసైటివారికోసం. ఇప్పుడు దానిని సంస్కరించి 35 వేల పదాలతో తమ ప్రతిజ్ఞమేరకు సిద్ధపరచారు. ఇదిగాక ఆంధ్రవాఙ్మయచరిత్ర ఆరు సంపుటాలు సిద్ధంగా వున్నాయి. ఆంధ్రాంగ్లాలలో కొమర్రాజువారి జీవితచరిత్ర మొదలయినవి అచ్చుకు సిద్ధంగా ఉన్నాయి. వాటిని ఆంధ్రావళి అచ్చువేయించి వాడుకోడం అవసరం

ఈయనకు ఇప్పుడు 72 సంవత్సరాలవయస్సు, సాహిత్యంలోనే తలమున కలుగా జీవితం గడిపిన ఈయనకు ఆధునికయుగంలో గడచిన తరంవారైనా గురు జాడ. గిడుగు, ఆదిభట్ల, చిలకమర్తి, పానుగంటి, మానవల్లి, వేటూరి మొదలయిన వారితోనూ, ఆధునికులతోను సన్నిహితత్వం కలిగి, వారి రచనలన్ని పుడిసిటబట్టిన వారుగనుక — మొత్తంమీద రెండుతరాల కవిపండిత లోకానికి సన్నిహితులు గనుక స్వీయచరిత్రను సమగ్రమైన దానిని వ్రాయాలని కోరుతున్నాను. ఆలాటిది వ్రాస్తే సారస్వత పాంథులకు ఎల్లకాలపు కయిదివ్వెగా వినియోగపడుతుంది.

ఒకమారు వారితో అన్నానుగదా "మీరు బ్యాంకిలోవుండే, తక్కిన మీ సహోద్యోగులలాగే ఏ మూడువేల రూపాయలజీతంతో రిటైరయ్యేవారు. ఇప్పుడు ఏమి బాముకున్నట్టు ? బ్యాంకిలో వుంటూనే మీరు సాహిత్యసేవ చేసేవారు, మును పటిలాగే!" అని.

"నా కసలేమీ అసంతృప్తిలేదు బ్యాంకు నౌకరీ వదలివేసినానని, మీరన్నట్టు నాతోపనిచేసిన ఒకతను ఇరవయ్దెదు వందల జీతంతో రిటైరయ్యాడు. నిజమే ఇప్పటి సంతృప్తి, సారస్వతానికి సేవ ఇంకా చేస్తాననే ధీమా అసలు నాకుండేవా ?" అని ఎదురు ప్రశ్నవేశారు ఈయన.

నిడుదవోలువారిని దర్శించినప్పుడు. తలచుకొన్నప్పుడు నాకు శృంగారగ్రంథ మండలి స్థాపకులు గంటి సూర్యనారాయణశాస్త్రి గారు తరచు అంటున్నమాట— "నీకు తెలియకపోతే నిడుదవోలువారినడుగు" అనేది జ్ఞాపకంవచ్చి, ధారణావతార మైన ఈయన ఎడల గౌరవం ఇనుమడిస్తుంది.

శ్రీ నేలటూరి వేంకటరమణయ్య

అర్థశాతాబ్ది మునుపటిమాట. మహోపాధ్యాయ, కళాప్రపూర్ణేత్యాది బిరుదాంకితులు వేదం వేంకటరాయశాస్త్రిగారు నెల్లూరు శివారులోని బాండ్‌దొర బంగళాలో ఇష్టులతో, మిత్రులతో, అంతేవాసులతో గోష్ఠి జరుపుతున్నారు. గోష్ఠి విషయం ఆనాడు ప్రతాపరుద్రీయ నాటకం ప్రశంసిస్తూ ఎవరో ప్రాసిన వ్యాసం. ఇంతలో ఒక విద్యార్థి ఎంతో బిడియపడుతూ అడుగులు పెడుతూ ప్రవేశించాడు. అతని వయస్సు పదిహేను ఏళ్ళుంటాయేమో !

"ఎవరుఁ" అన్నారు శాస్త్రిగారు. ధీరగంభీరులైన శాస్త్రిగారిని ఆ విద్యార్థి దర్శించడం అదే మొదటిసారి. నోట మాటరాలేదు. అతని వివశత్వానికి గోష్ఠి అంతా గొల్లున నవ్వింది. విద్యార్థికి రోషం వచ్చింది: ధైర్యం చిక్కబట్టి "నేనే ఆ వ్యాసం ప్రాసినవాణ్ణి నేనే" అన్నాడు.

గోష్ఠిలోనివారంతా మెడలుతిప్పి మరొకమారు చూచి, ఇంకొకమారు అట్టహాసం చేశారు, "బాగుందే వరస" అంటూను. విద్యార్థి ముఖం జేవురించింది. ప్రతివాది భయంకరులైనా శాస్త్రిగారు విద్యార్థి వత్సలులు. ఆదుకోకపోతే, ఆతడు ఆగ్రహోదగ్రు డవుతాడనే అనుమానం కలిగింది వారికి. దగ్గరికి పిలిచి "నీవేనా నాయనా ప్రాసింది? చాలా బాగా ప్రాశావు. ఏ స్కూలు? ఏ క్లాసూ?" అని ఊరడించారు విద్యార్థికి ఏను గెక్కినట్లయింది. "నీ విమర్శ పద్ధతి బాగుంది నాయనా. చరిత్రకూడా బాగా చదు వుకో. మంచి దృష్టి అలవరచుకో" అని హితవు చెప్పారు శాస్త్రిగారు. ఆ హితవు ఆ విద్యార్థికి జీవిత పాథేయమయింది.

మరొక సంవత్సరం గడిచింది. ఆ విద్యార్థికి పరిశోధన పరిమేష్టులు వేదం వేంకటాచలయ్యగారితో పరిచయమయింది. "దొరలు ప్రాసిన చరిత్ర వట్టి అబద్ధాలు. వాటిని నమ్మవద్దు. మనకు కావలసింది సత్యం" అని వేంకటాచలయ్యగారు హెచ్చ రించారు. ఆ హెచ్చరిక ఆ విద్యార్థికి చరిత్ర పరిశోధనలో చేదివ్వెగా సహకరించింది. ఆ విద్యార్థి శ్రీ నేలటూరి వేంకటరమణయ్యగారు.

శ్రీ వేంకటరమణయ్యగారిని నేలటూరి వేంకటరమణయ్యగారని అనడంకంటే, హంపీ వేంకటరమణయ్యగారనో, విజయనగరం వేంకటరమణయ్యగారనో అంటే, చప్పున చరిత్రాభిమానులందరికీ తెలుస్తుంది. వారు ఒక్క విజయనగర సామ్రాజ్య చరి త్రకే కాదు చాళుక్యుల చరిత్రకూ, తక్కిన తెలుగుదేశ చరిత్రకూ అంకితమైపోయారు.

నేలటూరువారు నెల్లూరుజిల్లా నేలటూరు గ్రామంలో 1891 లో జన్మించారు. వారికి ఐదుగురు సోదరీమణులు, ఒక సోదరుడు. (ఆ సోదరుడు రాఘవయ్య. మహా మేధావి. 1927లో మరణించారు.) తండ్రి సుబ్బయ్యగారు. మంచి సంపన్నకుటుంబం. బోడిస్వామి కండ్రిక అనే అగ్రహారంలో భాగమూ ఉండేది. కాని, తండ్రిగారు వ్యాపా రంలో చాలా నష్టపడ్డారు. కుటుంబం చితికిపోయింది. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు తండ్రిగారు చాల చిన్నతనంలోనే కాలధర్మం చెందారు. కనుక నేలటూరివారు తమ పెదతండ్రి రాఘవయ్యగారి వద్ద ఉంటూ నక్కలమిట్ట, అనంతవరం, మామిడిపూడి బళ్ళలో చదువుకున్నారు. పెదతండ్రి కరణంకూడా. వారు నేలటూరివారిని వెంట బెట్టుకొని తిరుగుతూ, అన్ని విషయాలు కథలుగా చెప్పేవారు. ఎంతో అభిరుచి కలి గించేవారు. నేలటూరివారు భారతం మొదలయిన వాటిని గుజిలీ పుస్తకాలలో పద పదమూ కూడబలుక్కుని చదువుకొని, తన్మయత్వం చెందేవారు.

అప్పుడు మనుకూరు వేంకటసుబ్బారెడ్డిగారనే సంపన్న గృహస్థు తన కుమా రునికోసం మామిడిపూడి వేంకటాచార్యులనే పాత మెట్రిక్యులేటును పిలిపించి, బడి పెట్టించారు. నేలటూరివారూ అక్కడ కొన్ని నెలలపాటు ఎ.బి.సి.డీలు పదాలు నేర్చు కున్నారు. పాతవకాబులరీని తీసుకొని, ఇంటికి దూరంగా తాటితోపులో వెళ్ళికూర్చుని

పదాలు వల్లెవేసేవారు. వేంకటాచార్యుల బడి ఎంతోకాలము సాగలేదు. కనుక నేలటూరివారు రోజూ మామిడిపూడికి వెళ్లి తిరుమల రామయ్య అనే వారివద్ద చదువుకుని వచ్చేవారు. ఈ విధంగా కొంత పునాది ఏర్పడిన తర్వాత, 12వ సంవత్సరంలో నెల్లూరువెళ్లి అమెరికన్ బాప్టిస్టు మిషన్ స్కూలులో మొదటి పారంలో చేరారు. జాన్ కొళందవేలు గారు హెడ్‌మాస్టరు. క్రమశిక్షణకు ఆయన పెట్టినపేరు. నాలుగేళ్ళు ఎలాగో కష్టపడి లాక్కువచ్చారు. నాలుగో పారంలో వివాహమయింది. దానితో కొన్ని ఆర్థికమైన చిక్కులు గట్టెక్కాయి.

నేలటూరివారికి అప్పుడు లెక్కలంటే చాలఇష్టం. అయితే ఒక్కలెక్క సరిగా వచ్చేదికాదు. హెడ్‌మాస్టర్ భరించలేక వారిని హిస్టరీ గ్రూప్‌లోకి తోశారు. అక్కడ కల్యాణ రామయ్యర్, తుంబివనం నటేశయ్యర్ వారికి చరిత్రలో ఎంతో ఆసక్తి కలిగించారు. ముత్తరాజు సుబ్బారావు గారనే మరొక ఉపాధ్యాయులూ వారిని ఎంతో ప్రోత్సహించారు.

"హైస్కూలు రోజుల్లో డబ్బుకు గిజగిజగా ఉండేది. పుస్తకాలకూ డబ్బు పుట్టేదికాదు. ఒకసారి జాగ్రఫీ పుస్తకమొకటి కొనవలసి వచ్చింది. ఖరీదు ఎనిమిది ణాలు. దానిని సంపాదించడానికి ఎంతో శ్రమపడ్డా. అదే నేను కొన్న మొట్ట మొదటి సొంత పుస్తకం. ముత్తరాజు సుబ్బారావుగారి దయతో పరిస్థితి మారింది. ఆయన గొప్ప మనసు గలవారు. వారి ప్రభావం నామీద ఎంతో పడింది. వారి గ్రంథాలయమంతా నా వశంలో ఉండేది" అని వారు చిన్ననాటి ముచ్చట్లు కృతజ్ఞతతో స్మరిస్తారు. చిన్ననాడు వారికి చదువుతప్ప మరొక వ్యాపృత్తిలేదు. ప్రతి విషయంలోను ఫస్టులో ఉండేవారు.

నెల్లూరులో స్కూలుఫైనల్ ముగించిన తర్వాత నేలటూరివారు మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ తరగతిలోచేరారు. మణలి హాస్టల్‌లో ఉచితంగా భోజనం సంపాదించారు. మిత్రులు వారికి సహాయంచేశారు. రెండేండ్లు గడిచాయి. మలేరియా తగలడంవల్ల పరీక్షకు వెళ్ళలేదు. జీవికకోసం తాలూకాఫీసులో గుమాస్తాగా మూడునెలలు పనిచేశారు. జీతాలబిల్లు తయారుచేస్తే, మామూళ్లు ముట్టేవి. ఇదేమిటి అన్యాయం ?—అనుకుని, ఆ పని మానివేశారు. తర్వాత మరుసటి టెర్మ్‌కు ఇంటర్ పాసై, బి.ఎ.,లో సీటుకు ప్రిన్సిపాలుతో పోట్లాడి ఎలాగో సంపాదించారు. అప్పట్లో మాక్మిలన్ కంపెనీ సలహాదారుగా కె. ఎ. వి రాఘవాచారి అనే సహృదయులు ఉండేవారు. ఆయనకు నెల్లూరు వారంటే ప్రత్యేకాభిమానం. కంపెనీ ప్రచురణ, ప్రూపులు చదవడం మొదలయిన పనులు చూడమని నేలటూరివారికి కొంత సహాయం చేసేవారు.

నేలటూరి వారు 1918 తో ఆనర్సు ముగించి బెంగుళూరులో వెస్లీమిషన్ హైస్కూలులో చరిత్రోపాధ్యాయులుగా కుదిరారు. అప్పుడు సహాయ నిరాకర

ణోద్యమం తీవ్రంగా ఉంది. నేలటూరివారికికూడా హృదయం పొంగింది. బెంగు ళూరికి ప్రిన్స్ ఆఫ్ వేల్స్ వచ్చారు. ఆయనకు మిషన్ వారిచ్చినస్వాగతంలో పాల్గొన డానికి నేలటూరివారు నిరాకరించారు. ఫలితం ఉద్యోగం కాస్తా పోయింది.

వారు తిరిగి చెన్నపురికి వెళ్ళి శిష్యవత్సలుడైన ప్రిన్సిపాల్ ఆదరంతో క్రిస్టి యన్ కళాశాలలో తెలుగు పండితులుగా చేరారు. కొన్నాళ్ళ తర్వాత చరిత్రశాఖలో ట్యూటరుగాను, పిదప లెక్చరర్‌గాను, అయ్యారు. 1921 నుంచి పది సంవత్సరాల పాటు వారు దాదాపు ఈ పదవిలోనే ఉన్నారు. చరిత్రను సమ్యగ్‌దృష్టితో అధ్య యనంచేసి బోధించారు. పల్లవులపై వ్యాసాలు ఆంగ్లంలో వ్రాశారు. వారి సిద్ధాంతాలను అందరూ అంగీకరించారు, అవి చరిత్రలోనే చేరిపోయాయి. "ఆరిజిన్ ఆఫ్ ది సౌత్ ఇండియన్ టెంపుల్స్" అనే విషయమై పరిశోధించి మద్రాసు విశ్వవిద్యాలయం డాక్టరేటుపొందారు. అదే మద్రాసు విశ్వవిద్యాలయంలో చరిత్రలో మొదటి డాక్టరేట్ (1930) తోడిలెక్చరర్లు అందరూ కలిసి డాక్టరేట్ గౌను కుట్టించి బహూకరించారు.

వారి జీవితం తెనుగుదేశ చరిత్రకు అంకితమయ్యే సంఘటన అప్పుడొకటి జరిగింది. "చాళుక్యుల చరిత్రలో కొన్ని సంశయాలు" అనే వ్యాసం వ్రాసి భారతి కార్యాలయానికి వెళ్ళారు. (1928). అదే భారతికి వారి మొదటి వ్యాసం. అప్పుడు వారికి మల్లంపల్లి సోమశేఖరశర్మగారితో పరిచయమైంది. నేలటూరివారి చరిత్ర దృక్పథం మారింది.

"శ్రీ శర్మగారితో నా స్నేహం ఆఖరువరకు ఉంది. శర్మగారు అప్పుడు అద్దంకి శాసనాలు (పాండురంగని శాసనాలు) ప్రచురణకు సిద్ధపరుస్తున్నారు. ఆది నారాయణశాస్త్రి, వీరభద్రరావు, శ్రీ టి. యల్. రామచంద్రన్ మొదలయిన చరిత్ర పురాతత్వ పరిశోధకుల పరిచయం కలిగింది. పల్లవులమీద అభిమానాన్ని విజయ నగరానికి మళ్ళించినవారు శర్మగారు. నాకు ప్రియమిత్రులు శర్మగారు." అంటూ కన్నీరు కుక్కు కుంటారు నేలటూరివారు.

1928లో నేలటూరివారు విజయనగర చరిత్ర పాఠం చెప్పవలసివచ్చింది కృష్ణస్వామి అయ్యంగారు పుస్తకాలు పూర్వపరం విరుద్ధంగా కనిపించాయి. కనుక ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారానికివెళ్ళి అక్కడ కైఫియతులు మొదలయినవి పరిశో ధించారు. తర్వాత సంవత్సరానికి మద్రాసు విశ్వవిద్యాలయంలో చరిత్రశాఖలో రీడ రుగా ఎన్నికయిన తర్వాత విజయనగర చరిత్ర ప్రధానవిషయంగా స్వీకరించారు. వారి పరిశోధన ఫలితాలే, "ఆరిజన్ ఆఫ్ ది సిటి ఆఫ్ విజయనగర్," "స్టడీస్ ఇన్ ది త్రీ డైనాస్టిస్ ఆఫ్ విజయనగర్," "ఫర్దర్ సోర్స్ ఆఫ్ విజయనగర హిస్టరీ" (మూడు సంపుటాలు], కంప్లి అండ్ విజయనగర్," "ఎర్లీ ముస్లిం ఎక్స్ పాన్షన్ ఇన్ సౌత్ ఇండియా" మున్నగు ఉద్గ్రంథాలు. ఆరిజన్ ఆఫ్ ది సిటి ఆఫ్ విజయ నగర్ అనేది విజయనగర స్థాపకులు ఆంధ్రులని నిరూపించే ఉత్తమ పరిశోధన.

దీనిని వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ. లక్ష్మణస్వామి మొదలియార్ గారు చాలా మెచ్చుకున్నారు. ఎర్లీ ముస్లిం ఎక్స్‌పాన్షన్ అన్న గ్రంథంలో కాపయ నాయకుని గూర్చి వివరంగా ఇచ్చారు. వారి సిద్ధాంతాలు ఐతిహాసికులకు తలలూపజేశాయి. వారి మొదటి గ్రంథం "త్రిలోచనపల్లవుడా? కరికాళచోళుడా" అన్నది.

వెలుగోటి వారి వంశావళి, రఘునాథాభ్యుయం, విష్ణుమాయానాటకం మొదలయిన చారిత్రక సాహిత్యగ్రంథాలను సంస్కరించి ప్రచురించారు వేంగే తూర్పు చాళుక్యులను గురించి, వేములవాడ చాళుక్యులను గురించి కొత్తసిద్ధాంతాలలో గ్రంథాలు రచించారు. ఆ సిద్ధాంతాలను చరిత్ర జిజ్ఞాసువులు తెలుగు భాషాసమితివారి విజ్ఞాన సర్వస్వ సంపుటాలలో చూడవచ్చు. "పాల్కురికి సోమనాథు డెప్పటివాడు?" "మధుర తంజావూరు ఆంధ్రనాయకుల నాటి తెలుగు వాఙ్మయము" మొదలయిన సాహిత్య విమర్శ గ్రంథాలు రచించారు. పాల్కురికి సోమనాథుడు ఎప్పటివాడనే గ్రంథంలో సోమనాథుడు తిక్కనకు ఇటీవలి వాడనే కొందరి వాదాన్ని సమర్థించారు. దాదాపు 200 వ్యాసాలు వ్రాశారు.

పలు తావులలో తిరిగి శాసనాలు సేకరించారు. "1930 లో నేను మల్లంపల్లి వారు కమలాపురం తాలూకాకు వెళ్ళాము, ప్రాగైతిహాస్ని సమాధులు పరిశీలించాము. వాటివల్ల మాకును కొన్ని భ్రమలు పోయాయి. మరుసటి సంవత్సరం పొద్దుటూరు నుంచి మాలెపాడు వెళ్ళి శాసనాలు నకలు వ్రాసుకున్నాము. మూడవ సంవత్సరం గుత్తి దగ్గర అశోక శాసనాలు చూడటానికి వెళ్ళాము. ఇది జొన్నగిరికి, ఎర్రగుడికి మధ్య గుట్టపైన ఉంది. మొత్తం పదాలుగు శాసనాలు. ఎలాగో జట్కాలో వెళ్ళి సిళ్లు తెప్పించి కడిగి నకళ్లు తీసుకున్నాము. పెద్ద వడుగూరిలో చాళుక్య శాసనాలు వ్రాసుకున్నాము. అది శాతవాహనుల స్థానం. ఇదంతా తెలిసి, మా అనుమతి లేనిదే నకళ్లు తీసుకోరాదని ఎపిగ్రఫివారు మాకు తాఖీదు ఇచ్చారు" అంటూ వారు శాసన సేకరణ యాత్రలను వినోదంగా తెలుపుతారు.

విశ్వవిద్యాలయంనుంచి విరమించిన తరువాత వారు 1953 నుంచి 1959 వరకు స్వాతంత్రోద్యమ చరిత్ర రచనాధికారిగా పనిచేశారు. ప్రస్తుతం హైద్రాబాదు జిల్లా గజిటీర్ల సంపాదకులుగా పనిచేస్తున్నారు.

నేలటూరివారికి మొదటి కళత్రానికి ఇద్దరు కుమార్తెలు. ఉదయం ఉషఃకాలములోనే స్నానసంధ్యలు ముగించి మేడమీద తమ చదువులగదిలో కూర్చొని నన్నె చోడుని కుమారసంభవం చదివి ప్రతిపదార్థం వ్రాసుకుంటారు. ఎనిమిదిన్నరకు భోజనముగించి ఆఫీసుకు వెళ్ళుతారు. సాయంకాలం ఐదున్నరకి తిరిగివస్తారు రాత్రి ఏమీ చదవరు, వ్రాయరు.

"ప్రస్తుతం నా కోరిక విజయనగర విస్తృత చరిత్ర వ్రాయాలని. స్థానికవంశ చరిత్రలు వ్రాయాలి. రేనాటి చోళులు, వైదుంబులు కాయస్థులు, నోళంబులు మొద

లైన వంశాల చరిత్ర వ్రాయదలచుకున్నాను. ఇప్పటి పనివల్ల నాకు తెలియని విషయాలు ఎన్నో తెలిసాయి. అనంతపురం స్థానిక వంశచరిత్రలు నెల్లూరి చరిత్రవ్రాస్తున్నాను. గుంటూరు చిత్తూరు చరిత్రలు చాల కుతూహలం కలిగించేవి" అన్నారువారు.

"మహ్మదీయ మహాయుగం, ఆంధ్రుల చరిత్ర చదివి తన్మయుణ్ణవుతాను!" అని అనే నేలటూరివారు, తమ చరితగ్రంథాలతోను పాఠకులకు తన్మయత్వం కలిగిస్తారు, వారు ఆశిస్తున్నట్టే ప్రతి జిల్లాచరిత్రా పూర్తిచేసేవరకు ఆయురారోగ్యాలతో విరాజిల్లాలనే ప్రతి తెలుగువాడూ కోరాలి.



శ్రీ పులిపాటి వేంకటేశ్వర్లు

ఎప్పటిమాటో : బహుశా 1932 లో నేమో; విజయనగరంలో చింతామణి నాటకం ప్రదర్శిస్తున్నారు. బిల్వమంగళుడు, భవానీశంకరుని వెంట చింతామణి ఇంటికి వెళ్లేఘట్టం. ప్రేక్షకులు వేయికన్నులతో చూస్తున్నారు. చింతామణి భవనం నుంచి కర్ణపేయమైన సంగీతం వినబడుతున్నది. భవానీ శంకరుడు ముందు నడువగా బిల్వమంగళుడు చింతామణిని పరికిస్తాడు. ముఖంలో భావశబలత ముప్పిరిగొన్నది. కానున్న అపవర్గాచార్యకదా : భక్తిభావమూ పొటమరించింది. బిల్వమంగళుని నట నకు ప్రేక్షకులు తన్మయులయారు. ఒక సహృదయ సామాజిక మహాశయుడు దిగ్గున లేచాడు, రంగంమీదికి ఉరికాడు, భవానీశంకరుని పక్కకునెట్టి, బిల్వమంగళుని కౌగ లించుకుని, తనచేతిలోని వెండిచెంబు, పంచపాత్ర, కంచం. పట్టువస్త్రాలు అతని చేతుల్లో కుక్కాడు. అరగంటవరకు కోలాహలం అణగారలేదు, ఆ వస్తునులన్నీ ఆయన కుమార్తె పెళ్ళికోసం కొని, పెండ్లి విడిదికివెళ్లుతూ, దారిలో చింతామణి నాటక మంటే, చూద్దామని వచ్చినవాడు; వచ్చి ముగ్ధుడై బహూకరించాడు. బహూకృతుడైన బిల్వమంగళుడు శ్రీ పులిపాటి వెంకటేశ్వరులుగారు.

పులిపాటివారి పేరు అద్దంకి శ్రీరామమూర్తి, మాధవపెద్ది వేంకటరామయ్యగార్ల సరసనే వినబడేది. అద్దంకివారు దశరథులైతే, పులిపాటివారు భరతులు. అద్దంకివారు ధర్మజులైతే పులిపాటివారు పాండవమధ్యములు; మాధవపెద్దివారు దుర్యోధనులు ఈ ముగ్గురూ వైయక్తిక జీవితంలోనూ ఒక్కకుటుంబంవారుగా మెలిగేవారు, "అదిగో ద్వారక:" అంటూ పులిపాటివారు హస్తనిర్దేశంతో గొంతెత్తారంటే, ప్రేషక సందోహమంతా ఆ వైపు 'అర్రులు సాచిం'దన్నమాటే.

పులిపాటివారు ఈ శతాబ్దం ప్రారంభంలో (15-9-1900) తెనాలిలో జన్మించారు. సంపన్న కుటుంబం. మంచి అభిరుచులతో పెరిగారు; తెనాలి తాలూకా హైస్కూల్లో సెకండు ఫారం చదువుతున్నప్పుడే నాటకాలలో వేషాలు కట్టడం ప్రారంభించారు. వారి మొదటి వేషం 1911 లో రాణాహమ్మీర్. హైస్కూలుచదువు తర్వాత శ్రీ వి. నాగయ్యగారితోపాటు చిత్తూరు జిల్లా బోర్డులో పనిచేశారు అప్పుడు శ్రీ బి. రామకృష్ణరాజుగారు జిల్లాబోర్డు అధ్యక్షులు. 1920 నుంచి. నటనే వృత్తిగా పన్నెండేండ్లపాటు అద్దంకి, మాధవపెద్దిగార్లతోపాటు గడిపారు. 1932 నుండి పది సంవత్సరాలపాటు పన్నెండు చిత్రాలలో నటించారు రెండు తడవలు (తణుకులో, ఏలూరులో) గజారోహణ, సువర్ణఘంటాకంకణాల సత్కారం పొందారు.

రామదాసు, చకుముకీశాస్త్రి, కరటకశాస్త్రి, బిల్వమంగళుడు, కృష్ణుడు, అర్జునుడు. వెంగళరాయడు, భవానీశంకరుడు నక్షత్రకుడు మొదలయిన పురుషపాత్రలూ, లతాంగి, విమలవంటి స్త్రీపాత్రలు ధరించినా, వారికి ఇష్టమైనవి, ప్రజలూ సెబాసన్నవి అర్జునుడు, వెంగళరాయడు. భవానీశంకరుడు, భరతుడు, నక్షత్రకుల పాత్రలు

అర్ధశతాబ్ది నాటకానుభవం గలవారు గనుక, శనివారాలు, అమావాస్యలు, నాటకంలో అభినయించేనాటి రాత్రిళ్లు ఉపవాసం ఉండి, నటనవ్రతంగా ఆచరించినవారు గనుక, తరచు నటకులకులేసే రచనా కౌశలం గలవారు గనుక నాటక కళను, నాటక శాలలను గురించి పెక్కు వ్యాసాలు వ్రాశారు, పలుమార్లు ప్రసంగించారు. తెనాలిలో యూనివర్సల్ అసోసియేషన్ పేరుతో నాట్యకళోద్ధరణ సంఘం స్థాపించి నడిపించారు.

పులిపాటివారు ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక ఎకాడెమీ సభ్యులు. 1960 లో వారిని ఎకాడెమీ ఫెలోషిప్పుతో గౌరవించింది. 1961 లో వారికి జన్మస్థలమైన తెనాలిలో ఆస్థానకవి శ్రీ కాశీ కృష్ణాచార్యులవారి అధ్యక్షతన ఘనంగా షష్ట్యబ్దపూర్త్యుత్సవం జరిగింది. ఆస్థానకవి వారిని "నటకశేఖ" అనే బిరుదుతో సంబోధించారు.

ప్రస్తుతం పులిపాటివారు తెనాలిలో స్వగృహంలో నివసిస్తున్నారు. ఇప్పటికీ నాటకాలు వేస్తారు. నేటికీ ఆహారనియమం పాటిస్తారు. ఉప్పు, కారం చాల తక్కువగా ఉపయోగిస్తారు. పాలు; మీగడ, వెన్న వారికి చాల యిష్టం. అలాటి వేషాలే

వేళారు మరి: తెల్లవారుజామునే లేచి, నిత్యకృత్యాలు తీర్చుకొని, తపాలాఫీసుకు వెళ్లు తారు. టపా తీసుకుని పదిగంటలకు తిరిగివస్తారు. ఉదయమూ, రాత్రీ త్వరగా భోజనం ముగిస్తారు. పరస్థలం వెళ్లేటట్టయితే రాత్రి భోజనం చేయరు. మధ్యాహ్నం ఉత్తరాలు, వ్యాసాలు వ్రాస్తారు. సాయంకాలం మిత్రులతో గోష్ఠి జరుపుతారు. నిష్కర్షయినవారు. మొగమాటము ఏ కోశానాలేదు. నిరంతరం వెల్లివిరిసే ఉత్సాహంతో ఉండేవారే. కాని; రెండవకుమారుడు- వారి అశలెన్నింటినో పండిస్తాడనుకున్నవాడు- హటాత్తుగా మృత్యువువాత బడటంతో కొంత నిరుత్సాహపునీడలు వారిపై బడ్డాయి.

పులిపాటివారికి తిరుపతి వేంకటకవులు మొదటి అభిమానకవులు, తర్వాత పానుగంటివారు. ఇప్పటికే వారి రచనలలోని పద్యాలు సంభాషణలో దొర్లుతుంటాయి. మననమూ చేసుకుంటుంటారు. మరొక విశేషం- ఉత్తమపాత్రలు ధరించాము గదా, తదనుగుణంగా ప్రవర్తనను అలవరచుకుందామనే ఆశతో. దీక్షతో నడవడి దిద్దుకోడం నేటికీ మానుకోకపోవడం. కనుకనే కళ అన్నా రంగస్థలమన్నా వారికి మహోన్నత సిద్ధాంతాలున్నాయి,

"జనానికి మంచిఅభిరుచి కలిగించేబాధ్యత నటులదే. ఏదోవ్యాపారదృష్టితోచేసే ప్రదర్శనం కళాభివృద్ధికి తోడ్పడజాలదు. కళాదృష్టితో పనికిరానిదంటూ లేదు. కలిసి కట్టుగా పనిచేయాలి. పీటికి సంమోద్ధరణ దృష్టే తోడ్పడితే కళ బాగుపడుతుంది." ఇది వారి నిశ్చితాభిప్రాయం.

"ప్రజలకు నాటకాలపట్ల ఆదరణ చాలవుంది. ప్రతి మ్యూనిసిపాలిటీ, ప్రతి పంచాయతీ ప్రదర్శనశాలలు నిర్మించాలి. అవి ఉంటే, నాటకాభివృద్ధి కలుగుతుంది. యువకులకు శిక్షణ, వృద్ధులకు పోషణ కేంద్రరాష్ట్రప్రభుత్వాలు కల్పించాలి. వృద్ధ నటుల మాటలను రికార్డు చేయించాలి. మంచి విమర్శకులూ ఉండాలి. నాటక కళ పైకి రావాలంటే సంఘాలు, ప్రభుత్వ ప్రోత్సాహం, నాటకరంగం, విమర్శకులూ ఈ అంగచతుష్టయం ముఖ్యం. అప్పుడే కళ నాలుగు పాదాలపై నడుస్తుంది అని వారి హితవు.

"మేము ఆ రోజులలో నాటకాలు ఆడాలని ఆడాము. జనం చూడాలనిచూచారు. కళను అభిమానంతో పోషించారు. విదేశాలలోలలిత కళలకు ప్రత్యేకం అమాత్య శేఖరులున్నారు. మనదేశంలోనూ అలాటి ఏర్పాటులుండాలి. ఆదరించే ప్రభుత్వం ఉంటేనే ఏ విద్యఅయినా అక్కరకు వస్తుంది." అనివారనేమాటలలో నిజం లేదూ?

నాటకాలవల్ల సినిమాలవల్ల జనం చెడిపోతారనే వాదువింటే వారు పక్కున నవ్వుతారు. "చెడడమంటూవస్తే ప్రతిదానివల్లా చెడడంవుంది. అయినా, సభ్యత పాటించడం తప్పదు" అంటారు వారు. నిశితదాయకంగా ఉంటి, ప్రజానీకాన్ని సన్మా

ర్గానికి మళ్ళించే ఏ విషయమైనా నాటకవస్తువే. శాశ్వత విషయం ప్రదర్శించే నాటకం శాశ్వతమవుతుంది.

నాటకానికీ, సినిమాకూ ఎన్నడూ పోటిలేదనీ, నాటకం సినిమాకన్నా కళా దృష్టితో పై స్థాయిదేనని వారి గట్టినమ్మకం. రంగస్థలంమీద నటుడు ఎంతో చురుకుగా ఉండవలసి ఉంటుందని, సినిమాలో ఎంతో పాడుచేసి కొంత సాధించవచ్చునని వారనేది అనుభవ రసికుల కందరికీ విదితమే.

వినోదపుపన్ను తలచుకుంటే వారి ఒళ్ళు భగ్గుమంటుంది. ప్రాచీనకాలంలో ఇలాటి పన్ను ఉన్నా, ఇప్పటి పద్ధతిలాగా లేదని, నాటకాలు నీరసించడానికి ఇది కారణమని వారి నిశిత విమర్శ.

తెలుగు లలితకళా ఎకాడెమీవారుకాని, ప్రభుత్వంకాని నాటక సంఘం స్థాపించి ఇతర రాష్ట్రాలలోను, ఇతరదేశాలలోను తెలుగు నాటకాలు విధిగా ప్రదర్శించేఏర్పాటు చేస్తే నటనలో, నాటకరంగంలో తెలుగువారిప్రతిభ దిగంతాలకు వ్యాపిస్తుందని వారిసూచన.

నాటక రంగంలో కులపతులూ, కురువృద్ధులూ మరుగవుతున్న నేడు ఈ సూచనను పాటించగలవారు పాటిస్తే ఏంతో మేలు.

*

123

శ్రీ బండా కనకలింగేశ్వరరావు

నాటకాలకు కాణాచి అయిన నాటి బళ్ళారి, దాదాపు రెండువందలమంది కాకలు తీరిన భరత శాస్త్రవేత్తలు, ఆలంకారికులు, ఆధునిక నాటక విమర్శకులు, నాటక కర్తలు, నటనధురీణులు సమావేశమయ్యారు. చిత్రనళీయంలోని బాహుక పాత్రాభినయం సాగుతున్నది. పండితులందరూ తదేకదీక్షతో పరిశీలిస్తున్నారు. అభినేత చివరి వాక్యం ముగించారు. బళ్ళారి రాఘవ లేచి రంగస్థలంఎక్కి, ఆ అభినేతను ఆలింగనం చేసుకుని "చిరంజీవి కనకలింగేశ్వరరావు బాహుకుని నటన అద్వితీయం. ఇకనేను రిటైరు కావచ్చు సంతోషంగా. నా వారసుడు వచ్చాడు." అన్నారు. పండితుల కర తాళ ధ్వనులతో వహవ్వానినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. తర్వాత రాఘవ "హిజ్ యాక్టింగ్ ఆఫ్ బాహుక హేజ్ టేకెన్ ఇన్స్పిరేషన్ ఫ్రంది పాస్ట్ అండ్ ఈజ్ ఎ లెసన్ ఫర్ది ఫ్యూచర్"అని ఆనాటి మద్రాను మెయిల్‌కు పెద్దవ్యాసం వ్రాశారుకూడా.

ఆ అభినేత బాహుక పాత్రాభినయం తన సిద్ధిగా భావించేవారు. దానినే కాదు, ఏ పాత్రనైనా వారు అంత తన్మయత్వంతోను అభినయించారు; అభినయిస్తారు అంత సాధనా చేశారు; చేస్తారు. నేడు వారి ఏకైకలక్ష్యం కూచిపూడి నాట్యకళాప్రచారం; దానికి విశ్వవిఖ్యాతి చేకూర్చడం. ఇరవైనాలుగు గంటలూ వారిపని ఇదే వారి వినో

దమిదే. ఇదేవారి తపన; ఇదేవారి తపస్సు; వారు శ్రీ బందాకనక లింగేశ్వరరావు గారు.

బందావారు జన్మించింది కృష్ణాజిల్లా కైకలూరు తాలూకా ఆటపాక గ్రామంలో 1907 జనవరిలో వారితండ్రి శ్రీ శ్రీశైలంగారు కొల్లేటి లంకలకు కరణం. బందావారి విద్యాభ్యాసం చిన్నతనంలో కొంతకాలం స్వగ్రామంలోనూ, ఏలూరులోను జరిగింది. తర్వాత బందరు నోబుల్ కళాశాలలో పట్టభద్రులయ్యారు.

తల్లి శ్రీమతి సుందరమ్మగారి పుణ్యమా అంటూ పాట అంటే పసితనంనుంచే వారికి సరదా. మరి కళాశాల విద్యార్థిదశలో నాటకాలంటే ఉత్సాహం ఉద్బుద్ధంకావడంలో అశ్చర్యమేముంది ? కళాశాల నాటక 'సమాజానికి అధ్యక్షులయ్యారు. అప్పుడు వారు తొలిసారిగా నాటకంలో రంగుపూసుకొన్నది కృష్ణవేషంలో. బావమరిది శ్రీ కొడాలి సుబ్బారావుగారు ధుర్యోధనుడుగా రాయబారం రంగాలు అడపాదడపా ప్రదర్శించేవారు. పిదప మద్రాసులో న్యాయకళాశాలలో చదువుతున్నప్పుడు నాటక సంఘానికి కార్యదర్శి అయి, పెక్కు నాటకాలు ప్రదర్శించారు.

చెన్నపురిలోనే వారు మహానటులు కావడానికి తెన్నులుతీరాయి. చెన్నపురి ఆంధ్ర మహాసభలో బళ్ళారి రాఘవతోపాటు వేషాలువేసే మహదవకాశం వారికి కలిగింది. వారి సారంగధర పాత్ర, రాఘవ రాజరాజ నరేంద్ర పాత్ర; అలాటి కలయిక నభూతో నభవిష్యతి. 1934 లో న్యాయవాది పట్టా పుచ్చుకున్న తర్వాత, ఏలూరులో వకాల్తా ప్రారంభించి రెండేండ్లపాటు బాగా ఆర్జించారు. అప్పుడే, ఏలూరు తాలూకా బోర్డు సభ్యులుగాను ఎన్నికయారు. కాని, కళవారిని ఊరుకోనివ్వలేదు; వారు ప్రభాత్ థియేటర్స్ అని సొంత నాటక సమాజం స్థాపించి వివిధ నాటకాలు ఆడేటట్టు చేసింది

ఆ రోజుల్లోనే వారి జీవితం మరొకమలుపు తిరిగింది. అది సినిమా మలుపు. రాఘవతో కలిసి 1935 లో బొంబాయిలో ద్రౌపది మానసంరక్షణంలో కృష్ణ పాత్ర ధరించారు. ఆ పాత్ర ఆహార్యంకోసం సొంతంగా కిరీటం చేయించుకున్నారు దానిని ఇప్పటికీ ధరిస్తారు. ఆ కిరీటం, ఒక ఉంగరం తమకు భాగ్యం తెచ్చిపెట్టాయని వారి నమ్మకం. ఆ నమ్మకానికి తగినట్టుగానే శ్రీ బెల్లంకొండ సుబ్బారావుగారు కృష్ణ పాత్ర ధారణకు నిరాకరించడం వల్ల బందావారి కృష్ణునికి ప్రజాదరం హెచ్చింది.

ఆప్పటినుంచి పదేళ్ళపాటు సినిమాజీవితం సాగింది. సారంగధర కాలచక్రం, జెమినీ వారి బాలనాగమ్మ చిత్రాలలో నాయకపాత్ర, పాదుకలో భరతపాత్ర నిర్వహించారు. 1942 లో భార్యావియోగం సంభవించడంవల్లనూ, సినిమా వాతావరణం రుచించ నందుననూ, చిత్ర ప్రపంచంనుంచి వైదొలగారు.

ఏలూరుకు తిరిగివచ్చి, ద్వితీయ వివాహం చేసుకున్నారు. సతీమణి పేరు శ్రీమతి కనకదుర్గమ్మగారు. ఆమె అడుగుపెట్టిన వేళా విశేషం బందావారికి కనకవర్షం కురియ సాగింది. ప్రభాత్ థియేటర్స్ కార్యకలాపం తీవ్రతరం చేశారు. శ్రీయుతులు, ఊటుకూరి సత్యనారాయణరావు, జంపన చంద్రశేఖరరావు, గబ్బిట వెంకటరావుగార్లచేత

రంగస్థలానుగుణంగా పెక్కు నాటకాలు వ్రాయించుకొని ప్రదర్శించారు. యుద్ధకాలంలో నాటకాలవల్ల లక్షలు సంపాదించారు. బిల్వమంగళ పాత్రను సరికొత్తగా నటించారు. ఇరవైఐదేండ్లపాటు నాటక సమాజం నడిపారు.

1915 లో రష్యా, ఫిన్‌లెండ్, జెకొస్లోవేకియా మున్నగు దేశాలు పర్యటించి, అక్కడి నాటకరంగాలు పరిశీలించి స్వదేశానికి తిరిగివచ్చిన తర్వాత కేంద్రం సంగీత నాటక అకాడెమీ సభ్యులుగాను, డ్రామాస్కాలర్‌షిప్ కమిటీ ఎక్స్‌పర్ట్‌గాను, ఆంధ్ర ప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ కార్యవర్గ సభ్యులుగాను నియమితులయారు.

బందావారు పెక్కు వేషాలువేశారు— కృష్ణుడు, బాహుకుడు, కాళిదాసు, బిల్వమంగళుడు, ప్రతాపరుద్రుడు, శ్రీనివాసుడు, కర్ణుడు, కణ్వుడు, రాముడు, అభిమన్యుడు, సారంగధరుడు, గిరీశం, సలీం, రఘునాథ్, అల్లూరి సీతారామరాజు, రామశాస్త్రి- ఇంకా ఎన్నో, వాటికి సాక్షిగా, గవర్నర్లు, మహారాజులు ఇచ్చిన పెక్కు సువర్ణ పతాకాలు, రజతపాత్రలు, బిరుదులు ఉన్నాయి కురుపాంరాజా వారిని "అభినవ కృష్ణ" అన్నారు. జయపురం మహారాజా "నటశేఖర" అని సంభోదించారు. కాని, వారి అభిమాన పాత్రలు బాహుకుడు, కృష్ణుడు, బిల్వమంగళుడు.

"అన్ని పాత్రలూ నాకు ఇష్టమే. ఇష్టంలేందే ఏ వేషం వెయ్యను. రౌడీవేషాలు, విలన్ వేషాలు నావల్లకాదు. గిరీశంవరకు వెళ్ళగలను. భవాని శంకర పాత్ర నే వేయ జాలను. ఆంజనేయులమూతి, అశ్వత్థామతోక వేయను" అంటారు వారు ఆవేశంతో.

"నా వేషంకన్నా మరొకరు ఎక్కువగా చేయరాదు. అలాచేస్తే, ఆవేషం కింద పెట్టవలసిందే. అంటే పరిణతికోసం ప్రయత్నిస్తాను. ఎవరన్నా బాగాచేస్తే, నా తాళం చెవులు పక్కన పెట్టివేయడమే" ఇదివారి ప్రతిజ్ఞ. కంట్రాక్టు నాటకాలయినా, వారు తమ షరతులను వదులుకోలేదు.

బందావారు ప్రస్తుతం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో నాటక ప్రయోక్తలు. వారికి ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. వారు జీవితం నల్లేరుపై బండిలాగ నడిచిపోయే సంతుష్టాంతరరంగులైన గృహస్థులు. పెక్కు గ్రంథాలు కృతి పుచ్చుకున్నారు. శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు 'శశిదూతం' వారికి అంకితమిచ్చారు. బందావారు స్వగ్రామంలో శివాలయం నిర్మించి, తటాకం తవ్వించారు; వేదపాఠశాల స్థాపించారు. వారికి దుర్వ్యసనాలేమి లేవు.తుదకు పొగైనాతాగరు; తమ్ములమైనానమలరు.

వారికి కేవలం వాక్యానుభూతి గిట్టదు. ఆత్మను చంపుకొని ముష్టి ఎత్తుకొని, కళాసేవచేయడం వారి అభిమతం కాదు. "నా కళ చూపించాను. సంతోషించారు. నాకు డబ్బు ఇచ్చారు. నా పాత్రను తిట్టినవారు ఎవరూలేరు. అందరూ మెచ్చారు" అంటారు వారు.

నాటకం పైవారికనే వారందరికి నచ్చదు. "నాటకం పైవారికీ కాదు. కిందవారికీకాదు. ఇద్దరికీ అనుకూలంగా సమన్వయించాలి. కళను, వ్యాపారాన్ని సమన్వయించాలి. ముప్పైఏళ్ళక్రితం నేను భగవద్గీత ప్రదర్శించి అందరికీ రక్తి కట్టించాను."

ఇప్పటి నాటకరంగం పరిస్థితిపై వారికి చాలా అసంతృప్తిఉంది. నేటి నాటక రంగం పతనమై పోయిందనే వారి ఆవేదన. "(1) మానవత్వాన్ని పైకితెచ్చే నాటకాలు ఎవరూ వ్రాయడంలేదు. (2) పూర్వం నటులు ఆజన్మనటులు. తపస్వులు. ఇప్పుడు మంచినటులు రావడంలేదు. (3) ప్రేక్షకులకు మంచి అభిరుచిలేదు. వనస్పతి మిఠాయి అలవాటయితే నేతిమిఠాయి జీర్ణంకాదు. కమర్షియల్ రోజులలో చెడ్డ అభిరుచి కలిగించారు. ఇది జాతికి ద్రోహం. చెడ్డనటుడు నటనకేకాక తన ఆత్మకూ ద్రోహం చేసుకుంటాడు. మంచి ప్రేక్షకులు కావాలంటే మంచి నాటకాలు వేయాలి. (4) నేడు మంచి విమర్శనలూ లేవు. మంచి విమర్శ వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం. మంచినాటకాలు, మంచినటులు, మంచిప్రేక్షకులు, మంచివిమర్శలు — ఈ నాలుగూ ఉంటేనే, నాటక రంగం నాలుగు పాదాలపై నడుస్తుంది. మంచినాటకాలు వేయించి నేతి మిఠాయి తినిపించాలి. ఈ పని నేను ఒక్కణ్ణే చేయలేను" అంటారు వారు.

అయితే, "మీరు బిల్వమంగళుని వేషం వేసినప్పుడు 'గుత్తివంకాయకూర' పాట పాడారు; పోసిండి. కణ్వుని వేషంలోను, కృష్ణుని వేషంలోను పాడారే! మీరు కూడా ప్రేక్షకులలో చెడ్డఅభిరుచికి దోహదం చేయలేదా?" అని ప్రశ్నిస్తే, "నేనేమి చెయ్యను? జనం వేలం వెర్రి. రాళ్ళు పడేయించుకోమంటారా?" అనివారు ప్రశ్నతో సమాధానమిస్తారు.

ఏమైనా, వారి నటజీవితమంతా ఒక ఎత్తు: కూచిపూడి నాట్యసంప్రదాయసముద్ధరణం ఒక ఎత్తు. కళాక్షేత్రం అనే పేరుతో కూచిపూడి నాట్య పాఠశాల స్థాపించి చేస్తున్నకృషి, కూచిపూడి నాట్య బృందాన్ని యావద్భారతంలోను తిప్పుతూ చేస్తున్న ప్రచారం సాటిలేనిది. "ఐదేళ్ళవరకు కూచిపూడివారికి డబ్బిచ్చి, ఆ సంప్రదాయంలో బాగా శిక్షణ ఇచ్చాము. ఇప్పుడు వారు బాగా నేర్చుకున్నారు. కష్టపడి ముష్టెత్తి సంపాదించిన రెండులక్షల రూపాయలతోను, ఇతర సహాయంతోను కూచిపూడిలో సిద్ధేంద్ర కళాక్షేత్రం కట్టిస్తున్నాము." అని వారు జన్మ తరించినట్టుగా నిండుగా, హాయిగా వర్ణిస్తారు.

నిజమే, సత్కార్యం చేసేవారికి ఎవరికైనా ఆ సంతుష్టి, ఆ వాక్పుష్టి, ఆ నిండుదనం ఉంటాయి. జీవితమంతా నాటకానికి ఫణంగాఒడ్డి, ఒకరికి తలవంచక, చేయిచాచక తాము తలయెత్తుకుని తాము అభిమానించిన కళకూ ప్రతిష్ఠ చేకూర్చి సిద్ధసంకల్పులైన బందావారు సిద్ధేంద్ర కళాక్షేత్రాన్ని యావద్భారతానికేకాదు; యావత్ప్రపంచానికే మహత్తర కళాతీర్థంగా రూపొందించ గలరనడం వారిని ఏ మాత్రం తెలుసుకున్న వారికైనా కరతలామలకం.

శ్రీ మాడపాటి హనుమంతరావు

శ్రీ మాడపాటి హనుమంతరావుగారిని తెలంగాణాలో ఆనాడు, ఆంధ్రప్రదేశ్ అంతట ఈ నాడు తెలియనివారు ఎవరూలేరు. వారు ఆనాడు తెలంగాణాలో సంఘ సేవోద్యమాన్ని తమ పరం చేసుకొనక పోయిఉంటె తెలంగాణా పునరుజ్జీవనం, ఆంధ్రావళి సమైక్యం సాధ్యమయ్యేవికావు. "అభిమాన శూన్యులు, అవివేక పూర్ణులు" అని ఆంధ్రులకు ఆ నాటి నిజాం ప్రభుత్వాధికార్లిచ్చిన బిరుదాలు రూపుమాపి, వెక్కు సంఘ శ్రేయోద్యమాలకు నారులు పోసిన "ఆంధ్రపితామహులు" వారు. అర్ధ శతాబ్ది సాధనతో వాటిని చిగురింపచేసి, పూయించి. ఫలింప జేసిన "పద్మవిభూషణులు"వారు.

వారికి కుందేటి పరుగుపై నమ్మకం లేదు; వారిది తాబేటి నడక. వారి రథం ఎప్పుడూ ఎడమవైపే: ఏనాడు తక్కిన బండ్లకు అడ్డు తగిలి ముందుకు దూసుకొని పోలేదు. ఒకొకప్పుడు వారు తమరథం గుర్రాల వాగెలను బిగబట్టి వెనకవచ్చే బండ్లకు ముందుకు సాగిపొమ్మని చేయి విసరడమూకద్దు. ప్రజాకార్యం నున్నని జారుడు బండ అని వారికి తెలుసు. పరుగుతీసినకొద్దీ ప్రమాదమే. అంటే వారు

సావధాన స్వరూపం. వారిని వీరిని పక్కకునెట్టి కూచునే ఆశ వారికిలేదు. వెనుకనే ఉండి విప్లవాగ్ని రాజబెట్టడమే వారి సంతృప్తి. కనుకనే ఎన్నోపదవులు వారిని వరించి వరించి విసిగివేసారాయి. వారిలో ఆదర్శపు వేడి ఉంది. ఆవేగపు మంటలు లేవు. కన్నులకు లక్ష్యం ఉంది; కాళ్ళకు వడి గడబిడలేదు. తూకంవేయక వారు ఏ పనికీ చేయి వేయలేదు, వేయరు కాళ్ళుచాచడానికి ముందు పక్కను కొలిచే వ్యావహారిక వివేకం వారిది. పట్టినపని పండగయ్యేవరకు పాలాళునికికూడా తెలియనీయని రహస్య గోపనం. వారికి మహారాష్ట్రుల మితవ్యయం, గుజరాతీల చదరంగపుటెత్తులు, కన్నడుల ఓపిక పట్టువడ్డాయి. వీటివల్లనే కాబోలు వారు రాజకీయాలజోలికి పోకుండా పలురీతుల సంఘశ్రేయోద్యమాలను నిజాంప్రభుత్వం సంకురుమయ్యచూపు పడకుండా నడుపగలిగారు. ఇంతయినా మానవ సహజ దౌర్బల్య ఛాయలు, తప్పులు వారి సన్నిధిని నడయాడవు. అంతా అసిధారావ్రతం. అచంచల నియమం.

మాడపాటివారు కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పొక్కునూరులో 1885 జనవరిలో జన్మించారు. వారి తండ్రి వెంకటప్పయ్యగారు వారి అయిదవ ఏటే పరమపదించడంవల్ల తల్లి వెంకటసుబ్బమ్మగారు వారిని వారి సోదరులు తిరుమలరావుగారిని వెంటబెట్టుకొని సూర్యాపేటలో తాలూకా సిరస్తాదారీ చేసే తమ సోదరులు జమలాపురం వెంకటరావుగారి ఆశ్రయం పొందవలసి వచ్చింది. మాడపాటివారు సూర్యాపేటలో తిరునగరి నరసయ్యగారనే చాత్తాదవైష్ణవోపాధ్యాయుని ప్రైవేటుబడిలో మూడేళ్ళు చదివారు. తరువాత ఇబ్రహీం పట్టణంలో ఒక మేరువ కులస్థుని (దర్జీ) పాఠశాలలో నాలుగైదు నెలలు చదువుకున్నారు. పిదప నల్లగొండలో పేష్కారుగా ఉంటున్న రెండవ మేనమామ రామచంద్రరావుగారివద్ద ఉంటూ ఉర్దూ,ఫారసీ, తెనుగు చదువుకుని 1898 లో ఉరుదూ మిడిల్ పరీక్షలో అవ్వల్‌దర్జాలో పాసయ్యారు. బంగారు పతకం కూడా సంపాదించారు. తరువాత భువనగిరిలో ఉండి ఇంగ్లీషు అప్పర్ ప్రైమరీ పరీక్షలోనూ, 1899లో ఇంగ్లీషు మిడిల్‌లోనూ, 1902 లో వరంగల్ నుండి మద్రాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పరీక్షలోను ప్రథములుగా ఉత్తీర్ణులయ్యారు. ఇంతలో రెండవ మేనమామ మరణించడంతో వారికి కళాశాలలో చదివే అవకాశం కలుగలేదు; మీదుమిక్కిలి కుటుంబభారం కూడా తలపై బడింది. కనుక వారు 1904 లో హనుమకొండలో స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ ఆఫీసులో గుమాస్తాగా చేరవలసి వచ్చింది.

ఈ గుమస్తాగిరి చేసిన ఎనిమిదేళ్ళకాలమూ వారి సర్వతోముఖ వికాసానికి బహుముఖ సంఘసేవకూ మూలబంధమయ్యింది. అప్పుడప్పుడే దేశంలో విస్తరిస్తున్న గ్రంథాలయోద్యమం వారి సేవాదృష్టిని ఆకర్షించింది. అన్నిటికీ చదువే పదిలమైన పునాదిగనుక కొందరు మిత్రుల సహకారంతో రాజరాజనరేంద్ర భాషానిలయమనే గ్రంథాలయం నెలకొల్పారు. తెనుగు సాహిత్యంబాగా అధ్యయనం చేశారు.

"ఆ కాలంలో హైదరాబాదులో ప్రముఖ న్యాయవాదులు మహారాష్ట్ర ప్రముఖులైన వామన్ నాయక్, కేశవరావు. (శ్రీ వినాయక్‌రావు విద్యాలంకార్ తండ్రిగారు). కేశవరావు గారు ఒక ముకద్దమాలో వాదించడానికి వరంగల్ వచ్చారు. వారు ఉరుదూ చాలపేలవంగా మాట్లాడేవారు. వాదధోరణి పటిష్టంగా ఉండేదికాదు. ఇంగ్లీషు అసలేరాదు. నాకు ఇంగ్లీషు బాగావచ్చు. ఫారసీలోను; ఉరుదూలోనూ అప్పటికే చక్కటిశైలి అలవరచుకున్నాను; వకీలుగా ఉంటే కేశవరావుగారికంటే బాగా షైన్ కాగలననీ, తెలుగువారికీ ఎక్కువలాభం కలిగించవచ్చు"నని అనుకున్నారు మాడపాటివారు. ఈ తలపు కలగడం తరువాయి-ఒక ముస్లిం మిత్రునిద్వారా హైదరాబాద్ నగరంలో శాసననిర్మాణ శాఖలో అనువాదకుని పదవి సంపాదించి హైకోర్టు వకీలు పరీక్షకు చదవడం ప్రారంభించారు. ఐదేళ్ళలో ఉత్తీర్ణులై నౌకరికి ఆదాబ్ అర్జ్‌చేసి వకాలత్ మొదలుపెట్టారు. అపుడే భార్యావియోగం సంభవించింది. మనస్సు చివుక్కుమని ఆ వృత్తి తగదేమో ననిపించింది. అయినా ప్రజాసేవాదృష్టి ముందుకులాగింది. 24 సంవత్సరాలపాటు లాయరుగా ఉన్నారు.

ఈ ఇరవై నాలుగేళ్ళూ మాడపాటివారి సేవాదీక్షకు స్వర్ణయుగం. వారు వివిధ రంగాలలో నారుపోసి వాటినిపెంచి పెద్దవిచేసారు. అవి నారాయణగూడ బాలికల పాఠశాల మొదలయినవి చూస్తుండగనే మహావటవృక్షాలయాయి. ఒకవైపు గ్రంథాలయ విస్తరణ మరొకవైపు మహిళాభ్యుదయం; వేరొకవైపు సాహిత్య విస్తృతి, ఇంకొకవైపు వర్తక స్వాతంత్ర్యత, బేగారీ నిర్మూలనం ఇలా రకరకాల కార్యకలాపాలు—వాటన్నిటికీ మీగడ తరకగా ఆంధ్రోద్యమం. ఈ ఉద్యమ ప్రాదుర్భావానికి ఒక అపూర్వసంఘటన జరిగింది. అప్పటి బహిరంగసభలలో ఉర్దూ మరాఠీలలోనే ప్రసంగాలు జరిగేవి. మాడపాటివారు మొదలయినవారు ఒక సభలో తెనుగులో ప్రసంగించబోగా కొందరు ఆక్షేపించారు. దానితో ఆంధ్రమహాసభ అవతరించి 1930 లో జోగిపేటలో తొలిసమావేశం జరిపింది. ఈ ఉద్యమాలన్నిటికి మొదట్లో సకల కార్యకర్తలూ వారే. సభ ఏర్పాటుచేయడం, ఆహ్వానాలకు చిరునామా వ్రాయడం టపాబిళ్ళలు అతికించడమూ, సభ ముగిసిన తరువాత వార్తలు పత్రికలకు వ్రాసిపంపడం-నాంది మొదలు భరతవాక్యం వరకూ వారే. (వారు తమ భావాల ప్రచారంకోసం ముషీర్-ఇ-దక్కన్ అనే ఉరుదూ పత్రికకూ పదమూడు సంవత్సరాలపాటు సంపాదకులుగానూ ఉన్నారు. హైదరాబాద్ మేయర్ అయిన తరువాత మానుకున్నారు.) ఈ కార్యకలాపాలలో రాజకీయ ప్రసక్తిలేదని తను మిత వాదినని వారు ఎలుగెత్తిచాటేవారు. అయినా పలువురు ఫిర్యాదుచేశారు. నీలగిరి, తెలుగుపత్రికవంటి వారపత్రికలలో ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాశారు. ఆంధ్రోద్యమం ఉత్తరోత్తరా ప్రమాదకరమనీ అప్పటి నిజాం మంత్రులూ హెచ్చరించారు. ప్రభుత్వంకూడా రాజకీయమనే అనుమానించింది మొదట్లో; కార్యకర్తలను కష్టపెట్టింది. మాడపాటివారినుండి అండర్ టేకింగ్‌కూడా తీసుకునేది.

కాని, కర్నల్ బ్రెంచ్, టాస్కర్ అనే ఇద్దరు ఆంగ్లేయులు మంత్రులుగా వచ్చారు. వారిలో టాస్కర్‌కు తెలుగువచ్చు. మా కార్యక్రమం ఆయన స్వయంగా పరిశీలించారు. దానివల్ల నాకు ఇబ్బంది తగ్గింది. నిజామాబాద్ సమావేశంలో ఆంధ్ర మహాసభ రాజకీయ సంస్కరణలు కావాలని కోరింది. నేను టాస్కర్‌కు ఉత్తరం వ్రాసి ఆంధ్రమహాసభ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చాను. టాస్కర్ నా నిజాయితీకి చాలా సంతోషించారు. ఆయన ఇప్పుడు స్వాన్‌సీలో ఉన్నారు అన్నారు, మాడపాటి వారు. నిజమే. భీకరదమన నీతి ఎదుట మితవాద విధానమే మెరుగు.

మీరు అప్పట్లో కాంగ్రెస్‌లో చేరలేదేమిఁ అని ప్రశ్నిస్తే "అప్పటి నాయకులు కాంగ్రెస్ సభలకు వెళ్ళేవారు. విరాళాలు సేకరించేవారు. తరువాత సంవత్సరందాకా ఆ విషయం తలపెట్టేవారు కారు. కాంగ్రెస్ కంటే ఆంధ్రోద్యమం ముఖ్యమని నమ్మాను. నేను జెయిల్‌కు వెళ్ళలేదు. మాడరేటుగా ఉన్నాను. ఆంధ్రోద్యమం-నాపని పూర్తయింది. తరువాత కాంగ్రెస్‌లో చేరాను. అని వకీలుగా వారు మాట్లాడుతున్నప్పుడు ఆ మహావ్యక్తి మితవాది కాదు. మహా విప్లవవాది అని నా మనస్సుకు స్పష్టమవుతుంది.

ఆంధ్రమహాసభలను వారు గ్రామసీమలలోనే జరిపించేవారు. వాటికి పెట్టుబడి పెట్టినవారు వైశ్యులు. గ్రంథాలయసభలలో వర్తక సంఘాలను ఏర్పాటుచేశారు. బేగారీ అనే పుస్తకమూ వ్రాసి ప్రచారం చేశారు. ఇవన్నీ మితవాదపు మాటున మహా విప్లవవాదం కాక మరేమిటిఁ

న్యాయవాదవృత్తిలో వారు న్యాయంగా ఉన్నారు. న్యాయమైన రుసుమే పుచ్చుకొనేవారు. అందువల్లనే ఆ వృత్తిలో వారు రాణించలేక పోయారు. "క్రమంగా లేని కేసులు వదలివేసేవాణ్ణి. కక్షిదార్లు నమ్మకపోతే కేశవరావుగారి వద్దకు విశ్వనాథ్‌గారి వద్దకు పంపేవాణ్ణి. వారూ వద్దనే వారు. ఒకమారు నాకు నచ్చని కేసును అంబాదాస్‌గారి వద్దకు పంపాను. ఆయన 'ముకద్దమా చలా సక్‌తేహై' అని వ్రాసి మీకు ప్రపంచజ్ఞానం లేదు. నేను తీసుకున్నానుఃఅని త్వరలో నాతో అన్నారు. ఆ కేసు విషయంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, అంబాదాస్‌రావుగార్ని అధిక్షేపించారు పాయింట్లు సరిగాలేవని. రెండు సంవత్సరాల తర్వాత నేను నల్లగొండకు వెళ్ళినపుడు ఆ కక్షిదారు పదిరూపాయల మిఠాయితో వచ్చి నా చిత్తశుద్ధిని ప్రశంసించాడు" అని వారు ఒక పూర్వగాథను తెలిపారు.

సాహిత్యంలోనూ వారిస్థానం విశిష్టం. వారిది సంశ్రేయస్సాహిత్యం. చిన్ననాటినుండే పోతన, పెద్దన వారికి ఇష్టం. ఎపుడో చదివినభాగవత పద్యాలు తర్వాతి జీవితంలో అర్థమయ్యాయి అని వారు అన్నారు. హాలికవి రచనలంటే వారికి ఎంతో

ప్రీతి. మహమ్మద్ హుస్సేన్ ఆజాద్ 'ఇస్లామ్స్ రైజ్ అండ్ ఫాల్' అనే గ్రంథం వారి జీవితపథం నిర్ణయించింది. దానిలో గ్రంథకర్త చెప్పిన ఫాల్ మనకు వర్తిస్తుం దన్న ధోరణిలో వారిని ఆలోచనా నిమగ్నులను చేసింది. వీరేశలింగంగారి గ్రంథాలు, చిలకమర్తి వారివి వారిని కర్తవ్యపరాయణులను చేశాయి. 1915 లో కృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం వార్షికోత్సవంలో చిలకమర్తివారికి సన్మానం చేశారు కూడా. ప్రేమ్‌చంద్ రచనలు వారికి హృదయాన్ని ప్రసాదించాయి. ప్రేమ్‌చంద్ కథలు తొలుత తెలుగు చేసినవారు వారే. కేల్కర్‌గారి పెక్కు మరాఠీ గ్రంథాలను వారు అనువదించారు. మహాభారత సమీక్ష, ఎఫిక్ ఇండియా, శాత్రకాలపు హిందూర్యులు, వారి విమర్శలు, మల్లికాగుచ్ఛం, మాలతీగుచ్ఛం, కథాసంపుటాలు. ఇక మూడునాలుగు భాషలలో వ్యాసాలు అసంఖ్యాకాలు. వారి సాహిత్యసేవను ఉస్మానియా విశ్వవిద్యా లయం "డాక్టర్ ఆఫ్ లిటరేచర్" బిరుదంతో గౌరవించింది. వారి ప్రజాసేవను భారత ప్రభుత్వం పద్మవిభూషణ బిరుదంతో మెచ్చింది. 1951 లో హైదరాబాదు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడినపుడు నగరవాసులు వారిని తొలి మేయరుగా ఎన్ను కున్నారు. మొదటి మేయర్ ఆంధ్రుడు, అందులోనూ మాడపాటివంటివారు కావడం విశేషం. 1958 లో ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఏర్పడినపుడు తొలి అధ్యక్షులు వారే. నేడూ అ పదవిని సర్వపక్ష రంజకంగా వారు నిర్వహిస్తున్నారు.

వారు తమ సతీమణి (ద్వితీయకళత్రం) శ్రీమతి మాణిక్యాంబగారికి స్వయంగా చదువుచెప్పి విద్యావతిని చేశారు. ఆమె 1935 లో సిరిసిల్లలో మాడపాటివారి అధ్య క్షతన జరిగిన ఆంధ్రమహాసభలో మహిళాసభకు అధ్యక్షత వహించారు. వారివీకైక పుత్రుడు న్యాయశాస్త్ర పట్టభద్రుడు.

మాడపాటివారు ఉదయం ధ్యానంచేసుకుంటారు. గజేంద్రమోక్షం మొదలయిన ఘట్టాల పద్యాలు ఎనిమిదింటిని పదిపదిసార్లుపఠిస్తారు. తరువాత తోటలో అరగంటసేపు తిరిగి రేడియోవార్తలువిని, స్నానంచేసి పత్రికలు చూస్తారు. సాయంకాలం సభలకు సమావేశాలకు వెళ్లుతారు. లేకపోతే టాంక్‌బండ్‌కు వెళ్ళి ఏడుగంటలవరకు ఉంటారు. తిరిగివచ్చి భోజనానంతరం కొంతసేపు చదువుకొని 9-30 కు పడుకుంటారు.

నాయకత్వం, పదవి పలువురికి అఖండ నిధులు. నాగుబాములాగ వాటిని కాపలా కాస్తారు. కాని మాడపాటివారి స్వభావానికి ఇది విరుద్ధం. వారిజీవితంలో ఎన్నోపదవులు వారి కాళ్లావేళ్లాపడ్డాయి. వారు ఎన్నిటినో కాదన్నా మిత్రుల బల

వంతంతో కొన్నిటిని కాదనలేక పోయారు, ఇంతవరకు వారు తమ పదవి, ప్రతిపత్తి తెలిపే విజిటింగ్ కార్డు ముక్కైనా అచ్చొత్తించు కొనలేదు.

వారు గట్టువరకు నిండిన జలాశయం.

నదులన్నీచేరిన సముద్రం. తమ ప్రయత్నాల ఫలితాలు చూచుకొని మురిసి పోయే భాగ్యశాలులు. అలాటివారు ఆంధ్రులలో అవతరించడం ఆంధ్రుల భాగ్యం.



ప్రేమామృతపూరితి వేంకటరంగయ్య

వందేమాతరం కారుచిచ్చులాగ వ్యాపిస్తున్న రోజులు మహావక్త బిపిన చంద్ర పాల్ దేశమంతా పర్యటిస్తూ, చెన్నపురికి విచ్చేసిన సమయం. ఆయన బేసిన్ బ్రిడ్జి స్టేషనులోనే దిగుతారని తెలిసి చెన్ననగరం నగరమే వేలంవెర్రిగా అక్కడికి వెళ్ళి రాయపురం ఆస్పత్రి మీదుగా వీధిపట్టనంత క్రిక్కిరిసి తిరువల్లిక్కణి వరకు ఊరేగింపుగా నడచింది. పాల్ ప్రసంగించడానికి ఎవ్వరూ హాలు ఇవ్వలేదు. సముద్రుడు ప్రసాదించిన తీరమే ఉందన్నారు పాల్. తొలిసారిగా మెరీనాబీచ్‌లో ఆయన ప్రసంగించారు. ఐదునాళ్ళు ప్రసంగోత్సవం బ్లాక్ నార్టన్ అని పేరుపొందిన ప్రముఖన్యాయవాది శ్రీ టి. ఎన్. వెంకటసుబ్బయ్యర్ అధ్యక్షత వహించే సాహసానికి పూనుకున్నారు. బిపిన చంద్రుని మేఘగంభీర గర్జనలు చెన్నపురి పౌరులను, ముఖ్యంగా కదిలించి వేశాయి.

అంతదూరమూ ఆయనవెంట తిరిగి. అన్ని ప్రసంగాలూ విన్న ఒక యువకుడు అంతరంగపు ఔన్నత్యం తెలిపే ఆజానులంబి బాహువైన అత్యున్నత దేహయష్టి, విజ్ఞానదీధితులు వెలార్చే చిరునవ్వు చిందులు; ప్రజ్ఞానైశిత్యం పరుగులుతీసే చూపు, నిరంతర దీక్ష ప్రస్ఫుటమయ్యే ముఖకవళిక, ఆచార్యత్వం అవతారం దాల్చినట్లున్న ఆకృతి విశేషం; మనోనైర్మల్యం నిగనిగలాడే తెల్లని ఖద్దరు దుస్తులు- తన గదిలో దీర్ఘాలోచనా నిమగ్నుడై ఉన్నాడు. అతడు 1907 లో పచ్చయప్ప కళాశాలలో బి. ఏ.లో చరిత్ర మొదలయిన మూడు భాగాలలోను విశ్వవిద్యాలయ ప్రముఖుడుగా వచ్చాడు. అతని సహధ్యాయులు శ్రీ కొంతి రామమూర్తిగారు ఐ. సి. ఎస్. చదవ డానికి ఇంగ్లండు వెళుతున్నారు. ఆ యువకునికికూడ ఆఫీసర్స్ ఆసోసియేషన్‌వారు ఐ. సి. యస్. చదవడానికి స్కాలర్‌షిప్ యిస్తామన్నారు; ఐ. సి. యస్, అయితే వెంటనే కలెక్టరీ ఖాయం. అయితే తనకు నచ్చిన ఉపాధ్యాయ పదవి చేతికి అంది ఉంది. మనస్సు ఊగిసలాడింది కొంతసేపు బిపిన చంద్రుని ఉపన్యాసం ఇంకా చెవు లలో గింగురుమంటున్నది. ఒక్క నిశ్చయానికివచ్చి పిడికిలి బిగించాడు. ఛస్! ఇలాటి సర్కారు నౌకరీయా? ఐ.సి.ఎస్. మానుకున్నాడు. పచ్చయప్ప కళాశాలలో హిస్టరీ ట్యూటరు పదవి స్వీకరించాడు.

అవును మరి! దేశమంతటా తన శిష్యప్రశిష్య సంతతి తామరతంపరగా అల్లుకో వలసి ఉండగా, ఆచార్యత్వం సుప్రతిష్టతం కావలసిఉండగా కలెక్టరో, గవర్నరో, మరొకరో అయి, ఆయన కరవెత్తనంతో ఉండగలడా? ఆ యువకుడే ఆచార్య మామిడిపూడి వేంకటరంగయ్యగారు.

మామిడిపూడివారు 1889 జనవరిలో నెల్లూరుజిల్లా కోవూరు తాలూకా పురిణి గ్రామంలో జన్మించారు. వీరి పూర్వులు మామిడిపూడి అగ్రహారికులు. ఈ అగ్రహారం విజయనగర సార్వభౌముడు సదాశివరాయలు మామిడిపూడివారి పూర్వులు నీలమేఘా చార్యులకు వైదిక జ్ఞానసంపత్తికి బహూకరించినది. మామిడిపూడివారు పురిణిలోనే చిన్ననాడు చదువుకున్నారు. గర్భాష్టమంలో ఉపనయనానంతరం తండ్రిగారివద్ద వేదా ధ్యయనం, సంస్కృతాధ్యయనం కావించారు. తన కుమారునికి ఇంగ్లీషు చదివించాలని బుద్ధి పుట్టింది ఆ తండ్రికి. పైరవీటు చెప్పించి 1899 లో పచ్చయప్ప కళాశాల అను బంధ పాఠశాలలో రెండవఫారంలో చేర్చారు. అప్పటినుంచి మామిడిపూడివారు ప్రతి తరగతిలోను సర్వప్రథములుగా వచ్చారు.

రెండేండ్లు ట్యూటరుగా గడిచాయి. ఆ రెండేండ్లలోను ఎం. ఎ. విడిగా చదివి ఉత్తీర్ణులయారు. తర్వాత బ్రహ్మర్షి సర్. ఆర్. వెంకటరత్నంనాయుడుగారి ఆహ్వా నంపై చరిత్రోపన్యాసకులుగా కాకినాడకు వెళ్ళి 1910 నుంచి మూడు సంనత్సరాలు పాటు ఉన్నారు. వారు బ్రహ్మసమాజానుయాయులు కాకపోయినా, వారిని నాయుడు గారు ఎంతో అభిమానించేవారు. ఈ మూడేళ్ళలోనే మామిడిపూడివారు ఏ విషయమైనా కరతలామలకంగా తెలుసుకొని, కదళీపాకంగా బోధించగల సమర్థులని, శిష్యవత్సలు

లైన ఆచార్యులని వాసిగన్నారు. ఇంతలో నిజయనగరం కళాశాలలో చరిత్రశాఖలో బి. ఏ. తరగతులు ఆరంభించగా, అక్కడి ప్రిన్సిపాల్ శ్రీ కిడాంబి రామానుజాచార్యుల ఆహ్వానంపై వెళ్ళి దాదాపు పధ్నాలుగు సంవత్సరాలపాటు (1927 వరకు) చరిత్రాచార్యులుగా ఉన్నారు.

ఆ సమయంలోనే మామిడిపూడివారి జీవితం మరొకమలుపు తిరిగింది. సహాయ నిరాకరణోద్యమం సందర్భంగా 1921లో గాంధీజీ విజయనగరం వచ్చారు. గాంధీజీని మామిడిపూడివారు సకుటుంబంగా దర్శించారు. వారి సతీమణి శ్రీమతి వెంకమ్మగారు తమ చేతి బంగారు మురుగులు గాంధీజీకి సమర్పించారు. (అప్పుడు విజయనగరం సంస్థానం ట్రస్టీ శ్రీ వి.టి. కృష్ణమాచారి- ప్లానింగ్ కమీషన్ మాజీ ఉపాధ్యక్షులు) విజయనగరం మహారాజా శ్రీ అలక్ నారాయణ్ గజపతిగారికి మామిడిపూడివారిపై ఫిర్యాదులు వెళ్ళాయి. మహారాజా సమక్షంలో ఉంటే, ఇలాటి దేశద్రోహం జరుగదని కాబోలు — మహారాజాకు ట్యూటరుగా ఉండాలని మామిడిపూడివారికి హుకుమయింది. కళాశాలలో పనిచేస్తూనే ట్యూటరుగా మూడు సంవత్సరాలు ఉన్నారు.

1925 లో మహారాజా ఇంగ్లాండు వెళ్ళారు. ఆ సమయంలో మామిడిపూడి వారు సగం జీతంపై శెలవు పుచ్చుకుని, మద్రాసు విశ్వవిద్యాలయంలో ఫెలోషిప్ సంపాదించి, స్థానిక స్వపరిపాలనను గురించి పరిశోధించారు. దాని ఫలితమే, "ది డెవలప్‌మెంట్ ఆఫ్ లోకల్ బోర్డ్స్ ఇన్ మెద్రాస్ ప్రావిన్స్" "బిగినింగ్స్ ఆఫ్ లోకల్ టాక్జేషన్ ఇన్ ది మెద్రాస్ ప్రెసిడెన్సీ" మొదలయిన గ్రంథాలు. వీటిలో మొదటిది ఆంధ్ర విశ్వవిద్యాలయం మొదటిప్రచురణ.

తర్వాత సంవత్సరానికి విజయనగరం మహారాజా దేశానికి తిరిగివచ్చారు. వారికి అప్పటి దివాన్ శ్రీ ఏల్చూరి నరసింహంపంతులు గారికి పొసగలేదు. మామిడిపూడివారిని ఊటీకి పిలిపించారు మహారాజా, దివానుగిరి స్వీకరించమన్నారు. వారు స్వీకరించారు. ఈ పదవిలో వారు సంవత్సరమేఉన్నా, తమ పరిపాలనాదక్షతను, ప్రజారంజకతను నిరూపించుకొన్నారు. మహారాజా జాతీయవాది. ఆయనకు యూరోపియనులంటే గిట్టదు, గవర్నర్ వెల్లింగ్టన్ విజయనగరానికి వస్తారనివిని నవంబరులో ఎముకలు కొరికే చలికాలంలో డార్జిలింగ్‌కు పయనం కట్టారు. మామిడిపూడివారూ బయలుదేరారు.

మహారాజా, దివానూ ఇద్దరూ జాతీయభిమానులు కావడంవల్ల ప్రభుత్వానికి కన్నెర్రయింది. ఏమిచేశారో ! సరిగా శ్రీరామనవమినాడు దివాన్‌గిరి తీసివేసినట్టు తాకీదువచ్చింది. తర్వాత వారు మహారాణీ లలితకుమారీదేవి సలహాపై మహారాజాను కల్సుకున్నారు. వారిద్దరూ. "మీరు సీతారాములవంటివారు. దివానుగిరిపోయినందుకు కారణాలు అడగకండి" అంటూ ఏడువేలరూపాయలు బహూకరించి, రెండువందలు యావజ్జీవం పించను ఏర్పాటుచేసారు. 1928 తో విజయనగరవాసం పూర్తయింది.

అక్కడనుంచి మూడుసంవత్సరాలపాటు వారు నెల్లూరు వెంకటగిరిరాజా కళాశాల ప్రిన్సిపాలుగా ఉన్నారు. అది దండి సత్యాగ్రహసమయం. ఖద్దరు కట్టే వారిని చూస్తేనే ప్రభుత్వానికి బెదురు. పోలీసులు విద్యార్థులకు అర్థరూపాయ ఇచ్చి విషయాలు కనుక్కునేవారు. ఆ నిగాలోనే మామిడిపూడివారు స్వదేశీ—పారిశ్రామిక ప్రదర్శనం ఏర్పాటు చేశారు. ఇంతలో ఆంధ్రవిశ్వవిద్యాలయం చరిత్ర—రాజనీతి శాఖలో రీడరు పదవికి వారిని ఆహ్వానించింది. జాతీయవాదిగనుక ఆ పదవి వారికి ఇవ్వరాదని పెక్కు ఆకాశరామన్న ఉత్తరాలు, కొన్ని ఆక్షేపణలు చేరాయి. వాటిని వైస్‌చాన్సలర్ డాక్టర్ రాధాకృష్ణన్‌తోసి రాజన్నారు. మామిడిపూడివారు ఆ పదవిని కొంతకాలం, తర్వాత ప్రొఫెసర్ పదవిని, మొత్తం 14 సంవత్సరాలు అలంకరించారు. అప్పటికి వారి వయస్సు 55 సంవత్సరాలయింది. వైస్‌చాన్సలరూ మారారు. వారు పదవినుంచి విరమించారు.

తర్వాత సంవత్సరం భీమవరం కాలేజి ప్రిన్సిపాలుగాను, మూడేళ్ళు పత్రికలకు వ్యాసాలు ప్రాస్తూను గడిసారు. 1949 నుంచి మూడేళ్ళు బొంబాయి విశ్వవిద్యాలయంలో సర్ ఫిరోజ్‌షా మెహతా ప్రొఫెసర్‌గా ఉండి, కాంపిటీటివ్ అండ్ కో-ఆపరేటివ్ ఫెడరలిజం, జనరల్ ఎలెక్షన్ ఇన్ బోంబే అనే ఉద్గ్రంథాలు రచించారు. హిందూస్తాన్ టైమ్స్ పత్రికలో పెక్కు గ్రంథాలు సమీక్షించారు. పిదప మూడు సంవత్సరాలు మద్రాసు రేడియోలో విద్యావిషయ ప్రయోక్తగా ఉండగా వారిని హైదరాబాద్‌కు బదిలీ చేశారు. అక్కడపని నచ్చక రాజీనామా ఇచ్చారు.

మామిడిపూడి వారితో సంబంధంలేని సంఘహితోద్యమమే ఆంధ్రప్రదేశ్‌లో కనిపించదు. సహకారోద్యమంలో గ్రంథాలయోద్యమంలో, బాంకింగ్ ఉద్యమంలో వారు ప్రధానపాత్ర వహించారు. ఆంధ్ర టీచర్స్ ఫెడరేషన్‌కు చాలకాలం అధ్యక్షులు. 'ఎజుకేషనల్ ఇండియా' పత్రికకు మూడు దశాబ్దాలు సంపాదకులు. పాఠ్యగ్రంథాలు మొదలు రాజ్యాంగ వివరణవంటి అనేకోద్గ్రంథాలు రచించారు. శతాధికంగా వివిధ విశ్వవిద్యాలయాలలో ప్రసంగాలు చేశారు. విజ్ఞాన సర్వస్వ సంగ్రహవిజ్ఞాన కోశాలకు ప్రధాన సంపాదకులు.

మామిడిపూడి దంపతులు కడుపు చల్లనివారు, వారికి ఏడుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. అందరూ వారి కీర్తికి మెరుగులు దిద్దేవారే. మామిడిపూడివారు ఉదయం ఐదుగంటలకే లేచి కాలకృత్యాలు తీర్చుకుని, రెండు గంటలసేపు పత్రికలు చదువుతారు. భోజనానంతరం స్వాతంత్ర్యోద్యమ చరిత్రపని కావలసినంత. సమీక్షలూ వ్యాసాలూ సరేసరి. సాయంకాలం మనుమలకు, మనుమరాండ్రకు పాఠాలు చెబుతారు, రేడియో వింటారు.

ప్రస్తుతం వారు చేస్తున్న ముఖ్యమైనపని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన స్వాతంత్ర్యోద్యమ చరిత్ర తృతీయ సంపుట రచన. "పదివేల పుటలకు సరిపడే విష

యాలు సేకరించి ఉన్నాయి. వాటిని వినియోగించుకుని, సహాయనిరాకరణోద్యమం మొదలు సత్యాగ్రహం వరకు వ్రాయడానికి రెండు సంవత్సరాలు పడుతుంది. రోజుకు ఎనిమిదిగంటలు పనిచేస్తున్నాను" అన్నారు వారు. 1908 శశిరేఖ పత్రికలో తొలిసారిగా "ఇటలీ స్వాతంత్ర్యోద్యం" అన్న వ్యాసంతో ప్రారంభమై, దేశంలోని వెక్కు పత్రికలలోను, గ్రంథరూపంలోను అవిచ్ఛిన్నంగా సాగిన వారి రచనా వ్యాసంగం ఈ పరిణత వయస్సులో స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు పూనుకోడం కాకతాళీయం కాదనుకుంటాను. రాజ్యాంగానికి సంబంధించిన ఇతర గ్రంథాలుకూడ పూర్తిచేయాలనీ వారు అభిలషిస్తున్నారు.

ఇప్పటి విద్యావిధానం వారికి అంతగా నచ్చినట్టులేదు. "ఇప్పుడు చదువులలో శిష్యులకు, గురువులకు శ్రద్ధ కనిపించదు. నేను (ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తప్ప) పన్నెండు విశ్వవిద్యాలయాలలో పరీక్షకుడుగా ఉన్నాను. విద్యాప్రమాణం తగ్గిందనే నా నమ్మకం. ప్రభుత్వం బాధ్యత వహించాలి. మేమంతా ఈ దుస్థితి మారాలని అంటూనే ఉన్నాము. పూర్వము ఇప్పుడున్నన్ని వినోదాలు లేవు. కనుక అప్పటివారి దృష్టి ఏకాగ్రంగా ఉండే దనుకుంటాను" అంటారువారు.

ఏడేళ్ళముందు జనగామ రైలుప్రమాదం జరిగిననాడు మద్రాసుకు పయనమై, వర్షం కుండపోతగా కురవడంవల్ల టిక్కెట్టు వాపసుచేసి ఆగిపోవడంతో పెద్దగండం గడిచిన మామిడిపూడివారు ఆయురారోగ్యాలతో అలరారుతూ తమ విజ్ఞానాన్ని పంచి పెడుతూ ఉండాలి, వారికి ఆంధ్రావళి ఆ అవకాశం కలిగిస్తూ ఉండాలి.

శ్రీ ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి

"ఏమండీ, శాస్త్రిగారూ, మీరుచేయుచున్నపని చట్టమునకువిరుద్ధమైనది; న్యాయమునకు ప్రతికూలమైనది. మేము సహింపజాలము" అన్నారు ఒక ఫాదరీగారు.

"నేను చట్టానికి విరుద్ధంగా, న్యాయానికి ప్రతికూలంగా నడుచుకోడంలేదు" అని సమాధానమిచ్చారు ఆ శాస్త్రిగారు.

మేము మీ మాటలు నమ్మము; నమ్మజాలము, మీరు చేయుచున్నపనికి అనుమతి ఇచ్చిన వారెవరు?" అల గద్దించి అడిగారు ఫాదరీగారు.

"మీకు అనుమతి ఉండగా లేనిది, నాకులేదా?" అని ఎదురుప్రశ్న వేశారు శాస్త్రిగారు.

"లేదు. మీకులేదు. మాకు ఘనతవహించిన ప్రభుత్వంవారు మత ప్రచారము కొరకు అనుమతి పత్రమును, ఆజ్ఞాపత్రమును ఇచ్చియున్నారు" అన్నారు ఫాదరీగారు.

"మాకు అలాటి పత్రాలు ఏవీలేవులెండి : ధర్మశాస్త్రమూ, మా వీరమాహేశ్వరుల మహదాచారమూ మాకు వరవడి అన్నారు శాస్త్రిగారు,"

"మీరుచెప్పినది మాకు అర్థమగుటలేదు. ఏ మైనను, మీరు మా మతస్థులను మరల హిందూమతమునకు మార్చుటను మేము ఇక సహింపము; సహపంజాలము, మిమ్ములను అరెస్టు చేయుటకు ఘనతవహించిన ప్రభుత్వమువారికి సిఫార్సు చేయుచున్నాము"—అని గర్జించారు ఫాదరీగారు.

"అయ్యా ఫాదిరీగారూ; మీరు క్రైస్తవ ఫాదరీలయితే, నేను హిందూఫాదరీని. మనకు వాదవివాదాలెందుకు ? మీ అధికారంలో ఉన్నదంతా చేసుకోండి" అని వినయంగా మనవి చేశారు శాస్త్రిగారు.

అస్పృశ్యతా నివారణోద్యమం ముమ్మరంగా సాగుతున్న రోజులలో గుంటూరు జిల్లా చినవడ్లపూడిలో ఇద్దరు సంఘసేవకులకు జరిగిన వాకోవాక్యమిది. ఆ శాస్త్రిగారు శ్రీ ముదిగొండ జ్వాలాపతిలింగశాస్త్రిగారు.

అపరంజి బంగారుచాయలో, ఖద్దరు నీర్కావిధోవతితో, మెడలో పచ్చిపోకలంతేసి రుద్రాక్షలతావళంతో, బొజ్జవరకు వ్రేలాడుతున్న లింగకాయతో; అంగ ప్రత్యంగాలతోనూ విభూతిత్రిపుండ్రాలతో, నాలుగు పరకల పిలకతో వెలిగిపోతూ, నిత్య కర్మానుష్ఠానాలు, షట్కాల శివపూజలూ యథావిధిగా ఆచరిస్తూ, నిరంతరం శివ పంచాక్షరి జపిస్తూ ఉండే ఈ శోత్రియులేమిటి ? అస్పృశ్యతా నివారణోద్యమంలో అంతటి అభినివేశంతో పాటుపడడమేమిటి ?—అని నేడు ముదిగొండ వారిని చూచే వారెవరైనా ఆశ్చర్యపడవచ్చు.

కాని, ముదిగొండవారు శైవద్వాదశాచార్యులలో ఆరాధ్యత్రయంలోని ఉద్భటారాధ్యుల సంతతివారని, భక్తిమీది వలపును, ప్రాహ్మ్యంతో పొత్తును బాయక సమన్యాయం సాధించిన భక్త శిఖామణుల వంగడం వారని తెలుసుకున్న తర్వాత, వీర వైష్ణవులు, వీరశైవులు మతాన్ని ప్రధానంగా పరిగణించి, కులాన్ని గౌణంచేశారని గ్రహించిన తర్వాత అలాటివంశంలోనివారు ఇలాటి సంఘసంస్కరణలకు పూనుకోక ఎలా ఉంటారనేప్రశ్న ఉదయిస్తుంది.

ముదిగొండవారు గుంటూరుజిల్లా తెనాలితాలూకా ఈమనిలో జన్మించారు (1902 ఆగష్టు). వారి పితామహులు నిగమాగమజ్ఞులు; షట్కాల శివపూజా ధురంధరులు; నిరతాన్నదాతలు. తండ్రిగారు కొండయ్య అయ్యవారు, సంస్కృతాంధ్ర భాషాకోవిదులు; నిర్వాణనిశ్రేణి అనే గ్రంథం రచించినవారు ముదిగొండవారు పన్నెండు సంవత్సరాలవరకు స్వగ్రామంలోనే ప్రాథమికపాఠశాలలో చదువుకున్నారు. ఇంట్లో ఆంధ్ర సంస్కృతాలు నేర్చుకొనడం ఉండనేఉన్నది. తర్వాత ఎనిమిదేళ్ళు పలువురు మహాపండితులవద్ద వేదాధ్యయనం, సంస్కృతకావ్యనాటకాలంకారాధ్యయనం కావించారు వ్యాకరణ శైవాగమ శాస్త్రాధ్యయనం కావించారు. దేవకార్యాలు, ఉత్సవాది ప్రతిష్ఠాంతం చేయించగలరు.

అప్పుడు దేశంలో అవధానాల జాతరులు జరుగుతున్నాయి. ముదిగొండవారికి కూడా అవధానాలు చేద్దామనే తలంపు కలిగింది. వయస్సూ ఇరవై సంవత్సరాలు. తొలిసారిగా ఈమనిలో అవధానం, ఉభయభాషలలోనూచేసి, కృతార్థులయ్యారు. తర్వాత పెక్కుపట్టణాలలో అష్టావధాన, శతావధానాలు వందకు పైగా చేశారు. అప్పుడు గంటకు మూడువందల పద్యాలుగాని, శ్లోకాలుగాని చెప్పేవారు. సరే! ఇక పలుతావులలో సన్మానాలు, సువర్ణ పతకాలు, కవిభూషణ, కవితా ప్రవీణేత్యాది బిరుదాలు చెప్పనక్కరలేదు.

కాని దర్శనాలు అధ్యయనం చేయనిదే, నిత్యజీవితానికి ఉపయోగపడే వాస్తు జ్యోతిషాదులు తెలియనిదే సంపూర్ణత్వం లభించదని వారికి తోచింది. 28వ ఏట శ్రీ జోస్యుల కనకయ్యసిద్ధాంతిగారి వద్ద ముహూర్త జాతక సిద్ధాంతమనే త్రివిధ జ్యోతిశ్శాస్త్రం అభ్యసించి, పది సంవత్సరాలపాటు పంచాంగాలు గుణించి ముద్రించారు. జ్యోతిర్విశారద బిరుదం పొందారు. వాస్తు విషయాలు పరిశీలించారు. మహోపాధ్యాయ శ్రీ ముదిగొండ నాగలింగారాధ్యులవద్ద దర్శనాలను, శైవదర్శనాలకు శాంతి చేశారు. ఏలూరులో జరిగిన సభలో ఉభయకవితా సమ్రాట్ బిరుదం, వరంగల్ సభలో గండపెండేరం పొందారు.

ముదిగొండవారు దాదాపు ఎనభై సంస్కృతాంధ్ర గ్రంథాలు రచించారు. వారి ఋక్లపక్షః అనే సంస్కృత ఖండకావ్య సంపుటిలోని కాళిదాసః అనే ఖండికను అఖిల భారత సాహిత్య అకాడెమీవారు 1958 నాటి సంస్కృత కవితా సంపుటిలో ముద్రించి గౌరవించారు. ముదిగొండవారు సంస్కృతకవితలో కొన్ని ఆంధ్ర కవితా మర్యాదలు ప్రవేశపెట్టారు. పూర్వపు కొన్ని సంస్కృత శాసనాలలో సీసపద్యం (శీర్షిక మనే పేరుతోను). చంపకమాల కనిపిస్తాయి. ముదిగొండవారు మహాస్రగ్ధర, మత్తేభం, ఉత్పలమాల వంటి తెలుగు వృత్తాలను వాడారు. యతిని విరామంగా కాక తెనుగు అక్షరావృత్తిగా పరిగణించారు. కొన్నిచోట్ల పూర్వోత్తరార్ధ విచ్ఛేదంలేక కలిపికూడా వేశారు. అయినా ఎబ్బెట్టుగా కనిపించలేదు, వినిపించలేదు.

ముదిగొండవారిలో విశేషం వారు 1922 నుంచి- అంటే లోకవ్యవహారాలు తెలిసిన 20వ ఏటనుంచి- 25 సంవత్సరాలపాటు కాంగ్రెస్ సభ్యులుగా ఉండి దేశసేవ చేయడం; కులమతభేదాలు పాటించక అందరికీ విద్యాదానం చేయడం. వారు అజాతశత్రువులు. సతీమణి శ్రీమతి భ్రమరాంబగారు. ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ప్రస్తుతం ముదిగొండవారు ఈమనిలో స్వగృహంలో ఉంటూ ఎవరు పిలిచినా ఉచితంగా జ్యోతిష వాస్తు విషయాలు చెబుతుంటారు. దేవాలయాలలో ఉత్సవ ప్రతిష్ఠాదులు చేయిస్తుంటారు. కవితా గోష్ఠులలో పాల్గొంటూ ఉంటారు. శైవదర్శనాలపై ఉపన్యసిస్తుంటారు. పది సంవత్సరాలుగా శ్రీ శైవమహాపీఠ పండిత సభాధ్యక్షులుగా

ఉన్నారు. "అయ్యా ఇల్లు కట్టుకుంటున్నాము. తలవాకిలి గుమ్మం ఎక్కడ పెట్టాలండీ? జల ఎక్కడ పడుతుందండీ?" అని ఒకవైపు కొందరు "బ్రతికతప్పిపోయింది, ఎక్కడ కనబడుతుంది?" అని అడిగేవారు కొందరు ఎంత వేధిస్తున్నా ఎంతమాత్రమూ విసుగుపడక సమాధానాలు చెబుతూ ఉంటారు. ఇంతయినా, చీకట్లోనేలేచి, అనుష్ఠానాదికం ముగించుకొనడం, షట్కాల శివపూజ, నీలకంఠభాష్యాధ్యయనం యథావిధిగా సాగుతుంటాయి. మధ్యాహ్నం శివపూజ (భోజనం) తర్వాత విద్యార్థులకు పాఠం చెబుతారు; నూతన గ్రంథరచన సాగిస్తారు రాత్రి భోజనాల తర్వాత శివానందలహరి, మహిమ్నస్తవం చదువుకొని పడుకుంటారు. ప్రస్తుతం చూపు కొంచెం ఆనడంలేదు. అందువల్ల ఇతరులు చదవగా వింటారు. ఇతరులకు చెప్పి వ్రాయిస్తారు.

వారికి భారతీయ సంస్కృతిపై అపారమైన భక్తిశ్రద్ధలున్నాయి. ప్రాచీన ధర్మాలను ఉద్ధరించాలని వారి ఆకాంక్ష. అస్పృశ్యులను శుద్ధిచేసి కలుపుకోవాలని వారి నిర్ణయం "ఇంకా ప్రాచీన సంస్కృతిపై ఆసక్తి కలగుతుందనే నమ్ముతారా?" అని ప్రశ్నిస్తే. "దేనికైనా మితి అనేది ఉంది. ఇప్పటి పరిస్థితిపై వెగటు పుట్టి మన సంస్కృతిపై అభిరుచి కలుగుతుందనే నా విశ్వాసం" అంటారు వారు.

"సంస్కృతం సంవత్సరంలో మాట్లాడేటట్టు చేయగలను" అంటారు; విదేశీయులు సంస్కృతం నేర్చుకోంగా లేనిది, నూటికి తొంభైపాళ్లు సంస్కృత పదాలు నిరంతరం వాడుతున్న తెనుగువారు సంవత్సరంలోగా సంస్కృతం భాషించగలగడం గొప్పేమీ కాదని వారి అభిప్రాయం. సంస్కృతం మృతభాషకాదని, ప్రతిదానితోను సంబంధం కలదిగనుక దానికి మృతిలేదని వారి గాఢ విశ్వాసం.

వారివి అముద్రితగ్రంథాలింకా ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం వారు కలకత్తా జ్ఞానపీఠంవారి కోరికపై విశ్వకళ అనే సంగ్రహ విజ్ఞాన సర్వస్వంవంటి సంస్కృత కావ్యం రచిస్తున్నారు. విశ్వభరత్ అనే సంస్కృతాలంకార గ్రంథం, జవహర్‌లాల్ నెహ్రూ జీవితం చిత్రించే శాంతిదూత అనే సంస్కృతకావ్యం రచిస్తున్నారు. శాంతిదూతను త్వరలో ముద్రించి భారతప్రధానికి సమర్పించాలనికూడా ప్రయత్నిస్తున్నారు.

ఆంధ్రభాషా మర్యాదలను ధైర్యంగా గీర్వాణకవితలో ప్రవేశపెట్టిన ముదిగొండ వారి సంప్రదాయం, వాస్తవమైన సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ సంఘసేవచేస్తున్న ముదిగొండవారి సముదాచారం విస్తరించే అవకాశం ముందుముందు అనంతం.

*

శ్రీ మోటూరి సత్యనారాయణ

1936 లో నని నా జ్ఞాపకం. నాగపూర్‌లో ఎవరో ఆంధ్రులు హిందీలో ప్రసంగిస్తున్నారంటే, విందామని వెళ్లాను. వారు నాకు పరిచితులైన శ్రీ మోటూరి సత్యనారాయణగారే. హిందీలో వారి వాగ్ధాటిని ఇదివరకే తెలిసినవాడిని కాబట్టి చెవులు ఒగ్గి వింటున్నాను. పక్కనవున్న ఒక పెద్దమనిషి నావైపు తిరిగాడు. అతని ముఖంలో జిజ్ఞాసానందాలు పెనవేసుకొని వున్నాయి. నేను తటస్థుడుగా ఉన్నాను. ఆయన ఉండలేక పోయాడు. "ఎక్కడివారు ఈయన?" అని హిందీలో అడిగాడు. "ఆంధ్రప్రాంతంవారు" అన్నాను. ఆయనముఖంలో సందేహచ్ఛాయలు దోబూచులాడాయి. మరి రెండు మూడుసార్లు అదే ప్రశ్నవేశారు. నా సమాధానం విన్నాడు, ఇక సహించలేక పోయాడు. "యు. పి; వారో, బీహార్‌వారో, కనీసం సి. పి. వారో అయివుంటారు." అని నన్ను 'నీవు అబద్ధం చెబుతున్నావుసుమా!' అన్నట్టు గద్దించాడు. "ఉపన్యాసకులు తెలుగువారు, ముమ్మాటికీ!" అని నేను ఆయనకు నచ్చజెప్పడానికి గంటసేపు పట్టింది.

మోటూరివారి హిందీనుడికారం అంత మధురమైంది. హిందీయే వారి మాతృభాషఅన్నంత భ్రాంతికలిగిస్తుంది. హిందీ మాతృభాష అయినవారికికూడా. "1933లో

హిందూ విశ్వవిద్యాలయానికి వెళ్ళినప్పుడు శ్రీమాలవ్యాజీ నన్ను హిందీలో మాట్లాడ మన్నారు. నేను ముప్పావుగంట హిందీలో ఉపన్యసించాను. ఆయన చాల ఆనంద పడ్డారు" అన్నారు మోటూరివారు. "ప్రియేషు సౌభాగ్య ఫలాహి చారుతా" అన్నాడు కాళిదాసు. ఒక రంగంలో పనిచేస్తున్నవారికి ఆ రంగంలోని పెద్దల మెచ్చుకోలు ఆనందం కలిగించడం సహజం.

మోటూరివారిని నేను నాలుగుదశాబ్దాలుగా చూస్తున్నాను. సంస్థలను స్థాపించడం వాటిని నిర్వహించి వృద్ధిపరచడం, పదిమందికీ నచ్చచెప్పి మంచిపని చేయించడం వారి అపూర్వశక్తులు. పని స్వయంగా చేయడం సులువు; పది మందితో చేయించడం సులువుకాదు. దానికి మానవ మనస్తత్త్వం ఎంతో తెలిసి ఉండాలి ఇది తెలియ నందునే తెలుగువారు ఏ సంస్థనూ సక్రమంగా నిర్వహించలేక "ఆంధ్రా ణా మనే కత్వం" అన్న సామెతకు జనకులైనారు. కాని, మోటూరివారు దీనికి అపవాదసూత్రం. వారు చేపట్టిన ప్రతిసంస్థా శ్రీరామరక్షగా నిలబడవలసిందే; మూడు పూవులూ అరవై కాయలుగా అభివృద్ధి చెందవలసిందే.

మోటూరివారు ఈశతాబ్దం ప్రారంభంలో 1902 న మాతామహస్థానం కృష్ణా జిల్లా అంగలూరులో జన్మించారు. వారి పూర్వులు వెల్లటూరునుంచి కృష్ణాజిల్లా దొండ పాడుకు వలసవచ్చినవారు. తండ్రి పెదపిచ్చయ్యగారు, తల్లి శ్రీమతి రత్నమ్మగారు, ఈశతాబ్దం ప్రారంభం దేశం ఏ పరిస్థితిలో ఉండేదో చెప్పనక్కరలేదు. మోటూరి వారు కులగురువులవద్ద తెలుగు, సంస్కృతం అభ్యసించారు. చిన్ననాడు 15వ సంవ త్సరం వరకు తెలుగు, సంస్కృత కావ్యాలు, అమరం, ఆంధ్రనామసంగ్రహం మొదలైన నిఘంటువులు కంఠస్థం చేశారు. "నూరు చింతగింజలు పెట్టుకోడం, పది హేను రోజులపాటు నూరుసార్లు ప్రతిదీ వల్లెవేయడం. ఇదీ మా చదువుపద్ధతి కనుక సాధారణశక్తి గొప్పగాఉండేది. ఏ పద్యమయినా ఒక్కసారిచెబితే వెంటనే అప్పగించే వాడిని. కాని, నా తొమ్మిదవయేట ఒక సంఘటన జరిగింది. నా గురుపుత్రులతోపాటు నేనూ కావ్యాలు చదివేవాడిని. గురువుగారు సిద్ధాంతకౌముది ప్రారంభించారు. గురు పుత్రులకు, నాకూ చెప్పమన్నాను. అది వేదాంశం నీకు చెప్పరాదన్నారు గురువు గారు అది అప్పటి సంఘపరిస్థితి. ఇదేమిటి? భాష చదవడం ఎవరికైనా ధర్మ బద్ధం, శాస్త్రబద్ధం, ఈశ్వరబద్ధంకదా! ఈ వ్యత్యాసమేమిటి?—అనే ఆలోచన కలిగింది. క్రమంగా తెలుగువైపు నా మనసు మొగ్గింది." అని చిన్ననాటి విద్యాభ్యాస చరిత్ర చెప్పారువారు; వ్యవహారజ్ఞానంకోసం ఇంగ్లీషుకూడా నేర్చుకున్నారు.

అప్పుడు సంస్కరణోద్యమం ముమ్మరంగా ఉంది. ఒకవైపు గ్రంథాలయో ద్యమం, జాతీయోద్యమం బలపడుతున్నాయి. మోటూరివారిపై వీరేశలింగంగారి రచ నల ప్రభావం బలపడింది. ఇంతలో చెరకువాడ వెంకటనరసింహంగారితో సాన్ని హిత్యం కలగడంవల్ల గ్రంథాలయోద్యమంలో పాల్గొని ఊరూరూ తిరిగి గ్రంథాల

యాలు స్థాపించడం, హోం రూలు ఉద్యమంతో దివ్యజ్ఞానసమాజంతో సంబంధం కలగడం—ఇలా ఎంతో మార్పువచ్చింది. మంగిపూడి వేంకటశర్మగారి సంఘ సంస్కరణ పద్యాలు సభలలో చదవడంవల్ల వారికి బహుమతులూ వచ్చాయి.

1918 నుంచి స్వదేశీ ఉద్యమం, సహాయనిరాకరణోద్యమం ఇంగ్లీషు పాఠశాలల బహిష్కరణోద్యమం, హిందీ ప్రచారం ఎక్కువయాయి. మోటూరివారు బందరు జాతీయ కళాశాలలో చేరారు. 1919—21 మూడు సంవత్సరాలు చదివారు. అప్పుడే కృష్ణాపత్రిక సంపాదకులు మూట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు గార్లతో పరిచయం ఏర్పడింది. 1921 చివర వారి జీవితగతి మారింది. సంఘసేవకునారులు పడ్డాయి: కాంగ్రెస్ ఉద్యమంలో భాగంగా నెల్లూరుజిల్లా పల్లెపాడులో హనుమంతరావుగారు స్థాపించిన ఆశ్రమంలో హిందీ ప్రచారకులుగా వెళ్ళారు. మూడేళ్ళ పాటు నెల్లూరుజిల్లాలో గడిచింది. 1923 లో కాకినాడ కాంగ్రెసు ఆహ్వానసంఘ కార్యదర్శిగా పనిచేశారు. అప్పుడు వారి వయస్సు 21 సంవత్సరాలు. తర్వాత రెండు సంవత్సరాలు ఆంధ్రప్రాంత హిందీ ప్రచారసభ కార్యదర్శిగాను, తర్వాత రెండేళ్ళు మద్రాసులో హిందీసాహిత్య సమ్మేళన కార్యాలయంలో పరీక్షా కార్యదర్శిగానుఉన్నారు. 1927లో ఈ కార్యాలయం శ్రీ హరిహరశర్మ కార్యదర్శిగా దక్షిణభారత హిందీ ప్రచారసభగా ఏర్పడింది. 1933 నుండి 1960 వరకు ఈ సభ ప్రధాన కార్యదర్శిగా మోటూరువారు చేసినసేవ అపారం, అసదృశం. దక్షిణాపథంలో సత్యనారాయణజీ అంటే హిందీ, హిందీ అంటే సత్యనారాయణ్ జీ అన్నంత నానుడి ఏర్పడింది. దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఒక విరాట్ సంస్థగా రూపొందింది.

హిందీ ప్రచారానికి జీవితం మీదు కట్టిన మోటూరివారికి దేశమంతటా మహానాయకులతో సన్నిహితత్వం ఏర్పడింది. వారు ఎన్నో పదవులు అధిష్ఠించారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన రాజ్యాంగ నిర్మాణసభ సభ్యులుగా, తాత్కాలిక పార్లమెంటు సభ్యులుగా, పదునాలుగేళ్ళు రాజ్యసభ సభ్యులుగా, కొత్త ఢిల్లీలోని ఇండియన్ కల్చరల్ అకాడెమీ కార్యదర్శిగా, మద్రాసు విశ్వవిద్యాలయం సెనెట్ సభ్యులుగా, ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యులుగా, అధికారభాషా కమిషన్ సభ్యులుగా, దక్షిణభారత హిందీ ప్రచార్ సమాచార్ పత్రికల సంపాదకులుగా చేసినసేవ ఇంతంతనరానిది. 1947 లో తెలుగు భాషాసమితిని స్థాపించి, కార్యదర్శిగా తెలుగు విజ్ఞాన సర్వస్వం అందిస్తున్నారు. హిందీలో "విశ్వజ్ఞాన సంహితా" అనే పేర విజ్ఞానసర్వస్వాన్ని ప్రచురిస్తున్నారు. తెలుగు అకాడెమీ అకెడిమిక్ కౌన్సిల్ అధ్యక్షులుగాను, ఆగ్రాలోని కేంద్రీయ హిందీసంస్థాన్ అధ్యక్షులుగాను ఉన్నారు. ఇంకా ఎన్నో సంస్థలతో సంబంధం కలవారు. ఇంత సేవచేస్తున్నవారిని కేంద్రప్రభుత్వం 1958 లో పద్మశ్రీతోను 1962లో పద్మభూషణతోను సత్కరించడం విశేషమేమీ కాదని నా అభిప్రాయం.

దేశంలోని జాతీయోద్యమ నాయకులందరితో సన్నిహిత సంబంధం గలవారు తెలుగునాట మోటూరివారు తప్ప మరొకరు లేరని నా విశ్వాసం. దీనికి కారణం వారు 1927 నుంచే గాంధీజీకి సన్నిహితులు కావడం, ప్రతి కాంగ్రెస్ మహాసభకూ వారు హాజరు కావడమూను.

1942 లో మద్రాసులో జరిగిన ఉద్యమానికి మూలకారణం మోటూరి వారే. రెండేళ్లపాటు పొలిటికల్ డెటినూగాను ఉన్నారు. "రాజాజీకి నేను ఎంతో సన్నిహితుడుగా ఉండేవాడిని. నేనే ఉద్యమానికి వెన్ను అని మొదట ఆయన నమ్మలేక పోయారు. నామీద ఆయనకు చాల కోపం వచ్చింది" అన్నారు వారు.

"సాహిత్యభాష ఎంత పెరిగినా ప్రయోజనం తక్కువ. అది ఆనందానికి పనికి రావచ్చునుగాని, జీవికకు పనికిరాదు. జీవికోపయోగభాష-functional language-చాల అవసరం, బ్రిటీష్‌వారు మనవారికి ఇంగ్లీషులో రెండువందల పదాలు నేర్పి, పరిపాలన సాగించారు. సామాన్యుడు కోరేది, వానికి కావలసింది జీవికోపయోగిభాష. దానికి మనభాషలోకి వివిధ ఆధునికశాస్త్ర విషయాలు రావాలి" అని వారి వాదం "మనకు జ్ఞానవిజ్ఞానాలు పరాయి భాషలో పొందవలసిన వివశత ఏర్పడింది. దానిని పోగొట్టాలి. ప్రజల ప్రవృత్తినిబట్టి విజ్ఞానం పెరుగుతుంది. దాని ఉపయోగంతోపాటు భాషకూడ పెరుగుతుంది. మనం ఎన్నుకొన్న బోధనభాష ఉన్నతి చెందలేదు. అది ఉన్నతస్థాయని చెందితేగాని, గ్రంథనిర్మాణం చేయరాదు—అనే వాదం భాషాభివృద్ధికే ముప్పు" అని వారి హెచ్చరిక, "బోధనభాష మారకుండా వుండడం మన భాషల అభివృద్ధికే ముప్పు. భాషలు అభివృద్ధి కావాలన్నప్పుడు ఇతర భాషలలో మనం గ్రహించిన జ్ఞానాన్ని మనభాషలలో వ్యక్త పరచడానికి అవకాశం వుండేనేగాని, మన భాషలు పెరగవు. అందుచేత, జ్ఞానోపార్జనం, మనం ఎన్నుకొన్న జ్ఞానమార్గం సమపాళాలుగా నడిస్తేనేగాని మనం ఎన్నుకున్న భోదనభాష ఉన్నతి చెందదు." అనివారు స్పష్టంగా చెప్పారు. మనకు జ్ఞానం, ప్రాతిపదిక• భాష మీడియం, సంధాత్రిమాత్ర• ఈ మీడియంకూడా అంతశక్తిశాలినిగా వుండాలి దానికి జ్ఞానభండారం నిండాలి"దీనికి ప్రతి ఆ జీవికకు సంబంధించిన జ్ఞానమూ సంగ్రహించవలసి వుంటుంది" అని వారు ఎంతో అనుభవంతో, అర్థశతాబ్ది భాషాప్రచారం చేసిన కష్టసుఖాలతో అన్నమాట విద్యావేత్తలకు ఉపాదేయాలు.

మోటూరివారికి నలుగురు కూతుళ్లు, ముగ్గురుకుమార్లు. అందరూ మంచి పదవులలో ఉన్నారు.

మోటూరివారు ఆరోగ్యానికి పెట్టినదిపేరు. ఒక్కసారయినా చిర్రున చీదడంగాని, దగ్గడంగాని ఎరుగరు. ఒక్కనాడయినా సెలవు పుచ్చుకోలేదు. ఈ సందర్భంలో వారొక సంఘటన చెప్పారు. 1937 లో సంథాల్ పరగణాలో తిరిగి పరిస్థి

తిని పరిశీలించి నివేదిక పంపమని గాంధీజీ నన్నుపంపారు. నేను టైపిస్టులు మొదలైన వారితోపాటు వెళ్ళాను. టిర్ టైఫిస్ అనే జ్వరం వచ్చింది. ఈ సంగతి గాంధీజీకి వ్రాశాను. ఆయన–నీవు ప్రజాసేవకుడివి. జబ్బుపడే అధికారం నీకు ఎక్కడుంది?" అని జాబుతో మహాదేవ దేశాయిని పంపారు. తానే వచ్చినతర్వాత, రెస్టుకోసం జబ్బు పడే అధికారంకూడా ప్రజాసేవకునికిలేదా?—అని గాంధీజీని ప్రశ్నించాను. ఆయన నవ్వారు.

వారికి ప్రత్యేకమైన అలవాట్లేవీలేవు. "నాకు అలవాట్లేమీ నిర్ణితమైనవిలేవు. ఏవైనా నా పని సౌకర్యానికి భంగకరమయితే, విడిచిపెడుతాను" అన్నారు వారు. వారి సూత్రాలలో పనికి మొదటిస్థానం. అవును గోఖలే వ్యక్తిత్వం నన్ను విశేషంగా ఆకర్షించిందన్నవారికి అలా అనడం సహజమే.

"మీది అర్ధశతాబ్దికి పైబడిన ప్రజా సేవాజీవితం. మీకున్నంత అనుభవం, వివిధవర్గ నాయకులతో వున్న విస్తారమైన ఘనిష్ఠమైన సంబంధం తెలుగుదేశంలోనే కాక, ఇతరరాష్ట్రాలలోను ఎవరికీ వుండదు. కనుక దేశహిత దృష్టితో మీ ఆత్మ కథారూపంలో ఉద్యమాల చరిత్ర వ్రాయాలి." అని అభ్యర్థించాను. వారు మంద హాసంతో తలపంకించారు. వారి మందహాసం అడయార్ నదిలోను, దాని ఒడ్డునఉన్న వారి సుందరభవనం ఆవరణలోని పూలలోను ప్రతిఫలించింది.

శ్రీకొళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

మైసూరులోని పరకాలమఠంలో కవి గండభేరుండ, సర్వతంత్ర స్వతంత్రేత్యా
ద్యనేక బిరుదాంచితులు శ్రీకృష్ణ బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రులు, చామరాజ
నగరం శ్రీకంఠశాస్త్రిగారనే మహా విద్వాంసులతో ముచ్చటిస్తున్నారు. అప్పయ్య
దీక్షితులవారి ప్రస్తావన వచ్చించి. వీధిలో ఏదో కలకలం వినిపిస్తే "ఏమిటో
చూడమ్మా!" అని దీక్షితులవారు కూతురితో అన్నారట: ఆమె వీధిలోకి వెళ్ళి తిరిగి
వచ్చి తండ్రితో—

"తురుష్కా నిష్కాశిః తురగఖుర కుద్దాల దళిత
క్షమా ధూళీపాళీ చుళుకిత చతుస్సింధు సలిలః
స్వదోర్లీలా భగ్న ప్రతిభట వధూటి పరికరః
ప్రతస్థే కార్తాం తీం దిశమితి హి వార్తా సమజని"

అని చెప్పిందట. మరికొన్ని చాటువులతోపాటు శ్రీకంఠశాస్త్రిగారు ఈ శ్లోకాన్ని
పరకాల యతీంద్రులకు తెలిపారు.

పరకాల యతీంద్రుల సన్నిధిలో అప్పుడొక వటువున్నాడు. స్ఫురద్రూపి అయిన అ నిప్రాయం పన్నెండు సంవత్సరాలేమో ! అనంతూ ! ఈ శ్లోకం గుర్తు పెట్టుకోరా !" అన్నారట యతీంద్రులు. "చెప్పింది ఒక్కసారేకదా!" అని అడిగారట శాస్త్రిగారు. "మరేం ఫరవాలేదు. జ్ఞాపకం పెట్టుకుంటాడు" అన్నది యతీంద్రుల జవాబు. ఆ శ్లోకాన్ని, దానితోపాటే మరికొన్నిటిని ఆ వటువు 'టేప్ రికార్డు' చేసేసు కున్నాడు మనస్సులో.

ఆ వటువు గర్భాష్టమంలోనే సంస్కృతంలో కవిత చెప్పడమేకాక భోజుని చంపూ రామాయణానికి ప్రతిగా మరొక చంపువు చెప్పినాడని, రాజస్థాన కథావళి చదివి పదవపేటనే తారాబాయి, మీరాబాయి తెలుగు కావ్యాలు రచించినాడని ఆ శాస్త్రి గారికేం తెలుసు ?

తర్వాత పదకొండేండ్లకు (1917లో) రవీంద్రకవీంద్రుడు మైసూరుకు వచ్చిన ప్పుడు ఆ వటువు పాతికేళ్ళు నిండని యువకుడు. రవీంద్రుడు "భువన మన మోహిని" "జనగణమన" పాడుతూ వుంటే ఆ యువకుడు వెంటవెంటనే స్వరపరచుకున్నాడట! రవీంద్రుడు, "ఐ కేన్నాట్ ఇమాజిన్ హూ దిస్ యంగ్ పండిట్ ఫాలోస్ మి విత్ నొటేషన్స్" అని ఆశ్చర్య పడ్డారట, ఆ యువకుడు సంగీత సాహిత్యరంగాలలో సుప్రతిష్ఠితుడనీ మైసూరు మహారాజాస్థాన విద్వాంసులలో ఎనిమిది రూపాయల నెలజీతం పుచ్చుకుంటున్న పైస్థాయి వాడనీ, చిన్ననాడే" జలరాశి బాలేలోలే" అంటూ ఎన్నోకృతులు చెప్పిన వాగ్గేయకారుడనీ రవీంద్రునికి ఎలా తెలుస్తుంది?

వారికేకాదు. "ఆంధ్ర వాఙ్మయమున నాచన సోమనాథున కీయదగుస్థానము" అన్న వ్యాసముపై చేకుమళ్ల అచ్యుతరావుగారు, నడకుదుటి వీరరాజు, దర్భా సుబ్ర హ్మణ్యశర్మగారలు మున్నగు ఆంధ్ర పండిత నివహం ఒక్కుమ్మడిగా విరుచుకు పడే వరకూ ఆ వ్యాసకర్త ఫలానా అని, పేరు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారని ఎవరికీ తెలియదు.

రాళ్ళపల్లివారు విమర్శకులుగా ఆంధ్రావళికి ఏ సుముహూర్తాన దర్శనమిచ్చారో గాని, వారు ప్రవర్తింపజేసిన శిష్టాభిరుచి ప్రస్థానం అర్ధశతాబ్దిగా అవిచ్ఛిన్నంగా సాగు తున్నది; ఆంధ్రసారస్వతరమకు అసద్యశ నీరాజనంగాను జిజ్ఞాసువులకు విమర్శా మ్నాయ మణిదీపంగాను వెలుగొందుతున్నది. వారు ఆనందవర్ధనులుగా, అభినవ గుప్తులుగా సాక్షాత్కరిస్తారు.

వారి విమర్శనలను ఏ కొంచెం చదివినా, తత్వమును దెలిసికొనవలెనను నాశ. తెలిసిన వానిని నిర్భయముగా ప్రపంచమునకు బోధించుధైర్యము దానికి నిబంధనమై యిరు ప్రక్కలందును మరుగులేని మంచి పదునుగల చురకత్తి వంటి" రచనాశక్తి, దానికి మెరుగిచ్చునట్టి సూక్ష్మదృష్టి, గాయపుమందు కత్తికేపూని కొట్టినట్లు, తిడుతూనే నవ్వించే హాస్యకుశలత వారి విమర్శలకు మూలద్రవ్యాలని తెలిసిపోతుంది.

బహు వాఙ్మయాలలో తలస్పర్శి పొందితి, దాని మీగడతరగ అనదగిన సహృదయత, దాని బాహిరరూప మనదగిన కమ్మనికవిత, దానికి గమకమైన గానగరిమ. వాటన్నిటి సమాహార మనదగిన సచ్చరిత్ర పటిమ, దాని ప్రతికృతి అయిన మహితాకృతి, దానిని ప్రతిఫలించే పరిశుద్ధాభిరుచి, దానితో బారలుసాచి స్పర్థించే సదభివ్యక్తి రాళ్ళపల్లివారి 'అపురూప' స్వరూపరేఖలు అంటే చాలును.

వారి వ్యక్తిత్వం ఇంత మధురోదారంగా రూపొందడానికి కారణం చిన్ననాడు అనంతపురంజిల్లా రాళ్ళపల్లిలో పితృపాదులు కర్నమడకల కృష్ణమాచార్యుల వద్ద పన్నెండు సంవత్సరాలవరకు సంప్రదాయరీతి శిక్షణ, తర్వాత పందొమ్మిదవ ఏడు వరకు మైసూరులో 'కృష్ణబ్రహ్మతంత్ర పరకాల యతీంద్రుల వంటి మహాపురుషుని సన్నిధిని అంతేవాసిత్వం, ఇరవయ్యవ ఏటనుంచి (1912) మైసూరు మహారాజా కళాశాలలో తెనుగు ఒజ్జలయిన తర్వాత డాక్టర్ కట్టమంచి రామలింగారెడ్డిగారి సాహచర్యమూను. "సాహిత్య సంస్కారమున నాకు కడపటి గురువు ఆయన. రామలింగారెడ్డిగారు నన్ను సమానస్కంధునిగా చూచేవారు. నా దృక్పథం మారడానికి, ప్రత్యేకంగా తిక్కనపై అభిమానానికి ఆయనే కారణం"అని రాళ్ళపల్లివారు ముక్తకంఠంతో చెప్పుకుంటారు.

చిన్ననాడు తల్లి శ్రీమతి అలమేలు మంగమ్మగారి ప్రోత్సాహంతో వారికి సంగీతంలో కలిగిన అభిరుచి, పిదప బిడారం కృష్ణప్పగారివంటి వైణికగాయకసార్వభౌముని శిష్యత్వంలో తీగసాగింది. నోటిపాట, వయొలిన్ సాధనచేశారు. అయినా వయొలిన్ నా వృత్తిగా నేను సాధనచేయడం పడదేదు"అని విచారపడుతుంటారు వారు నేటికీ.

రాళ్ళపల్లివారు దాదాపు ముప్పయి ఎనిమిది సంవత్సరాలు మైసూరులో మహారాజ కళాశాలలో ఆంధ్రపండిత పదవి నిర్వహించారు. ఆ కాలంలోనే వారు వేమన, నాటకోపన్యాసాలు, సారస్వతోపన్యాసాలు, సారస్వతాలోకం, జీవన మత్తుకలె (కన్నడం) మొదలయిన విమర్శగ్రంథాలు, వెలయించారు. శాలివాహన గాథాసప్తశతిని తెనుగు చేశారు. సంస్కృత కవితాస్పర్థ (1924) లో "మహశూర రాజ్యాభ్యుదయ దర్శనం" అనే ఆఖ్యప్రబంధం చెప్పారు రఘువంశం, స్వప్నవాసవదత్త తెనిగించి తగవని చించివేశారు.

మూడు సంవత్సరాల క్రితం ఆంధ్ర లలితకళా అకాడెమీ వారికి 'గానకళా ప్రపూర్ణ' బిరుదం, నిడుడు కన్నడ గాయక మహాసభ 'గానకళాసింధు' బిరుదం ఇచ్చి సత్కరించాయి. మద్రాసు మ్యూజిక్ అకాడెమివారు సన్మానపత్రంతో సత్కరించారు.

వారు 1950 నుంచి ఏడేండ్లపాటు తిరుపతి ప్రాచ్య పరిశోధనాలయంలో అన్నమాచార్యుల సంకీర్తనలను స్వరపరిచారు. ఇటీవల వేదాంత దేశికుల అభీతిస్తవం సుందరపాండ్యుని నీతి ద్విషష్టిక తెనిగించారు.

వారు ప్రస్తుతం తిరుపతిలో చిన్నకుమారుడు శ్రీ జయంత(ఆంగ్లోపన్యాసకులు), వేంకటేశ్వర విశ్వవిద్యాలయం) వద్ద కొంతకాలం, పెద్దకుమారుడు శ్రీ ఫణిశాయి (సైకాలజీ లెక్చరర్; బెంగుళూరు) వద్ద కొన్నాళ్ళు గడుపుతూ ఉంటారు. ఇప్పుడు-71 వ వీట- వారి నిత్యకృత్యం స్నానానుష్ఠానంతరం, కొందరికి సంస్కృతం, వయొలిన్ చెప్పడం, ఓపిక వుంటే వయొలిన్ సాధనచేయడం, భోజనానంతరం కొంతసేపు విశ్రమించి, ప్రాచీన సాహిత్యం చదువుకోవడం ఎవరైనా అడిగితే సందేహాలు తీర్చడం.

"ఇప్పటికీ ప్రాచీన సాహిత్యాభిరుచి జనంలో తగ్గలేదు. ఇటీవల కర్నూలులో ఒక గోష్ఠిలో తిక్కన్నను చదివి వినిపించాను. బెంగుళూరులో కన్నడులకూ తిక్కన భారతం వినిపించేవాడిని- వ్యావహారిక భాషావాదం వ్యాపిస్తున్న ఈ కాలంలో ప్రాచీన గ్రంథాలపై అభిరుచి కలిగించడానికి పఠనం అవసరం" అంటారు వారు. ఇలాటి అభిరుచి అప్పుడు లేక పోవడం ప్రజలతప్పు కాదు. మన తప్పేనంటారు. ప్రజలను దారికి తెచ్చేవారు ప్రత్యేకంగా కావాలని, వారికి సంస్కారం కలిగించాలని వారి సూచన.

"ఇప్పటి పద్ధతిలో ఏకాగ్రత లేకపోవడం. కళలో ప్రధానం ఏకాగ్రత. సంతమీద ఏకాగ్రత కలిగించలేము. సంతకు ఉద్రేకం అవసరం. కనుక కొంతమందే చాలు పటనగోష్ఠికి. కళలను గురించి, కవులను గురించి ఉపన్యాసాలివ్వడం ఎంత ఆగిపోతే అంతమంచిది, కళలను ముందుపెట్టండి" అని అంటారు వారు.

కనుకనే నేటికి వారు తిక్కనభారతం పునశ్చరణ చేస్తుంటారు. "తెనుగువారికి వ్యాసుని గొప్పదనం తిక్కనమూలంగానే తెలిసింది. వాల్మీకి అంతస్తు ఎవరూ అందుకోలేరు. తిక్కన వ్యాసుని అంతస్తు అందుకున్నాడు. భిన్న భిన్న చిత్తవృత్తులను చూపడమే వ్యాసుని ప్రధానధర్మం. అతని దృష్టి కథకాదు. తిక్కన కథా ప్రవాహం చెడకుండా భారతం సంగ్రహించి, తెనుగు జీవితంతో అన్వయించి తెలుగుచేశారు. తిక్కన పాత్రలలో సత్యాపనం అనేధర్మం ఉంది. రామాయణంలో రామణీయకం ఎక్కువ. భారతంలో చిత్త సంస్కారం ఎక్కువ. కనుక వ్యాసం తిక్కనలపాత్రలలాగా ఇంకెవరి పాత్రలను అంత హార్దంగా అనుభవించలేము," అంటుంటే వారి చారులోచనాలు ఆనంద భాష్పాలు కురిపిస్తాయి.

"సాహిత్య పరమార్థం— అన్ని కళలపరమార్థమూ — అలౌకికానుభవం, చిత్త సంస్కారమూను ప్రపంచానికి అడ్డంగా ఉన్నదా లేదా అనేది చిన్నమెట్టు దీనికి విమర్శ ఉండినది, ఉండవచ్చునది, ఉండవలసినది అనేవి ఉత్తరోత్తరం బలీయాలు దీనికి నైతిక, ధార్మిక హార్దికమైనవాటికీ అన్వయిస్తాను. ఒక్కొక్కదానినుంచి మరొక్కదానికి వెళ్ళడమే నా ప్రయత్నం. ప్రయోజనాత్మకతకంటే, ఉన్నదున్నట్టు చూపడంకంటే, ఉండవలసినదిగా చూపడం పైస్థాయి" అన్నది ఈ విమర్శ ప్రస్థానాచార్యుల నిర్వచనం.

రచయిత జీవితానికీ, రచనకూ తప్పక సంబంధం ఉందనీ, తప్పులు తెలుసుకొని పోగొట్టుకొనడానికి ప్రయత్నించిన వానికి ఒక్క విషయం చెప్పేబాధ్యతా లేదనీ, రచయితలో ఆర్జవమనే ధర్మం ఉంటే అది మాటలలోనూ ప్రతిఫలిస్తుందనీ వారి నమ్మకం.

నేటి ఉద్వేగ కవులను చూచి వారు చాల చింతపడతారు. నిర్మాణాత్మకంగా పనిచేసే శక్తి ఉద్వేగకవులలో లేదనీ, వారు సమసామయికోద్యమంతో ఉద్రేకపడి కొంత చేయగలిగినా, మానవోద్యమమనే నిరంతరోద్యమమే మనలక్ష్యం కావాలని వారంటారు, "శ్రద్ధయా దేవో దేవత్వ మాప్నుతే" అన్నది వారి గట్టినమ్మకం;

రాళ్ళపల్లివారు నాటికీ, నేటికీ, సాహిత్యంలోనూ, జీవితంలోనూ, పులుగడిగిన ముత్యాలరాశిగా, సాయం సంధ్యల మల్లీమతల్లికా గుచ్ఛంగా; అపరంజి పోతపోసిన దివ్యమంగళ విగ్రహంగా దర్శన మిస్తుంటారు.



శ్రీ విశ్వనాథ సత్యనారాయణ

కాశీ విశ్వవిద్యాలయం పార్లమెంటు హాలు కిటకిటలాడుతున్నది. హాలు వసారా చుట్టూ కూడా జనం గజిబిజిగా ఇరుక్కుని ఉన్నారు. వేదిక ముందువరుసలో విశ్వ విద్యాలయోపాధ్యక్షులు ఆచార్య నరేంద్రదేవ్, విశ్వవిద్యాలయాచార్యులు, ప్రముఖులు ఆసీనులయి ఉన్నారు. వేదికనుంచి,

"గోదావరీ పావనోదార వాహూర
మఖిల భారతము మా దన్ననాడు,
తుంగభద్రా సముత్తుంగ రావముతోడ
కవులగానము శ్రుతిగలయునాడు"

అని మేఘ గంభీర నిర్ఘోషం వినబడగానే కలకలం చప్పున చల్లారింది. అందరూ చెవులు దోరపెట్టుకొని వినసాగారు. శ్రోతలలో తెనుగు తెలియని హిందీ బెంగాలీవారే పెక్కుమంది. వారిని ఏదో రసధుని ముంచెత్తింది. వేదికనుంచి మరికొంత సేపటికి

"పరసుఖదశా పరీపా
క రామణీయక మెరుంగు కచసాన్నిధ్యా
త్తరమణ ప్రథమ స్పర్శ
ప్రరూఢి మెడవొలిచె సూత్రబంధనవేళన్"
అని వివాహ ఘట్టమూ, ఆఖరున

"అమరీ కేశిక పారిజాత కుసుమో
హాస్వాదు నీ బాలకాం
డము నీ భక్తుడు శోభనాద్రి దగు సం
తానంబు జన్మాద్యపా
యము తప్పించుత :....."
అని మంగళపద్యం వినిపించాయి.

పది నిముషాలపాటు కరతాళధ్వనుల కోలాహలం ఆగలేదు. తర్వాత ఆచార్య నరేంద్రదేవ్ లేచి వేదిక అధిరోహించి, పద్యాలు చదివినవారిని గాఢాలింగనం చేసుకొని, "ఈ గమకం, సంస్కృత వృత్తాలగతి, శయ్య దేశంలోనే అపూర్వం. సంస్కృతాంధ్రాలు ఇంత సహజీవనం చేస్తాయని మాకు తెలియదు. ఇలాటి కవి దేశంలో ఉన్నారని కూడా మేము ఎరుగం. హిందీలో 'రీతి సంప్రదాయ' మనే విశిష్ట విధానానికి ప్రవర్తకులు తెనుగువారు. ఈ కవి రచనారీతి భారతదేశంలోనే విశిష్టమయింది. దీనిని ఆంధ్ర రీతి అని కాని, విశ్వనాథరీతి అని కాని అందాము" అంటూ ఉండగా జయజయ నినాదాలతో మరొకమారు సభాంగణం ప్రతిధ్వనితమైంది. ఆచార్య నరేంద్రదేవ్ ఆ కవికి దుశ్శాలువలు కప్పి, తులసీ రామాయణం, అవధీ వ్యాకరణం, నిఘంటువు మొదలయినవి బహూకరించారు.

పరరాష్ట్రంలో సాటి తెనుగువానికి, తెనుగువాణికి జరిగిన ఆ మహాగౌరవం తలంచుకుంటేనే ఒళ్లు కడిమిచెట్టవుతుంది.

ఆ కవి, శ్రీవిశ్వనాథ సత్యనారాయణగారు. విశ్వనాథ సత్యనారాయణ గారంటే అంధ్రప్రదేశ్‌లో ఆబాలవృద్ధం ఎరుగును. వారిని ఫలానా అని చెప్పడం సూర్యుణ్ని దివిటితో చూపడమే.

విశ్వనాథవారు పట్టి సాధించని సాహిత్య ప్రక్రియ అంటూ లేదు. మెట్టిచూడని సారస్వతమంటూ లేదు. వారిని తలచుకొన్నప్పుడెల్లా హంపీ విరూపాక్షాలయ గోపురం, దానికి అనతిదూరంలోని పంపాసరోవరం, మహాబలిపురంలోని దీపస్తంభం, దాని పక్కనే దొర్లాడే తరంగ హస్తనిస్తులమైన మహోదధి, వింధ్యాటవీమధ్య మణిచిత్ర కూటం, దాని పక్కనే పారే గద్గదనదద్గోదావరీపూరం, వేయి మైళ్ళ వేగంతో వీచే ఝంఝామారుతం, దానిని అనుసరించి వచ్చే అకాల జలధర ధారాసంపాతం, అభ్ర

కష శిఖరరాజి విరాజమాన హిమవన్నగం, అగాధాగాధమై తిమితిమింగిలాకులమైన పసిఫిక్ మహాసాగరం స్ఫురిస్తాయి.

వారు ఇంతటివారు కావడానికి నిదానం, స్వయంకృషి, పట్టుదలానూ. ఈ గుణాలు ఏర్పడడానికి మూలహేతువు వారు తలయెత్తే నాటికే పిత్రార్జితం పూర్తిగా తుడిచిపెట్టుకొని పోవడం. వారి పితృపాదులు శ్రీ శోభనాద్రిగారు వందంజిల్లర యకరాల పెద్ద భూస్వామి. ఆయన మహాభోగి; మహాత్యాగి. వారి యింట భుజించనివారు నందమూరు పరిసర ప్రాంతాలలోనేకాక కృష్ణాజిల్లాలోనే లేరని ప్రతీతి.

విశ్వనాథవారు జన్మించింది నందమూరులోనే (1893), అయినా, విద్యార్థిదశ అంతా బందరులో హిందూ హైస్కూలులోను, నోబుల్ కాలేజిలోను గడిపారు. ఆ దశలో హిందూ హైస్కూలు ఆవరణంలోని కానుగచెట్లెక్కి కూర్చొని, ముచ్చట ముడి సర్దుకుంటూ 'శృంగారవీథి' అని పద్యాలు చెప్పారు.

మొదట్లో శ్రీ పింగళి లక్ష్మీకాంతంగారితో కలిసి పద్యాలు చెబుదామని వారికి ఉబలాటంగా ఉండేది. ఒకనాడు బందరు రామలింగేశ్వరస్వామి ఆలయంలో కలుసుకున్నప్పుడు "నీతో కలసి పద్యాలు చెబుదామని ఉందోయ్!" అన్నారట. "ఛస్! నీకేమి వచ్చు. సంస్కృతమా? తెలుగా? ఇంగ్లీషా?" అని పింగళివారు కస్సుమన్నారట. 'ఇదా సంగతి?' అనుకున్నారు విశ్వనాథవారు. పొంగేరక్తం! పట్టుదల పెరిగింది. సంస్కృతం సాధించదలచుకున్నారు. "సత్కవి చెళ్లపిళ్ల వేంకన గురువంచు జెప్పి కొనగా నదిగొప్ప" అని వారు చెప్పుకున్నా, నిజానికి వారి శిక్షాగురువు శ్రీ విమలానంద భారతి (పూర్వాశ్రమంలో శ్రీ కె. టి. రామారావు). వారితో కలిసి, సంస్కృత రామాయణ భారతాలు పిండిచేశారు. పాణినీయం పుక్కిట బట్టారు. ఈ నిరంతర పరిశ్రమ వల్లనే కాబోలు బి. ఎ. పలుమారు తప్పారు. (డిగ్రీ త్వరగా చేతికి రాలేదనే ఆవేదన శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి "ఆంధ్ర ప్రశస్తి" ని అంకితమిస్తూ అవతారికలో చెప్పిన "డిగ్రీలు లేని పాండిత్యము...ఈ పాడుకాలాన బుట్టి" ఇత్యాదులలో ధ్వనించింది.) తర్వాత వారు ఎం. ఎ., కూడా పాసయారు.

నిరంతర సంస్కృత కావ్య వ్యాసంగంతో విలక్షణత సంపాదిద్దామనే అభినివేశంతో వారి రచన క్లిష్టతరమయింది. అప్పటి బందరు కవులు ముందు మెచ్చుకుంటూ వెనుక వెక్కిరించేవారట. "పాషాణపాకప్రభూ" అని కూడా సంబోధించారు. ఆ విమర్శలకు వారి మనసు కొంత కలగుండు పడింది. సంఘర్షణ బయలుదేరింది. "నా మార్గం నాదే. నేను ఎందుకు ఒకరివెంట పరుగు పెట్టాలి?" అనే నిశ్చయానికి వచ్చారు. ఈ ఆవేదన అర్ధశతాబ్దిక్రితం కృష్ణా పత్రికలో ప్రకటితమైన కిన్నెరసాని పద్యాలలో కనిపిస్తుంది.

వారు జీవికకోసం నేషనల్, హిందూ, ఎ. సి. కాలేజీలలో కొంతకాలం, విజయవాడ కళాశాలలో ఇరవై ఏళ్లూ ఆంధ్ర భాషాచార్యులుగా ఉన్నా, కరీంనగర్ కళాశాల

ప్రిన్సిపాలుగాను ఉన్నా, సాహిత్య అకాడెమీ ఉపాధ్యక్షులుగా ఉన్నా, శాసనమండలి సభ్యులుగా ఉన్నా ప్రధాన వ్యాసంగం రచన. లేడికి లేచిందేవేళ అన్నట్టుగా వారు వెళ్ళిందే కాలేజీ వేళగా గడిచాయి ఉద్యోగాలన్నీ.

వారి తొలి కవిత గిరికుమారుని ప్రణయగీతాలని అంటారు. మొదటి నవల సగంవ్రాసి వదలిపెట్టారు. ముద్రితమైన మొదటినవల ఏకవీర. నాటినుంచి పుంఖాను పుంఖంగా పత్రికలలోను, విడిగాను వేయిపడగలు, చెలియలికట్ట, బద్దెన సేనాని, సముద్రపు దిబ్బ, వ్రేయు తుమ్మెద మొదలయిన నవలలు: ఆంధ్రప్రశస్తి, ఋతుసంహారం, విశ్వనాథ మధ్యాక్కరలు, రామాయణ కల్పవృక్షం మొదలయిన కావ్యాలు; కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్ళి, బానిసల దీవి, ఉయ్యాలతాళ్లు మొదలయిన గేయకావ్యాలు; నర్తనశాల, సౌప్తిక ప్రళయము, అనార్కలీ, వేనరాజు, త్రిశూలం, కళింగరాజ్యం మొదలయిన నాటకాలు; అద్భుత శర్మిష్ఠ సంస్కృత నాటకం వ్రాశారు. 'మాకళిదుర్గంలో కుక్క' మొదలైన కథలు ఎన్నో వ్రాశారు. ఇటీవలనే పురాణ వైర గ్రంథమాల పేర దాదాపు ఇరవై నవలలు వ్రాశారు. ఇట్టిటివల వ్రాసింది వ్రేయు తుమ్మెద. ఇంకా నేటికి వ్రాస్తున్నారు; రేపూ వ్రాస్తారు.

ఇంత కవిత చెప్పినా, తిరుపతి వేంకటేశ్వరుల శిష్యులమని చెప్పుకున్నా వారు ఎప్పుడూ అవధానం చేయలేదు. ఒకానొకప్పుడు "ద్రుపదభూపతి యజ్ఞ ధూమంబు వెంబడి బాహిరిల్లిన చలద్భ్రమరవేణి" అని వేణీ సంహార కథ ఆశువుగా మాత్రం చెప్పారు.

ప్రతి రచయితపాత్రలకూ ఏదో ఆలంబన విభావం ఉంటుందనడం నిజం. కాని, విశ్వనాథవారి పాత్రలు కొంత వేషం మార్చుకొని తిరిగే లోకంలోని మానవులే పూర్తిగా. విశ్వనాథవారు ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కరకం మనుష్యుల సావాసంలో ఉంటారు —వారు పరమోత్తములూ కావచ్చు, పరమ నికృష్టులూ కావచ్చు. అలాటివారి స్వరూప స్వభావాలన్నీ కొంత కల్పనా కల్పంతో వారి తర్వాతి రచనలలో అచ్చయాయన్నమాటే. పిదప అలాటివారి సహవాసం వారికి ఉండదు. ఈవిధంగా తెరచిరాజు ముంజులూరి కృష్ణారావనే నటుని జీవితం. చెలియలికట్ట 'ఫ్రీ లవ్' ఉద్యమంపై దెబ్బ. హరిజనుడు నాయకుడైన బద్దెన సేనాని నేటి పలువురి గాథల పుట్ట, వేయిపడగలలో నేటి నాయకులు, పత్రికా సంపాదకులు పలువురు మనకు కన్నుల గడుతారు. వేనరాజు బందరు జాతీయ కళాశాల కుళ్లు కడిగివేసిన మడివేలు. దమయంతీ ద్వితీయ స్వయంవరం తమ ఆంధ్ర విశ్వవిద్యాలయోద్యోగ ప్రయత్న నాటకం. వ్రేయు తుమ్మెద కరీంనగరులోని ఒక మహాగాయకుని ఇతివృత్తం. పేరుకూడా కరీంనగర్ పరిసరాల వ్రేయుతుమ్మెద వాగుదే.

విశ్వనాథవారి రచనలలో శాశ్వత లక్ష్యమే కాక సమసామయికోద్యమాల ప్రభావంగలవీ చాల ఉన్నాయి; "బానిస గుడిసెల పజ్జల పయోరాశి ఎందులకో?" అని

AOUA102B134

ఆరంభమై "పయోరాశి వీచివాత్య పరుపులిడుట ఇందులకా ?" అని ముగిసే బానిసల ద్వీపం, "ఎడ్ల కనులకు గంతలు" అని ప్రారంభమయ్యే ఉయ్యాల ప్రాళ్లు ఆనాటి భారతీయుల బానిస బ్రతుకుకు ముకురాలు.

విశ్వనాథవారి రచనావిధానం విచిత్రాతి విచిత్రం. కూర్చునే బల్ల అవీ ఏమీ లేవు. పద్యాలయితే వందకువైగా తలలోనే ప్రాసుకుని తర్వాత స్వయంగా కాయితంపై పెడతారు. వచనమయితే, వారు చెబుతూంటే ఇతరులు ప్రాసుకోవలసిందే. ఏకవీర ప్రాసినప్పుడు మాత్రం ప్రతి శుక్రవారం బొంకాయకొట్టి పూజచేసి మిత్రులకు వినిపించే వారట. వేయిపడగలు మొదట్లో స్వయంగా ప్రాయడం ప్రారంభించగా మూడు ప్రకరణాలు మూడు నెలలు పట్టింది. ఇది సరికాదని చెప్పడం ప్రారంభించి వేయి పుటలు 29 నాళ్ళలో చెప్పారట. నవల ఏదీ నాలుగునాళ్ళకు మించలేదు

వారి అలవాట్లు మరీ వింతగా ఉంటాయి. వారు మంచి భోక్త. ఆవకాయలో పచ్చిమెరపకాయ కొరుక్కుంటారు. హాస్యప్రియులు. వారు జిలేబీ జాతి. స్టంట్ సినిమాలన్నా, ఇంగ్లీషు సినిమాలన్నా వారికి ప్రీతి మెండు.

వారి రచనలలో ఏది నిలుస్తుందీ అంటే ప్రతిదీ నిలుస్తుం దనేవారున్నారు. కాని, "తన కావ్యం ప్రతివాడూ గొప్పదంటాడు. ప్రతివాడూ తన అభిప్రాయమే గొప్పదంటాడు. ఎవరో నా ఏకవీర ఉత్తమమన్నారు. నేను ఉత్తమమని ఎందుకనాలి? ఒక తరం పోయి మరొకతరం వచ్చినట్టు చెప్పిన వేయి పడగలు గొప్పది కాదా? దాని గుణగణాలు ఎవరైనా పరిశీలించారా? ఎంతో 'సైకాలజీ' గుప్పించిన చెలియలికట్ట ఏమైనట్టు? పురాణ వైరగ్రంథమాలలో ఒకొక్కక్క నవలలో ఒకొక్కక్క శిల్పం చూపానే? ఎవరైనా చూచారా? మన ప్రమాణాలు నిలుస్తాయా? ఎంతో పోయె! దేవాలయాలే కూలిపోయె!" అంటారు వారు.

"అయినా, అన్నిటికన్నా విశ్వనాథ మధ్యాక్కరలు శిల్పవైలక్షణ్యంతోను, భావనా సౌకుమార్యంతోను, దేశిచ్ఛందోవిశేషంవల్లను శాశ్వతంగా ఉంటుందండి" అన్నాను. వారు ఒప్పలేదు "రామాయణ కల్పవృక్షాన్ని మించిన కవిత్వం ఉండదు. సర్వశక్తులూ పెట్టి ప్రాశాను. పరమేశ్వరుడు అనుగ్రహించాడు. నారాయణుడే పరమేశ్వరుడు" అన్నారు వారు.

పత్రికలంటే వారు ఉగ్రులైపోతారు. పత్రికా సంపాదకులకు శిక్షణ అవసరమని వారి సూచన. ప్రతి అడ్డమైనవాడూ ప్రాసినది ప్రచురించి సాహిత్య ప్రమాణాలు పాడుచేస్తున్నారు పత్రికలవారని, బాధ్యత గుర్తెరుగడం లేదని వారి విమర్శ.

వారు పట్టుబట్టలు కట్టుకుని భోజనంచేయడం చూచి ఎవరైనా, "మరి సనాతన ధర్మం పునశ్చరితమౌతుందా?" అని ప్రశ్నిస్తే, "సనాతనధర్మం రాదు. కాని వేదమ

సమ్మెటవారు పెక్కు సంగీత సంస్థలలో బాధ్యతగల పదవులు నిర్వహించారు. 1988 నుంచి మూడు సంవత్సరాలపాటు హైదరాబాద్ మ్యూజిక్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు.

సమ్మెటవారిది గంపెడు సంసారం. పన్నెండుగురు పిల్లలు, వారి శ్రీమతి సుశీలాదేవి ఓర్పును చూడాలి. ఆమెగూడా సంగీత విదుషి. కచేరీలు చేయరులెండి! ఇక పిల్లలసంగతి చెప్పనక్కరలేదు. అందరూ ఏదో కూనిరాగాలు తీసేవారే; జంత్రవాద్యాలు వాయించేవారు.

సమ్మెటవారు ఉదయం ఆరు గంటలకులేచి, కాలకృత్యాలు తీర్చుకుని కొంత సేపు నాదోపాసనచేసి, స్నానానంతరం పూజాపునస్కారాలు చేసుకుంటారు. రాత్రి పొద్దుపోయిన తరువాత పడుకోడం నవాబుల సావాసంవల్ల అలవాటయింది. చదరంగ మన్న ఫుట్‌బాల్, బాట్‌మెంటన్‌లన్నా వారికి ఇష్టం. వారితండ్రి "ఫీట్స్ ఆన్ చెస్" అనే గ్రంథమూ వ్రాసారు. "మీ తండ్రిగారు జ్యోతిర్వేత్తలుగదా? మీకు ఆ అభిరుచి లేదేమిటి?" అంటామనుకోండి. "జ్యోతిషానికి ఉపాసనా బలం అవసరం. నేనేమో నవాబులు, కబాబులలో ఉంటిని. నిష్ఠ, ఉపాసనా ఎక్కడివి?" అంటారు నవ్వుతూ వారు.

డాక్టర్ కేస్కర్ మంత్రికాగానే హార్మోనియంపై దాడి చేశారు; దానిని రేడియో జంత్ర సమ్మేళనం నుంచి తొలగించారు. దానితో హిందూస్థానీ సంగీత లోకంలో కల్లోలం చెలరేగింది. పెద్ద గవైయాలందరూ హార్మోనియం పక్కవాద్యంగా గలవారే సమ్మెటవారు హార్మోనియం స్త్రీయమైన వాద్యమని, దానిని రేడియోనుంచి తొల తొలగించరాదని ఆందోళనప్రారంభించి "రాంగ్ కాన్సెప్ట్స్ ఎబౌట్ హార్మోనియం" అనే పుస్తకంవ్రాసి ప్రభుత్వం వద్దకు రాయబారం వెళ్ళారు.

"హార్మోనియం నూరుసంవత్సరాలుగా మనదేశంలో ప్రచారంలో ఉంది. క్లారొనెట్ మనదికాదు. వయొలిన్ మనదికాదు, మరి హార్మోనియంమీదే పగఎందుకు? ప్రతి తంత్రీ వాద్యాన్ని ఎప్పటికప్పుడు శ్రుతిచేసుకోవాలి. హార్మోనియం ఎవర్‌రెడీ జంత్రం. తక్కిన తంత్రీవాద్యాలలో శ్రుతి మార్చినప్పుడు సరిదిద్దుకునే అవకాశంఉంది. హార్మోనియంలోపన్నెండు శ్రుతులు వాయించే అలవాటు ఉండాలి. అందువల్ల దీనివల్ల సాధన కష్టం. తంబూరాశ్రుతికూడా హార్మోనియం పద్ధతినిబట్టి ఒకటిన్నర, రెండు అని ఏర్పాటు చేసుకుంటున్నాము-అతికోమల అతి తీవ్రస్వరాలు హార్మోనియంలో రావనడం అబద్ధం" అని వారివాదం.

శ్రీ బెజవాడ గోపాలరెడ్డి మంత్రి అయిన తర్వాత సమ్మెటవారు వారివద్దకూ రాయబారం వెళ్ళారు. "శ్రీ రెడ్డిగారు తమ సహజ సౌజన్యంతో హార్మోనియం ఎడ

కొంత సుముఖత చూపారు. ఫలితంకోసం ఎదురుచూస్తున్నాము." అన్నారువారు. "హిందూస్థానీ సంగీతంలో మీది ఏ ఘరానా (సంప్రదాయం)?" అని ప్రశ్నిస్తే, "ఇతరులకు ఆనందం కలిగించడమే నా ఘరానా. నాకు మొదట ఆనందం కలుగాలి. నేను దానిలో లీనమై పోతాను. అప్పుడే నేనూ, ఇతరులూ ఆనందిస్తామని నా భావన" అంటారు వారు.

నిజానికి కళాతపస్వులకు ఇంతకన్నా ఘరానా ఏమిటి ?



163

క్రీస్తానం నరసింహారావు

నాలుగు దశాబ్దాలనాటి—1920 నాటి—మాట. బాపట్లలో ప్లీడరు గుమాస్తాల నాటకసంఘం ఉండేది. దానిలో శ్రీ కామరాజు వేంకటనారాయణగారు కూడా సభ్యులు. ఆయన మేనల్లుండ్లలో ఒకరు కళాభిరుచి కలవాడు; పందొమ్మిదేండ్ల ప్రాయంవాడు. అతడు మేనమామతోపాటు ఆ నాటకసంఘానికి వెళ్ళి, నటుల తరిఫీదులలో హార్మోనియం ప్రతి వేసేవాడు. అందువల్ల ఆ నాటకాల పద్యాలు, పాటలు, సంభాషణ ఆ యువకునికి కొట్టినపిండి ఒకనాటి మధ్యాహ్నం ఆ యువకుడు యథాలాపంగా ఆ నాటకాల పద్యాలు, పాటలు పాడుకుంటున్నాడు. ఆ నాటకసంఘంలో హరిశ్చంద్ర పాత్ర ధరించే చోరగుడి హనుమంతరావుగారు ఆ పాడడం విన్నారు. "బాగుంది. బాగుంది. పాడవోయ్!" ఆని ప్రోత్సహించారు. కాని యువకుడు సిగ్గుపడ్డాడు; పాట పెగిలి రాలేదు.

తర్వాత రెండు నెలలకు తిరుపతి వేంకటకవులు బాపట్లవచ్చి, అవధానాలుచేసి పౌరులను సంతోషపెట్టారు. వారి గౌరవార్థం హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించదల చారు, ఆ నాటకసంఘంవారు. ప్రదర్శనం తీరా రెండుపూటలుందనగా చంద్రమతి పాత్రధారి జాడలేదు. నాటకం ఆగిపోయే దుస్థితి ఏర్పడింది. చోరగుడి హనుమంతరావుగారికి వెంటనే మన యువకుడు స్ఫురణకు వచ్చాడు. మరికొందరిని వెంట బెట్టుకొని, ఆ యువకుడు చదువుకుంటున్న ట్రెయినింగు స్కూలుకు వెళ్ళారు. మధ్యాహ్నం రెండు గంటలవేళ. యువకుని అతని ఇంటికి కూడా వెళ్ళనివ్వకుండా పుస్తకాలతో సహా తమ సంఘానికి పిలుచుకుని వెళ్ళి, ఆపత్తు వచ్చిందని, ఎలాగైనా ఆదుకోవాలని కోరారు. యువకుడు ఏదో మామూలు పాత్ర కాబోలునని కొంచెం మొగ్గు చూపగా, చంద్రమతి వేషం అన్నారు. యువకునికి ముచ్చెమటలు పోశాయి. "ఆడ వేషమా? మామయ్య మళ్ళీ గడప తొక్కనిస్తాడా! వెయ్యనంటే వెయ్యను" అని భీష్మించుకున్నాడు. సంఘం వారంతా గంటసేపు బ్రతిమాలగా. నాటకం ఆగిపోయి తలవంపులవుతుందని ప్రాధేయపడగా. ఒప్పుకున్నాడు. అయినా, బెరుకుగానే ఉంది, మామయ్య ఏమంటాడో అని.

మరుసటిరోజు పొద్దు గూకగానే, ఆ యువకుడు హరికథకు వెళ్ళుతున్నానని అమ్మతో అబద్ధమాడి నాటక సంఘానికి బయలుదేరాడు. నాటకసంఘం నేపథ్యాలలో గ్యాసులైటు ముందుమూగి, నటులు వేషాలు వేసుకుంటున్నారు. అక్కడికి వెళ్ళి వేషం వేసుకోడానికి భయమయింది యువకునికి. మామయ్య వచ్చి చూస్తాడేమోనని కనుక ప్రొప్రయిటరు ఇంట్లోనే వేషం వేసుకున్నాడు. ప్రొప్రయిటరు చెల్లెండ్రు వేషధారణలో తోడ్పడ్డారు. యువకుడు అదివరకే చిత్రలేఖనంలో కొంత కృషిచేసినవాడు. కనుక చంద్రమతి పాత్ర ఎలా ఉండాలో మననం చేసుకొని, తదనుగుణంగా సింగారించు కున్నాడు.

నాటకం ప్రారంభమయింది. హరిశ్చంద్రపాత్రధారి హనుమంతరావుగారు ముందు రంగంలో అడుగుపెడుతూ, "దేవీ, ఇటురమ్ము" అన్నారు. కాని, ఆ దేవి సభాకంపంతో కంపించి పోతున్నది. ఎదుట మామయ్య. (ఆయన మాత్రం 'చంద్రమతిగాడు రాలేదే? ఎవడురా ఈ కొత్తవాడు' అని ఆలోచిస్తున్నాడు.) అడుగులు ముందుకు పడడం లేదు. ప్రొప్రయిటరు యవనిక అవతలినుంచి ఒక్కతోపు తోశాడు యువకుణ్ణి. దభీమని కుప్పగా కూలతూ రంగంలో ప్రవేశించాడు యువకుడు. అడుగులోనే హంసపాదు! యువకుని గాభరాను కప్పిపుచ్చడానికి హరిశ్చంద్రుడు "దేవీ! ఇది మహారణ్య ప్రాంతమని తెలియదా? రాయి, రప్ప కాలికి తగలవా? ముందు దారిచూచి నడు వుము" అని అన్నారు. యువకుడు కొంచెం తేరుకున్నాడు. కాని, ఒకరాగం మొదలు పెడితే, మరొక రాగంపలుకు తున్నది గొంతు. కడపటి సీనులో భయం సహజతను చేకూర్చింది. ప్రేక్షకులు మెచ్చుకున్నారు. నాటకం సమాప్తమైంది. తిరుపతి వేంకట కవులు అనువుగా యువకుని ఆశీర్వదించారు.

శ్రీ సానం నరసింహారావు

"తెల్లవారితే నాటకమనగా, తెల్లవారుజామున ఒక కల వచ్చింది. ఆ కలలో నారింజపండు రంగుగల ఒక పొగ దొర్లుతూ వచ్చి, స్త్రీ రూపం దాల్చింది. ఆ రూపం ఆ పొగనే వస్త్రంగా చుట్టుకుంది. నన్ను సమీపించింది. నాచేతులు పట్టుకుని, నన్ను పీపుమీద వేసుకుని, పైకి వెళ్ళిపోయింది. భయంతో కళ్లు తెరిచాను. రొమ్ముమీద దిండు ఉంది. మళ్ళీ కళ్ళు మూసుకుంటే కల రాలేదు. అదేదో పరాశక్తి నన్నావేశించింది. ఇది నా శక్తికాదు. ఎన్ని జన్మల కృషో ! ఆ శక్తి నా భవిష్యత్తును చూపినట్టుగా భావిస్తున్నాను" అన్నాడు నాటకం ముగిసిన తర్వాత యువకుడు. ఆనాటి ఆ యువకుడే, నాటినుంచి నేటిదాక స్త్రీ పాత్రలలో నాటకరంగాన్నే ఏలి, నవనవోన్మేష నటన శబలతతో భరత శాస్త్రానికే మెరుగులు దిద్దిన శ్రీ స్థానం నరసింహారావు గారు.

శ్రీ స్థానం నరసింహారావుగారు 1902 సెప్టెంబరు 23 వ తేదీన బాపట్లలో జన్మించారు బాపట్లలోనే స్కూలు ఫైనలుదాక చదివారు. చిన్ననాటినుంచే వారికి సంగీతమన్నా, ప్రాచీన సాహిత్యమన్నా. చిత్రకళ అన్నా అభిరుచి వుండేది. ప్రబంధాలలోని పాత్రలను ఊహించుకొని, రంగు రంగుల బొమ్మలుగీస్తూ సాధనచేసేవారు రహస్యంగా, 19 ఏళ్లు వచ్చేవరకు చిత్రకళలో, ముఖ్యంగా "ఇంటెరిమ్ పెయింటింగు లోను (వర్తమానచిత్రకళలోను), ఫోటోగ్రఫీలోను ఒక స్థాయిని సాధించారు. ఈ సాధన వారికి ఉత్తరోత్తరా పాత్రకల్పనలో, పాత్రలఅకల్పనలో ఎంతోఉపకరించింది. 16 వ ఏటనే తండ్రి హనుమంతరావుగారు పరమపదించడంవల్ల వారిని మేనమామ శ్రీ కామరాజు వేంకటనారాయణగారు ఆదుకున్నారు; తర్వాత ఆయనే మామగారూ అయ్యారు. వారు నాటక ప్రియులు, నటులూను. కనుక స్థానంవారి లలితకళాభిరుచికి దోహదమిచ్చి, లలితకళాభి వ్యక్తికి రూపు తీర్చారు.

చంద్రమతి వేషధారణతో, తిరుపతి వేంకటకవుల ఆశీఃప్రభావంతో స్థానంవారి జీవితస్థాయే మారింది. బోధనాభ్యసన పాఠశాలలో చదివి, సామాన్యోపాధ్యాయులుగానో, చిత్రకళోపాధ్యాయులుగానో మనుగడ గడపదలచిన స్థానంవారికి చంద్రమతి తాము వర్ణరంజితులై, ఇతరుల హృదయాలనూ రంజింపజేయాలనే తీవ్రకాంక్షను కలిగించి, జీవితాన్నే చంద్రమయం చేసింది. వారి కాంక్ష ఫలించింది. తెనాలిలోని కృష్ణ హిందూ థియేటర్స్ అనే నాటకసంఘంలో 25 రూపాయల నెలజీతంపై స్త్రీ పాత్రధారి ఉద్యోగం దొరికింది. ఆ కాలంలో 25 రూపాయలు చిన్నజీతమేమీ కాదు. అక్కడ వారు ఆరునెలలే పనిచేసినా, నిర్వహించిన యశోద, లీలావతి, మోహిని పాత్రలు వారికి ఎంతో కీర్తితెచ్చాయి. తర్వాత వారు తెనాలిలోని రామవిలాస సభలో చేరారు. కొంతకాలం పిదప దానికి నిర్వాహకులూ అయి, తమతోపాటే, ఆ సభ యశస్సునూ దిగంతాలకు విస్తరింపజేశారు.

అప్పుడు రామ విలాస సభ యజమానులు భాగవతుల కుమార రాజగోపాలం గారు. నాట్యోపాధ్యాయులు త్రిపురారిభట్ల వీరరాఘవస్వామిగారు. చిత్ర, నేపథ్య

కళోపాధ్యాయులు వజ్ఝు బాబూరావుగారు. నటులేమో మాధవపెద్ది వేంకటరామయ్య, పులిపాటి వేంకటేశ్వరులు, గోవిందరాజుల వేంకటసుబ్బారావు, వెద్ది భట్ల వేంకటాచలపతి, పిల్లలమర్రి సుందరరామయ్య, లింగమూర్తి వంటి హేమాహేమీలు. స్థానంవారు ఈ సభలో రోషనార, సత్యభామ, చిత్రాంగి, ముర. మధురవాణి, రాణిసంయుక్త. సుభద్రపాత్రలు ధరించి, సభ విలాసానికే వన్నెలు తెచ్చారు.

సభ శిక్షణ ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరించే ఆధునికంగా ఉండేది. నాట్యశాస్త్రకారులు నిర్వచించిన రసానుగుణమైన వాక్యాభినయం, భావానుగుణమైన శబ్దోచ్చారణ, తగినంత సంగీతం, పాత్రోచితమైన ఆహార్యాంగికాభినయం నిర్వహించి, సామాజికులను రంజింపజేయడం ఈ సభ ఆదర్శం. "అందులోను వీరరాఘవస్వామిగారి శిక్షణ కత్తిమీది సాము. ప్రతిదానినీ వారు నిశితంగా చూచేవారు. గోవిందరాజుల సుబ్బారావు ఒకమారు గంతులు వేశాడు. "ఏమిటా కుప్పిగంతులు?" అని స్వామిగారు చీదరించుకున్నారు. ప్రతి నాటకం తర్వాత మరునాటి సాయంకాలం విమర్శగోష్టి జరిగేది. నాటకంలో తప్పు చేసేవారికి జరిమానా వేసేవారు. సుబ్బారావుకూడా జరిమానా తప్పించుకోలేదు. నాకు ఎప్పుడూ ఫైన్ పడలేదు. అందరూ అసూయతో కాచుకూర్చున్నారు. ఒక మారు మూడు రాత్రులు వరుసగా నాటకాలు వేశాము. మూడోరోజు కృష్ణతులాభారం. నారదుడు సత్యభామతో సంభాషిస్తున్న ఘట్టం. అసలే అలసి ఉన్నాను. నారదుడు చెబుతుండగా ఆవులించాను. మరునాటి విమర్శ గోష్ఠిలో 'అంతటి మహాముని చెబుతూంటే, అగౌరవంగా ఆవులిస్తావా? తప్పు' అన్నారు అందరూ. సత్యభామ సౌభాగ్య గర్వం, అజాగ్రత్త చూపడం అవసరం గనుక ఒప్పేనని సమర్థించుకున్నాను. స్వామిగారూ అంగీకరించారు. నటుల సూచనలూ వారు తీసుకునేవారు. తర్వాత ఆంధ్రప్రభలో నేను 'ఆనాటి నా ఆవలింత' అనే వ్యాసం వ్రాశాను" అన్నారు స్థానంవారు.

స్థానంవారు వివిధ రాష్ట్రాలలోనే కాక, బర్మా మొదలయిన విదేశాలలోను తమ నాటక సంఘంతో పర్యటించి, తమ నటన నైపుణితో జనాన్ని ముగ్ధులను చేశారు. మగవారు ఆడవేషం వేయడమేమిటి ఖొజ్జావారిలాగ అని ఆక్షేపించినవారినీ తలలూపేటట్టు చేశారు. నవ్వమని మూతి ముడుచుకొన్నవారిని విరగబడి నవ్వేట్టు చేశారు. ఏదో వంక దొరికేనా అని వేచి ఉన్నవారిని కలకాలం వేచి ఉండేట్టు చేశారు. అచ్చపు ఆడదని ఆడవారే భ్రమిసేట్టు చేశారు. ఆంధ్ర నాటక కళాపరిషత్తును ఒకమారు ప్రారంభించారు, ఒకమారు అధ్యక్షత వహించారు. నటకావతంస, ఆంధ్ర బాల గంధర్వ, నటశేఖర ఇత్యాద్యనేక బిరుదాలు పొందారు. అసంఖ్యాక స్వర్ణ రజత పతకాలతో, స్వర్ణ కిరీటాలతోను అలంకృతులయారు. సంగీత నాటక అకాడెమీ వారిని కళా ప్రపూర్ణులను చేసింది. భారత ప్రభుత్వం 1956 లో 'పద్మశ్రీ' తో భూషించి, హైదరాబాద్ రేడియో కేంద్రం నాటకప్రయోక్తగా నియమించింది.

శ్రీ స్థానం నరసింహారావు

స్థానంవారు తమ 88 సంవత్సరాల నటజీవితంలో దాదాపు 16 వందల ప్రదర్శనలు జరిపారు. ఏ పాత్రనైనా సాటిలేనిరీతిగ చూపారు. ముఖ్యంగా చిత్రాంగి, మధురవాణి, సత్యభామ, సుభద్ర, ముర, రోషనార పాత్రలను ఎంతో అధ్యయనం చేసి, ప్రదర్శించారు. సాహిత్య చరిత్రలను తిరగవేసి, ప్రాచీన శిల్పచిత్రాలను పరిశీలించి, గంటలతరబడి ఒంటరిగా మననం చేసుకొని, వేషం దిద్దుకొనికాని రంగంమీదికి వచ్చేవారు కారు. ప్రతి పాత్రను వివిధ సన్నివేశాలలో ఊహించి, వివిధ స్త్రీ ప్రవృత్తులను ఆకళించుకొని నటించారు. వారి వేషం ప్రేక్షకులనే కాక సాటి నటులను, చిన్ననాటి మిత్రులను కూడా భ్రాంతిగొలిపిన ఘట్టాలు వందలు. 'రుస్తుం' అన్న నినాదం విన్న షోహరాబ్ దుర్గ్రాంతుడయి అస్త్రసన్యాసం చేసినట్టు రంగస్థలంమీద వారి నటనను చూచి పెదవి ఆడని, కాలు కదపని సాటి నటులను వారు సమయస్ఫూర్తితో లాలించి, పోత్సహించిన సందర్భాలు అనేకం. ఇప్పటిలాగ అప్పుడు మైక్‌లు ఉన్నాయా? అతి సున్నితమైన గుసగులను (విస్పరింగును) కూడా వాచికంలో పలికించేవారు.

స్థానంవారిలోని మరొక శక్తివిశేషం తమ అనుభూతులను, అనుభవాలను వివరించగల, నటనను సమర్థించగల రచననూ స్వాధీనం చేసుకోవడం. వారు చక్కని శైలితో నాటకాలను గురించి, నటనను గురించి పెక్కు వ్యాసాలు వ్రాశారు. మోహినీ రుక్మాంగద, కృష్ణదేవరాయలు మొదలయిన నాటకాలూ రచించారు. 1953 నుంచి తెనాలిలో నాటక కళాస్థానం అనే సంస్థ నెలకొల్పి నిర్వహిస్తున్నారు.

స్థానంవారు పురుషపాత్రలు కూడా ధరించే వారంటే ఎవరైనా నమ్ముతారా? నమ్మకతప్పదు మరి! కాని, వారు వేసింది ఒకేఒక మగవేషం—అదిన్నీ ఒకసారి—నారదవేషం, రాధాకృష్ణ నాటకంలో. వారి చిత్రాంగిని, మధురవాణిని, సత్యభామను చూచిన కండ్లతో గడ్డాలు, మీసాలు ఊగులాడుతూనో, గడ్డాలు మీసాలు లేక సిగకు, ముంజేతులకు, మణికట్టులకు మల్లెదండలు చుట్టుకుని తంబూరామీటుతూనో వచ్చే నారదవేషం చూస్తే ఎలా ఉంటుంది?

సినిమాలవల్ల నాటకాల విలువ తగ్గుతుందేమో?—అని అనుమానించే ప్రాణులను చూస్తే వారు మధురవాణి లొటిపిట్ట నవ్వు నవ్వుతారు. విదేశాలలో ఉన్నట్టు నాటక సంఘాల ఉద్ధరణకు, నాటక కళా విస్తృతికి కళాశాలలు, మంచి జట్టు (ట్రూప్) ఉంటే నాటకాల విలువ ఎప్పుడూ తగ్గదని వారి నిశ్చయం.

"ఏది వినిపించడానికైనా భాష ముఖ్యం. అది జటిలంగా ఉంటే ఏమిటి ప్రయోజనం? ఇక మన తర్వాతి మెట్టు వాచికం లేకుండా, మాట లేకుండా, భాష లేకుండా, అభినయించడమే" అని వారి భవిష్యద్వాణి.

స్థానంవారు దేవ్యుపాసకులు. తెల్లవారే స్నాన సంధ్యాదులు నిర్వర్తించి, దేవిని ఉపాసిస్తారు. "చేసిన పాపాలు చాల ఉన్నాయి. ఈ విధంగానైనా పాపపంకం క్షాళిత మౌతుంది" అని వారి విశ్వాసం. తర్వాత వారు మిత్రులతో గోష్ఠి జరిపి, రేడియో

స్క్రిప్టులు చదువుతారు. నాటక సంఘాలవారికి సలహాలిస్తారు. తర్వాత రేడియో కేంద్రంలో పని. వారి భాగ్యవిశేషం సహస్రమాస వృద్ధురాలయిన వారి మాతృశ్రీ ఆదెమ్మగారు వారి అభ్యుదయాన్ని తిలకిస్తూ ఉండడం.

వారు 'నటస్థానం' అన్న శీర్షికతో తమ నటానుభవాలను వ్రాయదలచారు ఆ గ్రథం యువనటులకేకాక, సాహిత్యంలోను కళా దీపంగా ఉండగలదనే నా నమ్మకం.

"మృదు మధూక్తుల రాశి మా మధురవాణి
నిత్య శక్త్యాత్మగౌరి మా సత్యభామ
అస్థిరాంగ లక్ష్మి మా చిత్రాంగి వనిత
లేకమై పుష్పమాలగ నెసగుత"

మని సన్నుతిగన్న స్థానంవారు శ్రీ వేలూరి శివరామశాస్త్రిలుగారు ఏనాడో అన్నట్టు భావశబలకు పెట్టిన పేరు. దానిని సమగ్రంగా రచించినవాడు కాళిదాసు; నటించిన వారు స్థానంవారు.

BCL

తెలుగు ఎదలో తెలుగుతనం
వెల్లువలా పారాలని
తెలుగింటిలో తెలుగుదీపం
అఖండంగా వెలగాలని
ఈ జాతి నిద్రతేచి
మహోన్నత మానవాదర్శాల వైపు
నిరంతర కృషితో
పయనం కొనసాగించాలనే ధ్యేయంతో
ఉడుతా భక్తిగా యువభారతి కృషిచేస్తున్నది
భాషాభిమానం కలగాలంటే
మాతృభాషా సాహిత్య పఠనమే
ప్రథమ కర్తవ్యం అనే భావం
బలంగా మనసులో నాటుకోవడానికి గాను
వీలైనంత ఎక్కువ మందికి వీలైనంత తక్కువ వెలకు
ఉత్తమసాహిత్యం అందించేందుకు
యువభారతి పూనుకున్నది
ప్రతి తెలుగింటిలో
కనీసం పదయినా తెలుగు పుస్తకాలు ఉండేందుకు
మనందరం ఉత్సాహ వేగంతో కృషిచేద్దాం
ఆ పదిమంచి పుస్తకాలలో ఏ ఒక్కటిగానైనా
యువభారతి ప్రచురణ ఏ ఒక్కటైనా
ఉండాలనే ధ్యేయంతో కృషిచేద్దాం

యువభారతి

సాహితీ సాంస్కృతిక సంస్థ
5, కింగ్స్‌వే, సికింద్రాబాదు-3

Cover Printed at VISTAS PRINTERS, Hyd - 27

మహసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B134
పుస్తకం పేరు	మరపురాని మనీషి
తారీఖు	31 December 2025
ముందు అట్ట	
వెనుక అట్ట	
మొత్తం పేజీలు	171
పెద్ద సైజు పేజీలు	
ఖాళీ పేజీలు	
లేవి పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	anusha
పరీక్ష చేసినది	
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పంపినది	